www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

శుక్రవారం | 8-8-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 131 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షఋతువు, శ్రావణమాసం, శుక్లపక్షం; తిథి: చతుర్దశి మ.2.12 తదుపరి పౌర్ణమి; నక్షత్రం: ఉత్తరాషాఢ మ.2.28 తదుపరి శ్రవణం; వర్జ్యం: సా.6.27-8.03, దుర్ముహూర్తం: ఉ.8.32-9.23, మ.12.46-1.36, అమృతఘడియలు: ఉ.7.56-9.34, తె.4.01-5.37, రాహుకాలం: ఉ.10.30-12.00, సూర్యోదయం: 6.00, సూర్యాస్తమయం: 6.41 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

బీజేపీ, బీఆర్‌ఎస్సే అడ్డు

బీసీ రిజర్వేషన్లకు అవి వ్యతిరేకం.. అపాయింట్మెంట్ ఇవ్వొద్దని రాష్ట్రపతిపై మోదీ, షా ఒత్తిడి

- ప్రయత్నాలన్నీ చేశాం.. రాష్ట్రపతే చొరవ తీసుకోవాలి
- జీవో ఇస్తే కోర్టుల్లో.. వాయిదా వేస్తే నిధులకు.. చిక్కు
- రాజకీయ పార్టీలు 42% టికెట్లు ఇవ్వడం చివరి మార్గం
- ముస్లింలను బూచిగా చూపి రిజర్వేషన్లు అడ్డుకునే కుట్ర
- చెట్టుకింద ప్లీడర్, గల్లీ లీడర్‌లా కిషన్‌రెడ్డి వ్యాఖ్యలు
- బీజేపీది మొదటి నుంచీ ఓబీసీల వ్యతిరేక వైఖరే
- పది రోజుల్లో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు ఇచ్చారు
- ఓబీసీ రిజర్వేషన్లు అంటే మాత్రం నాన్చుతున్నారు
- ఝార్ఖండ్ వెళ్లినందుకే బీసీ ధర్నాకు రాహుల్ రాలేదు
- మంత్రులు, పీఏసీతో భేటీ తర్వాత భవిష్యత్తు కార్యాచరణ
- ఢిల్లీలో మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్


ఢిల్లీలోని తన నివాసంలో మీడియాతో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో పీసీసీ చీఫ్ మహేశ్, మంత్రులు కొండా, పొన్నం

బీసీ రిజర్వేషన్లపై పార్లమెంటులో
ఒత్తిడి పెంచండి
కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి
13

తెలంగాణ విద్యా రంగానికి
సేవలందిస్తాం
సీఎం రేవంత్‌రెడ్డితో అమిటీ వీసీ అతుల్ చౌహాన్
13

న్యూఢిల్లీ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు దక్కకుండా బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలే అడ్డుపడుతున్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. 42 శాతం రిజర్వేషన్ల పెంపునకు కనీస నైతిక మద్దతు తెలపకుండా బీఆర్ఎస్, రిజర్వేషన్లు 50 శాతానికి మించిపోతాయంటూ బీజేపీ బీసీలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నాయని సీఎం మండిపడ్డారు. గురువారం ఢిల్లీలోని సీఎం అధికారిక నివాసంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు 50 శాతానికి మించకుండా కేసీఆర్ ప్రభుత్వం చేసిన చట్టాన్ని సవరిస్తూ ఆర్డినెన్స్ చేసి గవర్నర్‌కు పంపామని, ఆయన ఆమోదముద్ర వేయకుండా రాష్ట్రపతి పరిశీలనకు పంపారని తెలిపారు. ఆ బిల్లులను ఆమోదించాలని విన్నవించేందుకు తాము రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలవడానికి పది రోజుల క్రితమే అవకాశం అడిగామన్నారు. తర్వాత ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా.. రాష్ట్రపతిని కలిశారని, వారిద్దరి ఒత్తిడితోనే తమకు రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ లభించలేదని అభిప్రాయపడ్డారు. బీసీ రిజర్వేషన్లు సాధించుకోవాలంటే మోదీని గద్దె దించడం ఒక్కటే మార్గమని చెప్పారు. బీజేపీది తొలి నుంచి బీసీ వ్యతిరేక వైఖరేనని రేవంత్‌రెడ్డి అన్నారు. మండల్ కమిషన్ సిఫారసుల అమలును అడ్డుకొనేందుకు బీజేపీ కమండల్ యాత్ర(రథయాత్ర)ను ప్రారంభించిందని చెప్పారు. మన్మోహన్ హయాంలో ఉన్నత కేంద్రీయ విద్యాసంస్థల్లో రిజర్వేషన్లు ఇచ్చినపుడు యూత్ ఫర్ ఈక్వేషన్ పేరుతో అడ్డుకొనే ప్రయత్నం చేసిందన్నారు. ప్రస్తుతం ముస్లింల సాకుతో బీసీ రిజర్వేషన్ల పెంపును అడ్డుకుంటోందని ఆరోపించారు. 2017లో రాజస్థాన్‌లో అబ్దుల్ సత్తార్ అనే ముస్లిం వ్యక్తి ఓబీసీ కోటాలో

మిగతా 13వ పేజీలో...

ఎర్రవల్లే చర్లపల్లి!
- కేసీఆర్ ప్రస్తుతం జైల్లోనే ఉన్నారు
- ఫాంహౌస్‌లో తనను బంధించుకున్నారు
- ఎన్నికల్లో ఓడించడమే ఆయనకు పెద్ద శిక్ష
- కేసీఆర్ ఆరోగ్యం జాగ్రత్తని అధికార్లకు చెప్పా
- ఫిరాయింపు తప్పని సుప్రీం తీర్పిస్తే మేం సేఫ్
- 65 మంది ఎమ్మెల్యేలు మాతో ఉంటారుగా?
- ఎన్నికల ప్రక్రియలో మోసాలు జరిగేది నిజం
- కొడంగల్‌లోనే 15 వేల ఓట్లు మాయం
- మీడియాతో ఇష్టాగోష్ఠిలో సీఎం రేవంత్‌రెడ్డి

13



రోస్టర్ అధికారం
హైకోర్టు సీజేదే

- ఒక జడ్జికి క్రిమినల్ కేసులు కేటాయించొద్దని ఆదేశించడం
- ఆ అధికారాల్లో జోక్యం చేసుకోవడమే: సుప్రీం సీనియర్ జడ్జిలు
- జస్టిస్ పార్దీవాలా, జస్టిస్ మహదేవన్ బెంచ్ తీర్పుపై అసంతృప్తి
- అలహాబాద్ హైకోర్టు జడ్జిపై సుప్రీం ధర్మాసనం తీవ్ర వ్యాఖ్యల కేసు
- సర్వోన్నత న్యాయస్థానంలో నేడు మళ్లీ విచారణకు
- సుప్రీం ఆదేశాలు అమలు చేయకుండా ఉండేందుకు ఫుల్‌కోర్టును సమావేశపరచండి: అలహాబాద్ సీజేకు 13 మంది జడ్జిల లేఖ

అలహాబాద్, న్యూఢిల్లీ, ఆగస్టు 7: సివిల్ కేసులో క్రిమినల్ ప్రొసీడింగ్స్‌కు అనుమతిస్తూ అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ ఇచ్చిన తీర్పును సవాల్‌చేస్తూ దాఖలైన పిటిషన్‌ను.. సుప్రీంకోర్టు మరోసారి విచారించనుంది. సర్వోన్నత న్యాయస్థానంలో శుక్రవారం విచారణకు వచ్చే కేసుల జాబితాలో ఈ కేసు కూడా ఉంది. గతంలో ఈ వ్యాజ్యాన్ని విచారించిన జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌తో కూడిన ధర్మాసనమే దీన్ని విచారించనుంది. ఆగస్టు 4న ఈ కేసు విచారణ సందర్భంగా.. జస్టిస్ ప్రశాంత్‌కుమార్ తీర్పుపై సుప్రీంకోర్టు తీవ్ర పదజాలంతో ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. "హైకోర్టుల్లో ఏం జరుగుతోంది.. ఇది సుప్రీం

మిగతా 2వ పేజీలో...

విచారణే లేకుండా శిక్ష!
- ఏళ్లుగా జైల్లో ఉంచుతున్న ఈడీ
- బీపీసీఎల్ కేసులో సీజేఐ వ్యాఖ్య
- ఈడీ బాగా పనిచేస్తోంది: ఎస్జీ

2

జస్టిస్ యశ్వంత్ వర్మ ప్రవర్తన
నమ్మశక్యంగా లేదు
పిటిషన్ కొట్టేసిన సుప్రీం

2

డిస్కమ్‌లకు రాష్ట్ర సర్కారు బాకీ
రూ.14,928 కోట్లు
- నాలుగేళ్లలో చెల్లించాలి
- 2024 ఏప్రిల్ 1 తర్వాత బకాయిలైతే మూడేళ్లలోపే!: సుప్రీం

13



ఏపీ ఏసీబీ చరిత్రలోనే
అవినీతి రికార్డు
- రూ.25 లక్షలు లంచం తీసుకుంటూ దొరికిన గిరిజన సంక్షేమ శాఖ ఈఎన్‌సీ శ్రీనివాస్
- బిల్లుల మంజూరుకు రూ.5 కోట్లు డిమాండ్
- 3 వారాల్లో పదవీ విరమణకు ముందు మళ్లీ జైలుకు

14

ఏసీబీకి చిక్కిన అలంపూర్
ఇరిగేషన్ డీఈఈ
ఎంబీ రికార్డులో కొలతల కోసం రూ. 11 వేల లంచం

హైదరాబాద్‌పై
వరుణ గర్జన

- గంటన్నరపాటు దంచికొట్టిన వాన
- చెరువులను తలపించిన రహదారులు
- మునిగిన కార్లు.. కొట్టుకుపోయిన బైక్‌లు
- రోడ్ల మీద 4-5 కి.మీ. మేర ట్రాఫిక్ జాం
- కాలనీలు జలమయం.. ఇళ్లలోకి వరద
- ఖాజాగూడలో 13.3 సెం.మీ., గచ్చిబౌలిలో 12.6 సెం.మీ. వర్షపాతం
- నగరంలో అనేకచోట్ల 10 సెం.మీ. పైనే..
- అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావొద్దు: ముఖ్యమంత్రి రేవంత్
- యాదాద్రి జిల్లా ఆత్మకూరులో 14.8 సెం.మీ


హైదరాబాద్‌లోని రాజ్‌భవన్ వద్ద ప్రధాన రహదారిపై భారీగా నిలిచిన నీరు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)
కురిసేదాకా తెలియనే లేదు.. వరద పోటుతో బెంబేలెత్తించే భారీ వర్షం అని! ఉదయం నుంచి ఎండ దంచికొడితే మధ్యాహ్నం తర్వాత ఒక్కసారిగా మబ్బులు కమ్ముకున్నాయి. కొద్దిసేపటికే ఆకాశానికి చిల్లులు పడ్డాయా అన్నట్లుగా గంటన్నరపాటు కుండపోతగా వర్షం దంచికొట్టింది. రాష్ట్రవ్యాప్తంగా గురువారం పలుచోట్ల ఇలా వరుణుడు కంగారెత్తించాడు. ప్రత్యేకించి

మిగతా 14వ పేజీలో...

ప్రమాదంలో 'సింగూరు'!
- ఎగువన ఉన్న రివిట్‌మెంట్ దెబ్బతిన్నది
- రక్షణగా ఉన్న పిట్టగోడ నిలువునా చీలింది
- ప్రాజెక్టుకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలి
- ఎక్కువ నీటి నిల్వ వల్లే ఈ పరిస్థితి
- సర్కారుకు ఆనకట్ట భద్రత కమిటీ నివేదిక

3

2-3 నెలల్లో
ఆర్‌ఆర్‌ఆర్ పనులు

- ఆరు లేన్లుగా అప్‌గ్రేడ్ చేయడం వల్లే ఆలస్యం
- నిర్మాణ పనులు వేగవంతం చేసేందుకే టాస్క్‌ఫోర్స్ కమిటీ
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- కలెక్టర్లు, ఎస్పీలను కూడా కేటీఆర్ తిడుతున్నారు
- మేం డైరీ రాస్తే పదేళ్లలో ఎన్నో పేర్లు రాయాల్సి ఉండేది
- వచ్చే వారం హ్యామ్‌రోడ్ల టెండర్లు
- మీడియాతో ఇష్టాగోష్ఠిలో వెల్లడి



హైదరాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): రీజినల్ రింగ్ రోడ్డు తెలంగాణకు మణిహారమని.. రెండు మూడు నెలల్లో పనులు ప్రారంభించాలనే చిత్తశుద్ధితో ఉన్నామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తర భాగం భూసేకరణ దాదాపు పూర్తి అయిందని, 6 లేన్లుగా అప్‌గ్రేడ్ చేయటంతోనే పనులు ఆలస్యం అయ్యాయని ఆయన వివరించారు. సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, భువనగిరి జిల్లాల్లో

మిగతా 12వ పేజీలో...



గంజాయి మత్తులో మెడికోలు
14

- నార్కోటిక్ పరీక్షల్లో 9 మంది వైద్య విద్యార్థులకు పాజిటివ్
- వారిలో ఇద్దరు అమ్మాయిలు
- తల్లిదండ్రుల సమక్షంలో ఈగల్ పోలీసుల కౌన్సెలింగ్

..ఇంకా ఉంది!

సుంకాలు అమల్లోకి వచ్చి కొన్ని గంటలే అయింది

- చైనా సహా మరిన్ని దేశాలపైనా 'రష్యా చమురు' టారిఫ్‌లు
- భారత్‌పై సుంకాలు పెంచాం..
- రష్యాతో చర్చల్లో పురోగతి వచ్చింది
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యలు
- వచ్చే వారం ట్రంప్-పుతిన్ భేటీ?
- ఈ ఏడాది చివర్లో భారత్‌కు పుతిన్
- మా రైతుల ప్రయోజనాలపై రాజీలేదు
- అమెరికాతో వాణిజ్య ఒప్పందం అంశంలో ప్రధాని మోదీ స్పష్టీకరణ

ట్రంప్ సుంకాలతో
రూ.12,000 కోట్ల నష్టం
తిరుప్పూర్ వస్త్ర ఎగుమతిదార్ల సంఘం



వాషింగ్టన్/మాస్కో/న్యూఢిల్లీ, ఆగస్టు 7: రష్యా చమురు కొనుగోలు చేయవద్దన్న తన మాట వినడం లేదంటూ భారత్‌పై ఒంటికాలిపై లేస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. ముమ్ముందు ఇంకా ఉందంటూ వ్యాఖ్యలు చేశారు. భారత్‌పై సుంకాలను 50 శాతానికి పెంచామని.. ఇదే సమయంలో ఉక్రెయిన్‌తో యుద్ధం ఆపే విషయంలో రష్యాతో చర్చల్లో పురోగతి నెలకొందని పేర్కొన్నారు. రష్యా చమురు కొనుగోలు చేయవద్దంటూ భారత్‌పై విధించిన ఆంక్షలు ప్రభావం చూపిస్తున్నట్టు పరోక్షంగా వ్యాఖ్యానించారు. రష్యా-ఉక్రెయిన్‌లతో సంధి

మిగతా 2వ పేజీలో...

పకడ్బందీగా ఓట్ల చోరీ!

- ఎన్నికల సంఘం, బీజేపీ కుమ్మక్కై భారీగా అక్రమాలకు పాల్పడ్డాయి
- ఐదు రకాల అవకతవకలతో మోసం
- ఒక్క సెగ్మెంట్‌ను పరిశీలిస్తేనే.. 1,00,250 తప్పుడు ఓట్లు తేలాయి
- ప్రజాస్వామ్యంపై ఇదో అణు బాంబు
- డిజిటల్ ఓటర్ల జాబితాలు ఇస్తే.. దేశవ్యాప్త అక్రమాలు బయటికొస్తాయ్
- న్యాయవ్యవస్థ ఈ వ్యవహారంలో జోక్యం చేసుకోవాలి: రాహుల్ గాంధీ
- బెంగళూరులోని మహదేవపుర అసెంబ్లీ సెగ్మెంట్ లెక్కలతో పీపీటీ



ఓటర్ల జాబితాలో అనర్హులెవరు?
ఆ చిట్టా ఇవ్వండి
- తొలగించిన అర్హుల పేర్లను తెలియజేయండి
- రాహుల్‌ని కోరిన కర్ణాటక రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి

2

న్యూఢిల్లీ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల అవకతవకలపై అణుబాంబు ప్రయోగిస్తానని ఇటీవల ప్రకటించిన రాహుల్ గాంధీ.. దీనికి సంబంధించి గురువారం ఢిల్లీలో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్(పీపీటీ) ఇచ్చారు. కర్ణాటకలోని బెంగళూరు సెంట్రల్ లోక్‌సభ నియోజకవర్గంలోని మహదేవపుర అసెంబ్లీ సెగ్మెంట్ ఒక్కచోట పరిశీలిస్తేనే అనేక అక్రమాలు బయటపడ్డాయని చెప్పారు. దేశవ్యాప్తంగా చాలా చోట్ల ఇలా 'ఓట్ల చోరీ'కి పాల్పడి.. లోక్‌సభ స్థానాలను గెలుచుకున్నారని

మిగతా 2వ పేజీలో...



20 వేల డాలర్లకు గ్రీన్‌కార్డు!
- పదేళ్లకుపైగా నిరీక్షిస్తున్న వారికి అవకాశం
- ఫీజు చెల్లిస్తే ఫాస్ట్‌ట్రాక్‌లో పరిష్కారం
- అమెరికా ప్రతినిధుల సభలో బిల్లు

2

కాంగ్రెస్ నేతపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఆగ్రహం
నీళ్ల సీసా విసిరిన కోవ లక్ష్మి
- ఆసిఫాబాద్‌లో కొత్త రేషన్ కార్డుల పంపిణీలో ఘటన
- ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్న అదనపు కలెక్టర్
- తమ హయాంలో ఎన్నో జరిగాయన్న ఎమ్మెల్యే లక్ష్మి
- అడ్డు చెప్పిన కాంగ్రెస్ నేతతో ఎమ్మెల్యే వాగ్వాదం

12



పసిడి పరుగులు
- ఢిల్లీలో 10 గ్రాముల ధర రూ. 1,02,620
- ఒక్కరోజే రూ. 3600 జంప్.. ఆల్‌టైమ్ రికార్డు

11

ఐఏఎస్ శివశంకర్‌ను 2 వారాల్లో ఏపీకి పంపాలి
- ఇదే మీకు చివరి అవకాశం
- ఆదేశాలను అమలు చేయకపోతే డీవోపీటీ కార్యదర్శి జీతం నిలిపివేతకు ఆదేశిస్తాం
- కఠిన చర్యలు తీసుకుంటాం
- కేంద్ర పరిపాలన ట్రిబ్యునల్ ఆగ్రహం

3

20 వేల డాలర్లకు గ్రీన్‌కార్డు.!

- పదేళ్లకుపైగా నిరీక్షిస్తున్నవారికి అవకాశం
- అమెరికా ప్రతినిధుల సభలో బిల్లు

న్యూఢిల్లీ, ఆగస్టు 7: అమెరికాలో శాశ్వత నివాసానికి జారీ చేసే గ్రీన్ కార్డు కోసం ఏళ్ల తరబడి నిరీక్షణకు చెక్ పెట్టేందుకు ఓ ప్రతిపాదన ముందుకువచ్చింది. గ్రీన్‌కార్డు కోసం పదేళ్లకు పైగా ఎదురుచూస్తున్న వారు 20 వేల డాలర్లు (రూ.17.5 లక్షలు) చెల్లిస్తే వారి దరఖాస్తును త్వరగా పరిష్కరించేందుకు అవకాశాన్నిచ్చే బిల్లును యూఎస్ ప్రతినిధుల సభలో ప్రవేశపెట్టారు. 2035లోగా చట్టబద్ధమైన వీసా బ్యాక్‌లాగ్‌లు గణనీయంగా తగ్గించేందుకు డిగ్నిటీ యాక్ట్ ఆఫ్ 2025 పేరుతో సభ్యులు మారియా ఎల్విరా సలాజర్, వెరోనికా ఎస్కోబార్ ఆ బిల్లును ప్రతిపాదించారు. దశాబ్దాలుగా ఉన్న సమస్య పరిష్కారానికి ఈ బిల్లును తెచ్చినట్లు సలాజర్ చెప్పారు. ప్రతిపాదిత బిల్లు ప్రకారం.. కుటుంబం లేదా ఉద్యోగాల విభాగాల్లో గ్రీన్‌కార్డు కోసం దశాబ్దానికి పైగా నిరీక్షిస్తున్న వారు ప్రీమియం ప్రాసెసింగ్ ఫీజు కింద 20 వేల డాలర్లు చెల్లించే అవకాశం ఉంటుంది. ఫీజు చెల్లించిన వారికి ప్రామాణిక క్యూ కంటే ముందు కార్డు పొందే అర్హత వస్తుంది. ఉద్యోగ ఆధారిత, ఫ్యామిలీ స్పాన్సర్డ్ గ్రీన్‌కార్డుల్లో ఒక్కో దేశానికి గరిష్ఠంగా ఉన్న 7% పరిమితిని 15 శాతానికి పెంచాలని బిల్లులో ప్రతిపాదించారు. అలాగే డాక్యుమెంటెడ్ డ్రీమర్స్ శాశ్వత నివాసానికి ఓ మార్గాన్ని బిల్లు సూచించింది. వర్క్ వీసాపై అమెరికాకు వచ్చిన వారి పిల్లలు పదేళ్ల పాటు స్థిరంగా ఇక్కడే నివాసం ఉన్నట్లయితే వారికి చట్టబద్ధ శాశ్వత నివాస (ఎల్‌పీఆర్) హోదాను కల్పించనున్నారు.

సెప్టెంబరు 9న ఉపరాష్ట్రపతి ఎన్నిక

న్యూఢిల్లీ, ఆగస్టు 7: ఉప రాష్ట్రపతి ఎన్నికకు కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) నోటిఫికేషన్ జారీ చేసింది. సెప్టెంబరు 9న ఎన్నికలు నిర్వహిస్తామని.. అదేరోజు ఓట్ల లెక్కింపు ఉంటుందని ప్రకటించింది. నామినేషన్లను గురువారం నుంచి స్వీకరిస్తున్నట్లు తెలిపింది. ఈనెల 21 వరకు నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ అని, 22న వాటిని పరిశీలిస్తామని పేర్కొంది. ఈనెల 25 వరకు నామినేషన్లను ఉపసంహరించుకోవచ్చని వివరించింది. ఆరోగ్య కారణాలతో జగదీప్ ధన్‌ఖడ్ ఉపరాష్ట్రపతి పదవికి జూలై 21న రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. కాగా, ఎన్డీయే కూటమి గురువారం సమావేశమైంది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన జరిగిన ఈ భేటీకి కూటమి నేతలంతా హాజరై ఉప రాష్ట్రపతి అభ్యర్థి ఎంపిక, ఎన్నికల సమన్వయంపై చర్చించారు.

తండ్రి హత్యకు ప్రతీకారం

- 17 ఏళ్ల తర్వాత రౌడీషీటర్‌ను చంపేసిన విద్యార్థి

చెన్నై, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): అప్పుడు ఆ పిల్లాడి వయసు రెండేళ్లు. ఆ చిన్నారి కళ్లెదుటే తండ్రిని పాశవికంగా నరికి చంపేశారు. అతడు పెరిగి పెద్దయ్యాడు. అతనితోపాటు తన తండ్రిని చంపిన వ్యక్తిపై పగా పెరుగుతూ వచ్చింది. అంతేకాదు.. ఆ హత్య చేసిన వ్యక్తి కనిపించినప్పుడల్లా.. 'మీ నాన్నను నడిరోడ్డుపై చంపింది నేనేరా' అంటూ హేళన చేస్తున్నాడు. అంతే అతడిని చంపేయాలని నిర్ణయానికొచ్చాడు. ఇదేమీ సినిమా కథ కాదు. తమిళనాడు రాజధాని చెన్నైలో బుధవారం జరిగిన యథార్థ సంఘటన. ఆ కుర్రాడి పేరు యువనేష్. బీబీఏ చదువుతున్నాడు. అతడి చేతిలో హత్యకు గురయ్యింది రౌడీషీటర్ ఫుల్కాన్ రాజ్‌కుమార్ (42). ఈ రాజ్‌కుమార్ 2008లో చెన్నై శివారు ప్రాంతమైన టీపీ సత్రం వద్ద పేరుమోసిన రౌడీ సెంథిల్‌ను హత్య చేశాడు. తండ్రిని చంపేసిన రాజ్‌కుమార్‌పై కోపం పెంచుకున్న యువనేష్.. బుధవారం రాత్రి నలుగురు స్నేహితులతో వెళ్లి.. ఇంట్లో నిద్రిస్తున్న రాజ్‌కుమార్‌ను చంపేశాడు. పోలీసులు.. యువనేష్‌ను, అతడి ఇద్దరు స్నేహితులను గురువారం అరెస్టు చేశారు.

ఫ్రెంచ్ ఫ్రైస్‌తో మధుమేహం ముప్పు..!

న్యూఢిల్లీ, ఆగస్టు 7: వారానికి మూడు సార్లు బంగాళాదుంపలతో చేసిన ఫ్రెంచ్ ఫ్రైస్ తినడం వల్ల మధుమేహం వచ్చే ప్రమాదం 20% పెరుగుతుందని తాజా అధ్యయనంలో వెల్లడైంది. అయితే ఉడికించిన లేదా కాల్చిన బంగాళాదుంపలతో అంత ప్రమాదం ఉండదని బ్రిటిష్ మెడికల్ జర్నల్‌లో ప్రచురితమైన అధ్యయనం పేర్కొంది. హార్వర్డ్, కేంబ్రిడ్జి యూనివర్సిటీల పరిశోధకులు ప్రారంభంలో మధుమేహం, గుండె జబ్బులు, క్యాన్సర్ లేని దాదాపు 2 లక్షల మంది నుంచి 40 ఏళ్లపాటు సేకరించిన డేటాను విశ్లేషించారు. ఈ క్రమంలో 40 ఏళ్ల తర్వాత వారిలో 22,300 మంది డయాబెటిస్ బారినపడినట్లు గుర్తించారు. వారానికి మూడుసార్లు ఫ్రెంచ్ ఫ్రైస్ తీసుకున్న వారిలో మధుమేహం ప్రమాదం 20% పెరిగిందని గుర్తించినట్లు వెల్లడించారు. అయితే కాల్చిన లేదా ఉడికించిన బంగాళాదుంపలు తీసుకున్న వారికి ఎలాంటి సమస్యా ఎదురుకాలేదని పేర్కొన్నారు. బంగాళాదుంపల స్థానంలో తృణధాన్యాలను ఆహారంగా ఇచ్చినప్పుడు మధుమేహం వచ్చే ప్రమాదం తగ్గినట్టు కనుగొన్నారు. కానీ.. బంగాళాదుంపలకు బదులుగా అన్నం తీసుకున్నవారిలో మధుమేహం ప్రమాదం పెరిగినట్టు గుర్తించారు.

జస్టిస్ వర్మ ప్రవర్తన నమ్మశక్యంగా లేదు

- ఆయన పిటిషన్‌ను కొట్టివేసిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, ఆగస్టు 7: అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి యశ్వంత్ వర్మకు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. తన నివాసంలో భారీ మొత్తంలో కాలిన నోట్ల కట్టలు బయటపడిన కేసులో అంతర్గత దర్యాప్తు నిర్వహించిన కమిటీ.. ఆయన్ను దోషిగా తేల్చిన సంగతి తెలిసిందే. అయితే ఆ నివేదికను సవాలు చేస్తూ వర్మ దాఖలు చేసిన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం గురువారం కొట్టివేసింది. ఆయన ప్రవర్తన నమ్మశక్యంగా లేదని, పిటిషన్‌ను విచారించలేమని తెలిపింది. ఈ కేసు దర్యాప్తులో చట్టప్రకారమే వ్యవహరించారని పేర్కొంది. భారీ మొత్తంలో నగదు బయటపడడంతో వర్మను న్యాయమూర్తి పదవి నుంచి తొలగించాలని దర్యాప్తు నివేదికలో సిఫారసు చేసిన సంగతి తెలిసిందే. జస్టిస్ వర్మ పక్షాన సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, ముకుల్ రోహత్గి వాదనలు వినిపించారు. జస్టిస్ వర్మను విధుల నుంచి తొలగించాలని నాటి సీజేఐ సంజీవ్ ఖన్నా రాష్ట్రపతి, ప్రధానికి సిఫారసు చేశారు. తాజాగా వర్మ పిటిషన్‌పై జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఏజీ మాసిహ్‌ల ధర్మాసనం విచారణ జరిపింది. వాదనలు విన్న ధర్మాసనం.. జస్టిస్ వర్మ పిటిషన్‌ను సమర్థించలేమని తేల్చిచెప్పింది. ఆయన అంతర్గత కమిటీ విచారణలో పాల్గొన్న తీరు, ఆ తర్వాత అసలు కమిటీ సామర్థ్యాన్ని ప్రశ్నించడాన్ని తాము పరిగణనలోకి తీసుకున్నట్లు తెలిపింది. ఆయన రిట్ పిటిషనే విచారణకు అనర్హమని తేల్చింది. నాటి సీజేఐ, ఆయన ఏర్పాటు చేసిన అంతర్గత కమిటీ.. ఫొటోలు, వీడియోల అప్‌లోడ్ విషయంలో తప్ప మిగిలిన అంశాల్లో చట్టాన్ని పూర్తిగా అనుసరించిందని స్పష్టం చేసింది. అలాగే కోర్టు ప్రక్రియను నిందించారన్న అభియోగాలపై జస్టిస్ వర్మ మీద ఎఫ్‌ఐఆర్ నమోదు చేయాలంటూ న్యాయవాది మాథ్యూస్ నెడుంపర దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను కూడా కొట్టేసింది. తాజాగా సుప్రీంకోర్టు నిర్ణయంతో పార్లమెంటులో ఆయనపై అభిశంసన చేపట్టేందుకు మార్గం సుగమమైంది.

పకడ్బందీగా ఓట్ల చోరీ!

బెంగళూరు సెంట్రల్ లోక్‌సభ నియోజకవర్గం. అక్కడ గట్టి పట్టున్న కాంగ్రెస్ గెలుస్తుందనే అంచనా ఉంది. కానీ 32,707 ఓట్ల మెజారిటీతో బీజేపీ గెలిచింది. ఈ లోక్‌సభ స్థానంలోని 7 అసెంబ్లీ సెగ్మెంట్లకు ఆరింటిలో లీడ్‌లో నిలిచిన కాంగ్రెస్‌కు సుమారు 82 వేల మెజారిటీ వచ్చింది. మిగిలిన మహదేవపుర సెగ్మెంట్‌లో మాత్రం బీజేపీకి ఏకంగా 1,14,046 ఓట్ల మెజారిటీ వచ్చింది.

ఈ సెగ్మెంట్‌లోని ఓ సింగిల్ బెడ్రూమ్ ఇంటి చిరునామాపై 80 మంది, కేవలం ఒకే గది ఉన్న మరో ఇంట్లో 46 మంది ఓటర్లు ఉన్నారు. ఇలాంటి 'బల్క్ ఓటర్లు'.. 10,452 మంది.

ఇక 0, -, %.. ఇలా గుర్తింపులేని చిరునామాలు ఉన్న ఓట్లు 40,009.. మూడు, నాలుగు ఓట్లున్న 'డూప్లికేట్' ఓటర్లు 11,965 మంది.. ఫొటో గుర్తించేలా లేని ఓటర్లు 4,132 మంది.. ఫారం-6ను దుర్వినియోగపర్చి నమోదైన ఓట్లు 33,692..

... దేశంలో ఎన్నికల అక్రమాలకు, ఎన్నికల కమిషన్-బీజేపీ కుమ్మక్కుకు సాక్ష్యమిదిగో అంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ చెప్పిన లెక్కలివి.



(మొదటిపేజీ తరువాయి)

ఆరోపించారు. ఇవన్నీ బయటపడతాయనే తాము ఎన్నిసార్లు అడిగినా ఎన్నికల సంఘం డిజిటల్ ఓటర్ల జాబితాలు, సీసీకెమెరా ఫుటేజీలు ఇవ్వకుండా ఆధారాలను నాశనం చేస్తోందని ఆరోపించారు.

పక్కా అనుకున్న చోట్ల ఓటమితో సందేహం

2024 సార్వత్రిక ఎన్నికల్లో కర్ణాటకలో 16 లోక్‌సభ సీట్లు గెలుస్తామని తమ అంతర్గత సర్వేలో తేలిందని, కానీ 9 సీట్లే వచ్చాయని రాహుల్ చెప్పారు. తాము పక్కాగా గెలుస్తామనుకున్న స్థానాల్లో ఓటమితో సందేహం వచ్చి బెంగళూరు సెంట్రల్ లోక్‌సభ స్థానంలో పరిశీలన జరిపామన్నారు. "బెంగళూరు సెంట్రల్‌లో బీజేపీ 32,707 ఓట్ల ఆధిక్యతతో గెలిచింది. కానీ ఈ లోక్‌సభ స్థానం పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో ఒక్క మహదేవపురలో తప్ప మిగతా ఆరింటిలో కాంగ్రెస్‌కే ఆధిక్యం వచ్చింది. 82వేలకుపైగా మెజారిటీ కాంగ్రెస్‌కే ఉంది. ఒక్క మహదేవపురలో మాత్రం బీజేపీకి ఏకంగా 1,14,046 ఓట్లు ఎక్కువగా వచ్చాయి. దీనిపై సందేహంతో లోతుగా పరిశీలన జరిపాం. అక్కడి 6.5 లక్షల ఓట్లలో 1,00,250 తప్పుడు ఓట్లు ఉన్నట్టు గుర్తించాం" అని రాహుల్ చెప్పారు.

ప్రజాస్వామ్యాన్ని విధ్వంసం చేసే కుట్ర

దేశంలో ప్రజాస్వామ్యాన్ని విధ్వంసం చేసే ప్రక్రియలో ఎన్నికల కమిషన్ భాగమైందని రాహుల్ ఆరోపించారు. ఒక్క అసెంబ్లీ స్థానంలోనే ఇన్ని అక్రమాలు జరిగితే.. దేశమంతటా ఎంతగా అవకతవకలు చోటు చేసుకున్నాయో తెలిసిపోతోందని పేర్కొన్నారు. ఈ అక్రమాలకు ఓటర్ల జాబితాలు, సీసీ కెమెరా ఫుటేజీలే పక్కా సాక్ష్యాలని చెప్పారు. కానీ సీసీ కెమెరా ఫుటేజీలను బయటపెట్టకుండా కావాలనే నిబంధనలను కూడా మార్చారని విమర్శించారు. "ఎన్నికల సంఘం, కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ కలసి చేసిన ఈ నేరపూరిత మోసం దేశ ప్రజలకు తెలియాలి. ఇది మన రాజ్యాంగానికి, జాతీయ జెండాకు వ్యతిరేకంగా జరిగిన నేరపూరిత కుట్ర" అని రాహుల్ మండిపడ్డారు. ఈ వ్యవహారంలో న్యాయ వ్యవస్థ కల్పించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పక్కా ప్రణాళిక ప్రకారం మోసం..

అంతా పక్కాప్రణాళిక ప్రకారం ఓట్ల చోరీ జరుగుతోందని రాహుల్ ఆరోపించారు. "సాధారణంగా పాలక పక్షాలపై ప్రజా వ్యతిరేకత ఉంటుంది. మీడియాలో అది కనిపిస్తుంది. కానీ బీజేపీ విషయంలో అలా జరగదు. ప్రజావ్యతిరేకతే లేనట్టుగా మెజారిటీ ఎన్నికల్లో గెలుస్తూ వస్తుంది. ఎగ్జిట్ పోల్స్, ఒపీనియన్ పోల్స్ కూడా ప్రజాభిప్రాయానికి విరుద్ధంగా ఉంటాయి. అందుకు తగినట్టుగానే బీజేపీకి అనూహ్యంగా ఓట్లు వస్తాయి. లాడ్లీ బెహనా, పుల్వామా ఘటన వంటివి చూపి బీజేపీ గెలిచిందంటూ ప్రచారం చేస్తారు. ఎన్నికలు నెలల తరబడి జరుగుతాయి. షెడ్యూల్‌ను ఇష్టారాజ్యంగా నిర్ణయిస్తారు. భారీగా ఓట్ల చోరీ జరుగుతుంది" అని ఆరోపించారు. హరియాణా, మహారాష్ట్రలో ఇలాగే ఫలితాలు తారుమారు అయ్యాయన్నారు. మహారాష్ట్రలో ఐదేళ్లలో నమోదైన ఓటర్ల కంటే ఎక్కువగా.. 5 నెలల్లో కోటి మంది ఓటర్లు కొత్తగా నమోదయ్యారని గుర్తు చేశారు. దీనిపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసినా, పార్లమెంట్‌లో ప్రస్తావించినా పట్టించుకునేవారే లేరన్నారు. మహారాష్ట్రలో సాయంత్రం 5.30 తర్వాత పెద్ద ఎత్తున ఓటింగ్ జరిగిందని ఈసీ చెప్పిందని... కానీ పెద్దగా క్యూలేవీ లేవని తమ కూటమి భాగస్వామ్య పార్టీలన్నింటికీ తెలుసని రాహుల్ స్పష్టం చేశారు. దీనిపై సందేహంతో సీసీ కెమెరా ఫుటేజీలు ఇవ్వాలని అడిగితే.. ధ్వంసం చేశామని ఈసీ చెప్పిందని గుర్తు చేశారు.

సంతకంతో సాక్ష్యాలు ఇవ్వండి: ఈసీ

ఓట్ల చోరీ ఆరోపణలపై సంతకంతో కూడిన డిక్లరేషన్, సాక్ష్యాలను తమకు అందజేయాలని కర్ణాటక రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి రాహుల్ గాంధీకి లేఖ రాశారు. తగిన చర్యలు తీసుకుంటామన్నారు. అయితే తాను బహిరంగంగానే వివరాలు వెల్లడించానని, దానిని ప్రమాణం చేసి చెప్పినట్టుగానే తీసుకోవాలని రాహుల్ చెప్పారు. కాగా.. రాహుల్ నివాసంలో గురువారం సాయంత్రం ఇండి కూటమి నేతలతో విందు భేటీ జరిగింది. 25 పార్టీలకు చెందిన 50 మంది నేతలు ఇందులో పాల్గొన్నారు. బిహార్‌లో 'ఓటర్ల జాబితా ప్రత్యేక సమీక్ష', ఎన్నికల సంఘంపై 'ఓట్ల చోరీ' ప్రజెంటేషన్‌పై చర్చించారు.

నేడు బెంగళూరులో నిరసన ప్రదర్శన

'ఓట్ల చోరీ'కి సంబంధించి శుక్రవారం బెంగళూరులో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఇతర నేతలతో కలసి నిరసన ప్రదర్శన నిర్వహిస్తామని రాహుల్ తెలిపారు. 'ఓట్ అధికార్ ర్యాలీ' పేరిట ఈ సభను నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి బెంగళూరులోని ఫ్రీడం పార్కులో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సభ ముగిశాక స్థానిక ఎన్నికల కమిషన్ కార్యాలయానికి పాదయాత్రగా వెళ్లి వినతిపత్రాన్ని సమర్పించనున్నారు.

రాహుల్‌ది కుటిల మోసం: బీజేపీ

ఎన్నికల కమిషన్‌పై రాహుల్ ఆరోపణ కాంగ్రెస్ కుట్రలో భాగమని బీజేపీ విమర్శించింది. మోదీపై విశ్వాసంతో ప్రజలు ఓట్లు వేస్తున్న విషయాన్ని గౌరవించలేకే ఈ విమర్శలు చేస్తున్నారని బీజేపీ ఎంపీ రవిశంకర్ ప్రసాద్ మండిపడ్డారు. రాహుల్ తీరు రాజ్యాంగాన్ని నాశనం చేసే కుట్ర అని కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఆరోపించారు.

డిజిటల్ జాబితాలు ఎందుకు ఇవ్వట్లేదు?

కంప్యూటర్లలో సులువుగా విశ్లేషించేందుకు వీలుగా డిజిటల్ ఓటర్ల జాబితాలను ఇవ్వాలని ఎన్నికల సంఘాన్ని కోరితే నిరాకరించిందని రాహుల్ తెలిపారు. అందులో మతలబు ఏమిటని నిలదీశారు. వేల కొద్దీ పేజీలతో కూడిన జాబితాలను ఈసీ ఇచ్చిందని.. దీనితో 30, 40 మంది ఆరు నెలల పాటు రాత్రింబవళ్లు కష్టపడి.. ఒక్కో ఓటర్ పేరు, చిరునామా, ఫొటోలను పరిశీలించారని చెప్పారు. భౌతికంగా పరిశీలిస్తేనే ఇన్ని అక్రమాలు బయటపడ్డాయని.. డిజిటల్ జాబితాలిస్తే దేశవ్యాప్తంగా జరిగిన 'ఓట్ల చోరీ' అంతా బహిర్గతం అవుతుందని పేర్కొన్నారు.

లోకం తీరు



అబద్ధాల 'నిజలింగ'

వెలుగులోకి నిజలింగస్వామీజీ మోసాలు

బసవదీక్ష స్వీకరించినా ఇస్లాంపై మమకారం



బెంగళూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని చామరాజనగర్ జిల్లా గుండ్లుపేట మఠాధిపతిగా వ్యవహరించిన నిజలింగస్వామి అలియాస్ మహమ్మద్ నిసార్ గురించి కలకలం రేపే అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. గుండ్లుపేట తాలూకా చౌడహళ్లి గ్రామంలోని గురుమల్లేశ్వర విరక్తమఠం మఠాధిపతిగా నిజలింగస్వామీజీ వ్యవహరించారు. ఆయన ముస్లిం మతస్థుడని తెలియడంతో గ్రామస్థులు మఠం నుంచి బహిష్కరించారు. యాదగిరి జిల్లా శహపుర తాలూకాకు చెందిన ఆయన పూర్వనామం మహమ్మద్ నిసార్. బాల్యంలోనే సన్యాసం స్వీకరించారు. బసవణ్ణ వచనాలు, మానవతా బోధనలు చేసేవారు. 2020లో బసవదీక్ష స్వీకరించారు. బసవకల్యాణలో బసవ మహాముని బసవ ప్రభుస్వామీజీ నుంచి లింగదీక్ష పొందారు. 2020 ఆగస్టు 15న బసవలింగస్వామీజీగా మారారు. గుండ్లుపేట మఠం శాఖకు ఆయనను మఠాధిపతిగా నియమించారు. ఆయన ఎస్ఎస్ఎల్‌సీ మార్కుల జాబితా ఇటీవల వెలుగులోకి రాగా, అందులో మహమ్మద్ నిసార్ అని పేరు ఉండటం కలకలం రేపింది. అతడి మూలం ఇస్లాం మతం కావడంతో భక్తుల నుంచి వ్యతిరేకత వచ్చింది. భక్తులు రెండు వర్గాలుగా విడిపోయారు. దీంతో ఆయన సోమవారం పీఠాన్ని వదిలి వెళ్లిపోయారు. కాగా, మఠాధిపతిగా ఉంటూనే ఆయన ముస్లింలు ధరించే టోపీలను ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసినట్లు గ్రామస్థులు గుర్తించారు. స్వామీజీగా ఉంటూనే మద్యం సేవించేవారని, మాంసాహారాన్ని భుజించేవారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



రైతు ప్రయోజనాలపై రాజీపడే ప్రసక్తే లేదు

అమెరికాతో వాణిజ్య ఒప్పందం అంశంలో ప్రధాని మోదీ స్పష్టీకరణ

న్యూఢిల్లీ, ఆగస్టు 7: భారత రైతులు, మత్స్యకారులు, పాడి పరిశ్రమ ప్రయోజనాల అంశంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడే ప్రసక్తేలేదని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. అవసరమైతే వ్యక్తిగతంగా కూడా ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మోదీ మాట్లాడారు. వాణిజ్య ఒప్పందంలో భాగంగా తమ దేశ వ్యవసాయ, పాడి ఉత్పత్తులపై సుంకాలు తగ్గించాలంటూ అమెరికా ఒత్తిడి చేస్తున్న నేపథ్యంలో ఈ అంశంపై మోదీ స్పష్టతనిచ్చారు. దేశంలో వాతావరణ మార్పులను తట్టుకునే వంగడాలను అభివృద్ధి చేయాల్సి ఉందని చెప్పారు. కరువు, తీవ్ర ఎండలు, వరదలను తట్టుకునే వంగడాలను రూపొందించాలని శాస్త్రవేత్తలకు పిలుపునిచ్చారు. కాగా, బ్రెజిల్ అధ్యక్షుడు లులా డసిల్వా గురువారం మోదీకి ఫోన్ చేసి మాట్లాడారు. ఇరు దేశాల మధ్య వాణిజ్య, సాంకేతిక, రక్షణ భాగస్వామ్యంపై వారు చర్చించారని ప్రధాని కార్యాలయం వెల్లడించింది. బ్రెజిల్‌పై వాణిజ్య సుంకాల నేపథ్యంలో తాను ట్రంప్‌తో మాట్లాడబోనని, అవసరమైతే మోదీతో మాట్లాడుతానని పేర్కొన్న మర్నాడే ఆయన మోదీకి ఫోన్ చేశారు.

..ఇంకా ఉంది!

(మొదటిపేజీ తరువాయి)

ఒప్పందం కుదిరితే భారత్‌పై వేసిన అదనపు సుంకాలను తగ్గిస్తారా అని మీడియా ప్రశ్నించగా.. "దాని గురించి తర్వాత ఆలోచిస్తాం. ప్రస్తుతానికైతే భారత్ 50శాతం సుంకాలు చెల్లిస్తోంది" అని ట్రంప్ పేర్కొన్నారు. రష్యా నుంచి చైనాతోపాటు ఇతర దేశాలు కూడా చమురు కొనుగోలు చేస్తున్న అంశాన్ని ప్రస్తావిస్తూ.. "టారిఫ్‌లు అమల్లోకి వచ్చి కొన్ని గంటలే అయింది. రష్యా చమురు కొనుగోళ్ల విషయంలో చైనాకు భారత్ చాలా దగ్గరగా ఉంది. ఇంకా ముందు చాలా చూడాల్సి ఉంది. చైనా సహా మరికొన్ని దేశాలపైనా సుంకాలు విధించే అవకాశం ఉంది. ఇప్పటికైతే కచ్చితంగా చెప్పలేం.." అని పేర్కొన్నారు. కాగా, యాపిల్ కంపెనీ అమెరికాలో వచ్చే నాలుగేళ్లలో మరో వంద బిలియన్ డాలర్లు (సుమారు రూ.8.7 లక్షల కోట్లు) పెట్టుబడి పెట్టనుంది. ఇప్పటికే నిర్ణయించిన 500 బిలియన్ డాలర్ల (సుమారు రూ.43.5లక్షల కోట్లు) పెట్టుబడులకు ఇది అదనం. యాపిల్ సీఈవో టిమ్ కుక్‌తో వైట్‌హౌజ్‌లో భేటీ అయిన తర్వాత ట్రంప్ ఈ ప్రకటన చేశారు. అమెరికాలో అమ్ముడయ్యే ఐఫోన్లు అమెరికాలోనే తయారుకావాలన్న లక్ష్యం దిశగా ఇదొక ముందడుగు అన్నారు. అమెరికాకు దిగుమతయ్యే కంప్యూటర్ చిప్‌లు, సెమీకండక్టర్లపై 100% దిగుమతి సుంకం విధించనున్నట్టు ట్రంప్ తెలిపారు.

ఇంటెల్ సీఈవో రాజీనామా చేయాలి..

ప్రఖ్యాత చిప్‌లు, సెమీకండక్టర్ల తయారీ సంస్థ ఇంటెల్ సీఈవో లిప్-బు టాన్ రాజీనామా చేయాలని ట్రంప్ డిమాండ్ చేశారు. "తీవ్రంగా వివాదాస్పదంగా మారిన ఇంటెల్ సీఈవో వెంటనే రాజీనామా చేయాలి. ఈ సమస్యకు మరో పరిష్కారం లేదు" అని ట్రంప్ 'ట్రుత్ సోషల్' వేదికపై వ్యాఖ్యానించారు. చైనా కంపెనీలతో లిప్ బు టాన్ సన్నిహిత సంబంధాలు నెరుపుతున్నారని, ఇది ఇంటెల్‌కు, అమెరికా జాతీయ భద్రతకు ప్రమాదకరమని ఇటీవలే అమెరికా సెనేటర్ కాటన్ ఆరోపించారు. సీఈవోను తొలగించాలంటూ ఇంటెల్‌కు లేఖ రాశారు. కాగా భారత్‌పై ఏకపక్షంగా అమెరికా విధిస్తున్న సుంకాలకు బదులుగా భారత్ కూడా అమెరికాపై ప్రతీకార సుంకాలు విధించాలని సీనియర్ కాంగ్రెస్ నేత శశిథరూర్ పేర్కొన్నారు.



పుతిన్‌తో భేటీ అయిన అజిత్ దోవల్

పుతిన్‌తో అజిత్ దోవల్ భేటీ..

జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ గురువారం రష్యాలోని మాస్కోలో ఆ దేశ అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో భేటీ అయ్యారు. ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం, ఇంధనం, రక్షణ బంధాలపై చర్చించారు. అంతకుముందు రష్యా భద్రతామండలి కార్యదర్శి సెర్గీ షోయిగుతోనూ దోవల్ భేటీఅయ్యారు. రష్యా చమురు కొనుగోళ్ల విషయంలో అమెరికా ఒత్తిడి, అదనపు సుంకాల నేపథ్యంలో దోవల్ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. కాగా ఈ ఏడాది చివరిలో పుతిన్ భారత్‌లో పర్యటించనున్నట్టు సమాచారం. ఇక ఉక్రెయిన్‌తో యుద్ధం నిలిపివేత, రష్యాపై ఆంక్షల తొలగింపు అంశాలపై అమెరికా, రష్యా అధ్యక్షులు ట్రంప్, పుతిన్ భేటీ కానున్నారు. మాస్కోలో పుతిన్‌తో అమెరికా రాయబారి స్టీవ్ విట్కాఫ్ చర్చల సందర్భంగా దీనిపై అంగీకారం కుదిరింది. వచ్చే వారంలోనే యూఏఈలో ట్రంప్‌తో భేటీ జరగవచ్చని పుతిన్ పేర్కొన్నారు.



ట్రంప్ సుంకాలతో రూ.12 వేల కోట్ల నష్టం

తిరుప్పూర్ వస్త్ర ఎగుమతిదారుల సంఘం

చెన్నై, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బాదిన సుంకాల కారణంగా వస్త్ర ఎగుమతులు నిలిచిపోయి, తక్షణం రూ.12వేల కోట్ల నష్టం వాటిల్లే అవకాశముందని తమిళనాడులోని తిరుప్పూరు వస్త్ర ఎగుమతిదారుల సంఘం అధ్యక్షుడు సుబ్రమణియన్ పేర్కొన్నారు. గురువారం ఆయన తిరుప్పూర్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. భారత్‌పై అమెరికా విధించిన సుంకాలు అసమంజసంగా ఉన్నాయని, పెంపు ద్వారా వినియోగదారులే తీవ్రంగా నష్టపోతారన్నారు. తిరుప్పూరులో రూ.100కు లభించే దుస్తుల ధర రూ.150కు పెరుగుతుందని ఉదహరించారు. అమెరికా సుంకాల కారణంగా తిరుప్పూరు దుస్తుల ఎగుమతి కేంద్రాల్లో పనిచేస్తున్నవారి ఉపాధి అవకాశాలకు ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. బ్రిటన్‌తో కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కారణంగా ఆ దేశానికే దుస్తులను అధికంగా ఎగుమతి చేస్తామని వివరించారు.

రోస్టర్ అధికారం హైకోర్టు సీజేదే

(మొదటిపేజీ తరువాయి)

జడ్జిలుగా మేం చూసిన అత్యంత చెత్త, తప్పుడు తీర్పుల్లో ఒకటి" అంటూ సుప్రీంకోర్టు తన తీర్పులో మండిపడింది. అంతేకాదు.. ఆ జడ్జికి (జస్టిస్ ప్రశాంత్‌కుమార్) రిటైరయ్యే దాకా క్రిమినల్ కేసుల విచారణ అప్పగించొద్దని, ఆయన్ను వేరే సీనియర్ జడ్జి ఉన్న ధర్మాసనంలో కూర్చోబెట్టాలని.. అలహాబాద్ హైకోర్టు సీజేకు సూచించింది. అయితే ఆ తీర్పుపై సుప్రీంకోర్టులోని ఇతర సీనియర్ న్యాయమూర్తులు అసంతృప్తి వ్యక్తం చేశారని, దీనిపై సుప్రీం సీజే జస్టిస్ బీఆర్ గవాయ్ కూడా సుప్రీం సీనియర్ జడ్జిలతో సంప్రదించారని సమాచారం. ఒక జడ్జి రిటైరయ్యే దాకా క్రిమినల్ కేసులు అప్పగించకూడదని ఆదేశించడం.. హైకోర్టు సీజేకున్న రోస్టర్ అధికారాల్లో జోక్యం చేసుకోవడమేనని వారు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే ఈ కేసును మళ్లీ విచారించనున్నట్టు తెలిసింది.

ఫుల్‌కోర్టును సమావేశపరచండి..

మునుపెన్నడూ లేని విధంగా.. సుప్రీం తీర్పులో కొన్ని ఆదేశాలను అమలు చేయకూడదంటూ అలహాబాద్ హైకోర్టుకు చెందిన 13 మంది న్యాయమూర్తులు ఆ హైకోర్టు సీజేకు ఒక లేఖ రాశారు. జస్టిస్ ప్రశాంత్‌కుమార్‌కు క్రిమినల్ కేసులు అప్పగించొద్దని సుప్రీం ఇచ్చిన తీర్పుపై చర్చించేందుకు ఫుల్‌కోర్టును సమావేశపరచాల్సిందిగా ఆ లేఖలో విజ్ఞప్తి చేశారు. "సుప్రీంకోర్టుకు హైకోర్టులపై పాలనాపరమైన పర్యవేక్షణ అధికారం లేదు. కాబట్టి.. సర్వోన్నత న్యాయస్థానం ఆగస్టు 4న ఇచ్చిన తీర్పులోని 24, 25, 26 పారాల్లో ఇచ్చిన ఆదేశాలను అమలు చేయకూడదని మా ఫుల్‌కోర్టు తీర్మానం చేసింది. ఆ ఆదేశాలపైన, తీర్పులో వాడిన భాష, మాటల ధోరణిపై ఫుల్‌కోర్టు విచారం వ్యక్తం చేసింది" అనే తీర్మానాన్ని పరిగణనలోకి తీసుకోవాల్సిందిగా ఆ లేఖలో కోరారు. ఈ కేసు విషయంలో జస్టిస్ ప్రశాంత్ కుమార్‌కు ఎలాంటి నోటీసులూ జారీచేయకుండా, వాదన వినిపించుకునే అవకాశం ఇవ్వకుండా.. సుప్రీంకోర్టు ఆయనపై తీవ్ర వ్యాఖ్యలు చేసిందని పేర్కొన్నారు. అలాంటి వ్యాఖ్యలు.. అమర్‌పాల్ సింగ్ వర్సెస్ స్టేట్ ఆఫ్ యూపీ, 2012 కేసులో సుప్రీంకోర్టు ప్రతిపాదించిన సూత్రాలనే ఉల్లంఘించే విధంగా ఉన్నాయని ఆవేదన వెలిబుచ్చారు. జస్టిస్ ప్రశాంత్ కుమార్ తీర్పు.. ఎలాంటి ముందస్తు ఉదాహరణా లేకుండా ఇచ్చింది, విపరీతమైనది కాదని.. సుప్రీంకోర్టు గతంలో లీకున్‌హీ వర్సెస్ స్టేట్ ఆఫ్ యూపీ, సయ్యద్ అస్కారీ హదీ అలీ ఆగస్టీన్ ఇమామ్ వర్సెస్ స్టేట్ (ఢిల్లీ అడ్మినిస్ట్రేషన్) కేసుల్లో ఇచ్చిన తీర్పుల ఆధారంగా ఇచ్చిందని గుర్తుచేశారు. కాబట్టి ఆయనపై అంత తీవ్ర వ్యాఖ్యలు చేసి ఉండాల్సింది కాదన్నారు. అలహాబాద్ హైకోర్టు జడ్జి జస్టిస్ అరిందమ్ సిన్హా పేరిట రాసిన ఈ లేఖలో మరో 12 మంది జడ్జిలు సంతకం చేశారు.

విచారణే లేకుండా శిక్ష!

- ఏళ్ల తరబడి జైల్లో ఉంచుతున్న ఈడీ
- బీపీసీఎల్ కేసులో సీజేఐ వ్యాఖ్యలు



న్యూఢిల్లీ, ఆగస్టు 7: ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దర్యాప్తు చేస్తున్న కేసుల్లో శిక్షపడిన సందర్భాలు అతి తక్కువగా ఉండటంపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. నిందితులకు శిక్ష పడేలా చేయలేకపోయినా వాళ్లను ఏళ్ల తరబడి విచారణ లేకుండా జైళ్లలో ఉంచడం ద్వారా శిక్షించడంలో ఈడీ విజయం సాధించిందని వ్యాఖ్యానించింది. ఈడీ చేపట్టిన కేసుల్లో నేర నిరూపణ జరిగిన వాటి శాతం ఎంతని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ సతీశ్ చంద్ర శర్మల ధర్మాసనం ప్రశ్నించింది. భూషన్ పవర్ అండ్ స్టీల్ లిమిటెడ్ (బీపీఎస్ఎల్) కంపెనీని జేఎస్‌డబ్ల్యూ స్టీల్‌కు అప్పగించే ప్రతిపాదనను ఇటీవల సుప్రీంకోర్టు నిలువరించింది. దివాలా చట్టంలోని పలు నిబంధనలకు విరుద్ధంగా ఈ అప్పగింత ప్రయత్నం ఉందని వ్యాఖ్యానించింది. ఈ తీర్పుపై పునస్సమీక్షించాలని అప్పులు ఇచ్చిన బ్యాంకులు, బీపీఎస్ఎల్‌ను కొనాలనుకుంటున్న జేఎస్‌డబ్ల్యూ స్టీల్ సంస్థ సుప్రీంకోర్టును కోరాయి. గురువారం విచారణ సందర్భంగా బీపీఎస్ఎల్ కుంభకోణం విచారణ కొలిక్కిరాని విషయం ప్రస్తావనకు వచ్చింది. ఇన్నేళ్లయినా ఈడీ కుంభకోణం విచారణను కొలిక్కి తీసుకు రాలేక పోయిందని సుప్రీంకోర్టు తప్పుబట్టింది. బ్యాంకుల తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా స్పందిస్తూ, ఈడీ చాలా బాగా పనిచేస్తోందన్నారు. ఈడీ ఇప్పటిదాకా వివిధ కుంభకోణాలకు సంబంధించి నిందితుల నుంచి రూ.23,000 కోట్లు వసూలు చేసి బాధితులకు అప్పగించిందని తెలిపారు. తమకు ప్రచారం చేసుకునే అవకాశం లేకుండాపోయిందన్నారు. ఈ సందర్భంగా, సీజేఐ స్పందిస్తూ, ఈడీ కేసుల్లో శిక్షలు పడటమే చాలా తక్కువగా ఉందని, విచారణ లేకుండా జైళ్లలో ఉంచడం ద్వారా ఈడీ నిందితులకు శిక్షలు విధిస్తోందని వ్యాఖ్యానించారు.

12వేల అప్పీళ్లు, 6వేల ఫిర్యాదులు పెండింగ్

» ఆర్టీఐ ప్రధాన కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి వెల్లడి

జనగామ, యాదాద్రి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): సమాచార కమిషన్ వద్ద సుమారు 12వేల అప్పీళ్లు, 6 వేల ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయని రాష్ట్ర సమాచార ప్రధాన కమిషనర్ జి.చంద్రశేఖర్‌రెడ్డి చెప్పారు. ఈ అప్పీళ్లు, ఫిర్యాదుల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. జనగామ కలెక్టరేట్‌లో నిర్వహించిన సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సులో మిగతా కమిషనర్లతో కలిసి ఆయన పాల్గొన్నారు. జిల్లాలోని అన్ని శాఖల పౌర సమాచార అధికారి(పీఐవో), సహాయ పౌర సమాచార అధికారి(ఏపీఐవో)లకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆర్టీఐ చట్టంపై అవగాహన కల్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ప్రజలు అడిగిన సమాచారాన్ని 30 రోజుల్లోగా ఇవ్వాలని, లేదంటే అప్పీల్‌కు వెళ్లాలంటూ దరఖాస్తుదారులకు సూచించాల్సిన బాధ్యత పీఐవోలపై ఉందన్నారు.



మాట్లాడుతున్న ఆర్టీఐ ప్రధాన కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి

ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌కు అరుదైన గుర్తింపు

» కార్నియల్ న్యూరోటైజేషన్ నిర్వహించే కేంద్రాల్లో ఒకటి

» 2019 నుంచి ఆ తరహా ఆపరేషన్లు 40కి పైగా నిర్వహణ

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే.. కార్నియల్ న్యూరోటైజేషన్ శస్త్రచికిత్స నిర్వహించే అగ్రగామి కంటి చికిత్స కేంద్రాల్లో ఒకటిగా ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్(ఎల్వీపీఈఐ)కు గుర్తింపు దక్కింది. 2019 నుంచి ఇప్పటిదాకా ఎల్వీపీఈఐ ఈ తరహా శస్త్రచికిత్సలు 40కి పైగా చేసి అత్యుత్తమ ఫలితాలు నమోదుచేసింది. ఈ విషయాన్ని ఆ సంస్థ ఒక ప్రకటన ద్వారా తెలిపింది. గట్టిగా గాలి వీచి దుమ్ము లేస్తే.. అసంకల్పితన ప్రతీకారచర్యగా మనం కనురెప్పలు ఆడిస్తాం. కంట్లో ఏదైనా నలుసు పడితే.. వెంటనే కళ్లల్లో నీరు వచ్చి దాన్ని బయటకు నెట్టాలని ప్రయత్నిస్తుంది. కార్నియాకు సహజంగా ఉండే సెన్సేషన్ (స్పర్శ, నొప్పి, ఉష్ణోగ్రతవంటి వాటిని గుర్తించే సామర్థ్యం) కారణంగా ఈ చర్యలన్నీ జరుగుతాయి. పుట్టుకతో వచ్చే సమస్యల కారణంగాగానీ, న్యూరోసర్జరీ సమయంలో నాడులు దెబ్బతిన్నప్పుడుగానీ.. కార్నియాకు ఉండే ఆ సహజ సామర్థ్యం పోతుంది. అలాంటి సందర్భాల్లో.. నుదురు, కాలు వంటి ఇతర భాగాల నుంచి ఆరోగ్యవంతమైన సెన్సరీ నాడులను మైక్రో సర్జరీ ద్వారా కార్నియా సమీపంలో అతికిస్తారు. కొన్ని నెలల వ్యవధిలో అవి పెరిగి కార్నియా సెన్సేషన్‌ను పునరుద్ధరిస్తాయి. ఈ ప్రక్రియ కంటికి సాంత్వన కలిగించడమే కాక, దృష్టిని కాపాడడంలో కూడా సహాయపడుతుందని ఎల్వీపీఈఐ వైద్యులు తెలిపారు. న్యూరోట్రోఫిక్ కెరటిటిస్ చికిత్సలో ఎల్వీపీఈఐకి విశేష అనుభవం ఉందని వారు వివరించారు.

చేతబడి నెపంతో గిరిజనుడి హత్య

బాలిక మరణానికి కారణమంటూ పలువురి దురాగతం

ఆళ్లపల్లి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): చేతబడి చేసి ఓ బాలికను చంపాడనే నెపంతో గొత్తికోయ తెగకు చెందిన ఓ గిరిజనుడిని కొందరు తాళ్లతో కట్టేసి కర్రలతో కొట్టి హతమార్చారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆళ్లపల్లి మండలం పెద్దవెంకటాపూరం పంచాయతీ బూసురాయిలో బుధవారం జరిగిన ఈ ఘటనలో మడకం బీడ అలియాస్ రాజు(35) హత్యకు గురయ్యాడు. గురువారం వెలుగు చూసిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. బూసురాయికి చెందిన పొడియం గంగి(9) అనే బాలిక కామెర్ల బారిన పడి బుధవారం మరణించింది. అయితే, రాజు చేతబడి చేయడం వల్లే గంగి చనిపోయిందంటూ కొందరు అనుమానం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో బాలిక మృతదేహం వద్దకు రాజును తీసుకొచ్చి తాళ్లతో కట్టేసిన కొందరు కర్రలతో విచక్ష ణారహితంగా కొట్టారు. ఈ దెబ్బలకు రాజు ప్రాణాలు కోల్పోగా మృతదేహాన్ని అతని ఇంటి ముందే పడేశారు. గురువారం ఉదయం ఈ విష యం తెలుసుకున్న పోలీసులు బూసురాయికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. రాజు కుటుంబ సభ్యురాలు నందిని ఫిర్యాదు మేరకు గ్రామానికి చెందిన మడవిరాజు, మొక్కటి చిన్నసోమయ్య, మొక్కటి భీమయ్య, వజ్జ గంగ, వేకో జోగా, మొక్కటి వెంకటేశ్వర్లుపై కేసు నమోదు చేశారు. నిందితులంతా ప్రస్తుతం పరారీలో ఉన్నారని పోలీసులు తెలిపారు.

ప్రమాదంలో సింగూరు రిజర్వాయర్!

ఎగువన ఉన్న రివిట్‌మెంట్ దెబ్బతిన్నది.. రక్షణగా ఉన్న పిట్టగోడ నిలువునా చీలింది

» ప్రాజెక్టుకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలి

» ఎక్కువ నీటిని నిల్వ చేయడం వల్లే ఈ పరిస్థితి

» సర్కార్‌కు ఆనకట్ట భద్రత సమీక్ష కమిటీ నివేదిక

హైదరాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): రాజధాని హైదరాబాద్‌తో పాటు ఉమ్మడి మెదక్, నిజామాబాద్ జిల్లాలకు తాగు నీటితోపాటు ఉమ్మడి మెదక్, నిజామాబాద్ జిల్లాలకు సాగు నీటిని అందించే సింగూరు రిజర్వాయర్ ప్రమాదంలో పడింది. తక్షణమే మరమ్మతులకు ఉపక్రమించకపోతే ఏ క్షణంలోనైనా ఆనకట్ట తెగే ప్రమాదం ఉందని ఆనకట్ట భద్రత సమీక్ష కమిటీ(డ్యామ్ సేఫ్టీ రివ్యూ ప్యానల్) ఆందోళన వ్యక్తం చేసింది. డ్యామ్ ఎగువ భాగంలో రాళ్లతో కూడిన రివిట్‌మెంట్ దెబ్బతిన్నదని, దీన్ని యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు చేయాలని సూచించింది. నిర్ణీత కాలవ్యవధిలోగా పనులు పూర్తి చేయాలని ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలం సింగూరులో 29.91 టీఎంసీల సామర్థ్యంతో 1976లో సింగూరు రిజర్వాయర్ నిర్మాణం ప్రారంభించగా.. 1989లో పూర్తయింది. హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం 6.96 టీఎంసీలను కేటాయించడంతోపాటు ఘన్‌పూర్ ఆనికట్, నిజాం పరిధిలోని సాగు నీటి అవసరాలను తీర్చడంతో పాటు మంజీరా నదిలో పూడికను కట్టడి చేయడానికి వీలుగా ఈ ప్రాజెక్టు నిర్మించారు. డ్యామ్ రిహాబిలిటేషన్ ఇంప్రూవ్‌మెంట్ ప్రాజెక్టు (డ్రిప్)లో ఉన్న ఈ ప్రాజెక్టును అశోక్ కుమార్ గంజు ఛైర్మన్‌గా, నిర్మాణ రంగ నిపుణుడు, కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ) మాజీ సభ్యుడు యోగిందర్‌కుమార్, మాజీ ఈఎన్‌సీ, హైడ్రాలజీ నిపుణుడు పి.రామరాజు, జియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా మాజీ డీజీ ఎం.రాజు, మెకానికల్ నిపుణుడు ఎస్.కన్నయ్య నాయుడు సభ్యులుగా ఉన్న ఆనకట్ట భద్రత సమీక్ష కమిటీ జూన్ 23వ తేదీన పరిశీలించింది. ఈ మేరకు ప్రాజెక్టు పరిస్థితిని వివరిస్తూ, తక్షణమే చేపట్టాల్సిన మరమ్మతు పనులను తెలియజేస్తూ నాలుగు రోజుల క్రితం ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది.

నివేదికలోని కీలక అంశాలివే..

సింగూరు రిజర్వాయర్ డిజైన్ ప్రకారం 517.8మీటర్ల దాకా నీటిని నిల్వ చేయాల్సి ఉండగా.. మిషన్ భగీరథ అవసరాల కోసం 520.50 మీటర్ల మేర నిల్వ చేసేందుకూ అనుమతి ఇస్తూ 2017 అక్టోబరు 30న రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, కొన్నేళ్లుగా రిజర్వాయర్‌లో 522 మీటర్ల కన్నా ఎక్కువగా నీటిని నిల్వ చేస్తున్నారని కమిటీ గుర్తించింది. ఈ కారణం వల్లే జలాశయం తీవ్రంగా దెబ్బతిందని తేల్చింది. క్రమంగా కట్ట దెబ్బతినడమే కాకుండా మరమ్మతులకు అవకాశం లేకుండా పోయిందని వెల్లడించింది. దెబ్బతిన్న రివిట్‌మెంట్‌ను అత్యవసరంగా సరిచేయకపోతే ఏ క్షణంలోనైనా గండి పడే అవకాశం ఉందని తెలిపింది. అదేజరిగితే దిగువన ఉన్న మంజీరా బ్యారేజీ, నిజాంసాగర్‌తోపాటు చెక్‌డ్యామ్‌లు కూడా దెబ్బతింటాయని పేర్కొంది. ఆనకట్టకు రక్షణగా ఉన్న పిట్టగోడకు నిలువున చీలిక వచ్చిందని, ఒక వైపు గోడ వంగి ఉందని వివరించింది. కట్ట పునాదిని వెంటనే గ్రౌటింగ్ చేయాలని అభిప్రాయపడింది. 2016, 2019, 2024లో మొత్తం నాలుగు సార్లు సింగూరు జలాశయాన్ని తనిఖీ చేసి.. స్పిల్‌వే, ఎర్త్‌డ్యామ్, గ్యాలరీలకు తక్షణమే మరమ్మతులు చేయాలని సిపారసులు చేసినా...పట్టించుకోలేదని గుర్తు చేసింది. స్పిల్‌వే పనులు కూడా సంపూర్ణంగా చేయలేదని, రిజర్వాయర్ దిగువ భాగంలో టెయిల్‌పాండ్ కూడా సరిగ్గా లేదని వెల్లడించింది. రేడియల్ గేట్లకు పెయింటింగ్ చేయాలని, రబ్బర్ సీళ్లను మార్చాలని సూచించింది. డ్యామ్‌లో 97శాతం నీటి నిల్వ గేట్ల మీద ఆధారపడి ఉందని గుర్తు చేసింది. గ్యాంట్రీ క్రేన్ ఆపరేటర్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్‌ను అందుబాటులో ఉంచాలని పేర్కొంది. తక్షణమే ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసి, వానాకాలం అయిపోగానే మరమ్మతులు చేపట్టాలని సూచించింది. కట్ట మరమ్మతులకు అవసరమైన నిధులు డ్రిప్ నుంచి సమకూరకపోవచ్చని, రాష్ట్ర ప్రభుత్వమే నిధులు కేటాయించి మరమ్మతులు చేపట్టాలని సూచించింది.



డ్యామ్ గేటు రబ్బర్ సీల్ దెబ్బతిని లీకవుతున్న నీరు



సింగూరు ప్రాజెక్టు పిట్టగోడకు ఏర్పడిన పగుళ్లు

ఐఏఎస్ శివశంకర్‌ను రెండు వారాల్లోగా ఏపీకి పంపాలి

» ఆదేశాలను అమలు చేయకుంటే డీవోపీటీ కార్యదర్శి జీతం నిలిపివేతకు ఆదేశిస్తాం : క్యాట్

హైదరాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఇచ్చిన ఆదేశాల మేరకు ఐఏఎస్ శివశంకర్‌ను రెండు వారాల్లో ఏపీకి పంపాలని, లేనిపక్షంలో డీవోపీటీ కార్యదర్శి జీతం నిలిపివేతకు ఆదేశాలిస్తామని కేంద్రపరిపాలన ట్రైబ్యునల్(క్యాట్) హెచ్చరించింది. శివశంకర్‌ను ఏపీకి పంపాలన్న తమ ఆదేశాలను అమలు చేయకపోవడంపై డీవోపీటీ(కేంద్రం)పై ఆగ్రహం వ్యక్తంచేసింది. ఏ రాష్ట్రానికి కేటాయించిన అధికారులు ఆ రాష్ట్రానికి వెళ్లిపోవాలనే డీవోపీటీ ఆదేశాల నేపథ్యంలో శివశంకర్ తెలంగాణకు వచ్చారు. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను క్యాట్ ఫిబ్రవరి 28న అనుమతించింది. ఆయనను తిరిగి ఏపీకే పంపాలని ఉత్తర్వులిచ్చింది. ఈ ఉత్తర్వులు అమలు కాకపోవడంపై కోర్టుధిక్కరణ పిటిషన్‌ను దాఖలు చేశారు. మరోవైపు ఫిబ్రవరిలో క్యాట్ ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ కేంద్రం హైకోర్టులో అప్పీల్ దాఖలు చేయగా హైకోర్టు పిటిషన్‌ను కొట్టివేసింది. దీంతో.. క్యాట్ ఎదుట గురువారం కోర్టు ధిక్కరణ కేసు మళ్లీ విచారణకు వచ్చింది. ఆదేశాల అమలుకు 2 వారాల గడువిస్తున్నామని.. శివశంకర్‌ను ఏపీకి పంపకుంటే డీవోపీటీ సెక్రటరీ జీతం నిలుపుదలకు ఆదేశాలివ్వడంతోపాటు.. కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

వాట్సా‌ప్‌లో జేఈఈ, నీట్ డిజిటల్ మెటీరియల్

నీట్, జేఈఈ-2026 ప్రవేశ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు 'కోటా' డిజిటల్ మెటీరియల్‌ను సిద్ధం చేసినట్లు ఐఐటీ-జేఈఈ/నీట్ ఫోరం తెలిపింది. ఇందులో 2025-26 డిజిటల్ స్టడీ మెటీరియల్ (కాన్సెప్ట్స్, మల్టీపుల్ చాయిస్ ప్రశ్నలు), 2025-2026 గ్రాండ్ టెస్టులు, సొల్యూషన్స్, 'కోటా' ప్రీవియస్ టెస్టులు, సొల్యూషన్స్, ర్యాంక్ బూస్టర్ టెస్టులు, ఎన్‌సీఈఆర్‌టీ నీట్ క్వశ్చన్ బ్యాంక్‌ను వాట్సాప్ ద్వారా పొందవచ్చని వెల్లడించింది. మరింత సమాచారానికి 9849016661 నంబర్‌కు వాట్సాప్ మెసేజ్ చేయాలని ఫోరం సూచించింది.

బీసీల బిల్లు కాదు.. అది ముస్లింల బిల్లు

» బీసీ రిజర్వేషన్లపై రేవంత్‌రెడ్డి రోజుకో మాట

» బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు విమర్శ



యాదాద్రి/జనగామ రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చింది బీసీ బిల్లు కాదని, ముస్లింల బిల్లు అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు అన్నారు. గురువారం భువనగిరి, జనగామలో నిర్వహించిన పార్టీ జిల్లాస్థాయి సమావేశాల్లో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం ఓటుబ్యాంకు రాజకీయాలకు పాల్పడుతోందని, బీసీల పేరుతో ముస్లింల బిల్లును తీసుకువచ్చిందని విమర్శించారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం మైనార్టీల కోసం అనేక పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. ఓటు బ్యాంకు రాజకీయాలకే తప్పా బీసీ బిల్లుకు తాము వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. బీసీల పట్ల బీజేపీకి చిత్తశుద్ధి ఉందని, అందుకు బీసీని ప్రధానమంత్రిని చేయగలిగిందని, బీసీ కమిషన్‌కు రాజ్యాంగ హోదాను కల్పించిందని చెప్పారు. బీసీ రిజర్వేషన్లపై సీఎం రేవంత్‌రెడ్డి రోజుకో మాట మాట్లాడుతూ బీసీలను మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నాడని విమర్శించారు. రాష్ట్ర కాంగ్రెస్ నేతలు ఢిల్లీలో డ్రామాలు ఆడుతున్నారని, వీరి నాటకం అర్థమైపోయి ఆ సమావేశానికి సోనియా, రాహుల్, ప్రియాంక గాంధీలు గైర్హాజరయ్యారని తెలిపారు. బీఆర్ఎస్ నాయకులకు కాపాడేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం కేసులను సీబీఐకి అప్పగించడం లేదని ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ దొందూ దొందేనన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 19 నెలలు గడుస్తున్నా పంచాయతీ ఎన్నికలు నిర్వహించకపోవడంతో గ్రామాల్లో ఎక్కడి సమస్యలు అక్కడే నిలిచిపోయాయన్నారు. మూసీ ప్రక్షాళన చేస్తానని చెప్పిన ముఖ్యమంత్రి అందుకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం యూరియాను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తూ కృత్రిమ కొరతను సృష్టిస్తోందని రాంచందర్‌రావు ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం యూరియా లెక్కలు తీయగానే మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నుంచి స్పందన లేదని విమర్శించారు.

విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యం.. షాక్‌తో రైతు మృతి

» 15 రోజుల క్రితం విరిగిపడిన స్తంభం

» పరిశీలించి విద్యుత్ సరఫరా లేదన్న లైన్‌మన్

» చేనులో కలుపు తీస్తుండగా కరెంట్ షాక్

» వనపర్తి జిల్లా మస్తీపూర్‌లో ఘటన

» సిద్దిపేట జిల్లాలో మరో రైతు మృతి





తిరుపతయ్య, బాపురెడ్డి (ఫైల్)

అమరచింత, కొండపాక, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): విరిగి పడిన విద్యుత్ స్తంభం, తీగలను సరిచేయడంలో సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఓ రైతు ప్రాణం కోల్పోయాడు. ఈ విషాద ఘటన వనపర్తి జిల్లా అమరచింత మండల పరిధిలోని మస్తీపూర్ గ్రామంలో గురువారం జరిగింది. గ్రామానికి చెందిన ఓ రైతు పొలంలో 15 రోజుల క్రితం విద్యుత్ స్తంభం విరిగి పడింది. దాన్ని తొలగించాలని ఆ రైతు విద్యుత్ అధికారులను కోరాడు. లైన్‌మన్ పరిశీలించి, స్తంభానికి విద్యుత్ సరఫరా లేదని చెప్పి వెళ్లిపోయాడు. అయితే, గురువారం రైతు కూలీ తిరుపతయ్య (50) ఆ పొలంలోని పత్తి చేనులో కలుపు తీసేందుకు వెళ్లాడు. పనికి అడ్డుగా ఉన్న స్తంభాన్ని పక్కకు జరిపేందుకు యత్నించగా విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్లే తిరుపతయ్య మృతి చెందాడని గ్రామస్థులు జూరాల ప్రాజెక్టుకు వెళ్లే ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టారు. వారి ఆందోళనకు సీపీఐ (ఎంఎల్-మాస్‌లైన్), చెరుకు రైతుల సంఘం, ప్రజా సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. విద్యుత్ డీఈ, ఏఈలు ఆందోళనకారులతో మాట్లాడారు. విద్యుత్ శాఖ తరఫున రూ. 5 లక్షల పరిహారం, అధికారుల నుంచి మరో రూ.5 లక్షలు ఇస్తామని, లైన్‌మన్‌ను సస్పెండ్ చేస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్థులు ఆందోళన విరమించారు. అలాగే, సిద్దిపేట జిల్లా కొండపాక మండలం సిరిసినగండ్లకు చెందిన రైతు బాపురెడ్డికి గురువారం ఉదయం వరి, మొక్కజొన్న పంటలకు నీరు పెట్టేందుకు పొలానికి వెళ్లాడు. అక్కడ బోరు పని చేయకపోవడంతో స్టార్టర్‌ను పరిశీలిస్తుండగా వైరు తగిలి విద్యుదాఘాతంతో చనిపోయాడు.

నీళ్లడిగిన రైతులపై ఎస్సారెస్పీ సాక్షిగా బీఆర్ఎస్ సర్కారు అక్రమ కేసులు

» రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి

» ఎస్సారెస్పీ కాకతీయ, లక్ష్మీ, వరద కాలువల నుంచి నీటి విడుదల

మెండోర/నవీపేట/ ముప్కాల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): పంటలకు నీళ్లు అడిగిన రైతులపై ఎస్సారెస్పీ సాక్షిగా గత బీఆర్ఎస్ సర్కారు అక్రమ కేసులు పెట్టిందని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ అన్వేశ్ రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ఆ కేసులెత్తేసిందన్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కింద కాకతీయ, లక్ష్మీ కాలువ, వరద కాలువల వద్ద అధికారులతో కలిసి పూజలు చేసిన తర్వాత అన్వేశ్ రెడ్డి నీటిని విడుదల చేశారు. పంటల సాగుకోసం విడుదల చేస్తున్న నీటిని అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నవీపేట మండలం కోస్లీలో గోదావరిపై నిర్మించిన అలీ సాగర్ ఎత్తిపోతల పథకం స్టేజ్-1 వద్ద పంప్‌హౌస్‌లో సిచాన నుంచి ఇరిగేషన్ ఈఈ బలరాం సాగునీటిని విడుదల చేశారు. వానాకాలం సీజన్‌లో 2.4 టీఎంసీల నీటిని ఆయకట్టుకు విడుదల చేయడానికి అనుమతి లభించాయన్నారు. నిజామాబాద్ జిల్లాలోని 6 మండలాల పరిధిలో 49,803 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుందని బలరాం చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్సారెస్పీ ప్రాజెక్టు ఎస్ఈ శ్రీనివాస్‌రావు గుప్తా, ఈఈ చక్రపాణి, అలీసాగర్ ఎత్తిపోతల పథకం ఈఈ బలరాం పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

బంగ్లా పయనమెటు?

బంగ్లాదేశ్‌ను సుదీర్ఘకాలం ఏలిన షేక్‌హసీనాను దేశం నుంచి వెళ్ళగొట్టి ఏడాది అయింది. ప్రాణానికే ప్రమాదం వాటిల్లే పరిస్థితుల మధ్య, తట్టాబుట్టా సర్దుకొని, ఢాకాలో ఒక సైనిక హెలికాప్టర్‌లో బయలుదేరి, ఢిల్లీ సమీపంలోని హిండన్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో గత ఏడాది ఆగస్టు 5న ఆమె దిగారు. ప్రజాస్వామ్యం పట్ల వీసమెత్తు గౌరవం లేని ఒక నియంతను ఇలా ప్రాణభయంతో పరుగులెత్తించినందుకు బంగ్లాదేశ్ విద్యార్థి ఉద్యమకారులు సంతోషించారు. పదిహేనేళ్ళు ఏకధాటిగా ఏలిన, అవధులులేని అధికార వాంఛ గల క్రూరురాలిని దేశం నుంచి తరిమికొట్టినందుకు గర్వించారు. ఆమెలేని దేశం ఇక విలువలతో వెలిగిపోతుందనీ, ప్రజాస్వామ్యం వేళ్ళూనుకుంటుందని బలంగా విశ్వసించారు, భవిష్యత్తుకోసం కలలు కన్నారు. మరి, అంతటి తిరుగుబాటు తరువాత, అన్ని వందల మంది ప్రాణత్యాగాల అనంతరం ఆశించిన దిశలోనే ఆ దేశం ప్రయాణం సాగుతోందా? ఒక తాత్కాలిక ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉంటూ, ఇంకా ఎన్నికలు జరగాల్సి ఉన్న తరుణంలో ఈ ప్రశ్న బేసబబుగా కనిపించవచ్చును. కానీ, ఏడాది కాలంగా బంగ్లాదేశ్ నడుస్తున్న దారిని గమనించినప్పుడు, ప్రశ్నలూ అనుమానాలే కాదు, తీవ్రమైన భయాలు కూడా కలుగుతున్నాయి.

బంగ్లాదేశ్‌ను విస్ఫోటనానికి సిద్ధంగా ఉన్న దేశంగా ఒక సుప్రసిద్ధ మేధావి అభివర్ణించాడు. హసీనా దేశం విడిచిపోగానే, నేటికి సరిగ్గా ఏడాది క్రితం పారిస్ నుంచి మహ్మద్ యూనిస్ దేశరక్షకుడిగా తరలివచ్చారు. ఈ నోబెల్ విజేత రాకడ యావత్ ప్రపంచానికి బంగ్లాదేశ్ భవితవ్యంమీద నమ్మకాన్ని కలిగించింది. జూలై విప్లవం ఏ లక్ష్యం కోసం సాగిందో, ఆ ఆశయాలు, ఆదర్శాలకు అనుగుణంగా దేశాన్ని యూనిస్ నడిపిస్తారని అంతా నమ్మారు. కానీ, ఆ తిరుగుబాటుకు కొనసాగింపుగా చాలా దుర్మార్గాలు సాగాయి. తాత్కాలిక ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా శాంతిభద్రతలను గాలికొదిలేసి, మూక దాడులను అనుమతించింది. అవామీలీగ్ ఓటర్లు, అభిమానులు అన్న ఆరోపణతో హిందువులమీద మతఛాందసులు విరుచుకుపడ్డారు. అవామీలీగ్ నాయకులందరినీ జైళ్ళలోకి నెట్టివేయడమే కాక, హసీనా రాజకీయ ప్రత్యర్థి, బీఎన్‌పీ అధినేత ఖలీదాజియా మీద ఉన్న కేసులన్నీ రద్దుపరిచి జైలు నుంచి విడుదల చేయడం కూడా జరిగిపోయింది. హసీనా జైళ్ళలోకి నెట్టిన మత తీవ్రవాదులు తిరిగి రోడ్లమీదకు వచ్చేశారు. బంగ్లాదేశ్ పితామహుడు షేక్ ముజబూర్ రహ్మాన్ మూలాలూ గుర్తింపులను తుడిచిపెట్టడం లక్ష్యంగా ఆయన విగ్రహం నుంచి నివాసభవనం కూల్చివేతవరకూ ప్రతీదాన్నీ ప్రభుత్వమే అనుమతించింది. ఆయన చరిత్ర చెరిపివేయాలన్న కసిలో భాగంగా, బంగ్లా విముక్తిలో భారతదేశం పాత్ర కూడా పాఠ్యపుస్తకాలనుంచి చెరిగిపోయింది. పాకిస్థాన్‌కు ఏ మాత్రం నొప్పి కలగనిరీతిలో, ఏ పోరాటమూ, ఎవరి ప్రమేయమూ లేకుండానే బంగ్లాదేశ్ ఆవిర్భవించినట్టుగా చరిత్ర రచన సాగుతోంది. పాకిస్థాన్‌తో ఎన్నడూ లేనంత సాన్నిహిత్యమే కాక, సమస్త రంగాల్లోనూ సహకారం పెరిగింది. ఈ ఏడాదికాలంలో బంగ్లాదేశ్ ఆర్థికంగా బాగా దెబ్బతిన్నది. యూనిస్ ప్రభుత్వ వైఫల్యాలను, ఆలోచనా విధానాన్ని ప్రశ్నిస్తున్న వందలాదిమంది పాత్రికేయులు జైళ్ళకుపోయారు. నేరాలూ ఘోరాల పెరుగుదలతో పాటు, హసీనా వ్యతిరేక ఉద్యమంలో ముందువరుసలో ఉన్న విద్యార్థి నాయకులు దోపిడీలకు, బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడుతున్న ఘటనలూ హెచ్చాయి. మతఛాందసత్వంతో మహిళలను కట్టిపడేసే కృషి జరుగుతోంది. హసీనామీద ఆగ్రహంతో ప్రభుత్వమే ప్రోత్సహించిన మూకదాడులకు ఇటీవల మాజీ ఎన్నికల ప్రధానాధికారి సైతం గురికావలసివచ్చింది.

ఫిబ్రవరిలో ఎన్నికలు జరగబోతున్నట్టుగా యూనిస్ మంగళవారం చేసిన ప్రకటన, బంగ్లాదేశ్ తిరిగి గాడిన పడటానికి ఉపకరించవచ్చు. తాత్కాలిక ప్రభుత్వం కన్నా, ప్రజలు ఎన్నుకున్నవారు, ఎవరైనా కావచ్చు, అధికారంలో ఉండటంవల్ల కాస్తంత జవాబుదారీతనం ఉంటుంది. హసీనా పార్టీకి గుర్తింపు తొలగించి, ఎన్నికల బరిలో నిలవనివ్వకుండా ఇప్పటికే జాగ్రత్తలు తీసుకున్న నేపథ్యంలో అక్కడ జరగబోయే ఎన్నికలు ప్రజాభీష్టాన్ని సంపూర్ణంగా ప్రతిఫలించవు. అయినప్పటికీ, తాము ఏ ఆశయాల కోసం హసీనాను గద్దెదింపామన్నది విద్యార్థి ఉద్యమకారులు విస్మరించకుండా, దేశం మతఛాందస శక్తులు, పార్టీల చేతిలోకిపోకుండా చూసుకోవడం అత్యంత ముఖ్యం.

ఆటలో గెలవాలంటే ఆడితీరాలి



srini

బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) పారదర్శకంగా లేదన్న ఆక్షేపణతో అసెంబ్లీ ఎన్నికల బహిష్కరణకు ప్రతిపక్షాలు పిలుపునిస్తున్నాయి. ఇలా ఎన్నికల క్షేత్రానికి దూరంగా ఉండిపోవడం రాజకీయ పార్టీలు తమ బాధ్యతను వదిలివేయడమే అవుతుంది. అంతేకాకుండా అదొక రాజకీయ అనర్థానికీ దారితీస్తుంది.

ప్రజాస్వామ్య పండుగ అయిన ఎన్నికలలో పాల్గొనడమనేది పౌరుల హక్కే కాదు, బాధ్యత కూడా. ప్రజలు ఆ హక్కును సద్వినియోగపరిచి, తమ ప్రజాస్వామ్య బాధ్యతను నెరవేర్చేలా చూడడమనేది రాజకీయ పార్టీల, ముఖ్యంగా అధికారంలో ఉన్న పార్టీల విధ్యుక్త ధర్మం. అయినా కొన్ని రాజకీయ పార్టీలు లేదా ప్రజా వర్గాలు అప్పుడప్పుడూ ఎన్నికలలో పాల్గొనేందుకు నిరాకరించడం, ఆ ప్రజాస్వామిక ప్రక్రియను బహిష్కరించడం జరుగుతోంది. తద్వారా, ఎన్నికలలో పాల్గొనడం కంటే పాల్గొనకపోవడం ద్వారా ప్రభుత్వానికి, సమాజానికి తమ వైఖరి ఏమిటో స్పష్టాతి స్పష్టంగా చెప్పడమవుతుందని పార్టీలు లేదా ప్రజా వర్గాలు భావిస్తున్నాయి. పార్టీలు లేదా ప్రజావర్గాలు ఎన్నికలను బహిష్కరించడమనే ఎత్తుగడ పాత, కొత్త ప్రజాస్వామ్య వ్యవస్థల్లో పునరావృతమవుతున్న లక్షణంగా ఉన్నది. అయితే చరిత్ర ఈ పరిణామం గురించి ఒక సత్యాన్ని చెప్తోంది: ఎన్నికల బహిష్కరణలు అరుదుగా విజయవంతమయ్యాయి. అవి చాలావరకు విఫలమయ్యాయని, ప్రతిపక్షాలను బలహీనపరిచాయని, అధికారంలో ఉన్న పార్టీలు లేదా నాయకులకే మరింత అనుకూల పరిస్థితులు సృష్టించాయని కూడా చరిత్ర స్పష్టం చేసింది.

ఈ సంవత్సరాంతంలో బిహార్ అసెంబ్లీకి జరగనున్న ఎన్నికలను బహిష్కరించాలని ప్రతిపక్షాలు గట్టిగా పిలుపునిస్తున్నాయి. ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ –సర్) పట్ల సందేహాలు, సంకోచాలతో విపక్షాలు అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరించేందుకు సమాయత్తమవుతున్నాయి. ఓటర్ల పేర్లను భారీ ఎత్తున జాబితా నుంచి తొలగించే లక్ష్యంతోనే 'సర్'ను చేట్టారని, దీనివల్ల పేదలు, మైనారిటీలు, వలసపోయినవారు తీవ్రంగా నష్టపోనున్నారని 'సర్' విమర్శకులు ధ్వజమెత్తుతున్నారు. ఓటర్ల ధ్రువీకరణ ప్రక్రియ పారదర్శకంగా లేకపోవడంతో సర్ నిష్పాక్షికతను ప్రజలు విశ్వసించలేకపోతున్నారు. ఎన్నికల సంఘం పట్ల బిహార్ ప్రజల్లో అపనమ్మకం నెలకొన్నది. ఓటర్లు లేవనెత్తుతున్న ప్రశ్నలకు ఎన్నికల సంఘం తక్షణమే ఎటువంటి సందేహాలకు తావివ్వని రీతిలో సమాధానాలు ఇవ్వవలసిన అవసరమున్నది. అయితే ఇదే సమయంలో సర్ పట్ల ఆక్షేపణతో ఎన్నికలను బహిష్కరించడం ఎంతవరకు సబబు అనే విషయాన్ని నిశితంగా పరీక్షించవలసిన అవసరమున్నది.

ఎన్నికల బహిష్కరణ విషయమై చాలా జాగ్రత్తగా నిర్ణయం తీసుకోవాలని దక్షిణాసియా అనుభవాలు స్పష్టం చేస్తున్నాయి. బంగ్లాదేశ్‌లో ప్రధాన ప్రతిపక్షమైన బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) 2014లో పార్లమెంటరీ ఎన్నికలను బహిష్కరించింది. అధికారంలో ఉన్న అవామీలీగ్ రాజీనామా చేసి, ఎన్నికల నిర్వహణకు ఒక తటస్థ ప్రభుత్వం ఏర్పాటుకు అవకాశం కల్పించాలని బీఎన్‌పీ డిమాండ్ చేసింది. అవామీలీగ్ నిష్పాక్షికత పట్ల బీఎన్‌పీ అనుమానాలు నిరాధారమైనవి కావు. అయితే బీఎన్‌పీ ఎన్నికలను బహిష్కరించడం ద్వారా అధికార పార్టీకి చెప్పుకోదగ్గ పోటీ లేకుండా చేసింది. ఫలితంగా 153 నియోజకవర్గాలలో అవామీలీగ్ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ ఎన్నికల అనంతరం నేను ఢాకాకు వెళ్లాను. బీఎన్‌పీ ఎన్నికలలో పోటీ చేసి ఉంటే తప్పకుండా గెలిచేదని చాలా మంది నాకు స్పష్టంగా చెప్పారు అధికార అవామీలీగ్‌కు విజయాన్ని బీఎన్‌పీ స్వయంగా సమకూర్చిందని వారు అభిప్రాయపడ్డారు.

భారత్‌లో కూడా ఎన్నికల బహిష్కరణ జరిగింది. పంజాబ్‌లో 1992 అసెంబ్లీ ఎన్నికలు ఇందుకొక ఉదాహరణ. శిరోమణి అకాలీదళ్ ఆ అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరించింది. ఫలితంగా ఓటింగ్ శాతం చాలా తక్కువగా నమోదయింది. కొన్ని జిల్లాల్లో కేవలం 13 శాతం ఓటర్లు మాత్రమే పోలింగ్‌లో పాల్గొన్నారు. అకాలీదళ్ బాయ్‌కాట్ కాంగ్రెస్ పార్టీకి సులభ విజయాన్ని సమకూర్చింది. పోటీ రహితంగా ఎన్నికలు జరగడం, శాసనసభలో ప్రతిపక్షం లేకపోవడంతో పంజాబ్‌లో ప్రజాస్వామ్యం సార్థకత కోల్పోయింది. ఇంకా పలు బహిష్కరణల ఉదంతాలు ఉన్నాయి. అయితే వాటిలో చాలా భాగం ప్రధానస్రవంతిలో లేని వేర్పాటువాద పార్టీలు ఇచ్చినవే. జమ్మూ–కశ్మీర్ వేర్పాటువాద గ్రూపులు మొదటి నుంచీ ఎన్నికల బహిష్కరణకు పిలుపునిస్తూనే ఉన్నాయి. ఎన్నికలలో తాము పాల్గొనడం జరిగితే కశ్మీర్‌లో భారత పరిపాలనకు న్యాయసమ్మతి కల్పించడమే అవుతుందని వేర్పాటువాదులు తమ నిర్ణయాన్ని సమర్థించుకునేవారు.

ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాలలో కూడా ఎన్నికల బహిష్కరణ పిలుపులు విజయవంతమవలేదు. వెనిజులా ఇందుకొక ఉదాహరణ. 2005లో ప్రతిపక్షాలు ఎన్నికలను బహిష్కరించాయి. ఫలితంగా జాతీయ అసెంబ్లీలో ప్రతి సీటునూ పాలక కూటమి గెలుచుకున్నది. 2018లో పాక్షికంగా బహిష్కరించాయి. నికోలస్ మదురో మళ్లీ అధ్యక్షుడుగా ఎన్నికయ్యేందుకు ఈ బహిష్కరణ తోడ్పడింది. 2020లో కూడా ప్రతిపక్షాలు ఎన్నికలలో పాల్గొనకపోవడంతో 31 శాతం ఓటర్లే పోలింగ్‌లో పాల్గొన్నారు. ఈ తక్కువ శాతం పోలింగ్‌తో అధికార పార్టీకి భారీ మెజారిటీ లభించింది. జింబాబ్వేలో మోర్గాన్ స్వాన్‌గిరాయి 2008 అధ్యక్ష ఎన్నికల నుంచి ఉపసంహరించుకున్నారు. దీంతో రాబర్ట్ ముగాబే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఎన్నికల బహిష్కరణ వల్ల గానీ లేదా ఓటర్లు చాలా తక్కువగా పోలింగ్‌లో పాల్గొన్న కారణాన గానీ సంబంధిత ఎన్నికను రద్దు చేసే సౌలభ్యాన్ని భారత రాజ్యాంగం కల్పించలేదు. షెడ్యూలు ప్రకారం ఎన్నికల సంఘం విధిగా ఎన్నికలు నిర్వహించి, పోలయిన ఓట్ల ప్రాతిపదికన విజేతలు ఎవరో ప్రకటిస్తుంది. కనుక ఎన్నికల బహిష్కరణ పిలుపు ఎన్నికల ప్రక్రియను నిరోధించలేదు, నిరోధించజాలదు. పార్టీలు లేదా అభ్యర్థులు పోటీనుంచి వైదొలిగిన పక్షంలో అది బరిలో ఉన్న అభ్యర్థికి సులభ విజయం సమకూర్చడానికి మాత్రమే దోహదం చేస్తుంది.

ఈ కారణంగానే బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ వివాదానికి ప్రతిస్పందనగా ఎన్నికలను బహిష్కరించాలన్న తమ పిలుపుపై ఆ రాష్ట్రంలోని ప్రతిపక్షాలు పునరాలోచన చేయవలసిన అవసరమున్నది. అయితే 'సర్ ప్రక్రియను నిశితంగా పరీక్షించాలి. ప్రత్యేక సమగ్ర సవరణపై రాజకీయ పార్టీలు, పౌర సమాజం వ్యక్తం చేస్తున్న అనుమానాలను తొలగించాలి. ఆ సవరణ ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా చూడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘానికి ఉన్నది. ఓటర్ల ఫిర్యాదులను శీఘ్రగతిన పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు అన్నీ చేపట్టాలి. పౌర సమాజం, మీడియా, న్యాయస్థానాలు అన్నీ 'సర్' విషయంలో జాగరూకతతో ఉండాలి. ఎన్నికలలో పాల్గొనే బాధ్యతను రాజకీయ పార్టీలు ఎట్టి పరిస్థితులలోను వదిలివేయకూడదు. ఎన్నికల బరి నుంచి వైదొలగడమంటే ఎన్నికల పోరులో ఓడిపోవడమే. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికలలో పాల్గొనకపోవడం నిరసన ఎంత మాత్రంకాదు, అది బాధ్యతను పరిత్యజించడమే అవుతుందన్న సత్యాన్ని విస్మరించకూడదు.

ఎన్నికల బహిష్కరణే కాదు, పార్లమెంటు సమావేశాలను బహిష్కరించడం కూడా ప్రతిపక్షాలు తమను తాము ఓడించుకోవడమే అవుతుంది. వాకౌట్‌లు, సభా కార్యక్రమాలకు ఎగతెగకుండా అంతరాయం కలిగించడం కొన్ని సందర్భాలలో ప్రతీకాత్మక నిరసన కావచ్చునేమో కానీ, వాటి ఆచరణాత్మక ప్రభావం వల్ల కీలక బిల్లులను ఎటువంటి చర్చ లేకుండా ఆమోదించే స్వేచ్ఛ పాలక పక్షానికి లభిస్తుంది. అనేక కీలక బిల్లులు–2020లో మూడు కొత్త సాగు చట్టాలు, అంతకు ముందు సంవత్సరాలలో కీలక రాజ్యాంగ సవరణలు– ప్రతిపక్ష ఎంపీల వాకౌట్ల వల్లే ఆమోదించడం అధికార పార్టీకి వీలయింది.

ఎన్నికలలో గానీ, పార్లమెంటులో గానీ ప్రతిపక్షం పాత్ర ప్రభుత్వాన్ని సవాల్ చేయడం, ప్రశ్నించడం, పాలనాపరమైన నిర్ణయాలు, చర్యలకు జవాబుదారీగా వ్యవహరించేలా చేయడమే. ఆగ్రహాన్ని, అసంతృప్తినీ వ్యక్తం చేసేందుకు బహిష్కరణలు ఉపయోగపడవచ్చుగానీ ప్రభుత్వాన్ని ప్రశ్నించే వేదికల నుంచి వైదొలగడం, పాలకులు ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించేలా చేయాల్సిన పోరాటాలను వదిలివేయడమే అవుతుంది. అత్యంత ప్రభావశీల ప్రతిపక్ష నాయకులు అందరూ అత్యంత ప్రతికూల పరిస్థితులలోను తమ బాధ్యతలను విడనాడనివారేనని చరిత్ర చెప్తోంది. ప్రజాస్వామిక పద్ధతులలో ప్రభుత్వ తప్పులను బహిర్గతం చేసి, ప్రజాభిప్రాయాన్ని సమీకరించి, ప్రజల విశ్వాసాన్ని పొందినవారేనని స్పష్టం చేస్తోంది. ఎన్నికలు, పార్లమెంటు సమావేశాలను బహిష్కరించడం వల్ల ప్రతిపక్షాలు తమ ప్రత్యర్థులకే అనుకూల పరిస్థితులను సృష్టిస్తున్నాయి. ఇది చాలా పెద్ద తప్పు. దీనివల్ల సంభవించే అనర్థాల నుంచి కోలుకోవడానికి దశాబ్దాలు కాకపోయినా సంవత్సరాలు పడుతుంది. చట్టసభలలో ప్రతిపక్షాల స్థానాలు ఖాళీగా ఉండడం అధికారపక్షం స్వప్నం, ప్రజాస్వామ్యానికి దుస్స్వప్నం అనే సత్యాన్ని గుర్తుంచుకోవాలి.



■ ఎస్‌వై ఖురేషి
భారత ఎన్నికల సంఘం మాజీ ప్రధానాధికారి
(ఇండియన్ ఎక్స్‌ప్రెస్ సౌజన్యం)

నాన్నా, నిన్ను చివరిచూపు చూస్తానా!?

నేను క్షేమం. యుద్ధంలో ఉన్న నీ క్షేమాన్ని కోరటం అత్యాశే అవుతుంది. నిన్ను చూసే, నీతో మనసారా మాట్లాడే అవకాశం నాకెలాగూ లేదు. కనీసం నిన్ను చివరిచూపు చూస్తానో లేదోననే ఆందోళనతో ఈ బహిరంగలేఖ రాస్తున్నాను. మొన్న నంబాల కేశవరావు అంకుల్‌ను అనాథగా దహనం చేసిన తర్వాత కనీసం నీ పార్థివదేహాన్ని చూడగలననే ఆశ కూడా కోల్పోయాను. నీతో ఇలా సంభాషించవలసి రావటమే అతి పెద్ద విషాదం.

గత సంవత్సరం జరిగిన ఒక ఎన్‌కౌంటర్‌లో నీవే మరణించావని వార్త పొక్కింది. అది నిజమో, కాదో తేల్చుకోలేక వారం పాటు బాధాతప్త హృదయంతో ఉండిపోయాం. ఎన్‌కౌంటర్ వార్త విన్నప్పుడల్లా మా ఇద్దరు పిల్లలు 'తాత ఎలా ఉంటాడమ్మా' అని అడుగుతున్నారు. సరిగ్గా నలభై ఏళ్ల కిందట 'నాన్న ఎలా ఉంటాడమ్మా' అని నేను మా అమ్మని అడిగిన రోజులు నా స్మృతిపథంలోకి వచ్చాయి. కాలం చూడు ఎలా గడిచిపోయిందో.

నీవు అజ్ఞాతంలోకి వెళ్లి యాభై ఏళ్లు గడిచాయి. మొన్న ఎవరో అంటే విన్నాను నీవు, మల్లోజుల కోటేశ్వరరావు, గణపతి అంకుల్ మొదటితరం నాయకులని. మీ జీవితంలో మూడోవంతు ప్రజలకు అంకితం చేసారు. ఏ మనిషికైనా ఇలాంటి జీవితం అరుదుగా లభిస్తుంది. స్వాతంత్ర్య పోరాటంలో వీరుల గాథలను పుస్తకాలలో చదివాను. ఇప్పుడు స్వయంగా నా తండ్రే అలాంటి చరిత్రలో భాగమైనందుకు గర్వంగా ఉంది.



డియర్ నాన్న, నేను కోరుకున్నవేవీ జరగలేదు. కానీ నీవు, నీ సహచరులు క్షేమంగా ఉండాలని, నీకు ఏ ప్రమాదం జరగకూడదని బిడ్డగా నా కోరిక. నీవు కోరుకున్న పోరాటం జయాపజయాలతో నిమిత్తం లేకుండా విరామమెరుగని నీ ప్రయాణంలో 'మా నాన్న హీరోనే' అని నా పిల్లలకు చెప్పే రోజొకటి ఉంటుందని మాత్రం చెప్పగలను. నీవు మల్ల రాజిరెడ్డివో, మీసాల రాజన్నవో, సాయన్నవో, సంగ్రాంవో, మురళివో నాకు తెలియదు. నాకు మాత్రం బాపువే.

నేను పుట్టినాటికే నీవు విప్లవాన్ని ప్రేమించావని అమ్మ చెప్పింది. అంతకు మునుపే నీవు అమ్మను ప్రేమించావు. ఆమె నిన్ను, నీవు కోరుకున్న విప్లవాన్ని ప్రేమించి, పొత్తిళ్లలో ఉన్న నన్ను వదిలివేసి నీతో వచ్చింది. తల్లీ తండ్రీ ఉండి కూడా అనాథలా బతికాను. నిరాదరణ, ఈసడింపులు జీవితాన్ని వెక్కిరించాయి. దుఃఖం కట్టలు తెంచుకొని నిద్ర లేని రాత్రులు నాతో సహవాసం చేశాయి.

బంధువులకు భారమైనప్పుడల్లా నేను గూడులేని పక్షినే. ఆరేళ్ల వయసులో అనుకుంటాను నేనున్న చోటుకు సంవత్సరం తర్వాత ఒకరోజు అమ్మ వచ్చింది. నేను అమ్మను గుర్తుపట్టలేదు. యథాలాపంగా నా ఆటలో నేను మునిగిపోయాను. ఆమె నా దరి చేరి అక్కున చేర్చుకొని 'నేను మీ అమ్మనని' చెప్పింది. ఈ ప్రపంచంలో ఏ తల్లికి అలాంటి పరిస్థితి రాకూడదని కోరుకుంటున్నాను. ఇక ఆ తర్వాత అమ్మ కూడా నా దగ్గరకు రావటం తగ్గిపోయింది.

నేను అక్షరాలు నేర్చుకుంటున్న సమయంలోనే నా బాగోగులు చూసుకుంటున్న వారిని వదిలి మరో చోటుకు పంపించారు. హాయిగా అమ్మ ఒడిలో నిద్రించవలసిన వయసు, చందమామ కథలు వినవలసిన సమయం, గోరుముద్దలు తినవలసిన కాలంలో బతుకు చితికి, కన్నీళ్లు మింగాల్సి వచ్చింది. బాలకార్మికురాలి పాత్రలోకి జీవితం తర్జుమా అయింది. ఉదయాన్నే నిద్రలేచి, నా వయసుకు తగని పనులు చేసి, అప్పటికే అలసిపోయి బడికి వెళ్లేదాన్ని. కడుపునిండా తిండి, కంటి నిండా నిద్ర నాకు చాలా దూరంగా ఉండిపోయాయి. పారిపోవాలని ఉండేది కానీ గమ్యం తెలియదు. చనిపోవాలని అనిపించేది కానీ మార్గం తెలియదు. అప్పుడప్పుడు ఊళ్లోకి వచ్చే నీ సహచరులు కనుక్కునే యోగక్షేమాలే నాకు లభించే ఊరట.

ఇంటర్మీడియట్ చదువుకునే రోజుల్లో డాక్టర్ కావాలని ఉండేది కానీ, నాకు సరైన దారి దొరకలేదు సరికదా దారిచూపేవాళ్లూ లేరు. అప్పుడనిపించింది. అందరిలాగా నాకు అమ్మా నాన్న ఉంటే ఇష్టమైన చదువు దొరికేది కదా! అని. అంతిమంగా నావి అస్థిరమైన వానాకాలం చదువులయ్యాయి. నా ప్రమేయం లేకుండానే నేను ఉండే స్థలం, చదువు నిర్ణయం జరిగి మారుతుండేవి. అలా హైదరాబాద్ నగరానికి మారిపోయాను. లక్షలాది మంది అనాథలను, వలస కార్మికులను తన ఒడిలో చేర్చుకున్న ఈ నగరం నాకింత చోటిచ్చింది. కాస్త జీవితాన్నిచ్చింది. కొంత జ్ఞానానిచ్చింది. కొత్త స్నేహాలు, రాజకీయాలు, సామాజిక చలనాలు, ఆచరణ, అధ్యయనం నాకింత మనోధైర్యాన్ని ఇచ్చాయి. ప్రపంచం అర్థమయ్యేకొద్దీ సాంత్వన లభించింది.

సరిగ్గా ఈ సమయంలోనే నా జీవితాన్ని అల్లకల్లోలం చేసిన పిడుగులాంటి వార్త విన్నాను. చంటి పిల్లగా నన్ను వదిలేసిపోయిన మా అమ్మ ఎన్‌కౌంటర్ అయింది (ఆగస్టు 13, 1998). అది జరిగిన నెల రోజులకు నాకు ఆ విషయం తెలిసింది. అనాథ శవంగా మా అమ్మ మిగిలిపోయింది. ఆమెను ఎవరో ఖననం చేసారు. పిచ్చిదానిలా హైదరాబాద్ రోడ్లు పట్టి తిరిగాను. రాత్రి, పగలని తేడా లేకుండా సంచరించాను. నిద్రాహారాలు మాని దుఃఖాన్ని ఆశ్రయించాను. ఒంటరిదాన్ని అయిపోయాను. కనిపించని శత్రువుతో మౌనంగా యుద్ధం చేసాను. తండ్రి ఉండీ రాలేడు. తల్లి మరణించింది. ఈ జీవితం ఎందుకని ఎన్నిసార్లు అన్పించిందో!

ఉస్మానియా యూనివర్సిటీ లా కాలేజీలో సీటురావటం నా జీవితానికి చుక్కానిలా అన్పించింది. మలిదశ తెలంగాణ ఉద్యమంలో భాగస్వామ్యం కావటం వలన మామూలు మనిషిని కాగలిగాను. కానీ నేను పెళ్లి చేసుకున్న రోజు నీవు నా పక్కన ఉంటే ఎంత బాగుండునో కదా! నీ మనుమరాలు నా కడుపులో పడినప్పుడు ఈ వార్త నీతో చెప్పాలని ఎంత ఆశపడ్డానో. అందరు స్త్రీల వలె తల్లిదండ్రుల చేతుల మీదుగా నాకు సీమంతం జరగాలని ఎన్నిసార్లు అన్పించిందో. బాలింత వాసన తీరకముందే నా బిడ్డకు నేనే స్నానం చేయించుకోవలసి వచ్చింది. నీ చేతుల్లో ఆడుకోవాలని, నీ భుజాల మీద కూర్చోవాలని, నీ వేలు పట్టి నడవాలని ఎన్నోసార్లు కోరుకున్నాను. కనీసం నా పిల్లలనైనా నీవు ఎత్తుకుంటే చూసి మురిసిపోవాలని భావించాను.

డియర్ నాన్న, నేను కోరుకున్నవేవీ జరగలేదు, జరుగుతాయనే నమ్మకం లేదు. కానీ నీవు, నీ సహచరులు క్షేమంగా ఉండాలని, నీకు ఏ ప్రమాదం జరగకూడదని బిడ్డగా నా కోరిక. నీవు కోరుకున్న పోరాటం జయాపజయాలతో నిమిత్తం లేకుండా, విరామమెరుగని నీ ప్రయాణంలో 'మా నాన్న హీరోనే'నని నా పిల్లలకు చెప్పే రోజొకటి ఉంటుందని మాత్రం చెప్పగలను. నీవు మల్ల రాజిరెడ్డివో, మీసాల రాజన్నవో, సాయన్నవో, సంగ్రాంవో, మురళివో నాకు తెలియదు. నాకు మాత్రం బాపువే.

ప్రేమతో
• స్నేహలత మల్ల



బ్రిటన్ హౌస్ ఆఫ్ లార్డ్స్ సభ్యుడు, ప్రపంచ ప్రఖ్యాత ఆర్థికవేత్త, విద్యావేత్త, సాంస్కృతిక చరిత్రకారుడు లార్డ్ మేఘనాథ్ దేశాయ్ తన 85వ ఏట ఇటీవల కన్నుమూశారు. 1988–1994 మధ్యకాలంలో **డాక్టర్ యలమంచిలి శివాజీ** రాజ్యసభ ప్రసంగాల సంకలనం 'ఎగైన్స్ట్ ఆడ్స్' (ఎదురీత)కు **మేఘనాథ్ దేశాయ్** రాసిన ముందుమాట ఇది.

....రాజకీయవేత్తల్లో చాలా అరుదు!

భారతదేశపు ఆర్థిక సంస్కరణలు ఐదేళ్లుగా కొనసాగుతున్నాయి. మనం గనుక అంతర్జాతీయ ద్రవ్యనిధి నుంచి అత్యంత గరిష్ఠ మొత్తాన్ని అత్యవసర సమయాల్లో వినియోగార్థం రుణంగా స్వీకరించాలని ఇందిరాగాంధీ నిర్ణయించిన నాటి నుంచి లెక్కించేట్లయితే పదిహేనేళ్లుగా కొనసాగుతున్నట్టు. అంతేగాకుండా ఆర్థిక అంశాలపై చర్చలు భారతదేశంలో ఇంకా ప్రబల విశ్వాసాలతో; సుస్పష్టంగా, సుదీర్ఘంగా దట్టించిన కుతర్కాలతో; ప్రజానురంజక బాధ్యతారాహిత్యంతో ముసురుకుని ఉంటాయి. (అయితే ఈ విషయంలో బ్రిటిషు రాజకీయవేత్తలు ఏ మాత్రం మెరుగ్గా ఉండరనేది వారి పార్లమెంటులో కూడా ఐరోపా వ్యవహారాలపై ఏ చర్చను గమనించినా ఇట్టే అవగతమవుతుంది.) వాస్తవాలను అధ్యయనం చేసి, సిద్ధాంతాలను జీర్ణించుకుని నిష్పాక్షికంగా చర్చించగలిగేది రాజకీయవేత్తల్లో చాలా అరుదు. ఆర్థికశాస్త్రంలో నిష్ణాతులు కావటం కష్టమే; అయితే జాతి ఆర్థిక స్థితిగతుల గురించి అయోమయంలో పయనించడం కూడా అభిలషణీయం కాదు. మన రాజకీయవేత్తలు అలా మబ్బులో ఉండటమూ అంతే ముఖ్యం.





లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో వేసవి శిబిరంలో ఆర్థిక శాస్త్రాధ్యయనానికి వచ్చినప్పుడు డా. శివాజీని కలిశాను. ఆయన వంటి ఒక అవిశ్రాంత రాజకీయవేత్త.. ఇతర రాజకీయవేత్తల వలె తన సమయాన్ని రాజకీయ కుతంత్రాలతో గడపక లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో ఆర్థిక శాస్త్ర అధ్యయనపు కాఠిన్యాన్ని కోరుకోవడం నన్నెంతగానో ఆకట్టుకుంది. నేను రాజ్యసభలో ఆయన ప్రసంగాల సంకలనాన్ని చూచినప్పుడు ఆయన ఆర్థిక అంశాలపై ఎడతెగని ఉత్సుకతను చూపటాన్ని, వివిధ విషయాలపై వర్ణ విన్యాసాన్ని గమనించాను. ఇతర విషయాల్లో కూడ ఆయన విమర్శనాత్మక ధోరణిని కనబర్చగలడు కాని, నన్ను ఆకట్టుకునేవి మాత్రం ఆర్థిక అంశాలే.

బడ్జెట్లను, కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల చర్యల్ని పరిశీలించటం, వాటిని డా. శివాజీ మాదిరిగా క్షుణ్ణంగా విశ్లేషణకు గురిచేసే ప్రయత్నాలు చేయడం మన రాజకీయ జీవితాల్లో ఆర్థిక అంశాలపై చర్చల స్థాయిని పెంచగలవు. డా. శివాజీ మాదిరిగా ఆర్థికాంశాలకు తగిన ప్రాధాన్యతను సమకూర్చే వాళ్లు ప్రపంచానికి చాలా అవసరం. ముందు ముందు ఆర్థిక అంశాలపై చర్చను కొనసాగించే ఆయన కృషిలో విజయాన్ని ఆకాంక్షిస్తూ...

22-12-1995

– ప్రొఫెసర్ ది లార్డ్ దేశాయ్

ఎరువులపై కేంద్రం విధానం మారాలి

దేశవ్యాప్తంగా అన్ని రకాల ఎరువులను కలిపి సుమారు 6 కోట్ల 20 లక్షల మెట్రిక్ టన్నులు వినియోగిస్తున్నారు. ఇందులో తెలంగాణ వినియోగం సుమారు 44 లక్షల మెట్రిక్ టన్నులు, అంటే జాతీయ స్థాయిలో 7 శాతానికి సమానం. అలాగే మొత్తం దేశంలో రెండు సీజన్లు కలిపి ఒక సంవత్సరంలో సాగవుతున్న విస్తీర్ణం 54 కోట్ల 84 లక్షల ఎకరాలు, అందులో తెలంగాణ వాటా 4 శాతం మాత్రమే. అంటే, 4 శాతం సాగు విస్తీర్ణంతో ఉన్న తెలంగాణ, దేశ ఎరువుల వినియోగంలో 7 శాతం వాటా కలిగి ఉండటం వల్ల, రాష్ట్రంలోని సగటు ఎరువుల వినియోగం దేశ సగటుతో పోలిస్తే దాదాపు 80 శాతం అధికంగా ఉందని అర్థమవుతున్నది. అంతేకాక, వినియోగంలో వివిధ రకాల ఎరువుల మధ్య సమతుల్యత లోపించడమే కాకుండా, వాటి మధ్య వ్యత్యాసం కూడా స్పష్టంగా కనిపిస్తోంది. దేశవ్యాప్తంగా వినియోగిస్తున్న ఎరువుల్లో 60 శాతం వరకు యూరియానే ఉంది. తెలంగాణ యూరియా వాటా సుమారు 43 శాతం. అయితే తెలంగాణలో గత 7, 8 సంవత్సరాల నుంచి ప్రతి ఏడాది యూరియా వినియోగం సుమారు ఒక లక్ష మెట్రిక్ టన్నులు పెరుగుతూ వస్తోంది. దీనికి ప్రధాన కారణాలు భూగర్భజలాల పరిమాణం పెరగడం, సాధారణ వర్షపాతం నమోదవడం వల్ల రెండవ పంట సాగు విస్తీర్ణం గణనీయంగా పెరగడమే.

ఇటీవల యూరియా కొరతపై రైతుల్లో ఆందోళనకు అసలు కారణం యూరియా వినియోగం అనూహ్యంగా పెరగడం కాదు. సాధారణంగా, ప్రతి పంట సీజన్ ప్రారంభ దశలో యూరియా చాలా తక్కువ మోతాదులో వేయాలి. అయినా, చాలా సందర్భాల్లో రైతులు ముందస్తుగా ఎక్కువ మొత్తంలో యూరియాను కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. అంతేకాకుండా, యూరియాకు ఉన్న నికర ధర ఇతర ఎరువులతో పోలిస్తే చాలా తక్కువగా ఉండటంతో, అవసరం ఉన్నా లేకపోయినా ఎక్కువగా వాడుతున్నారు. వాస్తవానికి, పంట సీజన్ తొలి మాసంలో ఎక్కువగా వాడాల్సిన ఎరువులు డీఏపీ, కాంప్లెక్స్, పొటాష్ వంటి పోషక ఎరువులే. కానీ, ఈ ఎరువుల ధరలు యూరియాతో పోలిస్తే దాదాపు 6 నుంచి 7 రెట్లు ఎక్కువగా ఉండటంతో, రైతులు యూరియాపై ఆసక్తి చూపుతున్నారు. ఈ ధరల వ్యత్యాసం వల్ల అవసరానికి మించి యూరియా వినియోగం పెరుగుతున్నది.

ప్రస్తుతం 45 కిలోల యూరియా బస్తా ధర రూ.266 కాగా, ఇదే పరిమాణంలో డీఏపీ లేదా కాంప్లెక్స్ ఎరువులకు రూ.1500 నుంచి రూ.1800 వరకు ధర ఉంది. ఈ ధరల వ్యత్యాసానికి మూల కారణం కేంద్ర ప్రభుత్వపు లోపభూయిష్ట ఎరువుల ధరల విధానమే. దీనివల్ల యూరియా వినియోగం రోజురోజుకీ పెరుగుతున్నది. అదే సమయంలో, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువుల వినియోగం ఆ స్థాయిలో పెరగకపోవడంతో, ఎరువుల వినియోగంలో అసమతుల్యత పెరుగుతోంది.

ప్రస్తుత ఎరువుల సబ్సిడీ విధానం ప్రకారం, యూరియాపై దాదాపు 90శాతం సబ్సిడీ ఇస్తున్నారు. అదే సమయంలో డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులపై 60శాతం నుంచి 65శాతం సబ్సిడీ మాత్రమే ఉంది. ఉదాహరణకు, 45 కిలోల యూరియా బస్తాకు వాస్తవ వ్యయం రూ.2800 ఉన్నా, రైతు ప్రస్తుతం చెల్లిస్తున్న ధర కేవలం రూ.266 మాత్రమే; మిగతా మొత్తం కేంద్ర ప్రభుత్వ సబ్సిడీయే. ఇదే యూరియాపై 1970లో కేవలం 10శాతం సబ్సిడీ ఉండేది. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉంది. ఉదాహరణకు, ప్రస్తుతం ఒక కిలో నత్రజనిపై కేంద్ర ప్రభుత్వం రూ.43 సబ్సిడీ ఇస్తోంది. అదే సమయంలో, ఒక కిలో పొటాష్‌పై కేవలం రూ.2.40, ఒక కిలో సల్ఫర్‌పై రూ.2.60 మేరకే సబ్సిడీ ఉంది. ఈ విధమైన ధరల అసమతుల్యత, సబ్సిడీలో వ్యత్యాసం వల్ల, యూరియాపై రైతులు ఆధారపడుతున్నారు.

కేంద్ర ప్రభుత్వం ఎరువుల విధానాన్ని సమీక్షించాలి. అధిక యూరియా వాడకం నేల ఆరోగ్యం, పంట నాణ్యత, చీడపీడల తీవ్రత వంటి అనేక సమస్యలకు దారి తీస్తోంది. దీన్ని నివారించాలంటే– యూరియా ధరలను క్రమంగా పెంచుతూ, డీఏపీ, కాంప్లెక్స్, పొటాష్ వంటి ఇతర ఎరువుల ధరలను తగ్గిస్తూ, సమతుల్యాన్ని సాధించాలి.



ఇటీవల కేంద్ర ప్రభుత్వం సహజ వ్యవసాయం, జీవన ఎరువుల వాడకాన్ని ప్రోత్సహించేందుకు ప్రత్యేక మిషన్ ఏర్పాటు చేసింది. అయితే, ఈ ప్రయత్నంలో జీవన ఎరువుల వినియోగంపై సబ్సిడీ లేనందున, రైతులు ఆశించిన స్థాయిలో ఈ ఎరువుల వాడకం వైపు మళ్లడం లేదు. ఉదాహరణకు, ఒక 45 కిలోల యూరియా బస్తాలో ఉన్న నత్రజనిని జీవన ఎరువుల ద్వారా అందించాలంటే సుమారు 20 క్వింటాళ్లు వేయాలి. దీనివల్ల ఎక్కువ మంది రైతులు జీవన ఎరువుల వాడకం వైపు మొగ్గు చూపడంలేదు. ఇదే సమయంలో, సహజ వ్యవసాయంలో జీవన ఎరువుల వినియోగం తప్పనిసరి కావడం వల్ల, కేంద్ర ప్రభుత్వం సమర్థమైన ధరల విధానాన్ని రూపొందించకపోతే సహజ వ్యవసాయ లక్ష్యాలు సాధ్యం కావు.

ఇటీవలి కాలంలో కొన్ని ఎరువు సంస్థలు నానో ఫర్టిలైజర్లను వినియోగంలోకి తెచ్చాయి. ఉదాహరణకు, అర లీటర్ నానో యూరియా ధర సుమారు రూ.225. ఇది 45 కిలోల యూరియా బస్తా ద్వారా వచ్చే నత్రజనిని పంటలకు సమానంగా అందించగలదని సంస్థలు చెబుతున్నాయి. అదే విధంగా, నానో డీఏపీ ధర అర లీటర్‌కు రూ.600గా ఉంది. ఇది 50 కిలోల డీఏపీ బస్తా ద్వారా వచ్చే పోషకాలను పంటలకు అందిస్తుందని అభిప్రాయం ఉంది. అయితే ఈ నానో ఎరువుల నాణ్యత, పనితీరుపై ఇంకా క్షేత్ర స్థాయిలో శాస్త్రీయ అధ్యయనాలు పూర్తి కాలేదు. దీని వల్ల రైతులలో నానో ఎరువుల సామర్థ్యంపై పూర్తి స్థాయిలో నమ్మకం ఏర్పడలేదు. పైగా, వీటిపై సబ్సిడీ లేదు. దాంతో వీటి వినియోగం ఆశించిన స్థాయిలో విస్తరించడం లేదు.

యూరియాపై చెలరేగుతున్న గందరగోళంపై వెంటనే కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించి ఎరువుల విధానాన్ని సమీక్షించాలి. వాతావరణ మార్పుల నేపథ్యంలో వ్యవసాయంలో ఎదురవుతున్న కొత్త సవాళ్లను దృష్టిలో ఉంచుకుని సాహసోపేతమైన, శాస్త్రీయమైన విధానాల వైపు దృష్టి మళ్లించాలి. అధిక యూరియా వాడకం నేల ఆరోగ్యం, పంట నాణ్యత, చీడపీడల తీవ్రత వంటి అనేక సమస్యలకు దారి తీస్తోంది. దీన్ని నివారించాలంటే– యూరియా ధరలను క్రమంగా పెంచుతూ, డీఏపీ, కాంప్లెక్స్, పొటాష్ వంటి ఇతర ఎరువుల ధరలను తగ్గిస్తూ, సమతుల్యాన్ని సాధించాలి. అదే సమయంలో జీవన ఎరువులపై ప్రత్యేక సబ్సిడీ విధానం ప్రవేశపెట్టి, వాటి ఉత్పత్తిని ప్రోత్సహించాలి. నాణ్యతా ప్రమాణాలు కలిగిన జీవన ఎరువులపై రైతుల్లో నమ్మకం ఏర్పడేలా సరైన నియంత్రణ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం సహజ వ్యవసాయంపై దృష్టి పెట్టినా, అమలులో స్పష్టత లేకపోవడం వల్ల రైతుల్లో సరైన అవగాహన లేదు. అలాగే, నానో ఎరువుల ప్రయోజనాలు బహుళంగా ఉన్నా, సబ్సిడీ లేకపోవడం వల్ల వాటి వినియోగం చాలా పరిమితంగా ఉంది. దీనిపై కూడా కేంద్రం తక్షణ చర్యలు తీసుకోవాలి.

○ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య
ఉపకులపతి, తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం

కేఎంసీ వైద్యుడి సస్పెన్షన్

వరంగల్ మెడికల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కేఎంసీ, ఎంజీఎం ఆస్పత్రి కార్డియో తొరాసిక్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అల్లాడి సృజన్‌కుమార్‌ను సస్పెండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర వైద్య, విద్యా సంచాలకులు ఉత్తర్వులు విడుదల చేశారు. భార్య డాక్టర్ ప్రత్యూష ఆత్మహత్య కేసులో హసన్‌పర్తి సబ్ ఇన్‌స్పెక్టర్ గత నెల 15న సృజన్‌ను అరెస్టు చేశారు. అనంతరం కోర్టులో ప్రవేశపెట్టగా రిమాండ్ విధించారు. 48గంటలకుపైగా కస్టడీలో ఉన్నట్లు నిర్ధారణ కావడంతో సస్పెన్షన్ వేటు వేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కుప్పలు తెప్పలు 'రెవెన్యూ' తిప్పలు

పేరుకుపోయిన 'భూ భారతి' దరఖాస్తులు



- ఈ నెల 15 కల్లా పరిష్కరించాలని ప్రభుత్వం గడువు
- ఇక మిగిలింది వారం రోజులే..
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 2.26 లక్షల దరఖాస్తులు దాఖలు
- పరిష్కారమైంది 2,462 మాత్రమే..
- పరిష్కారంలో ఉన్నవి 7,665
- విచారణ వ్యవస్థలు లేక జాప్యం
- వేధిస్తున్న సిబ్బంది కొరత
- కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న దరఖాస్తుదారులు
- తలలు పట్టుకుంటున్న అధికారులు

హనుమకొండ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను ఈ నెల 15 నాటికి పరిష్కరించాలని ప్రభుత్వం విధించిన లక్ష్యం నెరవేరేలా లేదు. ఇంకా గడువు వారం రోజులే మిగిలి ఉంది. దరఖాస్తులు కుప్పలుతెప్పలుగా పేరుకుపోయి ఉన్నాయి. వేల సంఖ్య దరఖాస్తులు రాగా, పరిష్కరించిన దరఖాస్తులు వందల్లోనే ఉన్నాయి. మిగతా తరఖాస్తులను ఈ వారం రోజుల్లో ఎప్పుడు, ఎలా పరిష్కరించాలో తెలియక రెవెన్యూ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ధరణి స్థానంలో భూభారతిని తీసుకువచ్చినప్పటికీ పరిస్థితిలో ఏ మాత్రం మార్పు లేదు. ఎక్కడ వేసిన గొంగలి అక్కడే చందంగా ఉంది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 2.26 లక్షల దరఖాస్తులు రాగా, ఇప్పటివరకు 2462 (1.08 శాతం) మాత్రమే పరిష్కరించారు.

పరిష్కారం శూన్యం

ఉమ్మడి జిల్లాలో మొత్తం 2.26,961 దరఖాస్తులు దాఖలయ్యాయి. వీటిలో ఇప్పటివరకు కేవలం 2462 (1.08 శాతం) దరఖాస్తులు మాత్రమే పరిష్కారానికి నోచుకున్నాయి. మరో 7,665 దరఖాస్తులు (3.37 శాతం) పరిష్కారంలో ఉన్నాయి. ఉదాహరణకు హనుమకొండ జిల్లానే తీసుకుంటే ఈ జిల్లాలో వివిధ భూ సమస్యలకు సంబంధించి 34,973 దరఖాస్తులు రాగా వీటిలో 229 మాత్రమే పరిష్కారమయ్యాయి. మరో 974 దరఖాస్తులు పరిష్కారంలో ఉన్నాయి. మిగతా జిల్లాలో పరిస్థితి ఇలాగే ఉంది.

ఆన్‌లైన్‌కే అధిక సమయం

తొలుత ఒక్కో జిల్లాలో ఎంపిక చేసిన మండలాల్లో భూభారతి కింద ప్రయోగాత్మకంగా దరఖాస్తులను స్వీకరించిన వాటిలో కూడా 50 శాతం మించి పరిష్కరించలేదు. ఆ తర్వాత జూన్ 3 నుంచి 20వ తేదీ వరకు ఆరు జిల్లాలు.. వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని అన్ని మండలాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి దరఖాస్తులను స్వీకరించారు. వీటిని ఆన్‌లైన్ చేసి సమస్యలపై నోటీసులు జారీ చేసి, తదనంతరం పరిష్కార ప్రక్రియను ప్రారంభించాల్సి ఉంది. దరఖాస్తులను ఆన్‌లైన్ చేయడానికే అధిక సమయం పడుతుండడంతో మిగతా ప్రక్రియలపై మండల స్థాయి సిబ్బంది తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో రెవెన్యూ సదస్సులో లక్షా 30వేల దరఖాస్తులు దాఖలయ్యాయి. వీటిని స్కాన్ చేసి మండల స్థాయిలో భూభారతి పోర్టల్‌లో నిక్షిప్తం చేస్తున్నారు. అన్ని తహసీల్దార్ కార్యాలయాల్లో సిబ్బంది రోజువారీ విధులతో పాటు అర్ధరాత్రి వరకూ ఈ ప్రక్రియ నిర్వహిస్తున్నారు. కొత్త మండలాలు, రెవెన్యూ డివిజన్లు, జిల్లా ఏర్పాటు అనంతరం అదనపు సిబ్బందిని పెంచలేదు. క్యాడర్ స్థిరీకరణ చేయలేదు. దీంతో కొన్ని మండలాల్లో తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, ఇద్దరు సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, గిర్దావార్లు, ఒకరిద్దరు కంప్యూటర్ ఆపరేటర్లు మాత్రమే ఉన్నారు. రోజువారి సాగు భూముల రిజిస్ట్రేషన్లను తహసీల్దార్, భూభారతి ఆపరేటర్ నిర్వహిస్తుండ గా మిగిలిన వారిపై ఈ దరఖాస్తులకు సం బంధించిన పనిభారం పడుతోంది.

జిల్లా	దాఖలైన దరఖాస్తులు	పరిష్కారంలో ఉన్నవి	పరిష్కారమైవి
హనుమకొండ	34,973	974	229
వరంగల్	53,933	894	203
జనగామ	17,867	1,729	649
మహబూబాబాద్	39,419	921	195
ములుగు	32,118	2,217	833
భూపాలపల్లి	48,651	930	353
మొత్తం	2,26,961	7665	2462

సిబ్బంది కొరత

గ్రామాల్లో భూ సమస్యల పరిష్కరించడానికి గతంలో తహసీల్దార్లకు గ్రామాల్లో వీఆర్‌వో, వీఆర్ఏలు, సర్వేయర్లు అందుబాటులో ఉండేవారు. ఆ వ్యవస్థ రద్దుకావడంతో గ్రామాల్లో భూ సమస్యలు పరిష్కరించడంలో అధికారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గ్రామాల్లో భూ సమస్యలపై పట్టున్న రెవెన్యూ వ్యవస్థను గత ప్రభుత్వం రద్దు చేయడంతో సమస్యలు పరిష్కరించడం సాధ్యం కాదని భావించిన ప్రభుత్వం.. గ్రామాల్లో తిరిగి రెవెన్యూ వ్యవస్థను అమలు చేయడం కోసం గ్రామ పాలనాధికారులను నియమించాలని నిర్ణయించింది. ఈ మేరకు పూర్వ వీఆర్ఏలు, వీఆర్‌వోలను గామ పాలనాధికారులుగా నియమించడానికి వారి విద్యార్హతలను పరిగణలోకి తీసుకొని రాత పరీక్షను నిర్వహించింది. అలాగే సర్వేయర్ల కొరతను తీర్చడానికి ప్రైవేటు సర్వేయర్ల వ్యవస్థను తెరపైకి తీసుకువచ్చింది. జిల్లాను యూనిట్‌గా తీసుకొని సర్వేయర్లను నియమించడానికి

(మిగతా 6లో..)



భారీ వర్షంతో హనుమకొండ బస్‌స్టేషన్ రహదారిపై నిలిచిన నీరు

దంచికొట్టిన వాన

నగరంలో లోతట్టు ప్రాంతాలు జలమయం

హనుమకొండ బస్‌స్టేషన్‌లో పెద్దఎత్తున నిలిచిన వరద నీరు

హనుమకొండ, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి) : హనుమకొండ, వరంగల్ జిల్లాలో గురువారం రాత్రి వర్షం దంచికొట్టింది. రాత్రి 10 గంటల తర్వాత వర్షం మొదలైంది. ఉరుములు, మెరుపులతో జోరుగా వర్షం పడింది. రాత్రి 12గంటల తర్వాత కూడా వర్షం కురవడం కొనసాగింది. ఉదయం 7 గంటల సమయంలో సుమారు అరగంట పాటు కూడా జోరుగా వానపడింది. అప్పటి నుంచి ఆకాశం మేఘావృతమై ఉండి రాత్రి ఒక మోస్తరు నుంచి భారీ వర్షం పడింది. భారీ వర్షంతో నగరంలోని ప్రధాన రోడ్లన్నీ జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లో వర్షం నీరు నిలిచింది. ఎన్‌జీవోస్‌కాలనీ రోడ్డుపై పెద్దఎత్తున నీరు నిలవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. కాజీపేటలో నిట్ సమీపంలో పెద్ద ఎత్తున వరద నీరు ప్రవహించింది. హనుమకొండ కాకాజీ కాలనీ, బస్‌స్టాండ్‌లో మోకాలు ఎత్తు వరకు వరద నీరు ప్రవహించింది. వాహనాలు నీటమునిగాయి. హంటర్ రోడ్డు, జులైవాడ తదితర ప్రాంతాల్లో వరద ప్రవాహంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. వరంగల్‌లో సైతం వర్షం విస్తృతంగా పడడంతో సంతోష్‌నగర్, ఎన్టీఆర్ నగర్‌లోని లోతట్టుప్రాంతాలు నీటమునిగాయి. కొన్ని చోట్ల వాహనాలు మునిగిపోయాయి. రాబోయే రెండు రోజులు జోరుగా వర్షాలు కురవవచ్చునని వాతావరణ శాఖ హెచ్చరించింది. వరంగల్, హనుమకొండ, మహబూబాబాబాద్, ములుగు జిల్లాలో ఎల్లో అలర్ట్ ప్రకటించారు.



వాగును తలపిస్తున్న హనుమకొండ కాకాజీకాలనీ రోడ్డు

నేడు 'డబుల్' ఇళ్ల పంపిణీ

ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి చేతుల మీదుగా అందజేత



బాలసముద్రంలో నిర్మించిన రెండు పడక గదుల ఇళ్లను పరిశీలిస్తున్న హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

హనుమకొండ టౌన్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): హనుమకొండ బాలసముద్రంలో నిర్మించిన రెండు పడక గదుల ఇళ్లను శుక్రవారం మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేయనున్నట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ వెల్లడించారు. ఈ మేరకు ఇళ్ల పంపిణీ కోసం ఏర్పాట్లను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. గురువారం రెండు పడక గదుల ఇళ్లను జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, ఇతర అధికారులతో కలిసి కలెక్టర్ స్నేహ శబరీష్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ.. శుక్రవారం లబ్ధిదారులకు జిల్లా ఇన్‌చార్జి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. బ్లాక్‌ల వారిగా తాగునీరు, విద్యుత్, శానిటేషన్ సమస్యలను సత్వరమే పూర్తి చేయాలని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాలతో రెవెన్యూ, మున్సిపల్, ఇతర శాఖల అధికారులు ఏర్పాట్ల పనులను సిద్ధం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కాజీపేట డిప్యూటీ కమిషనర్ రవీందర్, గృహ నిర్మాణ శాఖ పీడీ సిద్ధార్థనాయక్, హనుమకొండ తహసీల్దార్ రవీందర్ రెడ్డి, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై కుంగిన బ్రిడ్జి

మల్లంపల్లి శివారులో రాత్రి చోటుచేసుకున్న ఘటన

- వాహనాల రాకపోకలకు పోలీసుల బ్రేక్
- గూడెప్పాడ్ క్రాస్ నుంచి వాహనాల దారి మళ్లింపు
- ప్రత్యామ్నాయంగా పరకాల, రేగొండ మీదుగా రాకపోకలు
- బ్రిడ్జి శిథిలదశకు చేరే వరకు పట్టించుకోని అధికారులు



వాహనాలను దారి మళ్లిస్తున్న పోలీసులు



మల్లంపల్లిలో కుంగుతున్న ఎస్సారెస్పీ కెనాల్ బ్రిడ్జి

ములుగు రూరల్/ఆత్మకూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా జెడీ మల్లంపల్లి శివారులోని జాతీయ రహదారిలో వు న్న పురాతన ఎస్సారెస్పీ కెనాల్ బ్రిడ్జి గురువారం రాత్రి కుంగుబాటుకు గురైంది. అ యితే ఈ ఘటనలో ఎలాంటి నష్టం జరగలేదు. దీంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనతో పోలీసులు వాహనాల రాకపోకలను ని లిపివేశారు. కొంత కాలంగా ఇక్కడ నూతన బ్రిడ్జి ని ర్మాణం కోసం పనులు జరుగుతున్నాయి. ఈ క్రమం లో బ్రిడ్జి కుంగుబాటుకు గురికావడంతో కలకలం రేపింది. దీంతో అప్రమత్తమైన పోలీసులు వాహనాల రాకపోకలను దారి మళ్లించారు. ములుగు నుంచి హ నుమకొండ వైపుకు వెళ్లే వాహనాలను అబ్బాపూర్, రే గొండ, పరకాల, గూడెప్పాడ్ మీదుగా, హనుమకొండ నుంచి ములుగు వచ్చే వాహనాలను గూడెప్పాడు, ప రకాల, రేగొండ, అబ్బాపూర్ మీదుగా పంపిస్తున్నారు. బ్రిడ్జి మరమ్మతులు చేపట్టేంత వరకు వాహనదారు లు గూడెప్పాడ్, పరకాల, రేగొండ మీదుగా రావాలని పోలీసులు సూచిస్తున్నారు. మల్లంపల్లి శివారులో ద శాబ్దాల క్రితం నిర్మించిన ఈ బ్రిడ్జి కొంతకాలంగా శిథిలావస్థకు చేరుతూ వచ్చింది. ముందుగానే గమనించి ప్రత్యామ్నాయ బ్రిడ్జి ఏర్పాటుచేయాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహించారు. దీంతో శిథిల బ్రిడ్జిపైనే వాహనాల రాకపోకలు సాగుతున్నాయి. ఈ క్రమంలోనే బ్రిడ్జి కుంగుబాటుకు గురైంది. గురువారం రాత్రి బ్రిడ్జి గనుక ఒక్కసారిగా కూలిపోతే పరిస్థితి ఏమిటని పలువురు వాహనదారులు ఆందోళన వ్యక్తం చేశారు. వరంగల్ నుంచి భూపాలపట్నంకు వెళ్లే జాతీయ రహదారి కావడంతో నిత్యం పెద్ద సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రస్తుతం బ్రిడ్జి కుంగిన నేపథ్యంలో ట్రాఫిక్ దారి మళ్లించడంతో చుట్టూ తిరిగి వెళ్లక తప్పదు. ఇలా ఎన్ని రోజులు అనేది అధికారులు చెపాల్సి ఉంది. వరంగల్ నుంచి భూపాలపట్నంకు వెళ్లే జాతీయ రహదారిలో మల్లంపల్లి వద్ద బ్రిడ్జి కుంగిపోవడంతో అధికారులు దారిమళ్లింపు చర్యలు చేపట్టారు. మల్లంపల్లి వైపు వెళ్లకుండా రోడ్డును బ్లాక్ చేశారు. బారికేడ్‌లను పెట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు. సీఐ. సంతోష్ స్వయంగా పర్యవేక్షించారు. గూడెప్పాడ్ క్రాస్ రోడ్డు నుంచి వాహనాలను పరకాల వైపు మళ్లించారు. గూడెప్పాడ్ క్రాస్ రోడ్డు నుంచి పరకాల, రేగొండ మీదుగా వాహనాలను దారి మళ్లించినట్లు తెలిపారు. దీంతో వాహనదారులు పరకాల, రేగొండ మీదుగా ములుగు చేరుకుంటున్నారు. అయితే ఈ ప్రత్యామ్నాయ మార్గం ఇరుకుగా ఉండడంతో రద్దీ పెరిగి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్టు తెలిసింది. లారీలు, బస్సులు, భారీ వాహనాలు ఒకే మార్గంలో ఎదురెదురుగా వస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

హామీలు నిలబెట్టుకోవాలి

- ఆంధ్రప్రదేశ్‌లా పింఛన్ పెంచాలి
- లేకుంటే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చుతాం..
- పింఛన్‌దారుల సన్నాహక సభలో మంద కృష్ణ మాదిగ



7



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు

బీసీలను మోసం చేస్తున్న ప్రభుత్వం

- రిజర్వేషన్లపై రేవంత్‌రెడ్డి దొంగ మాటలు
- బీసీలకు మాత్రమే 42శాతం రిజర్వేషన్ ఇవ్వాలి..
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

6

రేవంత్‌రెడ్డి రియల్ ఎస్టేట్ బ్రోకర్

- కేసీఆర్‌పై కక్షతో ప్రాజెక్టులు నిర్వీర్యం
- రాష్ట్రాన్ని కరువు రాష్ట్రంగా మార్చారు
- మాజీ ఎమ్మెల్యేలు రాజయ్య, గండ్ర



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యేలు తాటికొండ రాజయ్య, గండ్ర వెంకటరమణారెడ్డి

హనుమకొండ టౌన్, ఆగస్టు7 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి రియల్ ఎస్టేట్ బ్రోకర్ అని కేసీఆర్‌పై కక్ష తో సాగు నీటి ప్రాజెక్టులను నిర్వీర్యం చేశారని మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య, మాజీ ఎమ్మె ల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ధ్వజమెత్తారు. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తాటికొండ రాజయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక ప్రభుత్వమని అన్నారు. జనగామ జిల్లా పూర్తిగా దేవాదుల నీళ్లపై అధారపడి ఆయకట్టు రైతులు వ్యవసాయం చేస్తుంటారని ప్రభుత్వం నిర్లక్ష్యంతో పంటలు ఎండుతున్నాయని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆమోదంతో నిర్మించిన ఏకైక ప్రాజెక్టు కాళేశ్వరం ప్రాజెక్టు మహా అద్భుతం అని సుప్రీంకోర్టు చెప్పిందని అన్నారు. నిపుణుల కమిటీ నివేదిక ప్రకారమే కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించిందని అన్నారు. కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి మీద ఒత్తిడి తీసుకువచ్చి ఉమ్మడి వరంగల్ జిల్లాలోని దేవాదుల ఎత్తిపోతల మూడోదశ పనులను పూర్తి చేసి ఆయకట్టు ద్వారా రైతులకు సాగునీరు అందించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రా పేరుతో హైదరాబాద్‌లో అనేకమంది నిరుపేదల ఇండ్లను కూల్చి వేసిందని విమర్శించారు.

గండ్ర వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ.. వేసవిలో దేవాదుల ప్రాజెక్టు మోటార్లు పూర్తి స్థాయిలో నడవలేదని, ప్రభుత్వ నిర్లక్ష్యంతో పంటలు ఎండిపోయాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు రుణమాఫీ, రైతుభరోసా ఇవ్వలేదని విమర్శించారు. రైతులకు సకాలంలో యూరియా అందకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్రాన్ని కరువు రాష్ట్రంగా మార్చారని రమణారెడ్డి పేర్కొన్నారు. జిల్లాలో ఇద్దరు మంత్రులు ఉన్నా ఒక్కరోజైనా నీళ్ల మీద సమీక్షలు ఎందుకు చేయడంలేదని విమర్శించారు. కాళేశ్వరం మేడిగడ్డలో రెండు పిల్లర్లు కుంగాయని, కుంగిన పిల్లర్లకు మరమ్మతులు చేయకుండా సీఎం రేవంత్‌రెడ్డి డ్రామాలు చేస్తున్నారని అన్నారు. కేసీఆర్‌పై కక్ష సాధింపుతో కాళేశ్వరం ప్రాజెక్టుపై అసత్యపు, అవినీతి ఆరోపణలు చేస్తే రాష్ట్ర ప్రజలు, రైతులు బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్, నాయకులు హరి రమాదేవి, దేవమ్మ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఈల అభివృద్ధికి చర్యలేమిటి..?

లోక్‌సభలో ప్రశ్నించిన ఎంపీ కావ్య

హనుమకొండ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో చిన్న సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలపై లోక్‌సభలో వరంగల్ ఎంపీ కడియం కావ్య ప్రశ్నించారు. ఈ మేరకు స్పందించిన కేంద్ర వ్యవసాయశాఖ సహాయ మంత్రి శోభా కరంద్లజే.. వివిధ పథకాల ద్వారా తెలంగాణలో ఎంఎస్ఎంఈలకు అందుతున్న మద్దతును వివరించారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన చిన్న పరిశ్రమలు, యంత్రాలు కొనుగోలు చేసేందుకు గరిష్ఠంగా రూ.25లక్షల వరకు 40 శాతం సబ్సిడీ అందేలా ఎన్ఎస్ ఎస్‌హెచ్ పథకం అమలులో ఉందన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమలు పెట్టుకునే వారికి 25 నుంచి 35 శాతం సబ్సిడీ, పట్టణాల్లో 15 నుంచి25 శాతం సబ్సిడీ అందేలా పీఎంఈజీపీ పథకం ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ మహిళలకు మరింత ప్రయోజనం ఉందని తెలిపారు. హస్తకళల ఉత్పత్తులు చేసే వారికి విదేశీ ప్రదర్శనల్లో పాల్గొనడానికి సహాయం, రిజిస్ట్రేషన్, సర్టిఫికేషన్ ఖర్చులను భరిస్తున్న ఐసీ పథకం కూడా ఉందని పేర్కొన్నారు. జాతీయ హస్తకళల అభివృద్ధి పథకం (ఎన్‌హెచ్‌డీపీ) ద్వారా తెలంగాణ కళాకారుల ఉత్పత్తులకు అంతర్జాతీయ ప్రమోషన్ అభిస్తుందన్నారు. అంతేకాకుండా డిజిటల్ మార్కెటింగ్ కోసం టీఈఎం, పీఎంఎస్, ఎంఎస్ఎంఈలు ఈ-కామర్స్ సైట్‌లపై ఉత్పత్తులు అమ్మే అవకాశం కల్పించామన్నారు.

సైకియాట్రీ వైద్యుడిపై విచారణ పూర్తి

వైద్య విద్యార్థులకు అండగా నిలిచిన ఆంధ్రజ్యోతి కథనం

వరంగల్ మెడికల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): సైకియాట్రీ అసిస్టెంట్ ప్రొఫెసర్ పై విచారణ ముగిసినట్లు తెలిసింది. కాకతీయ వైద్య కళాశాలలో విచారణ కమిటీ ఎదుట విద్యార్థులు తమ గోడు వెల్లబోసుకున్నట్లు తెలుస్తోంది. సైకియాట్రీ వైద్యుడిపై విచారణ 'ఆంధ్రజ్యోతి'లో గురువారం ప్రచురితమైన కథనం తీవ్ర ప్రకంపనలు సృష్టించింది. ఎంజీఎం ఆస్పత్రితోపాటు కాకతీయ వైద్య కళాశాలలో ప్రతీ నోటా ఈ కథనంపై చర్చించడం కనిపించింది. హనుమకొండ ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి, కేఎంసీ రేడియాలజీ విభాగం హెచ్ ఓడీ డాక్టర్ శ్రీదేవి, కేఎంసీ వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీపతి, బయోకెమిస్ట్రీ విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ కాత్యాయని, ఫోరెన్సిక్ విభాగం ప్రొఫెసర్ ఖాజా మొయినోద్దీన్‌ల బృందం విద్యార్థులను విచారించింది. పీజీలను ఒక్కొక్కరిగా పిలిచి అభిప్రాయాలను తెలుసుకున్నట్లు సమాచారం.

మొదటి సంవత్సరం నుంచి మూడేళ్ల పీజీ విద్యార్థులను విచారణకు పిలిచినట్లు తెలిసింది. అదే విధంగా ఆరోపణలు ఎదుర్కొంటున్న సైకియాట్రీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్‌ను విచారణకు పిలిచినట్లు సమాచారం. కాగా, విచారణ కమిటీ నివేదికను వైద్య విద్య సంచాలకులకు పంపనున్నట్లు విశ్వసనీయ సమాచారం. తదుపరి శాఖాపరమైన చర్యలు ప్రభుత్వం తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే విషయాన్ని వెలుగులోకి తెచ్చిన 'ఆంధ్రజ్యోతి'కి వైద్య విద్యార్థులు, తల్లి దండ్రులు అభినందనలు తెలిపారు. అలాగే వెంటనే సత్వర చర్యలు చేపట్టిన ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యకు పీజీ విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపినట్లు సమాచారం.

కామర్స్‌లో రజనీకి డాక్టరేట్



కేయూ క్యాంపస్ ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మొయినాబాద్, హిమాయత్‌నగర్ చైతన్య డీమ్డ్ టూ బీ యూనివర్సిటీ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం పరిశోధకురాలు రజనీ కుక్కల డాక్టరేట్ సాధించారు. ఈ మేరకు గురువారం వర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ బి.రాజేందర్‌రెడ్డి రజనీకి డాక్టరేట్ ప్రకటించారు 'బ్యాంకింగ్ ఫైనాన్స్ ఫర్ రూరల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఇన్ ఇండియా - ఏ స్టడీ ఆఫ్ సెలెక్ట్ బ్యాంక్స్' అనే అంశంపై పరిశోధన చేసినందుకు రజనీ డాక్టరేట్ పొందారు.

సీడీసీ టూ బీ వర్సిటీ కామర్స్ ప్రొఫెసర్ బి.రాజేందర్ పర్యవేక్షణలో రజనీ పరిశోధన పూర్తి చేశారు. డాక్టరేట్ సాధించిన రజనీని సీడీసీ చాన్స్‌లర్ సీహెచ్ వీ పురుషోత్తంరెడ్డి డైరెక్టర్, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సీహెచ్ సాత్వికరెడ్డి, రిజిస్ట్రార్ ఎం.రవీందర్, డీన్ క్రిష్టోఫర్, సుగం.దదేవి, టీవీజీ శాస్త్రి, కుమారస్వామి, గాదె రాంబాబు తదితరులు అభినందనలు తెలిపారు.

బీసీలను మోసం చేస్తున్న ప్రభుత్వం

రిజర్వేషన్‌పై రేవంత్‌రెడ్డి దొంగ మాటలు

బీసీలకు మాత్రమే 42శాతం రిజర్వేషన్ ఇవ్వాలి

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న రామచందర్‌రావు

జనగామ రూరల్, ఆగస్టు7 (ఆంధ్రజ్యోతి): బీసీల రిజర్వేషన్‌పై సీఎం రేవంత్ రెడ్డి రోజుకో తీరుగా దొంగ మాటలు మాట్లాడుతూ మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నాడని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు అన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేశ్ అధ్యక్షతన గురువారం జనగామ జిల్లా విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం బీసీలకు మాత్రమే 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాలన్నారు. 10శాతం ముస్లిలకు బీసీ రిజర్వేషన్ ఇస్తే బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. బీజేపీ ముస్లింలకు వ్యతిరేకం కాదని, 19 నెలలు గడుస్తున్నా ప్రభుత్వం గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించకపోవడంతో గ్రామాల్లో ఎక్కడి సమస్యలు అక్కడే నిలిచిపోయాయన్నారు. సీఎం రేవంత్ రెడ్డి తప్ప ఇప్పటి వరకు ఏ సీఎం ఇన్నిసార్లు ఢిల్లీ వెళ్లలేదని ఆరోపించారు.

బీఆర్ఎస్ నాయకులకు కాపాడేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం ప్రాజెక్ట్ విచారణను సీబీఐకి అప్పగించడం లేదని రాంచందర్ రావు ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రెండు ఒక్కటేనని ఇద్దరు కలిసి తెలంగాణ ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు తెలంగాణను దివాలా తీశారన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు ప్రతీ ఒక్క స్థానంలో పోటీ చేస్తారని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మార్తనేని ధర్మారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, మాజీ మంత్రి గుండె విజయరామరావు, మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు నేతి సుభాష్‌రెడ్డి, అరూరి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే క్వార్టర్స్‌లో బంగారం, నగదు చోరీ

కాజీపేట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): తాళం వేసి ఉన్న రైల్వే క్వార్టర్స్‌లో దుండగులు తాళం పగలకొట్టి బంగారం, నగదు దోచుకెళ్లారు.. కాజీపేట ఎస్సై నవీన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కాజీపేట రైల్వే క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్న రైల్వే ఉద్యోగి రామగిరి భిక్షపతి కుటుంబంతో సహా బుధవారం ఇంటికి తాళం వేసి ఊరెళ్లారు. గురువారం ఉదయం ఇంటికి వచ్చేసరికి తాళం పగలకొట్టి బీరువాలో ఉన్న రెండు తులాల బంగారం, రూ.5వేల నగదును గుర్తు తెలియని వ్యక్తులు దోచుకెళ్లారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నవీన్ కుమార్ తెలిపారు. చోరీ అయిన బంగారం విలువ రూ.2లక్షల వరకు ఉంటుందని పోలీసులు తెలిపారు.

పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించండి

రెవెన్యూ అధికారులతో మేయర్ సుధారాణి సమావేశం



రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న మేయర్ సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ అధికారులు పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని మేయర్ గుండు సుధారాణి ఆదేశించారు. గురువారం వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ అధికారులకు పలు సూచనలు చేశారు. పీఓఎస్ మిషనర్‌లకు ట్రాకింగ్‌ను వ్యవస్థను ఐసీసీసీకి అనుసంధానం చేయాలన్నారు.

వంద రోజుల ప్రణాళికలో భాగంగా భువన్ సర్వే చేపట్టాలన్నారు. ఐదేళ్లుగా నిలిచిపోయిన రూ.48కోట్ల నీటి పన్ను బకాయిలను వసూలు చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. కమర్షియల్ నల్లా కలెక్షన్‌లను గుర్తించి వాటి బకాయిలను వసూలు చేయాలన్నారు. వరంగల్ కార్పొరేషన్ ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నెంబర్ ద్వారా ప్రతీరోజు 300 మందికి ఫోన్‌చేసి నల్లా పన్ను పై వాకబు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, డీసీ రవీందర్, ఆర్‌వోలు శ్రీనివాస్, షహజాది బేగం, ఐటీ మేనేజర్ రమేష్, ఆర్ఐలు, బిల్ కలెక్టర్లు పాల్గొన్నారు.

కుప్పలు తెప్పలు.. 'రెవెన్యూ' తిప్పలు

(5వ పేజీ తరువాయి)

అర్హులైనవారిని ఎంపికచేసి 50 రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. తుది ఎంపిక కోసం గత నెల 27న రాతపరీక్ష నిర్వహించారు. భూసమస్యల పరిష్కారంలో గ్రామపాలనాధికారులు, సర్వేయర్ల వ్యవస్థ ప్రాధాన్యతను సంతరించుకున్నది. వీరి నియామకాలను ఎంత త్వరగా చేపడితే అ దరఖాస్తులను అంత త్వరగా పరిష్కరించే అవకాశాలుంటాయని అధికారులు భావిస్తున్నారు. ఓ వైపు సిబ్బంది కొరత, మరో వైపు ప్రభుత్వం విధించిన గడువు అధికారులను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది.

విచారణలు ఎలా?

గత ఆర్‌వోఆర్ -2020, ధరణిలో నోటీసుల జారీ, విచారణ ప్రక్రియ లేదు. కొత్త చట్టం భూభారతి అమల్లోకి రావడంతో నోటీసుల జారీ, విచారణకు అవకాశం, అప్పీళ్ల వ్యవస్థ అందుబాటులోకి వచ్చాయి. క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టేందుకు వ్యవస్థలేవి లేవు. ఇప్పుడు వీఆర్ఏ, వీఆర్‌వోల అవసరం తెలిసి వచ్చింది. ఈ క్రమంలో గ్రామ పాలనాధికారుల (జీపీవో) నియామకానికి రెవెన్యూ శాఖ కార్యాచరణ చేపట్టింది. ఉమ్మడి జిల్లాలో 1668 మంది ఎంపికయ్యారు. వీరికి ఇంకా నియామక ఉత్తర్వులు ఇవ్వలేదు. సిబ్బంది కొరత నేపథ్యంలో దరఖాస్తుల పరిష్కారం కష్టమవుతోంది.

వివిధ సమస్యలపై..

రెవెన్యూ సదస్సుల్లో పదికిపైగా భూ సంబంధిత సమస్యలపై దరఖాస్తులు దాఖలయ్యాయి. సాదాబైనామాలు, మిస్సింగ్ సర్వే నెంబర్లు, పెండింగ్ మ్యుటేషన్స్, డిజిటల్ సైనింగ్, విస్తీర్ణంలో మార్పులు, పట్టాదారులో మార్పులు చేర్పులు, అసైన్డ్ భూములు, ఖాతా మార్పు, నిషేధిత భూములు, భూసేకరణ, ఇతరత్రా సమస్యలు వీటిలో ఉన్నాయి. వీటిలో సాదాబైనామా, అసైన్డ్ భూములు, భూసేకరణ, నిషేధిత భూములు మినహా మిగతా భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను మాత్రమే రెవెన్యూ అధికారులు పరిష్కరించేందుకు అవకాశం ఉంది. మిగతావన్నీ చట్టపరమైన, న్యాయపరమైన చిక్కులతో ముడిపడి ఉన్నాయి. సాదాబైనామా దరఖాస్తులనే తీసుకుంటే ఉమ్మడి జిల్లాలో అందిన మొత్తం దరఖాస్తుల్లో 75 శాతం ఇవే ఉన్నాయి.

ఒక్క హనుమకొండ జిల్లాలోనే 20వేలకుపైగా దరఖాస్తులు ఈ తరహాకు చెందినవే. సాదాబైనామా భూముల వ్యవహారం ప్రస్తుతం కోర్టులో ఉన్నందువల్ల ఇందుకు సంబంధించిన దరఖాస్తుల విషయంలో రెవెన్యూ అధికారులు ఎలాంటి ప్రక్రియ చేపట్టరాదని ప్రభుత్వమే ఆదేశించింది. ఇక అసైన్డ్ భూముల దరఖాస్తులు కూడా పెద్ద సంఖ్యలో అందాయి. మొత్తం దరఖాస్తుల్లో 15 శాతం మేరకు ఇవే ఉన్నాయి. వీటిని రెవెన్యూ అధికారులు నేరుగా పరిష్కరించే అవకాశమే లేదు. ఎమ్మెల్యే అధ్యక్షతన ఏర్పాటయ్యే కమిటీ వీటిని పరిష్కరించాల్సి ఉంది. కానీ ఎక్కడ ఇప్పటి వరకు స్థానిక ఎమ్మెల్యేల అధ్యక్షతన కమిటీలు ఏర్పాటు కాలేదు.

నిషేధిత భూముల దరఖాస్తుల్లో చాలా వరకు కోర్టు కేసులతో ముడిపడి ఉన్నాయి. వీటిని కూడా ముట్టుకునే పరిస్థితి లేదు. ఇలాంటి దరఖాస్తుల పరిష్కారానికి ప్రభుత్వం నిర్దిష్టమైన వ్యవస్థలను ప్రభుత్వం ఏర్పాటు చేయకుండానే దరఖాస్తులను స్వీకరించింది. అందిన దరఖాస్తుల్లో వాస్తవంగా రెవెన్యూ అధికారులు పరిష్కరించగలిగేవి 20 నుంచి 25 శాతం మాత్రమే ఉన్నాయి. తమ పరిధిలో లేనివి, తమ వల్లకాని దరఖాస్తులన్నిటినీ అధికారులు పక్కబెట్టారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో ఆగస్టు 15 నాటికి అన్ని భూభారతి దరఖాస్తులను ఎలా పరిష్కరించేదని రెవెన్యూ అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

సస్పెన్షన్‌కు గురైన మార్కెట్ కార్యదర్శులకు పోస్టింగ్

వరంగల్ వ్యవసాయం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): సీసీఐ పత్తి కొనుగోళ్లలో తాత్కాలిక రిజిస్ట్రేషన్ల (టీఆర్) విషయంలో అక్రమాలు జరిగాయని విజిలెన్స్ విచారణలో తేలిందని గత ఫిబ్రవరి నెలలో ఏడుగురు మార్కెట్ కార్యదర్శులను ప్రభుత్వం సస్పెన్షన్ చేసింది. కాగా, తదుపరి విచారణ, క్రమశిక్షణ చర్యలను పెండింగ్‌లో పెట్టి సస్పెన్షన్‌కు గురైన మార్కెట్ కార్యదర్శులకు తిరిగి పోస్టింగ్ ఇచ్చి బదిలీ చేస్తూ మార్కెటింగ్‌శాఖ కమిషనర్ సురేంద్రమోహన్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో చేర్యాల మార్కెట్ గ్రేడ్ 1 కార్యదర్శిగా పనిచేసిన పరమేశ్వర్‌ను నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ వ్యవసాయ మార్కెట్‌కు, నుగుచర్ల మార్కెట్ గ్రేడ్2 కార్యదర్శిగా పనిచేసిన ఎన్.శ్రీనివాస్‌ను జగిత్యాల జిల్లా ధర్మపురి మార్కెట్‌కు, జనగామ వ్యవసాయ మార్కెట్ గ్రేడ్ 3 ఎస్. శ్రీనివాస్‌ను కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి వ్యవసాయ మార్కెట్‌కు పోస్టింగ్ ఇచ్చి బదిలీ చేశారు. మరో ముగ్గురు కార్యదర్శులు ఉద్యోగ విరమణ చేయగా, వరంగల్ వ్యవసాయ మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శిగా పనిచేసిన పోలెపాక నిర్మల పోస్టింగ్ ప్రభుత్వమే ఉత్తర్వులు జారీ చేయాల్సి ఉండడంతో మరొకటి, రెండు రోజుల్లో ఉత్తర్వులు వెలువడే అవకాశాలున్నట్లు సమాచారం

నూతన పోలీస్‌స్టేషన్ భవనాన్ని నిర్మిస్తాం

ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్‌కుమార్



పోలీస్‌స్టేషన్‌కు కేటాయించిన స్థలాన్ని పరిశీలించిన ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్‌కుమార్

ఐనవోలు, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): ఐనవోలు పోలీస్‌స్టేషన్ నూతన భవనాన్ని ఆధునికంగా అన్ని హంగులతో నిర్మిస్తామని ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం సమీపంలో సర్వే నెంబరు 29లో ఉన్న ప్రభుత్వ స్థలంలో 3 ఎకరాలు పోలీస్‌స్టేషన్ భవనం, క్వార్టర్స్ నిర్మాణం కోసం గతంలోనే స్థలాన్ని కేటాయించారు. ఆ స్థలాన్ని గురువారం ఈస్ట్ జోన్ డీసీపీ మామూనూరు ఏసీపీ వెంకటేష్, పర్వతగిరి సీఐ రాజగోపాల్, ఎస్సై పస్తం శ్రీనివాస్, తహసీల్దార్ విక్రమ్‌కుమార్‌లతో కలిసి సందర్శించి పరిశీలించారు.

పోలీస్‌స్టేషన్ భవన నిర్మాణంతోపాటు సిబ్బంది క్వార్టర్స్ కోసం స్థలం రోడ్డుకు అనువుగా ఉందని సంతృప్తి వ్యక్తం చేశారు. పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఇతరత్రా విభాగాల నిధులను సమీకరించి సౌలభ్యంగా నిర్మాణాలు చేపట్టి త్వరతగతిన పూర్తిచేయడానికి కృషి చేస్తామని తెలిపారు. అనంతరం పాత్‌ఫైండర్ పాఠశాల విద్యార్థులతో కలిసి పోలీస్‌స్టేషన్ స్థలం మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య



కోటేశ్వర్(ఫైల్)

గిర్మాజిపేట, ఆగస్టు7 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక సమస్యలకు తోడు మద్యానికి బానిసైన ప్రైవేటు గుమస్తా.. జీవితంపై విరక్తి చెంది రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం వరంగల్ రైల్వేగేటు సమీపంలో జరిగింది. వరంగల్ జీఆర్‌పీ సీ.ఐ పి.సురేందర్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. వరంగల్ నగరంలోని శీరంగిరాజారాం తోట ప్రాంతానికి చెందిన మూలక కోటేశ్వర్ (40) వరంగల్ చౌరస్తాలో బట్టల దుకాణంలో గుమస్తాగా పనిచేస్తూ భార్య భవాని, ఇద్దరు కుమారులతో కలిసి జీవనం సాగిస్తున్నాడు. కుటుంబానికి సహాయంగా భవాని కూడా మరో బట్టల దుకాణంలో పనిచేస్తోంది. అయితే మద్యానికి బానిస కావడంతో పాటుగా అప్పులు పెరగడంతో కోటేశ్వర్ కొంతకాలంగా పనిమానేసి అందినకాడ అప్పులు చేస్తూ నిత్యం తాగుతుండేవాడు. మద్యం మానాలని భార్య, పిల్లలు చెప్పినా పట్టించుకోని కోటేశ్వర్.. ఇటీవల బావమరిది దగ్గర రూ.50వేలు తీసుకుని మద్యానికి ఖర్చు చేసినట్లు సీఐ తెలిపారు. బుధవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వచ్చిన కోటేశ్వర్.. బాగా మద్యం తాగి రాత్రి 11 గంటలకు బంధువులు, కుటుంబసభ్యులకు ఫోన్‌చేసి తాను చనిపోతున్నానని చెప్పినట్లు సీఐ తెలిపారు.

మద్యం మత్తులోనే కోటేశ్వర్ గురువారం తెల్లవారుజామున మూడు గంటల ప్రాంతంలో రైల్వే గేటు సమీపంలో చిన్నబ్రిడ్జి వద్దకు చేరుకుని వరంగల్ నుంచి కాజీపేట వైపు వెళ్తున్న గూడ్స్ రైలు కిందపడేందుకు ప్రయత్నించగా గూడ్స్ డ్రైవర్ రైలు నిలిపి కోటేశ్వర్‌ను పట్టాల నుంచి పక్కకు తప్పించినట్లు సీఐ తెలిపారు. అయితే గూడ్స్ రైలు వెళ్లిపోయాక మరి కొంత సమయం తరువాత అదే మార్గంలో వచ్చిన గోదావరి ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి కోటేశ్వర్ ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ సురేందర్ తెలిపారు. మృతుడి వద్ద లభించిన సెల్‌ఫోన్ ఆధారంగా మృతుడిని కోటేశ్వర్‌గా గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారమిచ్చారు. ఎంజీఎం మార్చురీలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని భార్య భవానికి అప్పగించినట్లు సీఐ సురేందర్ తెలిపారు. అప్పులు పెరగడం, మద్యానికి బానిసై కోటేశ్వర్ ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి భార్య భవాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ పి.రాజు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బెదిరింపులకు పాల్పడిన వ్యక్తి అరెస్టు

కరీమాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): రియల్ ఎస్టేట్ వ్యాపారులను బెదిరించి డబ్బులు డిమాండ్ చేస్తూ, ఇవ్వకుంటే చంపుతానని బెదిరింపులకు పాల్పడుతున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మిల్స్‌కాలనీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హనుమకొండ ప్రాంతానికి చెందిన సంగు గోవర్ధన్ రెడ్డి అతడి భాగస్వాములు ఖిలావరంగల్ శివారులో భూమిని కొనుగోలు చేసి అందులో ప్లాట్లుగా విడగొట్టి విక్రయించారు. ఈ వ్యవహారంలో ఉర్సు ప్రాంతం కాశికుంట ప్రాంతానికి చెందిన బండి సుభాష్ రియల్ ఎస్టేట్ చేస్తున్న గోవర్ధన్, అతడి భాగస్వాములకు పలుమార్లు ఫోన్ నేను మూడు జిల్లాలకు నక్సలైట్ కార్యదర్శిగా పనిచేశానని, తన వద్ద తుపాకీ ఉందని, మీరుచేస్తూ మీరు చేస్తున్న రియల్ ఎస్టేట్ ప్లాట్ల అమ్మకాల్లో తనకు పావు వాటా ఇవ్వాలని, లేకపోతే చంపేస్తానని బెదిరించాడు. ఈ విషయమై గోవర్ధన్‌రెడ్డి వారం రోజుల క్రితం మిల్స్‌కాలనీ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి, సమగ్ర విచారణ అనంతరం గురువారం బండి సుభాష్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు మిల్స్‌కాలనీ సీఐ బొల్లం రమేష్ తెలిపారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

మామునూరు జాతీయ రహదారిపై ప్రమాదం

మామునూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): వరంగల్ మామునూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారిపై బైక్‌ను లారీకి వెనుక నుంచి ఢీకొట్టడంతో వ్యక్తి మృతిచెందిన ఘటన గురువారం చోటుచేసుకుంది. మామునూరు సీఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ బొల్లికుంట గ్రామానికి చెందిన గుండల కృష్ణ(45) భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో కృష్ణ బుధవారం రాత్రి 9 గంటల సమయంలో పున్నేల్ గ్రామంలో పని ముగించుకొని ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో ముస్కులపల్లి బొడ్రాయి వద్దకు చేరుకున్నాడు.

అదే మార్గంలో అతని ముందు వెళ్తున్న కాకినాడకు చెందిన లారీ అకస్మాత్తుగా బ్రేక్‌లు వేయడంతో కృష్ణ బైక్.. ఆ లారీని ఢీకొట్టడంతో కృష్ణ తల, చేతులు, శరీరంలోని ఇతర భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాద స్థలంలో ఉన్న భిక్షపతి అనే వ్యక్తి వెంటనే 108 అంబులెన్స్ ద్వారా కృష్ణను ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. విషయం తెలిసిన వెంటనే ఘటనా స్థలాన్ని వరంగల్ ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్‌కుమార్, మామునూరు ఏసీపీ వెంకటేశ్, సీఐ రమేష్‌లు పరిశీలించారు. తీవ్రంగా గాయపడిన కృష్ణ బుధవారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు తెలిపినట్లు సీఐ తెలిపారు. ఇతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి తల్లి గుండల అమృతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమేష్, ఎస్ఐ శ్రీకాంత్‌లు తెలిపారు.

లక్ష్య సాధనకు ఇంటర్ వేదికగా ఉండాలి

ఇన్‌స్పైర్ కాలేజీ చైర్మన్ తీగల భరత్‌గౌడ్



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న భరత్‌గౌడ్

హసన్‌పర్తి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ విద్య లక్ష్య సాధనకు వేదికగా ఉండాలని ఇన్‌స్పైర్ కాలేజీ చైర్మన్ తీగల భరత్‌గౌడ్ విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. భీమారం ఎర్రగట్టుగుట్ట పరిధి బాలాజీ గార్డెన్స్‌లో బుధవారం ఇన్‌స్పైర్ జూనియర్ కాలేజీ ఆధ్వర్యంలో మొదటి సంవత్సరం విద్యార్థులకు స్వాగత కార్యక్రమం అక్సైలా 2 కే 25 ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ శ్రీరాంరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఇంటర్ విద్య ఒక మలుపు దశ అని ఈ సమయంలో విద్యార్థులు ఒత్తిడికి లోనుకాకుండా స్పష్టమైన లక్ష్యంతో విద్యను అభ్యసించాలని సూచించారు. విద్యార్థులు తమ జీవిత లక్ష్యాలను సాధించుకునే దశలో ఉన్నారని ఈ రెండు సంవత్సరాలు మంచి ప్రణాళికతో ముందుకు సాగితే తప్పకుండా ఉన్నత విజయాలు సాధించవచ్చన్నారు.

ఈ సందర్భంగా ఐపీఈ 2025లో 470కు 468 మార్కులు సాధించి స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించిన విద్యార్థిని సాయి శ్రేష్టితకు కళాశాల యాజమాన్యం తరపున రూ. లక్ష నగదు బహుమతి అందించి అభినందించారు. అలాగే ఎంపీసీ విభాగంలో 460 మార్కులు, బైపీసీలో 430 మార్కులు, సీఈసీలో 460 మార్కులకుపైగా సాధించిన విద్యార్థులను సన్మానించి మెమోంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు రాజుకుమార్, మమత, శివ, బోధన,బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు	2151	1521
పల్లికాయ (సూక)	5670	3450
పల్లికాయ (పచ్చిది)	4500	1575
కందులు	5873	3022
పెసళ్లు	7022	3022
పత్తి	7660	5300
పసుపు (కాడి)	12003	9534
పసుపు (గోల)	10180	8700
తేజ మిర్చి	11500	8500
తేజ ఏసీ	13800	11500
వండర్‌హాట్	12000	6000
వండర్‌హాట్ ఏసీ	15500	11500
యూఎస్341ఏసీ	14500	7000
దీపిక	9000	8000
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6000	3000

- వరంగల్ వ్యవసాయం

అనుబంధాల వేడుక.. ఆత్మీయతల వేదిక



రేపు రక్షాబంధన్ పర్వదినం

» పుట్టింటికి చేరుకుంటున్న ఆడపడుచులు
» ఇంటింటా కనిపిస్తున్న సందడి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : అన్నాచెల్లెల ఆత్మీయఅనుబంధానికి ప్రతీక రాఖీ పర్వదినం. సోదరుడికి కట్టే రాఖీలు సోదరీమణులకు రక్షణ కవచంగా నిలుస్తాయని విశ్వాసం. మార్కెట్‌లో రుద్రాక్ష, స్టోన్, వెండి, బంగారు రాఖీలు ప్రత్యేకంగా నిలిచాయి. కుందన్‌లు మెరుపులు జరీతో పాటు స్పాంజితో తయారు చేసిన రాఖీలు మార్కెట్‌లోకి వచ్చాయి. పిల్లలను ఆకర్షించేందుకు కార్టున్ రాఖీలు కూడ వచ్చాయి. పాతకాలంలో అతి పెద్దగా ఉండే రాఖీలు ధరించేవారు. రానురాను అవి చిన్నగా మారి పోయాయి. మళ్లీ ఈ సంవత్సరం మార్కెట్‌లోకి పెద్ద పెద్ద రాఖీలు దుకాణాల్లో దర్శనమిచ్చాయి. దూరప్రాంతాల్లో ఉన్న సోదరులకు సోదరీమణులు కొరియర్, పోస్టు ఆఫీసుల ద్వారా ముందుగానే రాఖీలు పంపించారు. కాగా రూ.10 నుంచి మొదలుకుని 300 వరకు రాఖీ ధరలు పలుకుతున్నాయి.



అమ్మకానికి సిద్ధంగా ఉన్న రాఖీలు

పుట్టింటికి చేరుకుంటున్న ఆడపడుచులు

మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా ఆడపడుచులు ఈ ఏడాది రాఖీ పర్వదినాన్ని సుఖఃసంతోషాలతో జరుపుకునేందుకు సిద్ధమయ్యారు. ఈనెల 8వ తేదీ నాటికే పుట్టింటికి చేరుకునేందుకు తరలివస్తున్నారు. రాఖీ పర్వదినాన్ని రాఖీ పౌర్ణమి, శ్రావణ పౌర్ణమి, జంజాల పౌర్ణమి కూడా అంటారు. 9న పౌర్ణమి తిథి కాబట్టి ఈ రోజే రాఖీ పౌర్ణమి జరుపుకోవాలని వేద పండితులు, అర్చకులు చెబుతున్నారు. సోమవారం రాఖీ పర్వదినాన్ని జరుపుకోవచ్చనే పండితుల సూచనల మేరకు ఆడపడుచులు రాఖీలు, స్వీట్లతో పుట్టింటికి చేరుకుంటున్నారు. పంచాంగం ప్రకారం ఈనెల 9న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల రాఖీ పండుగను జరుపుకోవచ్చని వేద పండితులు చెబుతున్నారు. ఆ సమయంలో సోదరీమణులు తమ సోదరులకు రాఖీలు కట్టవచ్చని పండితులు తెలిపారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

జిల్లా వ్యాప్తంగా ఉన్న దేవాలయాల్లో రాఖీ పర్వదినం రోజున భక్తులతో కిటకిటలాడనున్నాయి. రాఖీ పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తులు ఉదయాన్నే తలంటు స్నానాలు ఆచరించి దేవాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేసి సోదరులకు రాఖీలు కట్టనున్నారు. దీంతో జిల్లా కేంద్రం, మండల కేంద్రాలతో పాటు గ్రామాల్లో ఉన్న ఆలయాల్లో కూడా పర్వదినం సందర్భంగా భక్తుల సౌకర్యార్థం అర్చకులు, ఆలయ కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. రాఖీ పర్వదినం సందర్భంగా ఆలయాలు భక్తులతో సందడిగా మారనున్నాయి.

హిందూ పండుగల్లో ఒకటి..

హిందువులు జరుపుకునే పండుగల్లో రాఖీ ఒకటి. ఈ పండుగ సోదర, సోదరీమణులకు మధ్య ప్రేమకు గుర్తుగా పేరుగాంచింది. రాఖీ కట్టిన తన సోదరికి సోదరుడు తన జీవితాంతం అండగా ఉంటానని మాట ఇస్తాడు. ఈ రోజున సోదరీమణులు తమ సోదరుడి మణికట్టుపై రాఖీ కట్టి స్వీటు తినిపించి హారతినిస్తారు. తనకు రాఖీ కట్టిన సోదరికి ఏదైనా చిరుకానుక బహుమతిగా ఇచ్చి జీవితాంతం కాపాడతానని హామీ ఇచ్చినట్లుగా భావిస్తారు. ఈ పండుగ ప్రతి సంవత్సరం శ్రావణమాసం పౌర్ణమి రోజున జరుపుకుంటారు. రక్షాబంధన్ అనే పదం రక్ష, బంధన్ అనే రెండు పదాలతో ఏర్పడింది. దేవతామూర్తుల కాలం నుంచి ఈ పండుగను జరుపుకుంటున్నట్లుగా చరిత్ర ద్వారా తెలుస్తోంది.

ఎందుకు జరుపుకుంటారంటే..

ఒక రోజు శ్రీగణేశుడు తన సోదరి మానసదేవితో రాఖీ కట్టించుకుంటుండగా అప్పుడు ఇద్దరు కుమారులు శుభ్, లాభ్‌లు ఇది ఏంటని అడిగారట. అప్పుడు గణేశుడు ఇది రక్షణ కవచం అని, ఈ రక్షాసూత్రం సోదర సోదరీమణుల మధ్య ప్రేమకు ప్రతీక అని చెప్పాడట. ఇది విన్న శుభ్, లాభ్‌లు తమకి కూడా ఒక సోదరి కావాలని పట్టుబట్టగా తన కుమారుల కోరిక మేరకు గణేశుడు తన శక్తుల నుంచి ఒక మంటను సృష్టించి దానిని తన భార్యలు సిద్ధి, బుద్ధిల ఇద్దరి ఆత్మశక్తితో కలిపి ఆ వెలుగు నుంచి ఒక అమ్మాయి జన్మించింది. ఆ అమ్మాయికే సంతోషిమాత అని పేరు పెట్టారట.



వరంగల్ చౌరస్తాలో పూజ సామగ్రి కొనుగోళ్ల సందడి

నేడు వరలక్ష్మి వ్రతం

» ఆలయాల్లో ప్రత్యేక పూజలు
» ఇంటింటా మహిళలు వ్రతాలు
» పూజ సామగ్రి కొనుగోలుతో నగరంలో సందడి

వరంగల్ కల్చరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): వరాలిచ్చే తల్లి వరలక్ష్మీ తమ సౌభాగ్యం పసుపు కుంకుమలు ముత్తైదువ తనంతో ఇంటిల్లిపాది అందరు సుఖ సంతోషాలతో ఉండాలని వరలక్ష్మీని వేడుకుంటూ శుక్రవారం రోజు వ్రతాలను మహిళలు అత్యంత భక్తి శ్రద్ధలతో ఇంటింటా ఆచరించకోనున్నారు. ప్రతీ ఏడు శ్రావణ మాసంలో మూడో శుక్రవారం రోజున వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించుకుంటారు. ఈ మాసంలో రాజరాజేశ్వరీ దేవాలయంలో ఐదు శుక్రవారాలు సాముహికంగా వరలక్ష్మీ వ్రతాలను మహిళల చేత నిర్వహిస్తారు. వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని నగరంలోని అన్ని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు వ్రతాలు నిర్వహిస్తారు. ప్రధానంగా భద్రకాళీ దేవాలయం రాజరాజేశ్వరి అమ్మవారు, శ్రీ సంతోషీమాత దేవాలయం, శ్రీ వరద దత్తక్షేత్రం మహాలక్ష్మీ, వాసవీ మాత దేవాలయంతోపాటు ఇతర దేవాలయాల్లో ప్రత్యేక పూజలు ఏర్పాటు చేశారు. ఇంటింటా మహిళలు వ్రతాలు నిర్వహించుకోవడానికి కావల్సిన పూజా సామగ్రి కొనుగోలుతో నగరంలోని బజార్లు కిటకిటలాడాయి. వరంగల్ చౌరస్తా, బట్టలబజార్, స్టేషన్‌రోడ్డు, అండర్‌బ్రిడ్జి ప్రాంతాల్లో పూజా సామగ్రి అమ్మకాలు విక్రయించారు. వ్రతానికి పూలు, పండ్లు కొనుగోళ్లు పెద్దఎత్తున చేశారు. వీటితోపాటు అమ్మవారి ప్రతిమలు నూతన వస్త్రాలు, మిఠాయిల అమ్మకాలతో సందడిగా కనిపించాయి. శ్రావణ మాసం ఆధ్యాత్మిక శోభతో వరాల వరలక్ష్మీ అమ్మవారి వ్రతాల సందడి కనిపించింది.



పూలు కొనుగోలు చేస్తున్న మహిళలు

ప్రజావాణితో ప్రయోజనమేది ?

» జీడబ్ల్యూఎంసీలో దరఖాస్తులు బుట్టదాఖలు
» ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం
» అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్న ప్రజలు
» టౌన్‌ప్లానింగ్ విభాగంపై ఫిర్యాదులు ఎక్కువ
» పట్టించుకోని అధికారులు
» సీరియస్‌గా తీసుకోవాలంటున్న ప్రజలు

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ (జీడబ్ల్యూఎంసీ) సమర్థవంతమైన పాలన అందించాలంటే ప్రజల ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం చూపాలి. కానీ బల్దియాలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం ప్రయోజనంగా లేదని బాధితులు విమర్శిస్తున్నారు. గ్రీవెన్ సెల్‌కు హాజరైనా ప్రజల సమస్యలు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారినట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కమిషనర్ ముందు సమస్యలు పరిష్కరిస్తున్నట్టు నటిస్తున్నా ఆచరణలో సాధ్యం కావడం లేదు. ప్రజావాణి అధికారులకు తూతూ మంత్రంగా మారింది. ప్రతీ సోమవారం అన్ని విభాగాలకు 100 నుంచి 150 ఫిర్యాదులు వచ్చినా పావలా వంతు పరిష్కారానికి నోచుకోవడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. ఫిర్యాదులు స్వీకరించడంలో ఉన్న శ్రద్ధ పరిష్కరించడంలో చూపడం లేదు. కమిషనర్ స్వీకరించిన ఫిర్యాదులు అధికారుల నిర్లక్ష్యం వల్ల అవి బుట్టదాఖలవుతున్నాయి. ప్రత్యేకంగా టౌన్‌ప్లానింగ్ విభాగంపై ప్రతీ వారం పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు వస్తున్నా నగరంలో భవన నిర్మాణాలకు అనుమతులిచ్చి, పుచ్చుకోవడంలోనే అధికారులు బిజీగా ఉంటున్నారని ఆరోపణలొస్తున్నాయి. ప్రధానంగా అక్రమ నిర్మాణాలు, భూ కబ్జాలు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణలు, అనధికార లేఔట్లు, రోడ్ల ఆక్రమణలు, ఖాళీ స్థలాల ఆక్రమణ, వ్యక్తిగత కక్షలతో ఇళ్లు, ప్రహరీల కూల్చివేతలపై ఫిర్యాదులు నిత్యకృత్యంగా మారాయి. నగరవాసుల సమస్యలను పరిష్కరించడంలో సీపీ నుంచి చైన్‌మన్ వరకు సరైన స్పందన లేక ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

పట్టించుకోని అధికారులు

ప్రజావాణి ద్వారా తమ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని గంపెడాశతో వచ్చిన ఫిర్యాదుదారులకు నిరాశే మిగుతుంది. ప్రధానంగా అక్రమ నిర్మాణాలు, ఇంజనీరింగ్, తాగునీటి సమస్యలపై ప్రతీ వారం పెద్ద మొత్తంలో ఫిర్యాదులు అందుతాయి. శానిటేషన్ విభాగంలో చెత్త కుప్పల తొలగింపు, డ్రెయినేజీల శుభ్రం, జంతు కళేబరాల తొలగింపు ఫిర్యాదులపై తక్షణ పరిష్కారం జరుగుతున్నా టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగంపై వచ్చిన సమస్యలు సమస్యలుగానే మిగిలిపోతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పర్యటించి పరిష్కార మార్గాలు చూపించాల్సిన అధికారులు, సిబ్బంది అటుగా వెళ్లడం లేదు. ప్రజలు పదులసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోతుందని ఆరోపిస్తున్నారు. కొందరు అధికారులు ఫిర్యాదుదారులకు ఫోన్ చేసి సమస్య అడిగి తెలుసుకుని పరిష్కారం చేసినట్టు ఫోన్‌కు మెసేజ్ పంపించి చేతులు దులుపుకుంటున్నట్టు బాధితులు తెలిపారు. ఇంకా కొందరు అధికారుల డబ్బులు ముట్టజెప్పితేనే ఫీల్డ్ విజిట్ చేస్తామని మొండికేస్తున్నారు. కొత్తగా వచ్చిన కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ ప్రక్షాళన చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రజావాణి ఫిర్యాదులు పరిష్కరిస్తేనే కమిషనర్, మేయర్‌పై ప్రజలకు నమ్మకం ఏర్పడుతుందనేది వాస్తవం.



బల్దియాలో ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్, అధికారులు (ఫైల్)

గత 6 నెలలుగా అందిన ఫిర్యాదులు

ఇంజనీరింగ్ - 180
హెల్త్, శానిటేషన్ - 63
ప్రాపర్టీ ట్యాక్స్, రెవెన్యూ - 90
టౌన్‌ప్లానింగ్ - 289
తాగునీటి సరఫరా - 38
- హార్టికల్చర్ - 14
ఎలక్ట్రికల్ - 32
డీఆర్‌ఎఫ్- 30

వరంగల్ మంత్రి, ఎమ్మెల్యేలు, మేయర్, కమిషనర్‌తో పాటు ఆన్‌లైన్‌లో 450 ఫిర్యాదులు అందాయి. మొత్తంగా 1,186 ఫిర్యాదులు అందగా 200 ఫిర్యాదులు పరిష్కరించినట్లు అధికారులు వెల్లడించారు.

ప్రజావాణితో పాటు పర్సనల్‌గా..

నగరవాసులు వారి సమస్యలను ప్రజావాణిలో కమిషనర్, మేయర్, ఎమ్మెల్యే, స్థానిక కార్పొరేటర్లకు అందిస్తున్నారు. కొందరు బల్దియా ద్వారా పరిష్కారం కాకపోవడంతో ఎమ్మెల్యేలు, మంత్రుల వద్దకు పరుగులు తీస్తున్నారు. వారు సంబంధిత అధికారులకు ఫోన్ చేసి చెబుతున్నారు. అయినా కొందరు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో అధికారుల తీరుపై ప్రజలకు ఆశలు సన్నగిల్లుతున్నాయి.

ప్రజావాణిపై ప్రజల డిమాండ్లు..

- ప్రజావాణిలో ఇచ్చిన ఫిర్యాదులపై 10 రోజులలో పరిష్కారం చూపాలి.
- కమిషనర్ స్వీకరించిన ఫిర్యాదుల పెండింగ్‌పై ప్రతీ నెల చివరి వారంతో అధికారులతో సమీక్షించాలి.
- టౌన్ ప్లానింగ్ విభాగంపై ప్రత్యేక విచారణ కమిటీ ఏర్పాటు చేయాలి.
- ప్రతీ ఫిర్యాదుదారుడికి అక్‌నాల్డ్‌మెంట్ ఇచ్చే విధానం అమలులోకి తేవాలి.
- ప్రభుత్వ స్థలాల పరిరక్షణ, అక్రమ నిర్మాణాలపై స్వచ్ఛంద సంస్థలు, భూ బాధితులతో కమిటీలు వేయాలి.
- కబ్జాదారులపై అధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలి.
- డిజిటల్ ఫిర్యాదు ట్రాకింగ్ సిస్టం ఏర్పాటు చేయాలి.
- ఫిర్యాదులపై దర్యాప్తు అధికారి పేరు, ఫోన్ నెంబర్ వెల్లడించాలి.
- అధికారులు నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకోవాలి.

బల్దియాలో సమస్యలు పరిష్కారం కాక మా వద్దకు వస్తున్నారు..

- తోట వెంకటేశ్వర్లు, 10 డివిజన్ కార్పొరేటర్



ప్రజల సమస్యల పరిష్కారం కోసం ముందుగా మునిసిపాలిటీకి వెళ్తే అక్కడి అధికారులు జాప్యం చేయడంతో మా వద్దకు వస్తున్నారు. మేము ఎమ్మెల్యే, మునిసిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నాం. వారి సమస్యలకు తక్షణ పరిష్కారం చూపిస్తే మా వద్దకు రాకుండా ఉంటారు. అధికారుల నిర్లక్ష్యంపై కమిషనర్, మేయర్ దృష్టి సారించాలి.

రోడ్డు కబ్జా అయ్యిందని పదిసార్లు ఫిర్యాదు చేశాం..

- హారిక, మడికొండ



గ్రేటర్ 64వ డివిజన్ మడికొండ హిల్స్‌కాలనీలో కొందరు రోడ్డును ఆక్రమించి అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నారని పదిసార్లు ఫిర్యాదు చేశాం. మా కాలనీవాసులు సుమారు 20 మంది ప్రతీ ప్రజావాణిలో వచ్చి ఫిర్యాదు చేస్తున్నాం. కానీ సమస్య పరిష్కారం కాలేదు. ఇంతవరకు ఒక్క అధికారి కూడా వచ్చి చూడలేదు. కమిషనర్ స్పందించి ప్రజల ఫిర్యాదులకు పది రోజుల్లో పరిష్కారం చూపాలి.

హామీలు నిలబెట్టుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

» ఆంధ్రప్రదేశ్‌లా పింఛన్ పెంచాలి
» లేకుంటే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చుతాం..
» పింఛన్‌దారుల సన్నాహక సభలో మంద కృష్ణ మాదిగ

హసన్‌పర్తి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఎన్నికలకు ముందు సీఎం రేవంతర్‌రెడ్డి ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని వీహెచ్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. మండలంలోని భీమారం ఎంటీఆర్ గార్డెన్స్‌లో వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో గురువారం పెన్షన్‌దారుల సన్నాహక మహాసభ వీహెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దూడల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మంద కృష్ణమాదిగ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. వికలాంగులకు పింఛన్‌ను రూ.4వేల నుంచి రూ.6వేలకు, వృద్ధులు, వితంతువులకు రూ.2016 నుంచి రూ.4 వేలకు, కండరాల క్షీణత రోగులకు, ఇతర తీవ్రమైన రోగులకు రూ.15 వేలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వలాగా పెంచి తెలంగాణ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని హెచ్చరించారు. అందాల పోటీలకు, భూస్వాములకు రైతు భరోసాకు అభివృద్ధి పేరుతో వేల కోట్లు ఖర్చు పెడుతున్నప్పుడు.. కాళ్లు, కళ్లు, మాట్లాడలేని వికలాంగులకు, వయసు మీద పడిన వృద్ధులకు, భర్త లేకుండా బిడ్డలను పోషించలేని వితంతువులకు, తీవ్రమైన రోగాలతో చావుతో సాహసం చేస్తున్న కండరాల క్షీణత ఇతర రోగులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోకుండా మోసం చేస్తున్న ఆ సమాజానికి సీఎం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తప్పు తెలుసుకొని మొదటి వారం లోపు 15 డిమాండ్స్ తీర్చకపోతే సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆగస్టు 13న హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో లక్షలాది మందితో జరిగే మహాగర్జన మహాసభతో కుప్పకూల్చుతామని హెచ్చరించారు. పేద వర్గాల పింఛన్ పెంచని ప్రభుత్వం చేస్తున్న అన్యాయాన్ని ప్రశ్నించకుండా ప్రతిపక్ష పార్టీలు కూడా అన్యాయం చేస్తున్నాయన్నారు. ఇప్పటికైనా ప్రతిపక్ష, విపక్ష పార్టీలు మౌనం వీడాలని గుర్తు చేశారు. ఎమ్మార్పీఎస్ పోరాటంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆరోగ్యశ్రీ, వికలాంగుల, వృద్ధులు, వితంతువుల పింఛన్ రూ.200 నుంచి రూ.వేయి, రూ.1500 నుంచి రూ.2వేలు సాధించుకుని ఆంధ్రప్రదేశ్‌లో నేడు రూ.6 వేలు సాధించామన్నారు. ఆ స్ఫూర్తితో తెలంగాణలో కూడా పింఛన్ రూ.6 వేలకు పెంచడంతో పాటు ఇతర డిమాండ్స్ సాధించే వరకు విశ్రమించే ప్రసక్తేలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఎంఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు వైకే.విశ్వనాథ్ మాదిగ, హనుమకొండ జిల్లా ఇన్‌చార్జి కందుకూరి సోమన్నమాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్ మాదిగ, ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు బండారి సురేందర్ మాదిగ, ఎంఎస్‌పీ రాష్ట్ర నాయకులు ఆరెపల్లి పవన్‌మాదిగ, ఎంఎస్‌పీ జిల్లా ఉపాధ్యక్షులు రాజారపు భిక్షపతిమాదిగతో పాటు జిల్లాలోని వికలాంగులు, వృద్ధులు, వితంతువులు పాల్గొన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో ముగ్గురికి జైలు శిక్ష

వరంగల్ క్రైం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడ్డ 21మందిని గురువారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి ఎ.వేణుగోపాల్ ముగ్గురికి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు హనుమకొండ ట్రాఫిక్ సీఐ జి.సీతారెడ్డి తెలిపారు. మిగతా 18 మందికి రూ.21,000 జరిమానా విధించారన్నారు. అదే విధంగా డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న ఇద్దరిని న్యాయమూర్తి ఎదుట హాజరు పరచగా 1,400 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

హార్టికల్చర్ భూములకు మహర్దశ

» ఉద్యానవన పంటల సాగుకు ఐటీడీఏ మొగ్గు
» కార్యాచరణను సిద్ధం చేస్తున్న అధికారులు

ఏటూరునాగారం రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : ఏళ్ల తరబడి నిరాధారణకు గురైన భూములకు చలనం కల్గింది. ఐటీడీఏ నిర్లక్ష్యానికి విలువైన భూములు గత పదేళ్లుగా బీడుగా మారాయి. నిరుపయోగంగా మారిన భూముల్లో సాగుకు ఐటీడీఏ ముందడుగు వేసింది. ఐటీడీఏ ఉద్యానవన శాఖకు చెందిన భూముల్లో ఉద్యాన పంటల సాగుకు కసరత్తు చేస్తుంది. ఖాళీగా ఉన్న భూముల్లో పండ్లు, పూల, కూరగాయల సాగుకు ఐటీడీఏ పీవో ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. సుమారు 32 ఎకరాల్లో పండ్లు, పూలు, కూరగాయల సాగుతో పాటు వెదురు లాంటి చెట్లను పెంచనున్నారు.

ఎట్టకేలకు భూములకు మోక్షం

ఐటీడీఏ ఉద్యానవన శాఖకు సుమారు 35 ఎకరాల భూములున్నాయి. గతంలో ఈ భూముల్లో పండ్లు, కూరగాయలు, పూల మొక్కలు పెంపకాన్ని చేపట్టి గిరిజనుల ఉపాధికి బాటలు వేశారు. కానీ గత పదేళ్లుగా ఉద్యానవన శాఖ నిర్లక్ష్యానికి గురైంది. సంవత్సరాల తరబడి ఈ భూములు బీడుగా మారాయి. విలువైన భూములపై ఐటీడీఏ అలసత్వం ప్రదర్శించింది. మండల కేంద్రంలోని రామన్నగూడెం వెళ్లే రహదారిని ఆనుకొని సుమారు 6 ఎకరాలు భూమితో పాటు ఎక్కెలలోని 28 ఎకరాల్లో భూమి ఉంది. కానీ ఈ భూములపై ఐటీడీఏకు పట్టింపు కొరవడంతో భూములు కొంతమేర కబ్జాకు గురయ్యాయి. పలుమార్లు గిరిజనులు భూములను సాగులోకి తెస్తే తమకు ఉపాధి అవకాశాలు దొరుకుతాయని ఐటీడీఏ అధికారులకు మొరపెట్టుకున్న ఫలితం లేకుండా పోయింది. కానీ ప్రస్తుతం ఐటీడీఏ ఈ భూములపై నజరు పెట్టింది. విలువైన భూములు అన్యాక్రాంతం కాకుండా పీవో చిత్రా మిశ్రా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఆ భూములపై రీసర్వేను చేపట్టి హద్దురాళ్లు వేసేందుకు రెవెన్యూ అధికారులకు ఆదేశాలిచ్చింది. గతంలోని భూముల విస్తీర్ణం, ఇప్పుడున్న పరిస్థితిని సర్వే చేసి కబ్జాకు గురైన వాటిని స్వాధీనం చేసుకునేలా చర్యలు చేపట్టారు. నిరుపయోగంగా మారిన భూముల్లో ఉద్యానవన పంటల సాగుకు ముందుకు రావడంతో గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



రామన్నగూడెం రోడ్డులోని భూమిని చదును చేస్తున్న దృశ్యం

18 ఎకరాలు.. ఒక్కో ఎకరంలో ఒక్కో రకం

మండల కేంద్రంలోని ఎక్కెల గల హెచ్‌టీసీలో గల 18 ఎకరాల్లో ఉద్యానవన పంటల సాగును చేపట్టనున్నారు. 18 ఎకరాల్లో ఒక్కో ఎకరంలో ఒక్కో రకం పండ్ల తోటలను వేయనున్నారు. మామిడి, సీతాఫలం, నిమ్మ, బత్తాయి, ఫామాయిల్, ఆపిల్‌బేర్, మునగ, నేరేడు, జామ, సపోటా తదితర పండ్ల మొక్కలను 18 ఎకరాల్లో సాగు చేయనున్నారు. మామిడి 3 ఎకరాలు, సీతాఫలం 1, ఫామాయిల్ 2, నిమ్మ 1, బత్తాయి 1, ఆపిల్ బేర్ 1, నేరేడు 1, మునగ 1, జామ 3, సపోటా 1 ఎకరాల్లో పండ్ల మొక్కలు నాటనున్నారు. అదేవిధంగా హెచ్‌ఎన్‌సీటీలో గల పాత చెట్లను పునరుద్ధరణతో పాటు రామన్నగూడెం రోడ్డులోని భూముల్లో మామిడి మొక్కల పునరుద్ధరణతో పాటు పూలమొక్కలను సాగు చేయకున్నారు. ఇందుకోసం జిల్లా ఉద్యానవన శాఖ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. పండ్ల మొక్కల సాగు చేసేందుకు సంబంధించిన భూములను అధికారులు చదును చేస్తున్నారు. సాగుకు సంబంధించిన పనులను వేగంగా జరుగుతున్నాయి.



భూమిని పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా (ఫైల్)

గిరిజనుల ఉపాధికి ఊతం

హార్టికల్చర్ భూములు ఉపయోగంలోకి రావడంతో స్థానిక గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పండ్లు, కూరగాయాలు, పూలమొక్కల పెంపకం చేపట్టి తద్వారా వచ్చే ఫలితాలతో గిరిజనులకు ఉపాధి అవకాశాలు దొరుకుతాయని, ఆర్థిక వెసులుబాటు కల్గుతుందని పలువురు గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత పదేళ్లుగా బీడుగా మారిన భూములు ఉపయోగంలోకి రావడం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు.

వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలి

వరంగల్ మెడికల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే టీబీ, హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలని హనుమకొండ డీఎం హెచ్‌వో డాక్టర్ అప్పయ్య అన్నారు. హనుమకొండ లష్కర్‌బజార్‌లోని ప్రభుత్వ పాఠశాలలో గురువారం హెచ్ఐవీ, ఎయిడ్స్ నివారణ సంస్థ యూత్ ఫెస్ట్‌లో భాగంగా 9వ తరగతి విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. జిల్లాలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు జాతీయ స్థాయిలో కూడా విజేతలు గా నిలవాలన్నారు. గెలుపొందిన విద్యార్థులకు నగదు బహుమతి అందజే శారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ మదన్‌మోహన్‌రావు, జిల్లా ప్రోగ్రాం మేనేజర్ స్వప్నమాధురి, డెమో అశోక్‌రెడ్డి, సూపర్ వైజర్ రామకృష్ణ, కమలాకర్, ఎస్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో అప్పయ్య


సాంబశివరావుకు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నేతలు, పలివేల్పుల వాసులు

సీఎంతో మాట్లాడి ఇళ్ల పట్టాలు ఇప్పిస్తా..

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

న్యూశాయంపేట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లా డి పలివేల్పుల భగత్‌సింగ్‌నగర్ వాసులకు ఇళ్లపట్టాలు ఇప్పిస్తానని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హామీ ఇచ్చారు. హనుమకొండ నక్కలగుట్టలోని హరితకాకతీయ హోటల్‌లో గురువారం సీపీఐ నాయకులు, భగత్‌సింగ్‌నగర్ వాసులు సాంబశివరావును కలిసి ఇళ్ల పట్టా లు ఇప్పించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. భగత్‌సింగ్‌నగర్ వాసుల సమస్యను వెంటనే సీఎం దృష్టికి తీసుకెళ్లి పట్టాలు ఇప్పించే బాధ్యత తనదే అన్నారు. ఈ సందర్భంగా సాంబశివరావుకు సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి టీ శ్రీనివాస్‌రావు, భగత్‌సింగ్‌నగర్ కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు. సాంబశివరావును కలిసిన వారిలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, కార్యవర్గ సభ్యులు ఏదునూరి వెంకట్రాజం, నాయకులు తోట భిక్షపతి, స్టాలిన్ తదితరులు ఉన్నారు.

చేనేత రంగానికి ప్రోత్సాహం

- కలెక్టరేట్‌లో నెలకోసారి టెస్కో స్టాల్స్
- జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్
- ఉత్సాహంగా సాగిన హ్యాండ్లూమ్ వాక్

హనుమకొండ కలెక్టరేట్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): చేనేత రంగాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని కలెక్టర్ స్నేహ శబరీష్ పేర్కొన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా గురువారం హనుమకొండ కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌హాల్‌లో జిల్లా చేనేత, జౌళిశాఖ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. అంతకుముందు హనుమకొండ కాళోజీ జంక్షన్‌లో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి జెండా ఊపి చేనేత సడక్(హ్యాండ్లూమ్ వాక్) ప్రారంభించగా అదాలత్ మీదుగా కలెక్టరేట్‌కు చేరుకుంది.

ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ.. జిల్లాలో ఉన్న 800మంది చేనేత కార్మికులకు ప్రభుత్వం అండగా ఉంటోందని, చేనేత రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం వివిధ పథకాలను అమలు చేస్తోందన్నారు. చేనేత కార్మికులకు ప్రభుత్వం రుణమాఫీ కూడా చేసిందన్నారు. చేనేత కార్మికులు తయారు చేస్తున్న బెడ్‌షీట్లు, టవళ్లను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, ఇంకా ఏవైనా ప్రైవేట్ సంస్థలు, ప్రభుత్వ ఆధీనంలో ఉన్న ఇతర సంస్థలు, స్కూళ్లు, గురుకులాలు, ఆస్పత్రులు ఉన్న నేపథ్యంలో వీటికి కూడా డైరెక్ట్‌గా చేనేత కార్మికుల ద్వారా అందించే వీలు ఉందా అనేది ఆలోచిస్తామన్నారు. చేనేత ఉత్పత్తుల ప్రదర్శన అమ్మకాలకు సంబంధించిన టెస్కో స్టాల్స్‌ను నెలకోసారి ఐడీఓసీలో పెట్టాలన్నారు. ప్రతీ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణికి పెద్దసంఖ్యలో ప్రజలు వస్తున్నందున జిల్లాలో చేనేత కార్మికులు తయారుచేస్తున్న ఉత్పత్తులను కలెక్టరేట్‌లో స్టాల్స్ రూపంలో పెడితే అందరికి తెలుస్తుందన్నారు. చేనేత రంగాన్ని ప్రోత్సహించే విధంగా స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్స్ ఇచ్చే విధంగా సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ సందర్భంగా వివిధ రకాల చేనేత ఉత్పత్తులను ప్రదర్శించారు. అనంతరం చేనేత కార్మికులను ఘనంగా సన్మానించారు. చేనేతపై నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాస పోటీలలో విజేతలైన విద్యార్థులను సత్కరించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, చేనేత జౌళిశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ విజయలక్ష్మీ, చేనేత సహకార సంఘాల అధ్యక్షులు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్నేహ శబరీష్


జెండా ఊపి చేనేత సడక్ ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

భూభారతి దరఖాస్తులు వేగంగా పరిష్కరించాలి

హనుమకొండ కలెక్టరేట్ (ఆంధ్రజ్యోతి): భూభారతి దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలని ఆర్‌డీవోలు, తహసీల్దార్లను జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో గురువారం ఆర్‌డీవోలు, తహసీల్దార్‌లతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ.. రైతుల నుంచి వచ్చే దరఖాస్తులను విచారణ చేసి త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఈ సమీక్షలో హనుమకొండ, పరకాల ఆర్‌డీవోలు రాథోడ్ రమేష్, నారాయణ, జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

ముందస్తు రక్షాబంధన్ సంబురాలు



రక్షాబంధన్ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు, టీచర్లు

కేయూ క్యాంపస్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీలో గురువారం ముందస్తు రక్షాబంధన్ సంబురాలు నిర్వహించారు. కేయూ పరిపాలన భవనంలో వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంకు మహిళ ఉద్యోగుల సంఘం నేతలు రాఖీలు కట్టారు. కేయూ మహిళ ఉద్యోగుల సంఘం నేతలు డాక్టర్ ఎన్.సుజాత, బి.కృష్ణవేణిల ఆధ్వర్యంలో మహిళ ఉద్యోగులు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ శ్రీలతదేవి, హేమరాణి, పి.నర్మద, ఎస్.పద్మావతి, డీఆర్‌లు పంజాల శ్రీధర్, ఏఆర్ డాక్టర్ కోలా శంకర్, డాక్టర్ వల్లాల పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో..

కేయూ గెస్ట్‌హౌస్‌లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలను నిర్వహించారు. విద్యార్థినులు విద్యార్థులు రాఖీలు కట్టుకుని ఐక్యతను చాటారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా అధ్యక్షకార్యదర్శులు స్టాలిన్, మంద శ్రీకాంత్‌లు మాట్లాడారు. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను ఐక్యంగా అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కేయూ ఎస్ఎఫ్ఐ గర్ల్స్ కన్వీనర్ పరిమళ, అనూష, జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కల్యాణ్, కేయూ అధ్యక్షకార్యదర్శులు సాయికుమార్ బీరెడ్డి, జశ్వంత్, మల్లేశ్, పవన్, రాహుల్, గణేశ్, సందీప్, వర్షిత, అనిత, సువర్ణ, అర్చన, రాధిక, శ్రీదేవి, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

విశ్వవ్యాలీ ప్లేస్కూల్‌లో..

హనుమకొండ (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జవహర్‌నగర్‌లోని విశ్వవ్యాలీ ప్లేస్కూల్‌లో గురువారం రాఖీ పండుగను ఘనంగా నిర్వహించారు. స్కూల్‌లోని బాలికలు బాలురకు రాఖీలు కట్టారు. ప్రతిగా బాలురు వారికి స్వీట్లను తినిపించారు. స్కూల్ ప్రిన్సిపాల్ తిరుమలాదేవి, కరస్పాండెంట్ అచ్చా జగదీశ్వర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ ఈ సందర్భం గా రాఖీ పర్వదినం విశిష్టతను విద్యార్థులకు అర్థమయ్యేలా వివరించారు.


రక్షాబంధన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న టీఎన్జీవో అధ్యక్షుడు ఆకుల రాజేందర్


టీఎన్జీవో నాయకులకు రాఖీలు కడుతున్న ఉద్యోగినులు

టీఎన్‌జీవోస్ యూనియన్ ఆధ్వర్యంలో..

హనుమకొండ కలెక్టరేట్ (ఆంధ్రజ్యోతి): టీఎన్‌జీవోస్ యూనియన్ ఆధ్వర్యంలో హనుమకొండ కలెక్టరేట్ ప్రాంగణంలో గురువారం రాఖీ పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగినులు టీఎన్‌జీవోస్ యూనియన్ నాయకులకు రాఖీలు కట్టి, స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా టీఎన్‌జీవోస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఆకుల రాజేందర్ మాట్లాడుతూ.. ఉద్యోగినులకు అనుక్షణం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామ న్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీవోస్ యూనియన్ జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షులు పుల్లూరు వేణుగోపాల్, కోశాధికారి పి.రాజేష్, గౌరవ అధ్యక్షులు శ్యాంసుందర్, కేంద్ర సంఘం నేతలు రామునాయక్, లక్ష్మీప్రసాద్, జిల్లా మహిళా నేతలు రాజ్యలక్ష్మి, పావని, శ్రీలత, శ్రీవాణి, ఇందిర, సరస్వతి, ప్రియదర్శిని, అశ్విని, మాధవి తదితరులు పాల్గొన్నారు.


కేయూలో రక్షాబంధన్ వేడుకల్లో ఎస్ఎఫ్ఐ నాయకులు

12 నుంచి 21 వరకు తీజ్

- అశోకా కాలనీలోని గిరిజన భవన్‌లో నిర్వహణ
- మాజీ ఎంపీ అజ్మీరా సీతారాం నాయక్


మాట్లాడుతున్న సీతారాం నాయక్

వడ్డెపల్లి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): బంజారా సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా తీజ్‌ను వైభవంగా నిర్వహించాలని మాజీ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్ అన్నారు. గురువారం హనుమకొండ అశోకా కాలనీలోని గిరిజన భవన్‌లో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రేటర్ వరంగల్ గోర్ బంజారా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో హనుమకొండలోని గిరిజన భవన్‌లో తీజ్ ఉత్సవాలు ఈ నెల 12 నుంచి 21 వరకు జరుగుతాయని తెలిపారు. తీజ్ పండగను రాష్ట్రపండుగగా ప్రభుత్వం గుర్తించి సెలవుదినంగా ప్రకటించాలని కోరారు. గ్రేటర్ వరంగల్ పరిధిలోని బంజారాలు తీజ్ వేడుకల్లో పాల్గొని విజయవంతం చేయాలని సీతారాం నాయక్ కోరారు. ఈ సమావేశంలో నిర్వహణ కమిటీ ప్రతినిధులు వినోద్ లోక్‌నాయక్, గుగులోతు రాజునాయక్, జాటోత్ ధర్మనాయక్, మాలోతు నాను, బాదావత్ బాలాజీ నాయక్, కేలోత్ భిక్షపతి, డుంగ్రోత్ కిశోర్, డాక్టర్ చందునాయక్, భూక్య రాజు, భూక్య సాంబయ్య, బోడ నరసింహ, భూక్య భద్ర, ధరావత్ కిషన్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

అవయవదానాన్ని మించింది లేదు


సర్టిఫికెట్‌ను ఇస్తున్న శరీరదాతల సంఘం ప్రతినిధులు

హసన్‌పర్తి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): అవయవదానాన్ని మించిన దానం ప్రపంచంలో మరొకటి లేదని తెలంగాణ నేత్ర అవయవ శరీరదాతల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కోన్‌రెడ్డి మల్లారెడ్డి అన్నారు. గ్రేటర్ 1వ డివిజన్ ముచ్చర్ల గ్రామానికి చెందిన చిర్ర సాయిలు గౌడ్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. మృతుడి కుటుంబ సభ్యులు నేత్రదానం చేయడానికి అంగీకరించారు. దీంతో ప్రాంతీయ నేత్ర వైద్యశాల వరంగల్ సిబ్బంది నేత్రాలను సేకరించారు. కాగా, గురువారం గ్రామంలోని సాయిలు గౌడ్ సంస్మరణ నిర్వహించగా కుటుంబసభ్యులను తెలంగాణ నేత్ర అవయవ శరీర దాతల అసోసియేషన్ ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించి అభినందనపత్రాన్ని అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ముఖ్య సలహాదారులు ఇంజనీర్ రవీందర్, ప్రధాన కార్యదర్శి ఆడెపు రాజేంద్రప్రసాద్, ప్రతినిధులు సాయిరెడ్డి, సంధ్య, కోటేశ్వర్ గౌడ్, సుజాత, స్వప్న, బంధుమిత్రులు, కళాకారులు పాల్గొన్నారు.

ఘనంగా టీయూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీయూటీఎఫ్) 15వ ఆవిర్భావ దినోత్సవాన్ని సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. గురువారం సుబేదారి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా గౌరవాధ్యక్షుడు కుందూరు విజయ్‌పాల్‌రెడ్డి జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 2011లో ఆనాటి ఏపీయూటీఎఫ్ సమైక్య వాదాన్ని తలకెత్తుకొని ప్రత్యేక తెలంగాణ వాదాన్ని వ్యతిరేకించిన సందర్భంలో తెలంగాణ వాదమే సిద్ధాంతంగా టీయూటీఎఫ్ ఏర్పడి రాష్ట్ర సాధనలో భాగస్వామి అయ్యిందన్నారు. అనంతరం విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యల సాధనకు నిరంతరం పాటుపడుతోందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు నూతకంటి బాబు, దామెర భిక్షపతి, లకుపతి, మధుసూదన్‌రెడ్డి, కృష్ణమూర్తి, వీరస్వామి, దేవానందం, బాలవద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

అక్షరాస్యులను చేయాలి

సెక్టోరల్ ఆఫీసర్ బద్దం సుదర్శన్‌రెడ్డి

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లాలో ఉల్లాస్ కార్యక్రమం ద్వారా 15 ఏళ్లు నిండిన వయోజనులైన నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని సెక్టోరల్ ఆఫీసర్ బద్దం సుదర్శన్‌రెడ్డి అన్నారు. హనుమకొండలోని సుబేదారి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉల్లాస్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో 100 శాతం అక్షరాస్యత సాధించేందుకు ప్రతీ ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వయోజన విద్యాధికారి టి.రమేష్‌రెడ్డి, ఎంఈవో నెహ్రూనాయక్, ఆర్పీలు మధుసూదన్‌రెడ్డి, సంపత్‌కుమార్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

జూడో పోటీలో గురుకుల విద్యార్థినుల ప్రతిభ

మడికొండ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): వరంగల్ కెమిస్ట్రీ భవన్‌లో ఈనెల 5 నుంచి 7 వరకు మూడు రోజుల పాటు జరిగిన జూడో పోటీల్లో మడికొండ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థినులు ప్రతిభ కనబరిచి బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించారని గురువారం ప్రిన్సిపాల్ దాసరి ఉమామహేశ్వరి తెలిపారు. వారిలో కె.దీపిక, ఎన్.నిరీక్షణ, కె.రేవతి, కె.కృప బంగారు పతకాలు, టి.ఆశ్రిత, పి.సహస్ర, కె.రేవతి, కె.కృప వెండి పతకాలు, మధుప్రియ, టి.వైష్ణవి, కె.సహజ, రహీల కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారని పేర్కొన్నారు. ఈసందర్భంగా జూడో క్రీడాకారులను, కోచ్ నాగరాజు, పీడీ జి.పద్మ, పీఈటీ జె.సరిత, ఉపాధ్యాయులు ప్రిన్సిపాల్ అభినందించారు.

22న కేయూ

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం ఎన్నికలు

కేయూ క్యాంపస్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం ఎన్నికలు ఈనెల 22న నిర్వహిస్తారు. దీనికి సంబంధించిన ఎన్నికల నోటిఫికేషన్‌ను గురువారం కేయూ పరీక్షల నియంత్రణాధికారి, ఎన్నికల రిటర్నింగ్ అఫీసర్ ప్రొఫెసర్ కట్ల రాజేందర్ విడుదల చేశారు. 2025-28 ఏడాది కాలపరిమితికి ఎన్నికల జరుగుతాయని తెలిపారు. అధ్యక్షుడు, ఇద్దరు ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి, ఇద్దరు సంయుక్త కార్యదర్శులు, కోశాధికారితో పాటు మరో 8 మంది కార్యవర్గ సభ్యులను ప్రతినిధులుగా ఎంపిక చేయనున్నట్లు వెల్లడిం చారు. ఆగస్టు 12న ఎన్నికల షెడ్యూల్ వెలువరిస్తామని చెప్పారు. 12న సాయం త్రం 5 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ చేపడుతామని తెలిపారు. 13న నామినేషన్ల సాయంత్రం 4 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందన్నారు. 22న పోటీలో ఉన్న అభ్యర్థులకు ఉదయం 11 గంటల నుంచి సాయం త్రం 2 గంటల వరకు ఎన్నికలు నిర్వహించి సాయంత్రం 6 గంటలకు ఫలితాల ను వెల్లడిస్తామని చెప్పారు. వర్సిటీ క్యాంపస్ కళాశాల, సుబేదారిలోని యూనివ ర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, కొత్తగూడెంలోని యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్నికల పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.

పలు రైళ్లకు బోగీల పెంపు

కాజీపేట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : రైల్వే ప్రయాణికుల రద్దీ దృష్ట్యా పలు రైళ్లకు బోగీలు పెంచుతున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. (12705/6) గుంటూరు నుంచి సికింద్రాబాద్ మధ్య నడిచే ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌కు అప్ అండ్ డౌన్ ట్రిప్పులకు చైర్‌కార్, 01, 3ఏ (ఈ)- 01 రెండు బోగీలను ఈ నెల 12 నుంచి పెంచుతున్నారు. (12757/58) సికింద్రాబాద్ - సిర్పూర్ కాగజ్‌నగర్‌ల మధ్య నడిచే కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ రైలుకు అప్ అండ్ డౌన్ ట్రిప్పులకు 3ఏ (ఈ)-01 ఒక బోగీని ఈ నెల 11 నుంచి పెంచుతున్నట్లు రైల్వే అధికారులు చెప్పారు.

వ్యవసాయ విద్యతో ఉజ్వల భవిష్యత్

హసన్‌పర్తి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఏరువాక కేంద్రం సైంటిస్టు డాక్టర్ నాగభూషణం అన్నారు. మండలంలోని సీతంపేట గ్రామ పంచాయతీ ఆవరణలో గురువారం వరంగల్ వ్యవసాయ కళాశాల రావెప్-2025 కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ అగ్రికల్చర్ యూనివర్సిటీ వ్యవసాయ కళాశాల వరంగల్‌కు చెందిన ఆరుగురు విద్యార్థులు గ్రామంలో సోషల్ మ్యాపింగ్, రిసోర్స్ మ్యాపింగ్, ట్రాన్సెక్టు వాక్, సీజనాలిటీ డయాగ్రాం, సమస్యలు, పరిష్కారాలు వంటి అంశాలపై విశ్లేషణ చేశారు. ఈ సందర్భంగా ఏరువాక కేంద్రం సైంటిస్టు డాక్టర్ నాగభూషణం ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులు ప్రదర్శించిన పలుప్రదర్శనలు సందర్శించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాబోయే కాలంలో వ్యవసాయ రంగంలో అనేక మార్పులు రానున్నాయన్నారు. మార్పులకనుగుణంగా వ్యవసాయాన్ని లాభదాయకంగా చేసే విధంగా రైతులకు మెళకువలు నేర్పించాల్సిన బాధ్యత వ్యవసాయ విద్యార్థులపైనే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాథాలజీ శాఖాధిపతి డాక్టర్ విజయభాస్కర్, విస్తరణ శాఖ కోఆర్డినేటర్ డాక్టర్ విశ్వతేజ, డాక్టర్ కిశోర్, పాథాలజీ శాఖ ఇన్‌చార్జి డాక్టర్ గోపిక, పంచాయతీ కార్యదర్శి హరిత, ఉత్తమ రైతు ఆదిరెడ్డి, రైతులు, వ్యవసాయ కళాశాల విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.


గ్రామ సభలో పాల్గొన్న విద్యార్థులు, సైంటిస్టులు

రోటరీ ఆధ్వర్యంలో బ్యాగుల పంపిణీ


బ్యాగులతో స్కూల్ పిల్లలు

న్యూశాయంపేట, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ హనుమకొండ ఆధ్వర్యంలో హనుమకొండ న్యూశాయంపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు 2000 స్కూల్ బ్యాగ్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు బేతి రవీందర్‌రెడ్డి, కార్యదర్శి గం గోజుల నరేష్, కోశాధికారి మిరియాల రాజ్‌కుమార్, అసిస్టెంట్ గవర్నర్ సందసాని నరేష్, రోటరీ సభ్యులు, వివిధ పాఠశాలల హెడ్మాస్టర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు నీటి సరఫరా బంద్

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): అమ్మవారిపేట వద్ద పైపులైన్ పనులు జరుగుతున్న నేపథ్యంలో శుక్రవారం నీటి సరఫరా బంద్ చేస్తున్నట్టు గ్రేటర్ వరంగల్ కాశిబుగ్గ సర్కిల్ కార్యాలయం ఈఈ సంతోష్ బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా కరీమా బాద్, శివనగర్ ప్రాంతంల్లో నీటి సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. ప్రజలు గుర్తుంచుకుని అధికారులకు సహకరించాలని సంతోష్‌బాబు తెలిపారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి


- జిల్లా లీగల్ సర్వీస్ జడ్జి క్షమాదేశ్ పాండే
- జువైనల్ జస్టిస్ చట్టాలపై అవగాహన సదస్సు

కేయూ క్యాంపస్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చిన్నతనం నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా లీగల్ సర్వీసు జడ్జి క్షమాదేశ్‌పాండే కోరారు. డిస్ట్రిక్టు లీగల్ సర్వీసు అథారిటీ హనుమకొండ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా క్షమాదేశ్‌పాండే ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. జువైనల్ జస్టిస్ యాక్టు, బాల కార్మిక, బాల్య వివాహాలు నివారణ, యాంటీ ర్యాగింగ్, హ్యూమన్ ట్రాఫికింగ్‌లపై విద్యార్థులకు సూచనలు చేశారు. కేయూ పాలక మండలి సభ్యురాలు, మాజీ చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ చైర్మన్ డాక్టర్ కె.అనితారెడ్డి మాట్లాడుతూ.. చిన్నారులు నేరాల ప్రవృత్తికి దూరంగా ఉండాలని అన్నారు. పిల్లల వేధింపులపై 1098, 100లకు ఫోన్‌చేయాలని సూచించారు. పిల్లల హక్కులకు భంగం కలుగకుండా జాగ్రత్త వహించాలని అన్నారు. చట్టాలపై విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చూపిన వారికి బహుమతులను అందచేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీదేవి, న్యాయవాది గోపిక, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి క్షమాదేశ్ పాండే





పర్వదినం

సకల సంపత్కర వ్రతం

సృష్టిలో ఉన్న ఐశ్వర్యాలన్నీ లక్ష్మీ స్వరూపాలే. అవి అనంతాలు. ఆమె కృప కలిగినవారికి మానసిక, భౌతిక, ఆధ్యాత్మిక శ్రేయస్సు పుష్కలంగా లభిస్తుంది. సద్గుణాలు మానసికమైనవైతే, సంపదలు భౌతికమైనవి. పరాశక్తిని శ్రీమహాలక్ష్మిగా ఆరాధించి... ఆమె అనుగ్రహంతో లౌకిక, పారలౌకిక ప్రయోజనాలు ఎలా సాధించుకోవాలో మంత్రశాస్త్రాలు, వివిధ గ్రంథాలు విస్తారంగా తెలియజేశాయి. ఆ తల్లిని శ్రావణ మాసంలో 'వరలక్ష్మీ దేవి'గా పూజించడం అనాదిగా వస్తున్న సంప్రదాయం.

నేడు వరలక్ష్మీ శుక్రవారం

శ్రావణమాసంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారాన్ని 'వరలక్ష్మీ శుక్రవారం' అంటారు. ఈ రోజున వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు ఆచరిస్తారు. జగత్తులోని సకల ప్రాణులకు బతుకుతెరువు కల్పించేది శ్రీమహాలక్ష్మి. సకల సంపదలకు ఆమె అధిష్ఠాన దేవత. శ్రీహరికి ఆమె ప్రాణసమానురాలు. ఆమెను హృదయంలో ప్రతిష్ఠించుకున్నాడు. సస్య స్వరూపిణి అయిన ధాన్యలక్ష్మిగా, వైకుంఠంలో స్వర్గలక్ష్మిగా, గృహాలలో గృహలక్ష్మిగా, అలాగే జితేంద్రియగా, శాంతస్వరూపిణిగా, అరిషడ్వర్గాలనుంచి విముక్తి కలిగించే జ్ఞానప్రదాయినిగా ఆమెను పురాణాలు కీర్తించాయి. అయితే... అష్టైశ్వర్యాల కోసం అష్ట లక్ష్మీ రూపాలలోనే ఆమెను ఎక్కువగా భావన చేయడం, పూజించడం పరిపాటి. కాగా... 'సిద్ధలక్ష్మీ, మోక్షలక్ష్మీ, జయలక్ష్మీ, సరస్వతి, శ్రీలక్ష్మీ, వరలక్ష్మీ' అంటూ ఆరు రూపాలలో ఆమెను 'శ్రీసూక్తం' వర్ణించింది. సమస్త ఐశ్వర్యాలను, జయాన్ని, జ్ఞానాన్ని, ఐహిక-ఆముష్మిక సంపదలను వర్షించేది కాబట్టే ఆమెను వరలక్ష్మిగా ఆరాధిస్తున్నాం.

చారుమతిలా...

వరలక్ష్మీ వ్రతం గురించి పార్వతికి స్కందుని సమక్షంలో చెప్పినట్టు 'స్కాంద పురాణం'లో కథ ఉంది. స్కందుని ద్వారా సూతుడికి తెలిసిన ఈ కథ... ఆయన ద్వారా భూలోకంలో ప్రాచుర్యం పొందింది. 'వర' అంటే శ్రేష్ఠమైనది. ఈ వ్రతాన్ని ఆచరించడం వల్ల అనుకూలమైన భర్త లభిస్తాడని, గృహిణులు సకల సౌభాగ్యాలతో తులతూగుతారని నమ్మకం ఉంది. వరలక్ష్మీ వ్రత కథలో ప్రధాన పాత్ర చారుమతి అనే గృహిణి. ఆ వ్రతాన్ని ఆచరించిన ఆమె లక్ష్మీ అనుగ్రహాన్ని పొందింది. 'చారుమతి' అంటే 'చక్కని బుద్ధి' అని అర్థం. 'ఈ వ్రత విధానాన్ని అనుసరించి పూజలు చేసి, వ్రతకథను చెప్పుకొని లేదా విని... చారుమతి మాదిరిగా జీవితాలను తీర్చిదిద్దుకున్నవారు సర్వ సంపదలు, పొందుతారు, సమాజంలో గౌరవప్రదమైన స్థానం లభిస్తుంది, కుటుంబ శ్రేయస్సు, సౌభాగ్యం కలుగుతాయి, జీవితాంతం ఆ వరలక్ష్మీదేవి ఆలంబన లభిస్తుంది' అనేది పెద్దల మాట.

• ఆయపిళ్ళ రాజపాప

సహజయోగ

ఆ బంధం... ఒక పవిత్ర శక్తి

"ఆధ్యాత్మిక ప్రయాణంలో మానవ సంబంధాలు అతి ముఖ్యమైనవి. మానవ సమాజాన్ని పూర్తిగా విడిచిపెట్టి, అడవులలోకి వెళ్ళి, ఏదో ఒక మంత్రాన్ని నిరంతరం జపిస్తే భగవంతుడి సాక్షాత్కారం లభిస్తుందని చాలామంది అనుకుంటూ ఉంటారు. కానీ సంఘంలో అందరితో కలిసి జీవిస్తూ, పవిత్రమైన మానవ సంబంధాలను ఆనందించినప్పుడే ఆత్మసాక్షాత్కారం త్వరగా, మరింత సులభంగా లభిస్తుందంటారు" శ్రీమాతాజీ నిర్మలాదేవి.



రేపు శ్రావణ పౌర్ణమి

రాఖీ... చూడడానికి కేవలం ఒక దారప్పోగే కానీ... దాని విలువ వెలకట్టలేని మమతల పెన్నిధి. పవిత్రమైన సోదరీ సోదర బంధానికి అది ప్రతీక. మహాభారతంలో ద్రౌపది, శ్రీకృష్ణుల అనుబంధం ఈ బంధం గొప్పతనాన్ని చాటిచెబుతుంది. నిండు సభలో... దుర్యోధనుడి ప్రోద్బలంతో ద్రౌపదీ వస్త్రాపహరణానికి దుశ్శాసనుడు ప్రయత్నించినప్పుడు... ద్రౌపది చేసిన ఆర్తనాదానికి... ఎక్కడో ద్వారకలో ఉన్న శ్రీకృష్ణుడు వచ్చి, ఆమె మర్యాదను కాపాడిన కథ ప్రసిద్ధమైనది. ద్రౌపదిపై శ్రీకృష్ణుడికి ఉన్న సోదరీ ప్రేమకు ఇది నిదర్శనం. అలాగే... చరిత్రలో మరో ఉదంతం ఉంది. భారతదేశంపై దండెత్తి వచ్చిన అలెగ్జాండర్‌ను పురుషోత్తముడనే రాజు బంధిస్తాడు. భారతీయ సంప్రదాయాల గురించి తెలిసిన అలెగ్జాండర్ భార్య ఒక రాఖీని పురుషోత్తముడికి బహుమతిగా పంపిస్తుంది. వెంటనే అలెగ్జాండర్‌ను పురుషోత్తముడు చెర నుంచి విడుదల చేస్తాడు. పురుషోత్తమునిలో అకస్మాత్తుగా వచ్చిన ఈ మార్పునకు కారణం... తన భార్య పంపిన రాఖీ అని తెలుసుకున్న అలెగ్జాండర్ ఆశ్చర్యపోతాడు. సంస్కృతి సంప్రదాయాలకు, సోదర సోదరీ బంధానికి భారతీయులు ఇచ్చే విలువను గ్రహిస్తాడు. రక్షాబంధన్ ప్రాశస్త్యం గురించి శ్రీ మాతాజీ నిర్మలాదేవి వివరించిన మరో సంఘటన ఛత్రపతి శివాజీ జీవితానికి సంబంధించినది.



తానాజీ వీరత్వం...

సింహగడ్ రాజకుమారి కమలకుమారి నుంచి శివాజీ తల్లి జిజియాబాయికి ఒక లేఖ అందుతుంది. శివాజీని తన సోదరుడిగా కమలకుమారి సంబోధిస్తూ... తను ఆపదలో ఉన్నానని, తనను రక్షించాలని కోరుతుంది. మరునాటి సూర్యోదయం లోపున తనను కాపాడకపోతే... శత్రువుల వల్ల తన మానప్రాణాలకు ప్రమాదం అని తెలుపుతూ... ఒక రాఖీని కూడా పంపుతుంది. వెంటనే శివాజీని తన వద్దకు పిలిపించుకున్న జిజియాబాయి... మరునాడు ఉదయం లోపల సింహగడ్ కోటను జయించాలని ఆదేశిస్తుంది. ఆ బాధ్యతను తన సైన్యంలో ప్రముఖుడైన తానాజీకి శివాజీ అప్పగిస్తాడు. కమలకుమారి పంపిన రాఖీ గురించి విన్న తానాజీ ఒక్క రాత్రిలో ఆ కోటను జయిస్తాడు. అయితే యుద్ధం ముగిసేసరికి వీరమరణం పొందుతాడు. రాఖీకి విలువను ఇచ్చి ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పోరాడిన తానాజీ వీరత్వం భారత దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖితమయింది.

> మానవుల సంఘ జీవితాన్ని వారి సూక్ష్మ శరీరంలోని విశుద్ధ చక్రం నిర్దేశిస్తుంది. అందరితో పవిత్రమైన సంబంధ బాంధవ్యాలను కలిగి ఉండి, వాటిని ఆనందించేవారిలో ఈ చక్రం ఆరోగ్యంగా ఉంటుంది. దీనివల్ల మనిషి తన జీవితంలో ఎదురయ్యే రకరకాల ఒడుదొడుకులను తట్టుకొని నిలిచే స్థితప్రజ్ఞత పొందుతాడు.

ఎన్నో సమస్యలకు పరిష్కారం...

మానవుల సంఘ జీవితాన్ని వారి సూక్ష్మ శరీరంలోని విశుద్ధ చక్రం నిర్దేశిస్తుంది. అందరితో పవిత్రమైన సంబంధ బాంధవ్యాలను కలిగి ఉండి, వాటిని ఆనందించేవారిలో ఈ చక్రం ఆరోగ్యంగా ఉంటుంది. దీనివల్ల మనిషి తన జీవితంలో ఎదురయ్యే రకరకాల ఒడుదొడుకులను తట్టుకొని నిలిచే స్థితప్రజ్ఞత పొందుతాడు. "ఈ స్థితికి చేరాలంటే... స్త్రీ పురుషులు తమ జీవిత భాగస్వాములను తప్ప మిగిలినవారి పట్ల సోదర-సోదరీభావం కలిగి ఉండాలి. అటువంటి పవిత్రమైన మానవ సంబంధాలు స్థిరపడినప్పుడే నేటి సమాజంలో మనం ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు పరిష్కారం లభిస్తుంది" అని వెల్లడించారు శ్రీ మాతాజీ. మన అంతర్గత సూక్ష్మ శరీర వ్యవస్థలోని విశుద్ధ చక్రంలో ఎడమవైపున.. సోదరి తత్త్వానికి ప్రతీకగా శ్రీవిష్ణుమాయ నెలకొని ఉంటుంది. అందుకే సహజయోగ ధ్యాన సాధన చేస్తున్న ప్రతిఒక్కరూ ఈ సోదర, సోదరీ బంధాన్ని పవిత్ర శక్తిగా భావిస్తారు. తమ దైనందిన జీవితంలో దానికి అనుగుణంగా నడుచుకుంటారు. రాఖీ పండుగను ప్రపంచవ్యాప్తంగా... సామూహికంగా జరుపుకొంటారు.



డాక్టర్ పి. రాకేష్, 8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్', తెలంగాణ

నిజమైన స్వాతంత్ర్యం కోసం...

"మనిషికి అతని చైతన్యం మీద ఉండే ప్రభావాలు మాయమైతేనే అతనికి నిజమైన స్వాతంత్ర్యం వస్తుంది. సత్యాన్ని గ్రహించే శక్తి కలుగుతుంది. ఆధ్యాత్మిక ప్రపంచ ద్వారం తెరుచుకుంటుంది" అంటారు జిడ్డు కృష్ణమూర్తి. పెంపకం, సమాజం, చరిత్ర లాంటి ఎన్నో ప్రభావాలు మనమీద ఉంటాయి. శ్రమపడి వాటిని వదిలించుకోవచ్చు. అయితే అవి మనల్ని పూర్తిగా వదిలిపెట్టవు. మన చైతన్యంలోని గాఢమైన లోతుల్లో... మనం సులువుగా గుర్తించలేని, ఘనీభవించిన మూడు ప్రభావాలు ఉంటాయి, అవి: ఆలోచనా ప్రక్రియ, కాలం, అహంకారం. ఇవి కూడా మనల్ని వదిలినప్పుడే మనకు నిజమైన స్వాతంత్ర్యం వస్తుంది.

ఆలోచన...

మనం నిరంతరం ఆలోచిస్తూ ఉంటాం. నిద్రలో కూడా ఆలోచనలను కలల రూపంలో కొనసాగిస్తాం. వాటిని అరికట్టాలనే నిర్ణయం తీసుకుంటే... దానిలోంచే రకరకాల ఆలోచనలు పుట్టుకొస్తాయి. ఇది మన అదుపులో లేని నిరంతర కార్యక్రమం. దీనికి కారణం ఏమిటి? ఒక ఉదాహరణకు... నిన్న సాయంత్రం రమ్యమైన సూర్యాస్తమయాన్ని ఆనందించాను. ఆ ఆనందాన్ని కొనసాగించాలనే ధ్యేయంతో, వీలైతే ఆ ఆనందం మరోసారి అనుభవించాలనే కోరికతో నేను ఆ సూర్యాస్తమయం గురించి ఆలోచిస్తూ ఉంటాను. ఆలోచన సుఖ సూత్రంతో (ప్లెజర్ ప్రిన్సిపల్) ముడిపడి ఉంటుంది. అలాగే "మనం కష్టాలను, దుఃఖాలను తప్పించుకోవాలని అనుకుంటాం. అందువల్ల కూడా మనం ఆలోచిస్తూ ఉంటాం. ఆ ఆలోచనల్లో కాలం, అహంకారం పుడతాయి" అని చెబుతారు జిడ్డు కృష్ణమూర్తి.

కాలం...

సూర్యాస్తమయాన్ని చూస్తున్నప్పుడు... చైతన్యంలో ఆ అనుభవం మాత్రమే ఉంటుంది, కాలం ఉండదు. ఆ తరువాత దాని గురించి ఆలోచిస్తున్నప్పుడు... "నిన్న సాయంత్రం సూర్యాస్తమయాన్ని అనుభూతి చెందాను. వచ్చే ఆదివారం మళ్ళీ అది అనుభవించాలి" అనే ఆలోచనలతో... గతం, భవిష్యత్తు- అంటే కాలం పుడుతుంది.

అహం...

ఒక ప్రబలమైన అనుభవంలో నిజానికి 'నేను' లేదా 'అహం' అనే స్ఫురణ ఉండదు. ఉత్త అనుభవం మాత్రమే ఉంటుంది.

చింతన



దాని గురించే ఆలోచిస్తూ ఉన్నప్పుడు 'అహం' పుడుతుంది. 'సూర్యాస్తయమాన్ని నిన్న సాయంత్రం అనుభవించాను, వచ్చే ఆదివారం మళ్ళీ అనుభవించాలి' అని బయలుదేరే ఆలోచనల్లో అహం పుట్టి, అది ఒక కేంద్రంగా మారుతుంది. ఈ సత్యాన్ని ప్రప్రథమంగా చెప్పినవారు జిడ్డు కృష్ణమూర్తి. అలా పుట్టిన అహం... చైతన్యాన్ని కేంద్రం, పరిధులుగా విభజిస్తుంది. అన్ని అనుభవాలు కాలంతో కలిసి, జ్ఞాపకాలుగా మారి అహాన్ని పెనవేసుకుంటాయి. ప్రభావాలను సంపూర్ణంగా వదిలించుకోవాలంటే... ఆలోచనలను, కాలాన్ని, 'నేను' అనే భావాన్ని నిర్మూలించాలి. ఇదే జిడ్డు కృష్ణమూర్తి చెప్పే డీకండిషనింగ్. మంత్రోపదేశాలతో, దీక్షలతో, దీర్ఘమైన తపస్సులతో, కఠోరమైన వ్రతాలతో ఇది వీలుకాదనే విషయాన్ని ఆయన విశ్లేషించి చూపారు. శాస్త్రాల మార్గం అహంతో ముడిపడి ఉంటుంది. "పక్షమో, ఆరు నెలలో సాధన చేస్తే ఫలితం భవిష్యత్తులో కనిపిస్తుంది" అంటుంది సంప్రదాయం. "సాధన వల్ల సాధకుడిలో క్రమంగా కుండలినీ శక్తి మేలుకొని, షట్చక్రాలను ఛేదిస్తూ... సహస్రారాన్ని చేరినప్పుడు చైతన్య విస్తరణ జరుగుతుంది" అంటుంది శాస్త్రం. అంటే ఈ సాధన ఆలోచన, కాలం పరిధులలో ఉంటుంది. కానీ "ఈ కుండలినీ శక్తి కాలానికి, ఆలోచనలకు, అహంకారానికి అతీతమైనది" అని ఆ శాస్త్రమే చెబుతుంది. అంటే శాస్త్రం తనను తానే ఖండించుకుంటోంది. ఇదే జిడ్డు కృష్ణమూర్తి చేసిన విమర్శ. "సంప్రదాయ మార్గం నిరర్థకం. ఆ ప్రభావాలన్నింటినీ ఒక్క క్షణంలో ధ్వంసం చేయాలి. అహంకారం బాంబులా పేలి, రెప్పపాటులో మాయమైపోవాలి" అంటారాయన.

అది ఎలా సాధ్యం?

సూర్యాస్తమయాన్ని చూస్తున్న క్షణంలో... ఆలోచనలు మాయమైపోతాయి, కాలం, అహం తాలూకు స్పృహ ఉండదు. సూర్యుడు, చైతన్యం ఒక్కటైపోతాయి. ఆ అనుభవాన్ని అక్కడితో పరిసమాప్తి చేయాలి. లేకుంటే... దానినుంచి ఆలోచనాపరంగా దూరమవుతున్నప్పుడు... కాలం, అహం తలెత్తుతాయి. చైతన్యాన్ని కబ్జా చేస్తాయి. కాగా... 'తీవ్రమైన అనుభవం కావాలి' అనే ఉద్దేశంతో... ఒక కొండ మీద కూర్చొని, సూర్యాస్తమయం కోసం ఎదురు చూడడం కూడా నిరర్థకమే. ఆ ఉద్దేశం... కాలంతో, అహంతో ముడిపడిన ఆలోచనే కదా! ఆనందకరమైన అనుభవాల విషయంలోనే కాదు... ప్రతి అనుభవ స్వరూపమూ ఇంతే. క్రోధంలో క్రోధం ఒక్కటే ఉంటుంది. ఆలోచన, కాలం, అహం మాయమైపోతాయి. అసూయ, ద్వేషం, దుఃఖం లాంటి అనుభవాలు కూడా ఇంతే. 'మంచి అనుభవం, చెడ్డ అనుభవం' అనే భేదం ఉండదు. మనకు తారసిల్లే అనుభవాలకు మనం నిష్పాక్షికంగా లొంగిపోయి, వాటిలో లీనమైపోవాలి. అలా లీనమైన క్షణంలోనే ఆధ్యాత్మిక రహస్యాలన్నీ దాక్కొని ఉన్నాయి. ఆ క్షణంలోనే నిజమైన డీకండిషనింగ్ జరుగుతుంది, సంపూర్ణ స్వాతంత్ర్యం దొరుకుతుంది.

• గుంటూరు వనమాలి (www.gunturu.de)

విశేషం

మన దేశంలో సజ్జనులను ఉద్ధరించడానికి అనేకమంది మహనీయులు అవతరించారు. వారిని గురువులుగా... పూజ్యభావంతో మనం ఆరాధిస్తాం. అటువంటి గురువులలో శ్రేష్ఠుడు మంత్రాలయ ప్రభువైన శ్రీ రాఘవేంద్రస్వామి. స్వార్థ చింతన లేకుండా, సజ్జనులను సరైన మార్గంలో నడిపించడానికి, భగవంతుడిపై భక్తి భావాన్ని పెంపొందించడానికి భగవంతుడు పంపించిన దూత ఆయన. నేటి నుంచి ఈ నెల 12వతేదీ వరకూ 'శ్రీరాఘవేంద్రస్వాముల సప్తరాత్రోత్సవాలు' (ఆరాధనోత్సవాలు) మంత్రాలయంలో జరుగుతాయి.

సత్య ధర్మ స్వరూపుడు... శ్రీరాఘవేంద్రుడు

శ్రీరాఘవేంద్రస్వామివారి ఇంటి దైవం లక్ష్మీ వేంకటేశ్వరుడు. సంస్థాన పూజ చేసేది శ్రీరాముడికి. అయినప్పటికీ ఆయనకు శ్రీకృష్ణుడు అంటే అమితమైన ప్రీతి, భక్తి. ఒకసారి సంచారంలో భాగంగా ఆయన ఉడుపికి వెళ్ళారు. అక్కడ శ్రీమధ్వాచార్యులు స్థాపించిన శ్రీకృష్ణ విగ్రహం ముగ్ధ మోహన రూపాన్ని చూసి సంతోష పరవశులయ్యారు. ఉడుపిలోనే కొన్ని రోజులు ఉన్నారు. శ్రీకృష్ణుడి సన్నిధిలో (బ్రహ్మ సూత్రాలకు వ్యాఖ్యానంగా) 'తంత్రదీపిక', 'న్యాయముక్తావళి' అనే గ్రంథాలను రాశారు. 'చంద్రికా ప్రకాశ' అనే అద్భుతమైన టిప్పణి వ్రాశారు. అంతేకాదు.. ద్వైత సిద్ధాంత వాఙ్మయంలో మేరుకృతి అనిపించుకున్న, శ్రీ మధ్వాచార్యుల వ్యాఖ్యానానికి టీకగా శ్రీజయతీర్థులు రచించిన 'శ్రీమన్న్యాయసుధ'కు 'పరిమళ' అనే టిప్పణిని రచించి, శ్రీకృష్ణునికి సమర్పించారు.

స్వామి కీర్తనకు శ్రీకృష్ణ నర్తనం

ఒకరోజు మధ్యాహ్నం ఉడుపిలోని శ్రీకృష్ణుని గుడిలో శ్రీరాఘవేంద్రులు ధ్యానంలో మునిగి ఉన్నారు. ఉన్నట్టుండి గర్భగుడిలో అపూర్వమైన కాంతి కనిపించింది. మంజులమైన గజ్జెల శబ్దం వినిపించింది. శ్రీకృష్ణపరమాత్మ తనకు దర్శనం ఇవ్వబోతున్నారని శ్రీరాఘవేంద్రులకు అనిపించింది. ఆయన తన పక్కనే ఉన్న వీణను తీసుకొని శ్రావ్యంగా మీటసాగారు. అప్పుడు ఆయన నోటి నుంచి "ఇందు ఎనగె గోవిందా, నిన్నయ పాదారవిందవ తోరో ముకుంద ఇందిరా రమణ" (ఈ రోజు నాకు నీ పాదారవిందములను చూపించు ఇందిరా రమణా, ముకుందా) అనే అద్భుతమైన కృతి వెలువడింది. శ్రీ రాఘవేంద్రులు ఆనందంతో పాడుతూ, మధురంగా వీణ వాయిస్తూ ఉంటే... జగన్మోహనాకారుడైన బాలకృష్ణుడు ఆయనకు తన దివ్య మంగళరూపాన్ని అనుగ్రహించాడు. తను వేణుగానం చేస్తూ, బుడిబుడి అడుగులతో చుట్టూ నర్తించాడు. అనంతరం శ్రీరాఘవేంద్రులకు అభయప్రదానం చేసి అదృశ్యుడయ్యాడు. భగవంతుని దర్శనంతో పులకించిపోయిన ఆయన ఆనందబాష్పాలు రాలుస్తూ... దేవుణ్ణి పలు విధాలుగా స్తుతించారు.

భజతాం కల్పవృక్షాయ... నమతాం కామధేనువే

"నిస్వార్థమైన జీవనం మానవులను గొప్పవారిగా నిలబెడుతుంది. శ్రీరాఘవేంద్రస్వామిలో ఎటువంటి స్వార్థమూ లేదు. అందుకే వారిని 'భజతాం కల్పవృక్షాయ' అని స్తుతిస్తాం" అని చెప్పారు శ్రీసువిద్యేంద్రతీర్థులు. ఒక వృక్షం రుచికరమైన ఫలాలను ఇతరులకు అందిస్తుంది కానీ తాను వాటిని తినదు. నదిలోని నీరు ఏ విధమైన భేదభావం లేకుండా అన్ని ప్రాణులకూ దాహార్తిని తీరుస్తుంది. అదే విధంగా శ్రీరాఘవేంద్రులు ఎలాంటి ఫలాపేక్ష, ఎటువంటి భేదభావం లేకుండా సకల సజ్జనులను కరుణిస్తారు. ఆవు నీరు, గడ్డి మాత్రమే స్వీకరించి, మనకు అమృతంలాంటి పాలను అందిస్తుంది. మనిషి ఒక వయసు వచ్చాక తల్లి పాలు తీసుకోవడం మానేస్తాడు. కానీ పశువులు ఇచ్చే పాలను జీవితాంతం స్వీకరిస్తూనే ఉంటాడు. శ్రీరాఘవేంద్రులు కూడా ఆయన పట్ల మనం చూపించే భక్తి విశ్వాసాలకు బదులుగా మనల్ని కరుణిస్తారు" అంటారు 'హరికథామృతసారం'లో జగన్నాథదాసులు. అందుకే భక్తుల కష్టాలను కడతేర్చి, సన్మార్గం వైపు నడిపించే కల్పవృక్షంగా, కామధేనువుగా శ్రీరాఘవేంద్రులు పేరు పొందారు.

మహిమల పరమార్థం

చదువురాని వెంకన్న ఆదోని సంస్థానం దివాన్ అయ్యాడన్నా, పెద్ద గంగాళంలోని మామిడిపండ్ల రసంలో పడి మరణించిన శిశువు బ్రతికిందన్నా, స్వగ్రామానికి బయలుదేరిన ఒక శిష్యుడు కేవలం శ్రీరాఘవేంద్రులు ఇచ్చిన మృత్తికతో ఒక పిశాచాన్ని సంహరించి సంపన్నుడయ్యాడన్నా... ఇలాంటి అనేక మహిమల వెనుక స్వామివారి ముఖ్యోద్దేశం.... భగవంతుడి ఉనికిని, గొప్పతనాన్ని జనులకు తెలియపరచడం. "అంతా సర్వోత్తముడైన శ్రీహరి సంకల్పానుసారమే జరుగుతుంది తప్ప నాకు ఎలాంటి మహిమ లేదు" అని చెప్పిన నిరాడంబరులైన భాగవతోత్తములు శ్రీ రాఘవేంద్రులు. తత్త్వజ్ఞానం, హరిభక్తి, పరిశ్రమ, పరోపకారబుద్ధి... ఇలాంటివన్నీ మనం కూడా అలవరచుకోవాలనేది ఆయన ఆశయం.



> ఒక వృక్షం రుచికరమైన ఫలాలను ఇతరులకు అందిస్తుంది కానీ తాను వాటిని తినదు. నదిలోని నీరు ఏ విధమైన భేద భావం లేకుండా అన్ని ప్రాణులకూ దాహార్తిని తీరుస్తుంది. అదే విధంగా శ్రీరాఘవేంద్రులు ఎలాంటి ఫలాపేక్ష, ఎటువంటి భేదభావం లేకుండా సకల సజ్జనులను కరుణిస్తారు.

• శ్రీ మధ్వ ప్రచార పరిషత్

జెన్ కథ

గురువు చూపిన దారి



ప్రతి గురువు తనకు తెలిసిన సాధనా పద్ధతులను శిష్యులకు బోధిస్తాడు. శిష్యులలో కొందరు వాటిని తీవ్రంగా సాధన చేస్తారు. కఠోరమైన తపస్సు చేసిన వారి చుట్టూ పుట్టలు పెరగడం, చుట్టూ జంతువులు, పక్షులు సంచరించడం లాంటి కథలు కూడా ఉన్నాయి. అలాంటి ఒక శిష్యుడి కథ ఇది.

ఒక జెన్ గురువు ఆశ్రమంలో ఎందరో శిష్యులు ఉండేవారు. వారందరూ గురువు సూచన మేరకు సాధన చేసేవారు. వారిలో ఒకరికి జిజ్ఞాస చాలా ఎక్కువగా ఉండేది. ఎంతో ఎక్కువ దీక్షతో తపస్సు, ధ్యానం చేసేవాడు. అతను రోజుల తరబడి కదలకుండా, మెదలకుండా ధ్యానంలో ఉండిపోవడంతో... గడ్డాలు, మీసాలు పెరిగిపోయాయి. జుట్టు బాగా పెరిగి జడలు కట్టింది. అతని దేహం మీద పురుగులు పారాడడం, పాములు ప్రాకడం మొదలుపెట్టాయి. రకరకాల జంతువులు అతనికి దగ్గరగా వచ్చి కూర్చొనేవి. అతని తలపై పక్షులు గూడు కట్టుకొని నిర్భయంగా నివసించసాగాయి. అతను మామూలు స్థితిలోకి వచ్చినప్పుడు... ఇదంతా మౌనంగా గమనించేవాడు తప్ప ఏ పక్షినీ, ఏ పురుగునూ ఏమీ అనేవాడు కాదు.

ఆ వైపు వచ్చీ పోయే జనం అతణ్ణి గొప్ప యోగిగా, తపస్విగా భావించి ఎంతో గౌరవించేవారు. బాగా పొగిడేవారు. క్రమంగా తాను చాలా గొప్పవాడిననే భావం అతనిలో పెరిగింది. దాంతో అతని ధ్యానంలో తీవ్రత క్రమంగా తగ్గిపోసాగింది. ఈ సంగతి గురువుకు తెలిసింది. రాబోయే ప్రమాదం ఏమిటో గ్రహించిన గురువు ఇక ఏమాత్రం ఆలస్యం చేయకూడదనుకున్నాడు. సరాసరి ఆ శిష్యుడు కూర్చున్న చోటికి వెళ్ళాడు. ఆ సమయంలో శిష్యుడు కళ్ళు మూసుకొని ధ్యానంలో ఉన్నాడు. అతని చుట్టూ జంతువులు తిరుగుతున్నాయి. తలపైన ఉన్న గూడులోని పక్షులు తలలు బయటకు పెట్టి తొంగి చూస్తున్నాయి. అప్పుడు ఆ గురువు... తన శిష్యుణ్ణి రెండు చేతులతో గట్టిగా పట్టుకొని, బాగా కదిపాడు. గాఢ నిద్రలోంచి మేలుకొన్నవాడిలా శిష్యుడు గభాలున కళ్ళు తెరిచి చూశాడు. ఎదురుగా కనిపించిన గురువుకు గౌరవంగా నమస్కరించబోయాడు. గురువు కోపంతో "ఏమిటి ఇదంతా? తలపై ఈ గూడు ఏమిటి?" అంటూ దాన్ని గట్టిగా లాగేశాడు. పక్షులు తుర్రున ఎగిరిపోయాయి. గురువు అక్కడినుంచి వెళ్ళిపోయాడు.

కొద్దికాలంగా జరుగుతున్న సంఘటనలన్నీ శిష్యుడి కళ్ళ ముందు మెదిలాయి. తాను కదలకుండా కూర్చొని ధ్యానం చేయడం, పశుపక్ష్యాదులు తన చెంత చేరడం, తను వాటిని మౌనంగా పెంచి పోషించడం, అందరూ తనను పొగడడం, పూజించడం, తనలో గొప్పవాణ్ణనే అహంకారం వృద్ధి చెందడం, అది తన ఆధ్యాత్మిక పురోభివృద్ధికి ఆటంకంగా నిలవడం... అన్నీ గుర్తుకువచ్చాయి. గురువు సరైన సమయంలో వచ్చి, మందలించడం వల్ల తనకు తప్పిన ప్రమాదం ఏమిటో, కలిగిన శ్రేయస్సు ఏమిటో. తనకు ఆయన చూపిన దారి ఏమిటో స్పష్టంగా బోధపడింది. కరుణామూర్తి అయిన గురువు నడిచి వెళ్ళిన దిశలో నేలను చూశాడు. కంటి నుంచి నీరు కారుతూ ఉండగా... గురువు పాదముద్రలను తన చేతులతో తాకి, ఆ చేతులను తన హృదయంపై ఆనించి... గురువుకు మనసులోనే కృతజ్ఞత తెలియజేశాడు.

• రాచమడుగు శ్రీనివాసులు

చిత్రజ్యోతి
SINCE 1965

నాలుగో రోజూ షూటింగ్స్ బంద్

వేతనాలు పెంచాలన్న తమ డిమాండ్ నెరవేరే వరకూ షూటింగ్స్‌లో పాల్గొనేది లేదంటూ తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ బంద్ ప్రకటించిన సంగతి తెలిసిందే. సమ్మె ఫలితంగా నాలుగు రోజులుగా షూటింగ్స్ ఎక్కడిక్కడ నిలిచిపోయాయి. ఈ క్రమంలో ఫెడరేషన్ ప్రతినిధులతో నిర్మాతలు సమావేశమయ్యారు. ఫెడరేషన్ ముందు నిర్మాతలు నాలుగు ప్రతిపాదనలు ఉంచారు. అవి..ఫ్లెక్సిబుల్ కాల్‌షీట్లు(ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు; ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు) కాల్షీట్లు కావాలి, ఇక్కడ సరైన నిపుణులు లేనప్పుడు నాన్ మెంబర్స్‌తో కూడా పనిచేయించుకునే వెసులుబాటు ఉండాలి, షూటింగ్ ఎక్కడ చేసినా ఎలాంటి పరిమితులు ఉండకూడదూ, రెండో ఆదివారం, పండుగ రోజుల్లో పనికి మాత్రమే డబుల్ కాల్ షీట్, మిగిలిన ఆదివారాల్లో సింగిల్ కాల్‌షీట్ విధానం... ఈ నాలుగు ప్రతిపాదనలపై ఫెడరేషన్ తమ అభిప్రాయం చెబితేనే వేతన పెంపుపై ఒక నిర్ణయం తీసుకుంటామని నిర్మాతలు పేర్కొన్నారు. ఈ సమావేశం అనంతరం ఫెడరేషన్ నాయకుడు అనిల్ వల్లభనేని మాట్లాడుతూ 'నిర్మాతల వైపు నుంచి అందిన నాలుగు ప్రతిపాదనలపైనే చర్చ జరిగింది. రెండింటిని అంగీకరించాము. మరో రెండు ప్రతిపాదనలపై యూనియన్‌లో చర్చ జరగాలి. ఈ సమస్యను ఫిల్మ్ ఛాంబర్, ప్రొడ్యూసర్స్ కౌన్సిల్‌లోనే పరిష్కరించుకుంటాం. రెండ్రోజుల్లో ఛాంబర్ మీటింగ్ ఉండొచ్చు. చిరంజీవి, బాలకృష్ణ అందరికీ న్యాయం చేస్తారనే నమ్మకం ఉంది' అని అన్నారు. నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ 'సమస్య త్వరలోనే పరిష్కారమవుతుంది. నిర్మాతల ప్రతిపాదనలపైనే ప్రధానంగా చర్చ జరిగింది. దినసరి వేతనం తీసుకునే వారు ఎన్ని రోజులు పనిచేస్తారనేది ముఖ్యం. సాఫ్ట్‌వేర్ వాళ్లతో సినీ కార్మికులకు పోలిక అనవసరం. నిర్మాతలు, కార్మికులు సామరస్యంగా సమస్యను పరిష్కరించుకుంటారని నమ్ముతున్నాను' అని అన్నారు.

TFPC
తెలుగు చలనచిత్ర పరిశ్రమ

చిన్న సినిమాలకు వేతనాల పెంపు వర్తించదు: సి.కల్యాణ్

ఫెడరేషన్ నాయకులు - నిర్మాతల కోర్డినేషన్ మీటింగ్ జరుగుతుండగానే, చిన్న నిర్మాతలు నిర్మాత సి.కల్యాణ్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. కార్మికుల డిమాండ్లపై చర్చించారు. సమావేశం అనంతరం సి.కల్యాణ్ మీడియాతో మాట్లాడుతూ 'చిన్న చిత్రాలు లేకపోతే ఉపాధి లేదు. చిన్న నిర్మాతలు ఎవరితోనైనా పనిచేయించుకోవచ్చు. చిన్న సినిమాలకు వేతనాల పెంపు వర్తించదు. ఒక్క పైసా కూడా పెంచేందుకు వారు సిద్ధంగా లేరు. అలా అని కార్మికులను ఇబ్బంది పెట్టాలని ఏ నిర్మాత అనుకోరు' అని చెప్పారు.

నా విమర్శలు వ్యవస్థపైనే: టీజీ విశ్వప్రసాద్



సినిమా కార్మికులకు టాలెంట్ లేదంటూ అర్థం వచ్చేలా ఇటీవల తాను చేసిన వ్యాఖ్యలపై నిర్మాత టీజీ విశ్వప్రసాద్ వివరణ ఇచ్చారు. ఈమేరకు ఆయన ఒక లేఖ విడుదల చేశారు. 'హైదరాబాద్‌లో అపారమైన ప్రతిభ ఉంది. ప్రస్తుతం తెలుగు సినిమా రంగంలో పనిచేసే వారు సుమారు 60 శాతం నుంచి 70 శాతం వరకు హైదరాబాద్ నుంచే వస్తున్నారు. వీరి పాత్ర పరిశ్రమ అభివృద్ధికి ఎంతో కీలకం. నేను హైదరాబాద్ టాలెంట్‌ను తక్కువగా అంచనా వేశానన్న అభిప్రాయం పూర్తిగా తప్పు. నా విమర్శలు వ్యవస్థపై మాత్రమే, ప్రతిభపై కాదు. హైదరాబాద్‌లో టెక్నీషియన్లు, ఆర్టిస్టులు తెలుగు సినిమాకు ఎప్పటి నుంచో అండగా ఉన్నారు. వాళ్లను అడ్డుకునే వ్యవస్థల్ని తొలగించాలి. స్థానిక ప్రతిభకు అవకాశాలు కల్పించాలి' అని పేర్కొన్నారు.

టెక్నీషియన్లు నైపుణ్యం పెంచుకోవాలి: బన్నీ వాస్



తెలుగు సినిమా టెక్నీషియన్లకు సరైన నైపుణ్యాలు లేవని, అందుకే బయటి నుంచి నిపుణులను తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందంటూ వస్తున్న కామెంట్లపై నిర్మాత బన్నీ వాస్ స్పందించారు. 'సినీ కార్మికుల వేతనాల పెంపు డిమాండ్ న్యాయమైనదే. వేతనాలు పెంచి మూడేళ్లు అవుతోంది. కార్మికులు ఇప్పుడు ఎక్కువ అడుగుతున్నారు. టాలీవుడ్ అంతర్జాతీయ స్థాయికెళ్లింది. కానీ, ఎన్ని సినిమాలు ఆ స్థాయిని అందుకుంటున్నాయనేది గుర్తించాలి. అలాంటి పది చిత్రాలను దృష్టిలో పెట్టుకొని లెక్కలేసుకోవడం సరైంది కాదు. ప్రస్తుతం ధరలు పెరిగాయి. ఎంత చిన్న సినిమా అయినా రూ.12 కోట్ల బడ్జెట్ అవుతోంది. బ్లాక్‌బస్టర్ హిట్ అయితే తప్ప నిర్మాతలకు లాభాలు రావడం లేదు. అలాంటి చిత్రాలు ఎన్ని తీయగలరు? తెలుగు సినిమా టెక్నీషియన్లు తమ నైపుణ్యాలను పెంచుకోవాలి. పూర్తిగా మనవాళ్లతో అంతర్జాతీయ స్థాయి సినిమా తీయలేం. అందుకే బయటి నుంచి టెక్నీషియన్లను తీసుకొస్తున్నాం. మనవాళ్లు ఆ స్థాయిని అందుకొనే వరకు బయటి వారి రాక తప్పదు' అని అన్నారు.

డాన్స్ వార్



హృతిక్ రోషన్, జూనియర్ ఎన్టీఆర్ కథానాయకులుగా రూపొందిన బాలీవుడ్ చిత్రం 'వార్ 2'. అయాన్ ముఖర్జీ దర్శకుడు. ఈ నెల 14న తెలుగు, హిందీతో పాటు పలు భారతీయ భాషల్లో విడుదలవుతోంది. హృతిక్, ఎన్టీఆర్ ఇద్దరూ ప్రతిభావంతులైన డాన్సర్లే. 'వార్ 2' కోసం 'సలాం అనాలి' అంటూ సాగే గీతంలో వీరిద్దరూ పోటీపడుతూ స్టెప్పులేశారు. గురువారం మేకర్స్ ఈ పాట ప్రోమోను సోషల్ మీడియాలో విడుదల చేశారు. ఆదిత్యా చోప్రా నిర్మించిన ఈ చిత్రంలో కియారా అద్వాణీ కథానాయిక.

ఆబాల గోపాలాన్ని అలరించే చిత్రం



బెల్లంకొండ సాయి శ్రీనివాస్, అనుపమా పరమేశ్వరన్ జంటగా నటిస్తున్న చిత్రం 'కిష్కిందపురి'. కౌశిక్ పెగల్లపాటి దర్శకత్వంలో సాహు గారపాటి నిర్మిస్తున్నారు. చిత్ర బృందం మ్యూజిక్ ప్రమోషన్స్‌ను ప్రారంభించింది. గురువారం నిర్వహించిన కార్యక్రమంలో తొలి గీతాన్ని విడుదల చేసింది. ఈ రొమాంటిక్ డ్యూయెట్‌కు చైతన్ భరద్వాజ్ స్వరాలందించగా, పూర్ణాచారి సాహిత్యం అందించారు. జావేద్ అలీ ఆలపించారు. ఈ సందర్భంగా బెల్లంకొండ సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ 'ఆబాల గోపాలాన్ని అలరించే చిత్రమిది. ఈ హారర్ మిస్టరీ ఆద్యంతం ప్రేక్షకులను ఉత్కంఠకు గురిచేస్తుంది' అన్నారు. 'ఇది నా కెరీర్‌లో ప్రత్యేక చిత్రం. కొన్ని ఘట్టాలు చాలాకాలం పాటు ప్రేక్షకులకు గుర్తుండిపోతాయి' అని అనుపమా తెలిపారు. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తామని కౌశిక్ చెప్పారు.

ప్రేమ గీతం



ఆద్యంతం వినోద ప్రధానంగా సాగే ప్రేమ కథా చిత్రం 'ప్రేమిస్తున్నా'. భాను దర్శకత్వంలో పప్పుల కనకదుర్గారావు నిర్మిస్తున్నారు. సాత్విక్ వర్మ, ప్రీతి నేహా జంటగా నటించారు. తాజాగా ఈ చిత్రం నుంచి 'ఎవరే నువ్వు' అంటూ సాగే గీతాన్ని నటుడు విజయ్‌సేతుపతి విడుదల చేసి, సినిమా ఘన విజయం అందుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా భాను మాట్లాడుతూ "ప్రేమిస్తున్నా' కథ చాలా బావుందని విజయ్ సేతుపతి గారు మెచ్చుకున్నారు. ఇదొక కొత్త తరహా ప్రేమకథా చిత్రం. పాటలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి. ప్రతి ఒక్కరి హృదయాన్ని కదిలించే సున్నితమైన ప్రేమకథా చిత్రం ఇది. ప్రతి సన్నివేశం మనసులో నిలిచిపోయేలా ఉంటుంది" అని చెప్పారు.

రాజాగాడి లవ్‌స్టోరీ



తన ప్రేమను సఫలం చేసుకునేందుకు ఓ యువకుడు చేసిన ప్రయత్నాల నేపథ్యంలో రూపొందుతున్న ప్రేమకథా చిత్రం 'లిటిల్ హార్ట్స్'. మౌళి తనుజ్, శివానీ నాగరం జంటగా నటించారు. సాయిమార్తాండ్ దర్శకుడు. '90స్ మిడిల్ క్లాస్ బయోపిక్'తో గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు ఆదిత్య హాసన్ 'లిటిల్ హార్ట్స్'కు నిర్మాతగా వ్యవహరించారు. సెప్టెంబర్ 12న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. నిర్మాత బన్నీవాస్, వంశీ నందిపాటి విడుదల చేస్తున్నారు. గురువారం నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం 'రాజా గాడికి...' అంటూ సాగే గీతాన్ని విడుదల చేసింది. ఈ సందర్భంగా సాయిమార్తాండ్ మాట్లాడుతూ 'మౌళీ, ఆదిత్య హాసన్‌కు కథ నచ్చడంతో ఈ ప్రాజెక్ట్ పట్టాలెక్కింది. ప్రతి సన్నివేశం ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తుతుంది' అని చెప్పారు. ఆదిత్య హాసన్ మాట్లాడుతూ 'నిర్మాతగా నాకు చాలా సంతృప్తినిచ్చిన చిత్రమిది. ప్రేక్షకులు ఆద్యంతం కథతో మమేకమవుతారు. సినిమా చూస్తున్నంతసేపు నవ్వుతూనే ఉంటారు' అని చెప్పారు. 'ఈ సినిమాను నేను బాగా ఎంజాయ్ చేశాను. సాయిమార్తాండ్ సహజంగా తెరకెక్కించాడు' అని బన్నీవాస్ ప్రశంసించారు. ఈ కథ ఆద్యంతం హాస్యంతో నవ్విస్తుంది. వ్యంగ్యం, వినోదం కలబోసిన సినిమా ఇది అని వంశీ నందిపాటి అన్నారు.

తెలుగు ప్రేక్షకులకు నచ్చుతుంది



షనీల్ గౌతమ్ కథానాయకుడిగా నటించిన కన్నడ చిత్రం 'సు ఫ్రం సో'. జేపీ తుమినాడ్ దర్శకత్వంలో శశిధర్ శెట్టి నిర్మించారు. కన్నడనాట ఘన విజయం అందుకున్న ఈ చిత్రం మైత్రీ మూవీ మేకర్స్ ద్వారా నేడు తెలుగు ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా చిత్రబృందం గురువారం నిర్వహించిన ప్రీ రిలీజ్ కార్యక్రమంలో నిర్మాత నవీన్ యెర్నేని మాట్లాడుతూ "సు ఫ్రం సో' చిత్రం ప్రేక్షకులకు చక్కని వినోదం పంచుతుంది. తెలుగు ప్రేక్షకులకు అమితంగా నచ్చుతుంది' అన్నారు. శశిధర్ రెడ్డి మాట్లాడుతూ 'రీమేక్ కన్నా ఒరిజినల్ వెర్షన్ అయితే బావుంటుందని తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నాం. తెలుగులో 'సు ఫ్రం సో' చాలా పెద్ద హిట్ అవుతుంది' అని చెప్పారు. థియేటర్స్‌లో ఈ చిత్రాన్ని చూసి ఎంజాయ్ చేయండి అని తుమినాడ్ ప్రేక్షకులను కోరారు.

మవీర ఆగమనం



కన్నడ కథానాయకుడు ప్రజ్వల్ దేవ రాజ్ నటించిన తాజా చిత్రం 'కరావలి'. రాజ్ బి శెట్టి కీలకపాత్ర పోషించారు. ఆయన పాత్రను పరిచయం చేస్తూ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను మేకర్స్ గురువారం విడుదల చేశారు. పోరాటానికి సిద్ధమవుతున్నట్లుగా సీరియస్ లుక్‌లో ఆయన కనిపించారు. ఈ చిత్రంలో అత్యంత కీలకమైన మవీర అనే పాత్రకు రాజ్ బి శెట్టి ప్రాణం పోశారని దర్శకుడు గురుదత్ గనిగ తెలిపారు.

సినిమా షూటింగ్‌లకు గమ్యస్థానంగా తెలంగాణ

జయేష్ రంజన్



సింగిల్ విండో వ్యవస్థలో అన్ని సినిమా షూటింగ్ అవసరాల కోసం "ఫిల్మ్ ఇన్ తెలంగాణ" పోర్టల్ అభివృద్ధిని "వన్ స్టాప్ షాప్"గా అభివృద్ధి చేయడంతో సహా ఒక కార్యాచరణ ప్రణాళికను రూపొందించనున్నట్లు జయేష్ రంజన్ తెలిపారు. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, యువజనాభివృద్ధి, పర్యాటక, సంస్కృతిక శాఖ, ముఖ్యమంత్రి కార్యాలయంలోని పరిశ్రమలు, పెట్టుబడుల సెల్ సీఈవో జయేష్ రంజన్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఎంఐసీఈ అండ్ ఫిల్మ్ పర్యాటక రంగాలను మరింత బలోపేతం చేయడంతోపాటు ప్రోత్సహించడానికి స్టేక్ హోల్డర్ల సమావేశం గురువారం తాజ్‌కృష్ణలో నిర్వహించారు. పలు రంగాలకు చెందిన 40 మంది కీలక స్టేక్ హోల్డర్లు, పరిశ్రమల ప్రతినిధులు సమావేశమై రాష్ట్ర ఎంఐసీఈ పర్యాటక ప్రొఫైల్ అభివృద్ధికి సమగ్ర రోడ్‌మ్యాప్‌పై చర్చించారు. సినిమా షూటింగ్‌లకు తెలంగాణను అత్యంత స్నేహపూర్వక, తక్కువ పెట్టుబడులతో అత్యంత లాభదాయకమైన గమ్యస్థానంగా మార్చే అవకాశాలపై ఇందులో చర్చించారు. దీనిపై సమగ్ర కార్యాచరణ ప్రణాళికను ఆగస్టు చివరి నాటికి లేదా ప్రపంచ పర్యాటక దినోత్సవం (సెప్టెంబర్ 27) నాటికి ప్రకటిస్తామని జయేష్ రంజన్ తెలిపారు. తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజుతో కలిసి ఫిల్మ్ టూరిజం, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్(నిథిమ్)కు సంబంధించి స్టేక్ హోల్డర్ల సమావేశాన్ని కూడా నిర్వహించారు. ఈ సమావేశంలో పలు ప్రభుత్వ విభాగాల నుండి దాదాపు ఇరవై మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

-హైదరాబాద్, (ఆంధ్రజ్యోతి)

మేఘం వర్షించదా



విజయ రామరాజు కథానాయకుడిగా రూపొందుతున్న క్రీడానేపథ్య చిత్రం 'అర్జున్ చక్రవర్తి'. విక్రాంత్ రుద్ర దర్శకత్వంలో శ్రీని గుబ్బల నిర్మించారు. ఈ నెల 29న విడుదలవుతోంది. గురువారం చిత్రబృందం తొలి గీతాన్ని విడుదల చేసింది. 'మేఘం వర్షించదా' అంటూ సాగే ఈ పాటకు విక్రాంత్ రుద్ర సాహిత్యం అందించారు. విఘ్నేశ్ భాస్కరన్ స్వరకల్పనలో కపిలన్ మీరా ప్రకాశ్, సుజిత్ శ్రీధర్ ఆలపించారు. స్పోర్ట్స్ డ్రామాతో పాటు హృదయాలకు హత్తుకునే ప్రేమకథతో ఈ చిత్రాన్ని రూపొందించినట్లు విక్రాంత్ రుద్ర చెప్పారు. అజయ్ ఘోష్ కీలక పాత్ర పోషిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: జగదీశ్

ఆంధ్రజ్యోతి

బిజినెస్

వరంగల్ ● శుక్రవారం 8 ఆగస్టు 2025

ట్రంప్ సుంకాలతో ఆగమాగం

50-70 శాతం ఎగుమతులకు దెబ్బ: జీటీఆర్ఐ



న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజా సుంకాల పోటుతో దేశీయ పరిశ్రమ గగ్గోలు పెడుతోంది. ఈ దెబ్బతో భారత్ నుంచి అమెరికాకు ఎగుమతయ్యే రొయ్యలు, దుస్తులు, ఆర్గానిక్ కెమికల్స్, మెషినరీ, మెకానికల్ అప్లయెన్సెస్, రత్నాభరణాల ఎగుమతులు 50 నుంచి 70 శాతం తగ్గిపోయే అవకాశం ఉందని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇన్షియేటివ్ (జీటీఆర్ఐ) అనే మేధో సంస్థ గురువారం విడుదల చేసిన ఒక నివేదికలో తెలిపింది. చైనా, వియత్నాం, బ్రెజిల్ దేశాలతో పోల్చితే భారత్ మాత్రమే అధికంగా నష్టపోనుందని పేర్కొంది. రొయ్యలు, ఆర్గానిక్ కెమికల్స్, కార్పెట్స్, అల్లిన వస్త్రాలు (నిట్టెడ్ అండ్ వోవెన్ అపారెల్స్), వజ్రాలు, బంగారు ఆభరణాలు, ఫర్నీచర్ వంటి ఉత్పత్తుల ఎగుమతులు దాదాపు 50-70 శాతం వరకు తగ్గిపోయే అవకాశం ఉందని జీటీఆర్ఐ వ్యవస్థాపకుడు అజయ్ శ్రీవాత్సవ తెలిపారు. కాగా స్టీల్, అల్యూమినియం, కాపర్, ఆటో విడి భాగాల ఎగుమతులు 30 నుంచి 50 శాతం తగ్గే ప్రమాదం ఉందన్నారు. ఫార్మా, స్మార్ట్‌ఫోన్స్, పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతులపై సుంకాల ప్రభావం చాలా తక్కువ ఉండనుందని శ్రీవాత్సవ పేర్కొన్నారు.

వస్త్ర పరిశ్రమకు చావు దెబ్బే

వస్త్ర పరిశ్రమ మాత్రం ట్రంప్ తాజా సుంకాలను జీర్ణించుకోలేక పోతోంది. మన వస్త్ర ఎగుమతులపై ట్రంప్ సుంకాలను 25 శాతం నుంచి 50 శాతానికి పెంచేశారు. ఇది ఎగుమతులపై ముఖ్యంగా అమెరికా మార్కెట్‌పై అధికంగా ఆధారపడిన ఎంఎస్ఎంఈ సంస్థలకు చావు దెబ్బ అని ఈ పరిశ్రమకు ప్రాతినిధ్యం వహించే ఏపీఈసీ చైర్మన్ సుధీర్ సెఖ్రీ తెలిపారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వమే ఆర్థికంగా పరిశ్రమను ఆదుకోవాలని కోరారు. మన దుస్తుల ఎగుమతిలో అమెరికాకు 33 శాతం వాటా ఉన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు.

ప్రభుత్వం చేయూత !

ప్రస్తుత పరిస్థితి నుంచి పరిశ్రమ వర్గాలను ఆదుకునేందుకు ప్రభుత్వం యోచిస్తున్నట్టు సమాచారం. ముఖ్యంగా పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు కల్పిస్తున్న ఎగుమతి ఆధారిత వస్త్ర, తోలు ఉత్పత్తులు, రత్నాభరణాలు, ఆటోమొబైల్ విడి భాగాలు, రసాయన కంపెనీల కోసం ప్రత్యేక రాయితీలు కల్పించే విషయాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది.

రత్నాభరణాలకూ ముప్పే

ట్రంప్ విధించిన 50 శాతం సుంకాలపై దేశీయ రత్నాభరణాల పరిశ్రమ కూడా తీవ్ర ఆందోళనలో ఉంది. ఈ పరిస్థితుల నుంచి బయట పడేందుకు విధానపరమైన సంస్కరణల ద్వారా ప్రభుత్వం ఆదుకోవాలని కోరింది. ఇదే సమయంలో అమెరికాకు ప్రత్యామ్నాయ మార్కెట్ల అన్వేషణ పైనా దృష్టి పెట్టాలని కోరింది. మన రత్నాభరణాలు, వజ్రాలు, వజ్రాభరణాల ఎగుమతులపై ట్రంప్ విధించిన 50 శాతం సుంకాలు కొనసాగితే అమెరికా మార్కెట్ మనకు శాశ్వతంగా మూసుకుపోయినట్టేనని పరిశ్రమ వర్గాలు భయపడుతున్నాయి.

ఫార్మాకు ఊరట

సుంకాల విషయంలో ట్రంప్ చాలా తెలివిగానే వ్యవహరిస్తున్నారు. భారత వస్తు దిగుమతులపై 50 శాతం సుంకాలు విధించిన ట్రంప్.. ఫార్మా, ఐటీ సేవలను మాత్రం మినహాయించారు. మిగతా అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే అమెరికాలో ఔషధాల ధరలు మూడింతలు ఎక్కువ. దీనిపై అమెరికన్లు ఇప్పటికే గగ్గోలు పెడుతున్నారు. ఈ పరిస్థితుల్లో భారత్ నుంచి చౌకగా వచ్చే జెనరిక్ ఔషధాల పైనా 50 శాతం సుంకాలు విధిస్తే అమెరికన్ల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తుందనే భయంతోనే ట్రంప్ భారత ఫార్మా దిగుమతులను సుంకాల నుంచి మినహాయించారని ఫార్మాగ్జిల్ చైర్మన్ నమిత్ జోషి తెలిపారు. ప్రస్తుతం అమెరికాలో విక్రయించే జెనరిక్ ఔషధాల్లో 40% మన దేశం నుంచే ఎగుమతవుతున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ సుంకాల మినహాయింపు తాత్కాలికమేనని ట్రంప్ స్పష్టంగా ప్రకటించారు. దీంతో కొన్ని ఫార్మా కంపెనీలు అమెరికాలోనే యూనిట్లు పెట్టి అక్కడే ఔషధాలు ఉత్పత్తి చేసేందుకు యోచిస్తున్నట్టు సమాచారం.

కొత్త మార్కెట్లను వెతుక్కోవాల్సిందే

ట్రంప్ సుంకాలపై ఆటోమొబైల్ విడి భాగాల తయారీ కంపెనీలూ ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ప్రత్యామ్నాయ మార్కెట్లు వెతుక్కోవడం ఒక్కటే ఈ సమస్యకు పరిష్కారమని ఈ పరిశ్రమకు ప్రాతినిధ్యం వహించే ఏసీఎంఏ జాతీయ అధ్యక్షురాలు శ్రద్ధా సూరి మార్వా తెలిపారు.

బంగారం దూకుడు

ఢిల్లీ మార్కెట్లో ఒక్కరోజే రూ.3,600 అప్

- 10 గ్రాముల ధర రూ.1,02,620
- ఆల్ టైమ్ రికార్డు స్థాయికి చేరిక



న్యూఢిల్లీ: పసిడి ధర మరో సారి రికార్డు సృష్టించింది. దేశ రాజధాని ఢిల్లీలో 10 గ్రాముల మేలిమి (24 కేరట్స్) బంగారం గురువారం రూ.3,600 పెరిగి సరికొత్త రికార్డు స్థాయి రూ.1,02,620కి చేరింది. కిలో వెండి ధరా రూ.1,500 లాభంతో రూ.1.14 లక్షలకు చేరింది. మరోవైపు ఫ్యూచర్స్ మార్కెట్లోనూ పసిడి ధర రికార్డు సృష్టించింది. అక్టోబరులో డెలివరీ ఇచ్చే 10 గ్రాములు మేలిమి బంగారం ధర ఎంసీఎక్స్‌లో గురువారం రూ.893 లాభంతో రూ.1,02,155 స్థాయికి దూసుకుపోయింది. హైదరాబాద్‌లోనూ పసిడి ధర రూ.320 లాభంతో రూ.1,02,550కు చేరింది. కిలో వెండి ధర మాత్రం రూ.1,000 పెరిగి రూ.1.27లక్షల వద్ద ముగిసింది. ట్రంప్ సుంకాల భయంతో చాలా మంది మదుపరులు సురక్షిత పెట్టుబడిగా భావించే పసిడి కొనుగోళ్లకు దిగడం, డాలర్‌తో పడిపోతున్న రూపాయి మారకం రేటూ ఇందుకు దోహదం చేస్తున్నాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

8వ తేదీ			
హైదరాబాద్	445	విజయవాడ	490
వరంగల్	447	గోదావరి	485
చిత్తూరు	513	విశాఖపట్నం	500
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	90	విజయవాడ	99
వరంగల్	90	గుంటూరు	104
కరీంనగర్	90	ఒంగోలు	104
మహబూబ్‌నగర్	90	చిత్తూరు	77
కర్నూలు	90	నెల్లూరు	82
విశాఖపట్నం	94	అనంతపురం	82
గోదావరి	99		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,02,550 ▲	94,000 ▲	1,27,000 ▲
విజయవాడ	1,03,550 ▼	97,500 ▲	1,18,500 ▲
విశాఖపట్నం	1,03,970 ▲	94,000 ▲	1,27,000 ▲
రాజమండ్రి	1,02,550 ▲	94,000 ▲	1,17,000 ▲
ప్రొద్దుటూరు	1,00,400 ▲	92,370 ▲	1,17,800 ▲
ముంబై	1,00,703 ▲	92,244 ▲	1,15,250 ▲

ఎల్ఐసీ లాభం రూ.10,987 కోట్లు

న్యూఢిల్లీ: బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ) జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో రూ.10,987 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ.10,461 కోట్లతో పోల్చితే లాభం 5% మాత్రమే పెరిగింది. ఇదే కాలంలో మొత్తం ఆదాయం రూ.2,10,910 కోట్ల నుంచి 2,22,864 కోట్లకు పెరిగింది. తొలి ప్రీమియం వసూళ్లు రూ.7,525 కోట్లుగాను, రెన్యువల్ ప్రీమియం వసూళ్లు రూ.59,885 కోట్లుగాను నమోదయ్యాయి. "మేం లాభదాయకత పెంచుకోవాలనుకుంటున్నాం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో లాభాల్లో రెండంకెల వృద్ధిని సాధించడం మా లక్ష్యం" అని ఎల్ఐసీ సీఈఓ ఆర్. దొరైస్వామి అన్నారు. తొలి ఏడాది ప్రీమియం ఆదాయంలో కంపెనీ మార్కెట్ వాటా 63.51 శాతంగా ఉందని, వ్యక్తిగత-గ్రూప్ వ్యాపారాల్లో తాము అగ్రస్థానం నిలబెట్టుకున్నామని ఆయన చెప్పారు.

సెప్టెంబరులో అల్యూమెక్స్ ఇండియా

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఢిల్లీ మరో అంతర్జాతీయ సదస్సుకు వేదికవుతోంది. 'అల్యూమెక్స్ ఇండియా-2025' పేరుతో సెప్టెంబరు 10-13 తేదీల మధ్య ఈ సదస్సు జరుగుతుందని అల్యూమినియం ఎక్స్‌ట్రూజన్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (అలెమై) జాతీయ అధ్యక్షుడు జితేంద్ర చోప్రా చెప్పారు. ఈ సదస్సులో 250కిపైగా దేశ, విదేశీ కంపెనీలు తమ స్టాల్స్ ఏర్పాటు చేస్తాయన్నారు. నాలుగు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో దేశీయ అల్యూమినియం పరిశ్రమ ఎదుర్కొంటున్న సవాళ్లు, ఉన్న అవకాశాలపై చర్చించనున్నట్టు చోప్రా తెలిపారు. దేశ అల్యూమినియం ఎక్స్‌ట్రూజన్ ఉత్పత్తుల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు దక్షిణ భారత్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు.

కొత్త వ్యాపారాలే చోదక శక్తులు

4 రంగాలపై రిలయన్స్ నజర్

- 6జీ టెక్నాలజీ అభివృద్ధిలో జియో
- ఆర్ఐఎల్ చైర్మన్ ముకేశ్ అంబానీ

న్యూఢిల్లీ: రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) వ్యాపార స్వరూపం మారిపోతోంది. ఇప్పటి వరకు పెట్రో కెమికల్స్, చమురు, గ్యాస్ ఉత్పత్తి, వాటి రిఫైనింగ్.. కంపెనీ వ్యాపారాలకు ప్రధాన ఆధారం. ముందు ముందు రిటైల్, డిజిటల్ సేవలు, మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్, కొత్త తరహా ఇంధన వ్యాపారాలు కంపెనీ అభివృద్ధికి ప్రధాన చోదక శక్తులు కానున్నాయి. తాజా వార్షిక నివేదికలో వాటాదారులను ఉద్దేశించిన రాసిన ముందు మాటలో ఆర్ఐఎల్ చైర్మన్ ముకేశ్ అంబానీ ఈ విషయం వెల్లడించారు. ఇదే సమయంలో మారుతున్న కాలానికి అనుగుణంగా ఆర్ఐఎల్ డీప్ టెక్ కంపెనీగా రూపాంతరం చెందుతుందన్నారు. ఇందుకోసం దాదాపు వెయ్యి మందికి పైగా శాస్త్రవేత్తలు కృత్రిమ మేధ (ఏఐ), పునరుత్పాదక ఇంధన వనరులు, అధునాతన లోహాల అభివృద్ధి, డిజిటల్ ప్లాట్‌ఫామ్స్ కోసం పని చేస్తున్నట్టు వెల్లడించారు. వీరు అభివృద్ధి చేసిన ప్రతి టెక్నాలజీని ఆర్ఐఎల్‌కు చెందిన ప్రతి వ్యాపార విభాగంలో భాగం చేస్తామన్నారు. అంతర్జాతీయ టెలికాం రంగంలో ప్రధాన శక్తిగా ఎదిగేందుకు ఆర్ఐఎల్ అనుబంధ సంస్థ రిలయన్స్ జియో ఆరో తరం (6జీ) టెలికాం టెక్నాలజీని అభివృద్ధి చేస్తున్నట్టు అంబానీ కంపెనీ వార్షిక నివేదికలో వెల్లడించారు.. తమ చర్యలన్నీ భారత్‌ను తయారీ కేంద్రంగా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగానే ఉంటాయన్నారు. కొత్త వ్యాపారాలతో పాటు పాత వ్యాపారాలైన పెట్రో కెమికల్స్, రిఫైనింగ్ రంగాలపైనా తమ దృష్టి కొనసాగుతుందని అంబానీ తెలిపారు.

మార్కెట్లో అద్భుత రికవరీ

ముంబై: ఈక్విటీ మార్కెట్ గురువారం భారీ నష్టాల నుంచి అనూహ్యమైన పునరుజ్జీవం సాధించి లాభాలతో క్లోజైంది. ఐటీ, బ్యాంకింగ్ రంగాల షేర్లలో చివరి గంట కొనుగోళ్లు మార్కెట్‌కు ఊపిరులూదాయి. గురువారం ఆరంభం నుంచే నష్టాల్లోనే ట్రేడయిన మార్కెట్.. ఒక్కసారిగా చివరి గంటలో ఇంట్రాడే కనిష్ఠ స్థాయి 79,811.29 నుంచి 926 పాయింట్ల మేర ఎగువకు దూసుకుపోయింది. చివరికి సెన్సెక్స్ 79.27 పాయింట్ల లాభంతో 80,623.26 వద్ద ముగిసింది. నిఫ్టీ 21.95 పాయింట్ల లాభంతో 24,596.15 వద్ద స్థిరపడింది. అమెరికా సుంకాల పోటు కారణంగా ఆరంభంలో భారీగా నష్టపోయినా డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు పుతిన్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ మధ్య శాంతి చర్చలు జరిగే అవకాశం ఉన్నదన్న వార్తలు మార్కెట్లను లాభాల బాటలోకి నడిపించాయి.

ఎటర్నల్‌లో యాంట్‌ఫిన్ 1.46%వాటా విక్రయం

చైనా కుబేరుడు జాక్ మా నేతృత్వంలోని యాంట్ ఫైనాన్షియల్ గురువారం జొమాటో, బ్లింకిట్ బ్రాండ్ల మాతృ సంస్థ ఎటర్నల్‌లో 1.46 శాతం వాటాలను విక్రయించింది. ఓపెన్ మార్కెట్ ద్వారా జరిగిన ఈ లావాదేవీ విలువ రూ.4,096.75 కోట్లు. ఒక్కో షేరు సగటు విక్రయ ధర రూ.289.91గా ఉంది. ఈ వాటాల విక్రయం అనంతరం ఎటర్నల్‌లో యాంట్‌ఫిన్ హోల్డింగ్ వాటా 1.95% నుంచి 0.49 శాతానికి తగ్గింది.

రూ.150 కోట్లతో పిట్టీ ఇంజనీరింగ్ విస్తరణ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): వృద్ధి అవకాశాలతో పాటు పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా ఉత్పత్తి సామర్థ్యాలను పెంచుతున్నట్లు పిట్టీ ఇంజనీరింగ్ లిమిటెడ్ వెల్లడించింది. రూ.150 కోట్ల పెట్టుబడితో పిట్టీ ఇంజనీరింగ్ ప్లాంట్ విస్తరణతో పాటు అనుబంధ సంస్థలైన పిట్టీ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, దక్షిణ్ ఫౌండ్రీ ప్రైవేట్ లిమిటెడ్ ఉత్పత్తి కార్యకలాపాలు విస్తరించనున్నట్లు కంపెనీ ప్రకటించింది. ప్రతిపాదిత పెట్టుబడులతో ప్రస్తుతం 90,000 ఎంటీలుగా ఉన్న కంపెనీ కన్సాలిడేటెడ్ ఉత్పత్తి సామర్థ్యాన్ని 1,08,000 ఎంటీలకు పెంచటంతో పాటు ఫౌండ్రీ సామర్థ్యాలను 18,600 ఎంటీల నుంచి 24,000 ఎంటీలకు విస్తరించనున్నట్లు తెలిపింది. దశలవారీగా 18 నెలల్లో ఈ విస్తరణ కార్యకలాపాలను పూర్తి చేయనున్నట్లు పేర్కొంది. కాగా జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో కంపెనీ రూ.463.96 కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయంపై రూ.22.88 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది.

గ్లోబల్ ఫౌండ్రీస్‌తో సైయెంట్ సెమీకండక్టర్స్ జట్టు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): సెమీకండక్టర్ మాన్యుఫ్యాక్చరింగ్ సేవల కోసం అమెరికాకు చెందిన చిప్ తయారీ సంస్థ గ్లోబల్ ఫౌండ్రీస్ (జీఎఫ్)తో వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకున్నట్లు సైయెంట్ సెమీకండక్టర్స్ ప్రకటించింది. ఒప్పందంలో భాగంగా జీఎఫ్ సెమీకండక్టర్ తయారీ సేవలు, టెక్నాలజీలకు సైయెంట్ సెమీకండక్టర్స్ అధీకృత విక్రేతగా వ్యవహరించనుంది. జీఎఫ్ భాగస్వామిగా సైయెంట్.. కంపెనీలకు ఫ్యాబ్రికేషన్ యాక్సెస్, టెక్నికల్ కన్సల్టేషన్, టెస్టింగ్, విలువ ఆధారిత సేవలను అందించనుంది.

స్పోర్ట్స్





సిరాజ్‌కు తగినంత గుర్తింపు దక్కలేదు

న్యూఢిల్లీ: ఇంగ్లండ్ టూర్‌లో భారత ఆటగాళ్ల ప్రదర్శన అద్భుతమని దిగ్గజం సచిన్ టెండూల్కర్ కొనియాడాడు. అనూహ్య ప్రదర్శనతో అలరించిన పేసర్ మహ్మద్ సిరాజ్‌పై ప్రశంసల వర్షం కురిపించాడు. వాస్తవంగా అతడికి దక్కాల్సినంత గుర్తింపు దక్కలేదన్నాడు. 'మైదానంలో అతడి వ్యవహారశైలి నాకెంతో నచ్చుతుంది. ఎన్ని ఓవర్లు బౌల్ చేసినా అలుపనేదే కనపడదు. ఓ పేసర్ ఇంత ఉత్సాహంగా ఉండడం ఏ బ్యాటర్‌కూ నచ్చదు. చివరి రోజు వరకు సిరాజ్ అదే జోష్‌ను కొనసాగించాడు. సిరీస్‌లో వెయ్యి బంతులు వేసినా.. అతడు పేస్ తగ్గకుండా గంటకు 145 కి.మీ. వేగంతో బౌలింగ్ చేయగలడని కామెంటేటర్లు చెప్పడం విన్నా. అది అతడి పోరాట తత్వానికి నిదర్శనం. ఓవల్ టెస్ట్ చివరి రోజు సిరాజ్ ప్రదర్శనను ఎంత పొగిడినా తక్కువే' అని సచిన్ అన్నాడు. సిరాజ్ ఇప్పుడు రాణిస్తున్నట్టే ఇంతకుముందూ అద్భుతంగా బౌల్ చేస్తూనే ఉన్నాడని, అయితే అతని ప్రతిభకు తగిన గుర్తింపు మాత్రం లభించలేదని సచిన్ చెప్పాడు. ఇక ఓపెనర్ యశస్వీ జైస్వాల్ కూడా పరిణతి చెందిన ఆటను ప్రదర్శించాడని ప్రశంసించాడు. చివరి టెస్ట్‌లో బ్యాటింగ్‌కు కష్టమైన పిచ్‌పై సెంచరీ చేయడం అసాధారణమన్నాడు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఎంతో ప్రశాంతంగా జట్టును నడిపించాడని సచిన్ కొనియాడాడు. భారత జట్టు గొప్ప ప్రదర్శనలో రాహుల్ కూడా కీలకపాత్ర పోషించాడని తెలిపాడు.

రాజస్థాన్‌ను వీడనున్న శాంసన్?



న్యూఢిల్లీ: మేనేజ్‌మెంట్‌తో తీవ్ర విభేదాల నేపథ్యంలో కెప్టెన్ సంజూ శాంసన్.. రాజస్థాన్ రాయల్స్ జట్టును వీడడానికి సిద్ధమయ్యాడని సమాచారం. తనను ట్రేడ్ లేదా వేలంలోపాల్గొనేందుకు రిలీజ్ చేయమని ఫ్రాంచైజీని సంజూ కోరాడట. అతడు రాజస్థాన్ జట్టులో కొనసాగడానికి ఇష్టపడడం లేదని శాంసన్ కుటుంబ సభ్యులు కూడా బహిరంగంగానే చెబుతున్నారు. 2025 మెగా వేలానికి ముందు శాంసన్‌ను రాజస్థాన్ రూ.18 కోట్లకు రిటైన్ చేసుకొంది. 2021 నుంచి ఐపీఎల్‌లో రాయల్స్ తరఫున సంజూ 149 మ్యాచ్‌లు ఆడాడు. కాగా, ట్రేడింగ్‌లో శాంసన్‌ను తీసుకోవడానికి చెన్నై సూపర్ కింగ్స్ ప్రయత్నాలు చేస్తున్నదన్న వార్తలు వస్తున్నాయి.

అయ్యర్ ఆడేది ఖాయమే!

కీపర్‌గా సంజూ శాంసన్

ఆసియాకప్‌లో భారత జట్టుపై అంచనాలు





న్యూఢిల్లీ: ఇంగ్లండ్‌లో ఐదు టెస్టుల సిరీస్‌తో ఆకట్టుకున్న టీమిండియా ఇప్పుడిక ఆసియాకప్‌పై దృష్టి సారించనుంది. అయితే ఇది టీ20 ఫార్మాట్‌లో జరుగనుండడంతో జట్టు సభ్యులు కూడా మారనున్నారు. అనేక ప్రతికూల పరిస్థితుల మధ్య సెప్టెంబరు 9 నుంచి 28 వరకు యూఏఈలో ఈ టోర్నీ జరిగేలా షెడ్యూల్‌ను ఖరారు చేశారు. అదే నెల 14న ప్రపంచ క్రికెట్ దృష్టిని ఆకర్షించే భారత్-పాక్ పోరు కూడా జరుగుతుంది. 8 జట్లు పాల్గొనే ఈ టోర్నీలో దుబాయ్, అబుధాబి వేదికలుగా మొత్తం 19 మ్యాచ్‌లను నిర్వహిస్తారు. మరోవైపు ఆసియాకప్‌లో పాల్గొనే భారత జట్టు కూర్పుపై సర్వత్రా చర్చ జరుగుతోంది. ఈనెల మూడో వారంలో బీసీసీఐ తమ టీ20 జట్టును ప్రకటించే అవకాశం ఉంది. అయితే మరో ఐదు నెలల్లోనే టీ20 వరల్డ్‌కప్ ఉన్న నేపథ్యంలో ఆ మెగా టోర్నీని దృష్టిలో ఉంచుకుని కూడా తాజా జట్టును ఎంపిక చేయాల్సిన బాధ్యత సెలెక్టర్లపై ఉంది. అయితే టెస్టు, వన్డేల మాదిరి కాకుండా టీ20 జట్టులో స్థానం కోసం విపరీత పోటీ నెలకొని ఉంది. అంతేకాకుండా టెస్టు ఫార్మాట్‌లో మాదిరి జట్టు సంధి దశలో కూడా లేదు. మరోవైపు ఇంగ్లండ్‌లో పర్యటించిన జట్టు ఆటగాళ్లలో గిల్, బుమ్రా, రాహుల్, పంత్, సిరాజ్ ఆసియాకప్‌లో ఆడే అవకాశం లేదని సమాచారం.

నెంబర్ 4లో శ్రేయాస్: ఐపీఎల్‌లో మెరుపులు మెరిపించిన ఆటగాళ్లంతా బెర్త్ కోసం ఎదురుచూస్తున్నారు. ముఖ్యంగా పంజాబ్ కింగ్స్ కెప్టెన్‌గా విశేష ప్రతిభ చూపి జట్టును రన్నరప్‌గా నిలిపిన శ్రేయాస్ అయ్యర్‌కు ఈసారి పిలుపు ఖాయమేనని అంచనా వేస్తున్నారు. ఇటీవలి కాలంలో అతడిని టెస్టు, టీ20లకు పక్కనబెట్టి వన్డేల్లో ఆడిస్తున్నారు. కానీ ఐపీఎల్‌లో తను 17 మ్యాచ్‌ల్లో 604 పరుగులు చేసి బ్యాటర్‌గానూ సక్సెస్ అయ్యాడు. ఓవరాల్‌గా ఏడాది కాలంలో ఆడిన 25 ఇన్నింగ్స్‌లో 179.73 స్ట్రయిక్ రేట్‌తో 949 పరుగులు సాధించాడు. అందుకే పొట్టి ఫార్మాట్‌లో శ్రేయాస్‌ను ఎంపిక చేసేందుకు ఈ ప్రదర్శన సరిపోతుందని భావిస్తున్నారు. భారత్ తరఫున అతడు 2023లో చివరి టీ20 ఆడాడు. రిషబ్ పంత్‌కు ఆరు వారాల పాటు విశ్రాంతి అవసరమైన నేపథ్యంలో కీపర్‌గా శాంసన్ ఎంపిక లాంఛనమే కానుంది. అయితే ఐపీఎల్‌లో గుజరాత్ ఓపెనర్ సాయి సుదర్శన్ ఆరెంజ్ క్యాప్ సాధించిన విషయం తెలిసిందే. ఒకవేళ తన ఫామ్‌ను పరిగణనలోకి తీసుకుంటే శాంసన్‌ను మిడిలార్డర్‌లో ఆడించాల్సి ఉంటుంది. కెప్టెన్ సూర్య కుమార్‌కు ఈ ఏడాది ఆరంభంలో హెర్నియా సర్జరీ జరిగింది. దీంతో తను ఎన్‌సీఏ పునరావాస శిబిరంలో ఉన్నాడు. తన ఫిట్‌నెస్‌పై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. ఒకవేళ తను కోలుకోలేకపోతే శ్రేయాస్‌కు పగ్గాలు అప్పగించినా ఆశ్చర్యం లేదు. ఫినిషర్లుగా ఆల్‌రౌండర్లు హార్దిక్, అక్షర్ కొనసాగనుండగా కుల్దీప్, వరుణ్ ప్రధాన స్పిన్నర్లు కానున్నారు. పేస్ విభాగంలో అర్ష్‌దీప్, హర్షిత్, ముకేశ్ ఉంటారు. ఇంగ్లండ్‌తో ఐదు టెస్టుల్లోనూ ప్రాతినిధ్యం వహించిన సిరాజ్‌కు విండీస్‌తో సిరీస్ కోసం తాజాగా ఉంచే అవకాశం ఉంది.

ఆసియాకప్ జట్టు (అంచనా): సూర్యకుమార్ (కెప్టెన్), అభిషేక్, శాంసన్, తిలక్ వర్మ, శ్రేయాస్, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, రింకూ సింగ్, శివమ్ దూబే, కుల్దీప్ యాదవ్, వరుణ్, హర్షిత్, అర్ష్‌దీప్ సింగ్, ముకేశ్ కుమార్, ఇషాన్.

11 మంది రెజ్లర్లపై వేటు

- నకిలీ జనన ధ్రువీకరణ పత్రాల గుట్టు రట్టు

న్యూఢిల్లీ : నకిలీ జనన ధ్రువీకరణ పత్రాలు సమర్పించిన 11 మంది రెజ్లర్లను..భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) సస్పెండ్ చేసింది. రెజ్లింగ్ క్రీడకు హరియాణా ప్రసిద్ధి చెందినది. దాంతో ఆ రాష్ట్ర జట్టులో ఎంపికకు పోటీ తీవ్రంగా ఉండడంతో పలువురు ఢిల్లీ నుంచి బరిలోకి దిగుతున్నారు. ఈక్రమంలో వారు ఢిల్లీలో జన్మించినట్టు నకిలీ జనన ధ్రువీకరణ పత్రాలు పొందుతున్నారు. వీటిపై అనుమానం వచ్చిన డబ్ల్యూఎఫ్ఐ విచారణ చేయాల్సిందిగా ఢిల్లీ మునిసిపల్ కార్పొరేషన్‌ను కోరింది. దర్యాప్తు జరిపిన కార్పొరేషన్ 11 మంది రెజ్లర్ల జనన ధ్రువీకరణ పత్రాలు తాము జారీ చేయలేదని తేల్చింది. దాంతో సాక్షమ్, మనుజ్, కవిత, అన్ను, ఆరుష్ రాణా, శుభమ్, గౌతమ్, జగ్‌రూప్ ధన్కడ్, నకుల్, దుష్యంత్, సిద్ధార్థ బలియాన్ అనే రెజ్లర్లపై డబ్ల్యూఎఫ్ఐ వేటు వేసింది.



అర్జున్ గెలుపు

- హారిక పరాజయం
- చెన్నై గ్రాండ్ మాస్టర్స్ టోర్నీ

చెన్నై: చెన్నై గ్రాండ్ మాస్టర్స్‌లో తెలుగు జీఎం అర్జున్ ఇరిగేసి శుభారంభం చేయగా.. ద్రోణవల్లి హారికకు షాక్ తగిలింది. గురువారం జరిగిన ఓపెన్ తొలి రౌండ్‌లో అమెరికా జీఎం అవోండర్ లియాంగ్‌పై అర్జున్ నెగ్గాడు. తెల్లపావులతో ఆడిన అర్జున్ 48 ఎత్తుల్లో ప్రత్యర్థి ఆటకట్టించాడు. సహచరులు ప్రణవ్-కార్తికేయన్ మురళి మధ్య గేమ్ డ్రాగా ముగిసింది. విన్సెంట్ కీమర్ (జర్మనీ) చేతిలో నిహాల్ సరీన్ పరాజయం పాలయ్యాడు. చాలెంజర్స్ విభాగం తొలి రౌండ్‌లో సహచర జీఎం దీప్తయాన్ ఘోష్ చేతిలో హారిక ఓడింది. ఇనియన్‌తో గేమ్‌ను వైశాలి డ్రా చేసుకొంది.

పంత్‌కు సారీ చెప్పా: క్రిస్ వోక్స్



లండన్: ఇంగ్లండ్‌తో జరిగిన ఐదు టెస్టుల సిరీస్‌లో తమ గాయాలను పక్కనబెట్టి రిషబ్ పంత్, క్రిస్ వోక్స్ బరిలోకి దిగి అందరి అభిమానాన్ని చూరగొన్నారు. అయితే పంత్ గాయానికి కారణమైన తాను అతనికి సారీ చెప్పినట్టు వోక్స్ వెల్లడించాడు. నాలుగో టెస్టులో అతడి బౌలింగ్‌లోనే పంత్ రివర్స్ స్వీప్‌నకు యత్నించగా కాలిపాదం ఫ్రాక్చర్ అయ్యింది. అయినా పంత్ రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగాడు. ఇక వోక్స్ కూడా ఐదో టెస్టు ఆఖరి రోజు బ్యాటింగ్‌కు దిగిన విషయం తెలిసిందే. 'నేను భుజం నొప్పితో బ్యాటింగ్‌కు దిగడాన్ని కెప్టెన్ గిల్ అభినందించాడు. ఇక ఇన్‌స్టాలో నా ఫొటోకు పంత్ సెల్యూట్ ఎమోజీ పెట్టాడు. దానికి నేను థ్యాంక్యూ చెప్పి.. నీ పాదం బాగానే ఉందని ఆశిస్తున్నా అని మెసేజ్ పంపా. అటు పంత్ కూడా తన వాయిస్ మెసేజ్‌లో అంతా మంచి జరగాలని కోరుకుంటున్నానని, మనం ఏదో రోజు కలుద్దామని అన్నాడు. నేను కూడా పాదం గాయం విషయంలో సారీ చెప్పా' అని వోక్స్ వివరించాడు.

ఫిఫా ర్యాంకింగ్స్‌లో మన మహిళలు పైపైకి..

న్యూఢిల్లీ: భారత మహిళల ఫుట్‌బాల్ జట్టు తమ ఫిఫా ర్యాంకింగ్‌ను మెరుగుపర్చుకుంది. తాజాగా ప్రకటించిన జాబితాలో 7 స్థానాలు ఎగబాకిన భారత్ 63వ స్థానం దక్కించుకుంది. ఇటీవల థాయ్‌లాండ్‌పై గెలిచిన మహిళల జట్టు ఏఎఫ్‌సీ మహిళల ఆసియాకప్‌లోనూ చోటు దక్కించుకుంది. గత రెండేళ్లలో భారత మహిళల ఫుట్‌బాల్ జట్టుకిదే మెరుగైన ర్యాంక్. స్పెయిన్ టాప్‌లో ఉంది.

భారత మహిళల ఓటమి

ఆస్ట్రేలియా-ఎతో తొలి టీ 20

మకే (ఆస్ట్రేలియా) : మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా గురువారం ఆస్ట్రేలియా-ఎ జట్టుతో జరిగిన మొదటి టీ20లో భారత్-ఎ 13 పరుగులతో పరాజయం చవిచూసింది. మూడు టీ20లు, మూడు వన్డేలతోపాటు ఒక అనధికార టెస్ట్ సిరీస్‌లో తలపడేందుకు ఆస్ట్రేలియాలో మన మహిళలు పర్యటిస్తున్నారు. గురువారం జరిగిన తొలి టీ20లో మొదట ఆస్ట్రేలియా-ఎ 20 ఓవర్లలో 137/6 స్కోరు చేసింది. అనికా (50 నాటౌట్), అలీసా హీలీ (27) రాణించారు. లెగ్ స్పిన్నర్ ప్రేమా రావత్ (3/15) మూడు వికెట్లు పడగొట్టింది. ఛేదనలో భారత్-ఎ 20 ఓవర్లలో 124/5 స్కోరుకే పరిమితమై ఓడింది. రాఘవీ బిస్ట్ (33), ఉమా ఛెత్రి (31), కెప్టెన్ రాధా యాదవ్ (26 నాటౌట్) పోరాడారు. అమీ, సియాన చెరో రెండు వికెట్లు సాధించారు.

గిల్‌కు 'నార్త్' పగ్గాలు



న్యూఢిల్లీ : సుదీర్ఘమైన ఇంగ్లండ్ పర్యటనను ముగించుకొని వచ్చినా.. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ దులీప్ ట్రోఫీ బరిలో దిగనున్నాడు. ఈనెల 28 నుంచి జరిగే టోర్నీలో నార్త్‌జోన్ కెప్టెన్‌గా గిల్ వ్యవహరించనున్నాడు. తొలి మ్యాచ్‌లో ఈస్ట్‌జోన్‌ను నార్త్‌జోన్ ఢీకొననుంది. గిల్‌తోపాటు పేసర్లు అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా, అన్షుల్ కాంబోజ్ నార్త్‌జోన్ జట్టులో ఉన్నారు.

కుప్పకూలిన జింబాబ్వే

న్యూజిలాండ్‌తో రెండో టెస్ట్



బులవాయో : జింబాబ్వేతో రెండో టెస్ట్‌లో న్యూజిలాండ్ భారీ ఆధిక్యం దిశగా సాగుతోంది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్‌కు దిగిన జింబాబ్వే తొలి ఇన్నింగ్స్‌లో 125 పరుగులకే ఆలౌటైంది. బ్రెండన్ టేలర్ (44) రాణించాడు.. హెన్రీ ఐదు, జకారీ ఫోక్స్ నాలుగు వికెట్లతో చెలరేగారు. అనంతరం కివీస్ తొలిరోజు ఆటచివరికి 174/1 స్కోరుతో తిరుగులేని స్థితిలో నిలిచింది. 49 పరుగుల ఆధిక్యంలో ఉన్న న్యూజిలాండ్‌కు ఇంకా 9 వికెట్లు చేతిలో ఉన్నాయి.

టేలర్ రికార్డు: జింబాబ్వే బ్యాటర్ బ్రెండన్ టేలర్ అరుదైన రికార్డును అందుకున్నాడు. 21వ శతాబ్దంలో టెస్ట్‌ల్లో అరంగేట్రం చేసి ఎక్కువ సంవత్సరాలు (21 సంవత్సరాల 93 రోజులు) కెరీర్ కొనసాగించిన క్రికెటర్‌గా ఇంగ్లండ్‌కు చెందిన జేమ్స్ అండర్సన్ (21 సంవత్సరాల 51 రోజులు)ను అధిగమించాడు. 39 ఏళ్ల టేలర్ 2004లో శ్రీలంకపై సుదీర్ఘ ఫార్మాట్‌లో అరంగేట్రం చేశాడు.

సెమీస్‌లో ఐదుగురు భారత బాక్సర్లు

ఆసియా చాంపియన్‌షిప్స్

బ్యాంకాక్: ఆసియా చాంపియన్‌షిప్స్ అండర్-19 విభాగంలో ఐదుగురు పురుష బాక్సర్లు సెమీస్‌లో ప్రవేశించి భారత్‌కు పతకాలు ఖాయం చేశారు. గురువారం జరిగిన క్వార్టర్‌ఫైనల్స్‌లో శివమ్ (55 కి.), మౌసమ్ సుహాగ్ (65 కి.), రాహుల్ కుందు (75 కి.), గౌరవ్ (85కి.), హేమంత్ సంగ్వాన్ (90 కి.) ప్రత్యర్థులపై విజయాలు సాధించారు. అండర్-19 మహిళల కేటగిరీలో ఏడుగురు భారత బాక్సర్లు ఇప్పటికే సెమీఫైనల్లో అడుగుపెట్టారు. దాంతో ఈ విభాగంలో మనకు 12పతకాలు ఖాయంగాలభించనున్నాయి.

కాంగ్రెస్ నేతపైకి నీళ్ల సీసా విసిరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌లో కొత్త రేషన్ కార్డుల పంపిణీలో ఘటన

ఆసిఫాబాద్, ఆగస్టు7 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ నియోజకవర్గం ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత కోవ లక్ష్మీ సహనం కోల్పోయారు. ఆసిఫాబాద్‌లోని రైతు వేదికలో గురువారం జరిగిన రేషన్ కార్డుల పంపిణీలో ఆసిఫాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్‌ఇన్‌చార్జి శ్యాంనాయక్‌పై మంచి నీళ్ల సీసాలు విసిరారు. దీంతో రేషన్ కార్డుల పంపిణీ రసాభాసగా మారింది. జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్, స్థానిక ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి లబ్ధిదారులకు గురువారం రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ డేవిడ్ మాట్లాడుతూ దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న రేషన్‌కార్డులను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోందని, లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే కోవ లక్ష్మి కల్పించుకుని కాంగ్రెస్ తమమ్యానిఫెస్టోలో రేషన్‌కార్డుల పంపిణీ విషయం పెట్టిందని, అందులో భాగంగానే కొత్త కార్డులు పంపిణీ చేస్తుందన్నారు. తమ ప్రభుత్వ హయాంలో ఎన్నో రకాల అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. దీంతో కల్పించుకున్న శ్యాంనాయక్.. ప్రభుత్వ కార్యక్రమంలో మాట్లాడే విధానం తెలుసుకోవాలని సూచించారు. దీంతో సహనం కోల్పోయిన కోవ లక్ష్మి.. తన ముందు బల్లపై ఉన్న మంచినీటి సీసాను తీసి శ్యాంనాయక్‌పైకి విసిరారు. దీంతో వారి మధ్య వాగ్వాదం జరిగి ఉద్రిక్తత నెలకొనగా అదనపు కలెక్టర్ డేవిడ్ నచ్చజెప్పి శాంతింపజేశారు.



కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిపైకి నీళ్ల సీసా విసురుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి



శాలువాను ప్రధాని మోదీకి బహూకరించిన ఎంపీ రఘునందన్‌రావు

ఆపరేషన్ సింధూర్ శాలువాతో ప్రధాని నరేంద్ర మోదీకి సన్మానం

» శాలువాను బహూకరించిన ఎంపీ రఘునందన్‌రావు

దుబ్బాక, సిరిసిల్ల, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ డిజైన్‌తో నేసిన శాలువాను మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ప్రధాని మోదీకి బహూకరించారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఢిల్లీలోని పార్లమెంటు భవనంలో ప్రధాని మోదీని కలిసి అగ్గిపెట్టెలో అమిరిన శాలువాను బహూకరించారు. చేనేత ఉత్పత్తులను ప్రోత్సహించడంలో భాగంగా దుబ్బాకను ప్రత్యేక హబ్‌గా గుర్తించాలని ఈ సందర్భంగా ప్రధానికి విజ్ఞప్తి చేశారు. ఈ శాలువాను రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన చేనేత కళాకారుడు నల్ల విజయ్ నేశారు. చేనేత మగ్గంపై రెండు గ్రాముల గోల్డ్ జరీతో రెండు మీటర్ల పొడవు, 36 ఇంచుల వెడల్పుతో శాలువాను రూపొందించారు.

తండ్రి కోసం కవిత న్యాయ పోరాటం!

» కాళేశ్వరం కమిషన్ నివేదికపై నిపుణులతో చర్చలు

హైదరాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ అధినేత, తన తండ్రి కేసీఆర్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ఆరోపణలను తిప్పికొట్టేందుకు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత న్యాయపోరాటానికి సన్నద్ధమవుతున్నట్లు తెలిసింది. కాళేశ్వరం కమిషన్ (పీసీ ఘోష్ కమిషన్) నివేదికపై రెండు రోజులుగా న్యాయనిపుణులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం. కేసీఆర్‌కు కాళేశ్వరం కమిషన్ నోటీసులు జారీ చేయడాన్ని నిరసిస్తూ గతంలో ఇందిరాపార్క్ వద్ద కవిత ధర్నా చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు కమిషన్ నివేదిక పేరుతో కేసీఆర్‌ను బద్నాం చేసే కుట్రలను, రాజకీయ ప్రేరేపిత ఆరోపణలను తిప్పికొట్టడంలోనూ ముందే ఉండాలని ఆమె నిర్ణయించుకున్నట్లు తెలిసింది. ఇందులో భాగంగానే దేశంలో ఇప్పటి వరకు వేసిన జ్యూడిషియల్ కమిషన్లు, వాటి నివేదికలు, ఆయా నివేదికలపై న్యాయస్థానాల్లో అప్పీళ్లు, వాటిపై న్యాయస్థానాలు వెలువరించిన తీర్పులపై చర్చించినట్లు తెలిసింది. అసెంబ్లీ, మండలిలో కమిషన్ నివేదికను ప్రవేశపెట్టిన తర్వాత న్యాయ పోరాటం చేయాలని నిర్ణయించారు.

10న టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ భేటీ

టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ సమావేశం ఈనెల 10వ తేదీన ఆ కమిటీ చైర్మన్ మల్లు రవి అధ్యక్షతన గాంధీభవన్‌లో జరగనుంది. మంత్రి కొండా సురేఖ, కొండా మురళిపై పార్టీ ఎమ్మెల్యేలు చేసిన ఫిర్యాదులతో పాటు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి వ్యవహారంపై భేటీలో పరిశీలించే అవకాశమున్నట్లు తెలిసింది. మరోవైపు.. రాజగోపాల్‌రెడ్డిపై నల్లగొండ, యాదాద్రి భువనగిరి జిల్లాలకు చెందిన నాయకులు క్రమశిక్షణ కమిటీకి ఫిర్యాదు చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది.

బీసీ రిజర్వేషన్లపై బీఆర్ఎస్ వైఖరేంటి?: చనగాని

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధనకు కాంగ్రెస్ ఢిల్లీలో పోరాడుతుంటే బీఆర్ఎస్ నేతలు విమర్శలు చేయడంలో ఆంతర్యమేంటని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చనగాని దయాకర్ ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్లపై బీఆర్ఎస్ వైఖరేంటో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. కేటీఆర్ బీసీ రిజర్వేషన్లపై మాట్లాడకుండా దొంగ చాటుగా ఢిల్లీ వెళ్లి వచ్చారని మండిపడ్డారు. బీసీ రిజర్వేషన్లపై బీజేపీ, బీఆర్ఎస్ ఒకే విధానంతో ఉన్నట్లు స్పష్టమవుతోందని విమర్శించారు.

బీసీలకు బాసటగా ఉంటాం

» మహారాష్ట్ర, గోవా సీఎంలు ఫడణవీస్, ప్రమోద్ హామీ

హైదరాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కుల గణన తర్వాత దేశంలో బీసీలకు నవశకం వచ్చే అవకాశం ఉందని మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్ అన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ నేతృత్వంలో రాష్ట్రీయ ఓబీసీ మహాసంఘ అధ్యక్షులు ప్రొఫెసర్ భవన్ రావు తైవాడే అధ్యక్షతన గురువారం జరిగిన జాతీయ ఓబీసీ మహాసభలో ఫడణవీస్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా బీసీల సమస్యలను ప్రధాని దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి తన వంతు ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. గోవా సీఎం ప్రమోద్ సావంత్ మాట్లాడుతూ బీసీల ఐక్యత పెంచుకుని కావలసిన వాటాను సాధించుకోవాలన్నారు. ప్రస్తుతం దేశమంతా బీసీల వైపు చూస్తుందని అన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కులగణన జరగాలని, గల్లీ నుండి ఢిల్లీ దాకా బీసీలు పోరాటం చేస్తే కేంద్ర ప్రభుత్వం స్పందించి జనగణతో పాటే కులగననకు సిద్ధమైందన్నారు. ఇది బీసీల పోరాట ఫలితమన్నారు. అన్ని రంగాలలో రాజ్యాంగబద్ధమైన హక్కులు దక్కేవరకు జాతీయ స్థాయిలో బీసీల పోరును కొనసాగిస్తామన్నారు.

14న కరీంనగర్‌లో బీసీ గర్జన సభ: బీఆర్ఎస్

హైదరాబాద్, న్యూఢిల్లీ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లను చట్టం ద్వారానే కల్పించాలన్న డిమాండ్‌తో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 14న కరీంనగర్‌లో బీసీ గర్జన సభ నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ నేతలు వెల్లడించారు. బీసీ రిజర్వేషన్ల కోసం ఏదో చేస్తామని ఢిల్లీకి వెళ్లిన రేవంత్‌రెడ్డి సాధించిందేంటని ప్రశ్నించారు. డ్రామాలు తప్ప.. బీసీ రిజర్వేషన్ల పట్ల కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. ధర్నాకు రావాలని బీఆర్ఎస్‌ను పిలిచారా? పిలవకుండానే ధర్నాలో పాల్గొనలేదని విమర్శలు చేయడం తగదన్నారు. బీసీ రిజర్వేషన్ల సాధనకు కాంగ్రెస్ ధర్నా చేస్తే ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఎందుకు రాలేదో బదులు చెప్పాలని బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర డిమాండ్ చేశారు.



సమావేశంలో విశ్రాంత వెటర్నరీ అధికారులతో వీసీ జ్ఞానప్రకాశ్

ముగిసిన రిటైర్డ్ వెటర్నరీ అధికారుల సంఘం సర్వ సభ్య సమావేశం

హైదరాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విశ్రాంత వెటర్నరీ అధికారుల సంఘం రెండో సర్వ సభ్య సమావేశం వెటర్నరీ కాలేజీలో గురువారం జరిగింది. సంఘం అధ్యక్షుడు డాక్టర్ అనంతయ్య సమావేశాన్ని ప్రారంభించి.. గతేడాది కన్నుమూసిన సభ్యుల ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించారు. ఇటు నిరుడు నిర్వహించిన వివిధ కార్యక్రమాలను డాక్టర్ దుర్గయ్య విపులంగా వివరించారు. కోశాధికారి డాక్టర్ రెడ్డి ఆర్థిక వివరాలు, వార్షిక ఖాతాలపై వివరణ ఇచ్చారు. కార్యనిర్వాహక కమిటీ సభ్యుడు డాక్టర్ విజయ రామారావు చేసిన సేవలను గుర్తించి ఆయన్ను సన్మానించారు. సమావేశానికి పశువైద్య విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ డాక్టర్ జ్ఞానప్రకాశ్, పశువైద్య కళాశాల డీన్ డాక్టర్ మాధురి హాజరై సభ్యులనుద్దేశించి ప్రసంగించారు. సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. ఇటు విశిష్ట సేవలు అందించిన ఆరుగురు సభ్యులను వీసీ జ్ఞానప్రకాశ్ సన్మానించారు.

2-3 నెలల్లో ఆర్ఆర్ఆర్ పనులు

(మొదటిపేజీ తరువాయి)

అక్కడక్కడా ఉన్న చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాల్సి ఉందన్నారు. భూ పరిహారం చెల్లింపు ప్రక్రియ వెంటనే ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సీఎం రేవంత్‌రెడ్డి సూచన మేరకు ఎన్‌హెచ్‌ఏఐ, ఎంవోఆర్‌టీహెచ్ ప్రాజెక్టుల పనులు వేగంగా పూర్తి చేసేందుకు టాస్క్ ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేసుకున్నామని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. సరైన ప్రణాళికలతో వెళ్లేందుకు.. ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయి పనుల పురోగతిని పర్యవేక్షించేందుకు.. ఈ టాస్క్‌ఫోర్స్ కమిటీ పనిచేస్తుందని తెలిపారు. ఆర్ అండ్ బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చైర్మన్‌గా, స్పెషల్ సీఎస్, సీసీఎల్‌ఏ కమిషనర్, విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, నీటిపారుదల, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, మైనింగ్, పీసీసీఎఫ్, ఎన్‌హెచ్‌ఏఐ, ఎంవోఆర్‌టీహెచ్, ఆర్ అండ్ బీ ఎన్‌హెచ్ చీఫ్ ఇంజినీరు సభ్యులుగా ఏర్పాటైన ఈ టాస్క్ ఫోర్స్ కమిటీ గురువారం సెక్రటేరియట్‌లో సమావేశమై పలు అంశాలపై చర్చించింది. నీటిపారుదలశాఖకు సంబంధించి.. వరంగల్-ఖమ్మం సెక్షన్‌లో ఎన్‌హెచ్-153జీ పరిధిలోని ప్యాకేజీ 2లో చెరువుల అంశాన్ని ఎన్‌హెచ్ అధికారులు మంత్రికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ రూపంలో వివరించారు. మహబూబాబాద్, నెల్లికుదురు ప్రాంతంలో చెరువుల సమస్యలు, దాంతో పాటు హై లెవల్ బ్రిడ్జి ప్రతిపాదనల గురించి వివరించారు. ఎన్‌హెచ్-30 సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు రోడ్డుతో పాటు గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డుకు సంబంధించి పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దీనికి ఆయన.. ఇరిగేషన్ శాఖ నుంచి ఇబ్బందులేవైనా ఉంటే సంబంధిత మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

- 12 ఎన్‌హెచ్ ప్రాజెక్టులకుగాను.. 6 ప్రాజెక్టులు అటవీ శాఖ అనుమతులులేక పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు మంత్రికి తెలపగా.. ఆ అనుమతుల కోసం అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. కల్వకుర్తి-శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్‌కు కేంద్ర మంత్రి గడ్కరీ సానుకూలంగా ఉన్నారని, అటవీ అధికారులు సమన్వయంతో పనిచేస్తే గొప్ప ప్రాజెక్టు పూర్తి చేసిన వారమవుతామన్నారు.



- విద్యుత్‌శాఖకు సంబంధించి 220కేవీ, 400కేవీ లైన్ సమస్యలతోపాటు, 33కేవీ, 11కేవీ లైన్ షిఫ్టింగ్ సమస్యలున్నాయని అధికారులు మంత్రికి వివరించారు. దీనికి ఆయన.. ఏయే ప్రాంతాల్లో ఏ సమస్య ఉందో వివరాలు ఇవ్వాలని అడిగారు. సమస్యలను పరిష్కరించే బాధ్యతను విద్యుత్ శాఖ అధికారి ముషారఫ్ ఆలీకి అప్పగించారు.
- గనులశాఖ నుండి కొన్ని అనుమతులు రావాల్సి ఉందని అధికారులు తెలపగా.. ఆ పనులు వెంటనే పూర్తయ్యేలా చొరవ తీసుకోవాలని సంబంధిత అధికారి శ్రీధర్‌కు మంత్రి సూచించారు. ప్రధానంగా భూసేకరణలో రెవెన్యూశాఖకు సంబంధించిన సమస్యలే ఎక్కువగా ఉన్నాయని.. వాటిని వెంటనే పరిష్కరించేందుకు సీసీఎల్‌ఏ కమిషనర్ లోకేష్‌కుమార్ కృషి చేయాలన్నారు. కొన్నిచోట్ల సున్నిత అంశాలు ఉంటాయని వాటి పట్ల మానవతా దృక్పథంతో మెలగాలని అధికారులకు సూచించారు. అన్ని శాఖల అధికారులతో సుదీర్ఘంగా చర్చించిన మంత్రి.. ఇక నుండి తరచుగా సమావేశాలు నిర్వహిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేద్దామన్నారు. 18న మరోమారు భేటీ అవుదామని, ఆ సమావేశానికి జిల్లా కలెక్టర్లు హాజరు అయ్యేలా చూడాలని సూచించారు. అన్నిశాఖల అధికారులూ సమన్వయంతో పనిచేస్తేనే టాస్క్‌ఫోర్స్ బాగా పనిచేసినట్లు అవుతుందని మంత్రి అభిప్రాయపడ్డారు. తమకు రాజకీయాల కంటే రాష్ట్రాభివృద్దే ముఖ్యమన్న ఆయన.. రాష్ట్ర ప్రాజెక్టుల క్లియరెన్స్ కోసం త్వరలో ప్రధాని మోదీని కలుస్తామని వెల్లడించారు.

కలెక్టర్లు, ఎస్పీలనూ కేటీఆర్ తిడుతున్నారు

మేం డైరీ రాయాలంటే గత పదేళ్లలో ఎన్నో పేర్లు రాసుకోవాల్సి ఉండేది: కోమటిరెడ్డి

"కలెక్టర్లను, ఎస్పీలను సైతం కేటీఆర్ తిడుతున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 20 నెలలకే.. 'డైరీలో రాసుకుంటున్నాం' అంటున్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో మా కార్యకర్తలు ఎంతో ఇబ్బంది పడ్డారు. మేము డైరీలు రాయాలంటే ఎన్నో పేర్లు రాసుకోవాల్సి ఉండేది" అని మంత్రి కోమటిరెడ్డి అన్నారు. కానీ, తామెప్పుడూ అలా చేయలేదన్నారు. టాస్క్‌ఫోర్స్ కమిటీ భేటీ అనంతరం సచివాలయంలో ఆయన మీడియాతో ఇష్టాగోష్ఠి నిర్వహించారు. గత పాలనలో పదేళ్ల పాటు జరిగిన అవినీతిపై కమిషన్ల ద్వారా విచారణ చేయిస్తున్నామని.. హ్యామ్ రోడ్ల పనులకు సంబంధించి 12న కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహిస్తున్నామని, వచ్చే వారం హ్యామ్‌రోడ్లకు టెండర్లు పిలుస్తున్నామని తెలిపారు. తొలిదశలో రూ.6వేల కోట్లతో మూడేళ్లలో మరమ్మతులు పూర్తి చేస్తామన్నారు. రాష్ట్రంలో జాతీయ రహదారుల అభివృద్ధిపై కేంద్ర మంత్రి గడ్కరితో సమావేశం జరిగిందన్నారు. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగానికి ఈ నెలలో క్యాబినెట్‌లో ఆమోదం లభిస్తుందని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారన్నారు. విజయవాడకు ఫ్యూచర్ సిటీ నుంచి గ్రీన్‌ఫీల్డ్ హైవే మంజూరు చేస్తారన్నారు. అలాగే.. బీసీ రిజర్వేషన్లపై ఢిల్లీలో చేసిన ధర్నా విజయవంతమైందన్నారు. రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలపై విలేకరులు ప్రశ్నించినప్పుడు ఆయన మౌనం వహించారు. బీఆర్ఎస్ నేత జగదీష్ రెడ్డి గురించి మాట్లాడే స్థాయి తనది కాదన్న కోమటిరెడ్డి.. ఉమ్మడి నల్గొండజిల్లా అభివృద్ధే తన లక్ష్యమన్నారు. సినీ కార్మికుల వేతనాలు, ఇతర సమస్యలపై శుక్రవారం చర్చిస్తామన్నారు.

వచ్చే ఎన్నికల్లో రేవంత్ ఓటమి ఖాయం

» మీడియాతో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

న్యూఢిల్లీ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : వచ్చే ఎన్నికల్లో రేవంత్ రెడ్డి ఘోరంగా ఓడిపోవడం ఖాయమని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి జోస్యం చెప్పారు. మోదీని గద్దె దించేందుకు శిలాశాసనం రాస్తున్నామని రేవంత్ అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వరుసగా మూడు లోక్‌సభ ఎన్నికల్లో ఓడిపోయి, వివిధ రాష్ట్రాల్లో అడ్రస్ లేకుండా పోయిన కాంగ్రెస్.. మోదీకి సవాల్ విసరడం అంటే సూర్యుడిపై ఉమ్మేసినట్టేనని ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్‌కు ఇప్పటికే మరణ శాసనం రాసేశారని వ్యాఖ్యానించారు. ఒక వేళ తెలంగాణలో కాంగ్రెస్ మళ్లీ గెలిస్తే.. రాహుల్‌గాంధీ ఏం చెప్పినా చేస్తామని సవాల్ విసిరారు. ఢిల్లీలోని తన నివాసంలో గురువారం కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. బీసీ సాధికారతపై కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదని తెలంగాణ ప్రజలకు అర్థమైపోయిందన్నారు. జంతర్ మంతర్ సభ కేవలం గాంధీ కుటుంబాన్ని పొగడడానికి, మోదీని తిట్టడానికే పెట్టినట్టున్నారని విమర్శించారు. కేసీఆర్.. పదేళ్ల రాష్ట్రాన్ని ప్రైవేట్ లిమిటెడ్ సంస్థగా మార్చేసి హోల్‌సేల్‌గా అవినీతి చేస్తే, కాంగ్రెస్ పార్టీ రిటైల్‌గా అవినీతికి పాల్పడుతోందని ధ్వజమెత్తారు. ఈ విషయంలో ఆ రెండు పార్టీలు పోటీ పడుతున్నాయని ఎద్దేవా చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతంగా ఉన్న రిజర్వేషన్‌ను 27 శాతానికి తగ్గించింది కేసీఆరేనని గుర్తు చేశారు. ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్ ఇచ్చేందుకు అప్పట్లోనే అనేక కుతంత్రాలు చేశారని చెప్పారు. జనాభా ప్రాతిపదికన బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అందాల్సి ఉండగా, అందులో 10 శాతం ముస్లింలను చేర్చి.. కాంగ్రెస్ ద్రోహం చేస్తోందన్నారు. మతపరమైన రిజర్వేషన్లతో దేశంలో అశాంతిని సృష్టించేందుకు ప్రయత్నం చేస్తున్నారా? ఇదేనా తెలంగాణ మోడల్ అంటే? అని ప్రశ్నించారు. బీసీల మెడలు కోసి.. మజ్లిస్ పార్టీ చేతుల్లో పెట్టే కుట్ర జరుగుతోందని దుయ్యబట్టారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒవైసీ కుటుంబానికి సీఎం పదవి ఇచ్చినా ఆశ్చర్యపోవాల్సిన పని లేదని ఎద్దేవా చేశారు. గతంలో ముస్లింలకు 4శాతం రిజర్వేషన్లనే హైకోర్టు కొట్టేసిందని, ఇప్పుడు 10శాతం రిజర్వేషన్లు ఎలా ఇస్తారని ప్రశ్నించారు.





నూతన వధూవరులు జయారెడ్డి-గుణచైతన్య రెడ్డిని ఆశీర్వదిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ సతీమణి గీత, కుమార్తె నైమిషా; వధూవరులతో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం, ఎమ్మార్పీఎస్ నేత మంద కృష్ణ తదితరులు

వైభవంగా జగ్గారెడ్డి కుమార్తె వివాహం

వధూవరులు జయారెడ్డి-గుణ చైతన్యరెడ్డిని ఆశీర్వదించిన మంత్రులు, ప్రముఖులు

సంగారెడ్డి, ఆగస్టు7 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జగ్గారెడ్డి, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల దంపతుల కుమార్తె జయారెడ్డి వివాహం గుణచైతన్యరెడ్డితో ఘనంగా జరిగింది. సంగారెడ్డిలోని రామ్‌మందిర్ వేదికగా గురువారం రాత్రి జరిగిన వేడుకకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, స్పీకర్ గడ్డం ప్రసాద్, సీఎం రేవంత్‌రెడ్డి సతీమణి గీత, కుమార్తె నైమిషారెడ్డి, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీతక్క, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, సీనియర్ నేతలు కేవీపీ రామచందర్‌రావు, వి.హనుమంతరావు, షబ్బీర్‌అలీ, ఎమ్మార్పీఎస్ అధినేత మంద కృష్ణ, కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల చైర్మన్లు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమానికి వేలాది మంది ప్రజలు, జగ్గారెడ్డి అభిమానులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

ప్రజలకు కష్టాలు.. ప్రశ్నిస్తే కేసులు

» కాంగ్రెస్ సర్కార్ చేసిందేమీ లేదు: హరీశ్ రావు

నర్సాపూర్/మెదక్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): అడ్డగోలు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పాలనలో ప్రజలకు కష్టాలు, ప్రశ్నించే ప్రతిపక్ష నేతలపై కేసులు తప్ప చేసిందేమీ లేదని మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 21 నెలలు అవుతున్నా.. ఇచ్చిన హామీలు నెరవేర్చక పోగా.. కమీషన్లు దండుకోవడం, గత ప్రభుత్వంపై కమిషన్లు వేయడం పనిగా పెట్టుకుందని మండిపడ్డారు. గురువారం మెదక్ జిల్లా నర్సాపూర్‌లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ఎన్నో పనులు చేశామని, రేవంత్ సర్కార్ ఏం చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కేసీఆర్, కేటీఆర్‌తో పాటు తనను తిట్టడమే పనిగా పెట్టుకున్నారని, ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి కూడా ఇదే విషయం ప్రస్తావిస్తూ కేసీఆర్‌ను తిట్టడం మానేసి పరిపాలనపై దృష్టి పెట్టాలని సూచించారని, ఈ విషయంపై రేవంత్ రెడ్డి ఆలోచించుకోవాలని అన్నారు.

రైతు మహాధర్నా నుంచి మధ్యలోనే వెళ్లిన హరీశ్

మెదక్ కలెక్టరేట్ వద్ద బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గురువారం రైతు మహాధర్నా నిర్వహించారు. ఇందులో హరీశ్ రావుతో పాటు మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి, ఎమ్మెల్యేలు సునీతారెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పద్మాదేవేందర్ రెడ్డి, క్రాంతికిరణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డితో రాష్ట్ర బీజేపీ నేతలు కుమ్మక్కు అయ్యారని ఆరోపించారు. ప్రధాని మోదీ కన్వర్టెడ్ బీసీ అంటూ రేవంత్ తీవ్ర వ్యాఖ్యలు చేస్తున్నా.. రాష్ట్ర బీజేపీ నేతలు మౌనంగానే ఉంటున్నారన్నారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా రైతుల ఆత్మహత్యలే చోటుచేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, రైతు మహాధర్నాకు హాజరైన హరీశ్ రావు ప్రసంగించకుండానే మధ్యలోనే వెళ్లిపోయారు. ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో పార్టీ అధిష్ఠానం అత్యవసర పిలుపు మేరకు ఆయన వెళ్లిపోయి ఉంటారని భావిస్తున్నారు.

కాళేశ్వరం నివేదికపై బీఆర్ఎస్ న్యాయపోరాటం?

» సుప్రీంకోర్టును ఆశ్రయించే యోచన

» ఏపీ తలపెట్టిన బనకచర్లపై కూడా

» ఢిల్లీ చేరుకున్న హరీశ్, వినోద్

హైదరాబాద్, సంగారెడ్డి, ఆగస్టు7 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం కమిషన్ ఇచ్చిన నివేదికపై న్యాయపోరాటం చేసేందుకు బీఆర్ఎస్ సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఇందుకోసం సుప్రీం కోర్టును ఆశ్రయించే యోచనలో ఉన్నట్లు తెలిసింది. ఈ మేరకు మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ గురువారం హడావుడిగా ఢిల్లీ వెళ్లారు. కేసీఆర్ సూచనల ప్రకారం హరీశ్ న్యాయనిపుణులతో చర్చిస్తారని తెలిసింది. రైతు సమస్యలపై మెదక్‌లో గురువారం నిర్వహించిన ధర్నాలో పాల్గొన్న హరీశ్.. ప్రసంగించకుండానే హుటాహుటిన ఎయిర్‌పోర్టుకు వెళ్లారు. అప్పటికే అక్కడ వేచి ఉన్న మాజీ ఎంపీ వినోద్, మరో ఇద్దరు న్యాయవాదులతో కలిసి ఢిల్లీ వెళ్లారు. కాగా, కాళేశ్వరం నివేదిక అసెంబ్లీకి రాకుండా అడ్డుకునేందుకు ఉన్న అవకాశాలపై బీఆర్ఎస్ దృష్టి సారించినట్లు సమాచారం. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారణ రాజకీయ ప్రేరేపితంగా జరిగిందని బీఆర్ఎస్ భావిస్తున్నట్లు సమాచారం. అలాగే, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తలపెట్టిన బనకచర్లను అడ్డుకునేందుకు బీఆర్ఎస్ తరఫున సుప్రీంకోర్టులో పిటిషన్ వేస్తారని సమాచారం. ఈ అంశాలపై హరీశ్.. సీనియర్ న్యాయవాదులతో గురువారం రాత్రి చర్చించినట్లు తెలిసింది.

అధికారంలోకి వస్తాం.. లెక్కలు సరి చేస్తాం!

» ఐఏఎస్‌లు రాజకీయాలెలా మాట్లాడతారు?

» బీసీ రిజర్వేషన్లపై రేవంత్‌రెడ్డిది డ్రామానే

» ఆయనకు కేసీఆర్ ఫోబియా: కేటీఆర్

హైదరాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : గత పదేళ్లలో రేషన్ కార్డులే ఇవ్వలేదంటూ కొందరు ఐఏఎస్‌లు అబద్ధాలు చెబుతున్నారని, వారి హోదాకు రాజకీయాలు మాట్లాడడం తగదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రెండున్నరేళ్లలో తాము అధికారంలోకి వస్తామని, అప్పుడు అందరి లెక్కలు సరి చేస్తామని హెచ్చరించారు. పోలీసులు సైతం అధికార పార్టీ నేతల ఆదేశాలు పాటిస్తూ.. బీఆర్ఎస్ శ్రేణులపై దౌర్జన్యానికి దిగుతున్నారని, కానీ.. ఇది ఎంతో కాలం నడవదన్నారు. తెలంగాణ భవన్‌లో గురువారం పరిగికి చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ల విషయంలో రేవంత్‌రెడ్డి డ్రామాలు ఆడుతున్నారని ధ్వజమెత్తారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పి ఓట్లు వేయించుకొన్న కాంగ్రెస్.. ఇప్పుడు రాహుల్‌గాంధీ ప్రధాని అయ్యాక ఇస్తామనడం విచిత్రంగా ఉందన్నారు. సీఎంకు కేసీఆర్ ఫోబియా పట్టుకొందని, ఆయన పేరు తీయకుండా ఉండలేని రుగ్మతతో బాధపడుతున్నారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్‌ను వీడిన 10మంది ఎమ్మెల్యేలది దౌర్భాగ్యమని, వారు ఏపార్టీలో ఉన్నామో చెప్పుకోలేని పరిస్థితిలో ఉన్నారని పేర్కొన్నారు. స్థానిక ఎన్నికల్లో గెలిచేందుకు అవినీతి డబ్బును కాంగ్రెస్ తేనుందని, జాగ్రత్తపడాలని బీఆర్ఎస్ శ్రేణులకు సూచించారు. కాంగ్రెస్ అరాచకాలు తగ్గాలంటే.. స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలని ప్రజలను కోరారు. బీఆర్ఎస్ పదేళ్లపాలనలో తెలంగాణ అభివృద్ధిపై మాత్రమే దృష్టి సారించామని, పార్టీ కార్యకర్తలను పట్టించుకోలేదని పేర్కొన్న కేటీఆర్.. ఈ సారి అధికారంలోకి వచ్చాక కార్యకర్తలను అన్నివిధాలా అభివృద్ధి పథంలోకి తీసుకొస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ ఉన్నంత కాలం గులాబీ కండువా ఉంటుందని, కాంగ్రెస్, బీజేపీని మట్టి కరిపించి మళ్లీ కేసీఆర్‌ను సీఎంను చేసుకుంటామని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా.. జాతీయ చేనేతదినోత్సవాన్ని పురస్కరించుకొని నేతన్నలకు కేటీఆర్ శుభాకాంక్షలు తెలిపారు.

యూఎస్ కాన్సుల్ జనరల్‌గా లారా విలియమ్స్ బాధ్యతల స్వీకరణ



హైదరాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని యూఎస్ కాన్సులేట్ కార్యాలయంలో అమెరికా కాన్సుల్ జనరల్‌గా లారా విలియమ్స్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భారత్ - అమెరికా సంబంధాల బలోపేతం కోసం కృషి చేస్తానని చెప్పారు. యూఎస్ కాన్సులేట్ కార్యాలయంలో మరింత నాణ్యమైన సాంకేతిక సేవలు అందిస్తామన్నారు. తెలంగాణ, ఏపీతో పాటు ఒడిశా రాష్ట్రాల పరిధిలో హైదరాబాద్ యూఎస్ కాన్సులేట్ జనరల్ కార్యాలయం సేవలందిస్తోంది. ఇదివరకు కౌన్సిల్ జనరల్‌గా పనిచేసిన జెన్నిఫర్ లార్సన్ ఇటీవల పదవీ విరమణ చేయడంతో ఆ స్థానంలో లారా విలియమ్స్ నియమితులయ్యారు. ఇంతకుముందు ఆమె, యుఎస్‌లో డిప్యూటీ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్‌గా (ఎంటర్‌ప్రైజ్ సర్వీసెస్) పనిచేసి సాంకేతిక, దౌత్యరంగాల్లో విశేష అనుభవం గడించారు. యూఎస్, కాన్సులర్ అఫైర్స్ బ్యూరో పరిధిలోని నేవీ సబ్‌మెరైన్ కమాండ్ విభాగంలో కాంట్రాక్టర్‌గా కూడా పనిచేశారు.

గ్రీన్ ఎనర్జీ కారిడార్‌కు అనుమతినివ్వండి

- కేంద్ర మంత్రి ఖట్టర్‌కు భట్టి విజ్ఞప్తి..



కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి

న్యూఢిల్లీ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): గ్రీన్ ఎనర్జీ కారిడార్ కింద తెలంగాణ ట్రాన్స్ కో ప్రతిపాదనలకు అనుమతినివ్వాలని కేంద్ర విద్యుత్తు శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌ను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కోరారు. గ్రీన్ ఎనర్జీ కారిడార్ మూడో దశలో సౌర విద్యుత్తు సంస్థ తొలుత ఐదు జిల్లాల్లో 13.5 గిగావాట్ల సామర్థ్యం గల గ్రీన్ పవర్ జోన్లను గుర్తించిందని.. ఇప్పుడు వాటి సామర్థ్యం 8 జిల్లాల్లో 19 గిగావాట్లకు విస్తరించాలని నిర్ణయించామని చెప్పారు. ఇందుకు రూ.6,895 కోట్లతో అంచనా వ్యయాన్ని కేంద్ర విద్యుత్తు ప్రాధికార సంస్థకు సమర్పించామని భట్టి వివరించారు. రాష్ట్రంలో గ్రీన్ పవర్ అభివృద్ధికి, గ్రిడ్ ఇంటిగ్రేషన్ వేగవంతం చేసేందుకు ఇది తోడ్పడుతుందని కేంద్రమంత్రికి తెలిపారు.



పీపుల్స్‌ప్లాజాలో ఏర్పాటు చేసిన చేనేత వస్త్ర ప్రదర్శనను ప్రారంభిస్తున్న మంత్రి తుమ్మల

తెలంగాణ చేనేతకు దేశవ్యాప్తంగా గుర్తింపు

- పీపుల్స్‌ప్లాజాలో వస్త్ర ప్రదర్శనను ప్రారంభించి చేనేత కళాకారులను సత్కరించిన మంత్రి తుమ్మల

ఖైరతాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని పీపుల్స్‌ప్లాజాలో ఏర్పాటు చేసిన చేనేత వస్త్ర ప్రదర్శనను వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చేనేత కళాకారులు తయారుచేసిన ఉత్పత్తులను పరిశీలించి వారిని అభినందించారు. త్రిళింగ పట్టు చీరలను, తెలంగాణ అథెంటిక్ వీవ్స్ లోగోను ఆవిష్కరించి, కొండా లక్ష్మణ్ బాపూజీ చేనేత పురస్కారాలకు ఎంపికైన కళాకారులను సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చేనేత రంగంలో తెలంగాణ దేశంలోనే ప్రత్యేక గుర్తింపును పొందిందని, కార్మికుల సంక్షేమం, జియోట్యాగింగ్ అభివృద్ధిలో తెలంగాణ మొదటిస్థానంలో ఉందని తెలిపారు. గద్వాల, నారాయణపేట, పోచంపల్లి ఇక్కత్, సిద్దిపేట గొల్లభామ చీరలు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాయన్నారు. జౌళిశాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్ మాట్లాడుతూ.. చేనేత కార్మికుల అభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపడుతోందన్నారు. నేతన్న పొదుపు కార్యక్రమం, నేతన్న భద్రత పథకంతో పాటు చేనేత రుణమాఫీ కోసం ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు 33 కోట్ల రూపాయల నిధులను విడుదల చేశామన్నారు.

ఆర్టీసీలో త్వరలో 3,038 పోస్టుల భర్తీ: సజ్జనార్

హైదరాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో త్వరలో 3,038 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వెలువడనున్నట్లు సంస్థ ఎండీ వీసీ సజ్జనార్ తెలిపారు. ఈ తరుణంలో ఆర్టీసీలో ఉద్యోగాలు ఇప్పిస్తామని కొందరు మోసగాళ్లు అమాయకుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న విషయం యాజమాన్యం దృష్టికి వచ్చిందని, అలాంటి వారి మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. ప్రభుత్వ అనుమతితో సంస్థలో పోస్టుల భర్తీకి కసరత్తు ప్రారంభమైందని, ప్రభుత్వ నియామక బోర్డుల ద్వారా నోటిఫికేషన్ త్వరలో వెలువడనుందని వివరించారు. ఆర్టీసీలో ఉద్యోగాల పేరుతో ఎవరైనా సంప్రదిస్తే యాజమాన్యం దృష్టికి తేవాలని, లేదా స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సజ్జనార్ తెలిపారు.

కిషన్‌రెడ్డి కుట్రలు సాగనివ్వం: మంత్రి పొన్నం

న్యూఢిల్లీ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చేస్తున్న కుట్రలను సాగనివ్వబోమని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రాష్ట్రపతి అపాయింట్‌మెంట్‌కు బీజేపీ నేతలే అడ్డుపడుతున్నారని ఆరోపించారు. తెలంగాణ ముఖ్యమంత్రి సహా మంత్రివర్గమంతా అపాయింట్‌మెంట్ అడిగితే రాష్ట్రపతి ఎందుకు కలవడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రపతిని కలవకుండా కిషన్‌రెడ్డి, బండి సంజయ్ అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. శాసనసభలో మద్దతు తెలిపిన బీజేపీ.. ఢిల్లీలో ఎందుకు అడ్డుకుంటోందని ప్రశ్నించారు. తెలంగాణలో ఒకలా, ఢిల్లీలో మరోలా.. ఇదేం ద్వంద్వ నీతి అని నిలదీశారు.

సివిల్ సప్లయ్స్ జీఎంలకు స్థాన చలనం

- ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులకు కీలక బాధ్యతలు

హైదరాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పౌరసరఫరాల సంస్థలో కీలక బాధ్యతలు నిర్వర్తించే పలువురు జనరల్ మేనేజర్లకు స్థానచలనం కలిగింది. కామారెడ్డి జిల్లా మేనేజరు జి. రాజేందర్‌ను హైదరాబాద్ ప్రధాన కార్యాలయంలో పీడీఎస్ (ప్రజా పంపిణీ వ్యవస్థ) జనరల్ మేనేజరుగా నియమించారు. పీడీఎస్ జీఎంగా పనిచేస్తున్న అలివేలు మంగమ్మను పీఐ- సెల్ జనరల్ మేనేజరుగా బదిలీ చేశారు. కామారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మేనేజరుగా కె.శ్రీకాంత్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ప్రధాన కార్యాలయంలో గ్రేడ్- 1 అధికారి హోదాలో పనిచేస్తున్న ఎ. సరితావాణిని ఆర్థిక విభాగం జనరల్ మేనేజరుగా నియమిస్తూ వైస్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డీఎస్ చౌహాన్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. జిల్లా మేనేజర్లుగా పనిచేస్తూ ఆరోపణలు ఎదుర్కొన్న ఒకరిద్దరు అధికారులకు ప్రధాన కార్యాలయంలో కీలక బాధ్యతలు అప్పగించటం చర్చనీయాంశంగా మారింది. కీలక పరిపాలన (అడ్మిన్) విభాగం జనరల్ మేనేజరు బాధ్యతలను ఇతర శాఖ నుంచి డిప్యుటేషన్‌పై వచ్చిన ఒక అధికారికి అప్పగించటంపై కొందరు కమిషనర్‌కు ఫిర్యాదుచేశారు.

సీఎస్ రామకృష్ణారావుతో దక్షిణ మధ్య రైల్వే జీఎం శ్రీవాస్తవ భేటీ

దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ గురువారం సచివాలయంలో తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావుతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా శ్రీవాస్తవ రాష్ట్రానికి సంబంధించిన పలు రైల్వే ప్రాజెక్టుల అభివృద్ధి అంశాలను ఆయనతో చర్చించారు. ప్రధానంగా రైల్వే ట్రాక్ విస్తరణ పనులకు త్వరితగతిన భూ సేకరణ పనులు పూర్తి చేయాలని కోరారు.

ఎర్రవల్లే చర్లపల్లి!

- కేసీఆర్ ప్రస్తుతం జైల్లోనే ఉన్నారు
- ఫామ్‌హౌస్‌లో తనను బంధించుకున్నారు
- ఎన్నికల్లో ఓడించడమే ఆయనకు పెద్ద శిక్ష
- మీడియాతో ఇష్టాగోష్ఠిలో సీఎం రేవంత్

న్యూఢిల్లీ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కొత్తగా జైల్లో పెట్టాల్సిన పని లేదని, ఆయనకు ఎర్రవల్లి ఫాంహౌసే చర్లపల్లి జైలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఆయన తనను తాను జైల్లో పెట్టుకున్నారని చెప్పారు. గురువారం ఢిల్లీలోని తన అధికార నివాసంలో రేవంత్ మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. "కేసీఆర్ ఫాంహౌస్‌కు, చర్లపల్లి జైలుకు తేడా ఏముంది? అక్కడా పోలీసులు ఉంటారు, ఇక్కడా ఉన్నారు. మధ్య మధ్యలో విజిటర్స్ వచ్చి మాట్లాడి వెళ్తారు. కేసీఆర్‌ను ఓడించడమే పెద్ద శిక్ష. కేసీఆరే కాదు. ఏ రాజకీయ నాయకుడికైనా ఎన్నికల్లో ఓడించడమే అతిపెద్ద శిక్ష. కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి నాకు తెలియదు. ప్రతిపక్ష నేత హోదాలో ఉన్నారు కాబట్టి ఆయనకు అనారోగ్య సమస్య తలెత్తితే మంచి వైద్యం అందించాలని ఆరోగ్య సెక్రటరీకి చెప్పా. కాకపోతే మా ఆరోగ్యం గురించి ఎవరికీ చెప్పేది లేదని అంటున్నారు. గతంలో జైపాల్ రెడ్డి ఆరోగ్యం విషయంలో అప్పటి ప్రభుత్వం ఇలానే స్పందించింది. వాజ్‌పేయి విషయంలోనూ ఆనాటి ప్రధాని రాజీవ్‌గాంధీ శ్రద్ధ తీసుకున్నారు. నేను విద్వేష రాజకీయాలు చేయను. నాకా అవసరం లేదు. కేసీఆర్ లాగా బిట్టర్ పాలిటిక్స్ నాకు రావు" అన్నారు. ఈవీఎంల్లో అవకవతకలు, ఓట్ల గల్లంతు అంశాలపైనా రేవంత్ రెడ్డి స్పందించారు. తాను కొడంగల్‌లో పోటీ చేసినప్పుడూ 15 వేల ఓట్లు మాయం చేశారని ఆరోపించారు. ఓటరు లిస్టులో ఓట్లు ఉన్నాయని, బూత్‌లోకి వెళితే మాయమయ్యాయని చెప్పారు. పోలింగ్ బూత్‌కు వెళితే, మరోచోటికి వెళ్లాలని చెబుతారని, అక్కడికి వెళితే మరో చోటికి వెళ్లమని అంటారని, ఇలా తిప్పడం ద్వారా ఓట్లు వేయకుండా చూస్తారని తెలిపారు. కుటుంబంలో ఐదు ఓట్లు ఉంటే రెండు మాయం చేయడం మరో పద్ధతి అన్నారు.

దుప్పటి కప్పుకొని పడుకొన్నా మాదే అధికారం

రాష్ట్ర ప్రజలు తమ పరిపాలన పట్ల ఎంతో సంతృప్తిగా ఉన్నారని చెప్పారు. ఇంట్లో దుప్పటి కప్పుకొని పడుకొన్నా మళ్లీ తమదే అధికారం అని తేల్చిచెప్పారు. ఏ ఎన్నికలు వచ్చినా సునాయసనంగా విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఒకసారి గెలిచిన తర్వాత అందరి ఇళ్లల్లోకి తొంగి చూడాలని, ప్రతి విషయంలో అత్యుత్సాహం ప్రదర్శిస్తే మళ్లీ గెలవడం కష్టమేనని బీఆర్ఎస్‌ను ఉద్దేశించి అన్నారు. వరుసగా రెండు, మూడు సార్లు గెలిచిన వాళ్లు తమ పని తాము చేసుకుంటూ వెళ్లే రకమని, అందుకే వాళ్లు మళ్లీ మళ్లీ విజయం సాధిస్తున్నారని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ నేతలకు నైతికత గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. వాళ్లు నైతికత పేరెత్తితే అది కూడా ఆత్మహత్య చేసుకుంటుందని చెప్పారు. పార్టీ ఫిరాయిస్తే వేటు పడుతుందని సుప్రీంకోర్టు తీర్పు ఇస్తే తమకే మంచిదని రేవంత్ రెడ్డి తెలిపారు. తమకున్న 65 మంది ఎమ్మెల్యేలు తమతోనే ఉంటారని అన్నారు. బిహార్ ఎన్నికలతోపాటే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు వస్తాయని సీఎం అభిప్రాయపడ్డారు.

బీజేపీ, బీఆర్ఎస్సే అడ్డు

(మొదటిపేజీ తరువాయి)

ఐఏఎస్‌కు ఎంపికయ్యారని, 1971 నుంచి నూర్ బాషా తదితరులకు బీసీ రిజర్వేషన్ల ఫలాలు అందాయని ప్రస్తావించారు. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు గుజరాత్‌లో ముస్లింలకు రిజర్వేషన్లు ఇచ్చామని మోదీ ఒక ఇంటర్వ్యూలో స్వయంగా చెప్పారని గుర్తు చేశారు. బీజేపీతో అంటకాగుతూ బీఆర్ఎస్ ఓబీసీ రిజర్వేషన్లకు శిఖండిలా అడ్డుపడుతోందని ఆరోపించారు.



ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డితో తెలంగాణ సచివాలయ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు

పీఏసీతో భేటీ తర్వాత కార్యాచరణ

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధనకు అన్ని ప్రయత్నాలు చేశామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ఇక ముందు ఏం చేయాలనే దానిపై హైదరాబాద్‌కు వచ్చిన తర్వాత రాజకీయ వ్యవహారాల కమిటీ(పీఏసీ)తో భేటీ అవుతామని చెప్పారు. మంత్రులు, పీఏసీతో చర్చించిన తర్వాత భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. "మూడు రోజులుగా ఢిల్లీలో అన్ని ప్రయత్నాలు చేశాం. మంత్రివర్గంతోపాటు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అందరం ఢిల్లీలోనే ఉన్నాం. ధర్నాకు ఇండియా కూటమిలోని 100 మంది ఎంపీలు హాజరై మద్దతు తెలిపారు. పార్లమెంటులో చర్చకు వాయిదా తీర్మానాలు ఇస్తే ప్రభుత్వం తోసిపుచ్చుతోంది. రాష్ట్ర ప్రభుత్వ పరంగా చిత్తశుద్ధితో అన్ని మార్గాల్లో ప్రయత్నాలు చేశాం. కేంద్రం నుంచి ఏ మాత్రం సహకారం లభించడం లేదు. తక్షణమే ఆ బిల్లులను ఆమోదించాలని రాష్ట్రపతికి విజ్ఞప్తి చేస్తున్నా" అని ముఖ్యమంత్రి అన్నారు. శిబు సోరెన్ అంత్యక్రియలు, ఓ కేసులో జార్ఖండ్ వెళ్లాల్సి రావడం వల్లే రాహుల్ జంతర్ మంతర్ ధర్నాకు రాలేక పోయారని రేవంత్ వివరించారు. ఆయనకు బీసీల సమస్యపై చిత్తశుద్ధి ఉంది కాబట్టే కుల సర్వే, బీసీ రిజర్వేషన్ల పెంపుపై తమ ప్రజెంటేషన్‌ను నాలుగు గంటలు సావధానంగా విన్నారని చెప్పారు. తెలంగాణ నమూనాను దేశమంతా తెలియజేసేందుకు తలకటోరా స్టేడియంలో జాతీయ స్థాయి సదస్సు పెట్టి వివరించారని గుర్తు చేశారు. రాహుల్ రాలేదని అంటున్న బీజేపీ నేతలు బీసీల కోసమైనా ధర్నా స్థలానికి రావొచ్చు కదా? అని ప్రశ్నించారు. పది రోజుల్లో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు తీసుకొచ్చిన బీజేపీకి బీసీ రిజర్వేషన్లపై ఎందుకు మనసు రావడం లేదని అడిగారు. చిత్తశుద్ధి ఉంటే ఒక్కరోజులోనే పూర్తి చేయొచ్చన్నారు. బీసీ రిజర్వేషన్ల పెంపుపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వాదనలు చెట్టుకింద ప్లీడర్‌లా, గల్లీ లీడర్‌లా ఉన్నాయని రేవంత్‌రెడ్డి విమర్శించారు. ముస్లింలు ముఖ్యమంత్రులు కావద్దనేలా ఆయన మాట్లాడటం సరికాదన్నారు. ముస్లింలను రాష్ట్రపతులు, ముఖ్యమంత్రులను చేసిన చరిత్ర కాంగ్రెస్‌కు ఉందన్నారు. ముస్లింలను తొలగిస్తే రిజర్వేషన్లు పెంచుతామని బీజేపీ నాయకులు చెబుతున్నారని, ఎలా తొలగిస్తారో? ఎలా పెంచుతారో? చేసి చూపించాలని సవాలు విసిరారు.

మోదీ అపాయింట్మెంట్ ఇవ్వలేదు

బీసీ రిజర్వేషన్లపై ప్రధాని అపాయింట్మెంట్ అడిగినా ఇవ్వలేదని రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ రిజర్వేషన్లతో కేంద్ర హోంశాఖతో సంబంధం లేనందున అమిత్ షా అపాయింట్మెంట్ కోరలేదని చెప్పారు. రిజర్వేషన్ల అమలుపై త్వరలోనే బీసీ సంఘాలు, బీసీ భాగస్వాములతో సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. గురువారం రాత్రి రాహుల్ గాంధీ కొంతమంది ఆత్మీయులకు విందు ఏర్పాటు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి కూడా ఆ విందుకు హాజరయ్యారు.

మా ముందు 3 మార్గాలు

42 శాతం రిజర్వేషన్ల అమలుకు చివరి వరకు ప్రయత్నిస్తామని, కుదరని పక్షంలో ప్రత్యామ్నాయ మార్గాల్లో స్థానిక ఎన్నికలకు వెళ్లాల్సి ఉంటుందని రేవంత్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. గురువారం మీడియా ప్రతినిధులతో రేవంత్ చిట్‌చాట్‌గా మాట్లాడారు. రిజర్వేషన్ల అమలుకు తమ వద్ద మూడు మార్గాలు ఉన్నాయన్నారు. 50 శాతం సీలింగ్‌కు అనుగుణంగా గత ప్రభుత్వం తెచ్చిన చట్టాన్ని పక్కన పెట్టి జీవో ఇవ్వడం ఒక మార్గమని చెప్పారు. జీవోపై ఎవరైనా కోర్టుకు వెళ్తే స్టే వచ్చే అవకాశం ఉందన్నారు. ఇప్పుడే స్థానిక ఎన్నికలు పెట్టకుండా ఆపడం రెండో మార్గమని చెప్పారు. దీనివల్ల కేంద్రం నుంచి రావాల్సిన నిధులు ఆగిపోతాయని, గ్రామాల్లో వ్యవస్థలు కుప్ప కూలుతాయని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఆపితే రాష్ట్రానికే నష్టమన్నారు. మూడో మార్గం పార్టీ పరంగా బీసీలకు 42 శాతం సీట్లు ఇవ్వాల్సి ఉంటుందని, ఈ అంశాన్ని తాము అమలు చేయడమే కాకుండా ఇతర పార్టీలను కూడా అమలు చేసే విధంగా ఒత్తిడి తెస్తామని అన్నారు.

బీసీ రిజర్వేషన్లపై పార్లమెంటులో ఒత్తిడి పెంచండి

- కాంగ్రెస్ చీఫ్ ఖర్గేకు సీఎం రేవంత్ విజ్ఞప్తి
- టీపీసీసీ చీఫ్, మంత్రులతో కలిసి భేటీ..

న్యూఢిల్లీ/హైదరాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికలు, విద్యా, ఉద్యోగ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్ల బిల్లులకు ఆమోదం తెలిపేలా కేంద్ర ప్రభుత్వంపై పార్లమెంటులో ఒత్తిడి తేవాలని ఏఐసీసీ చీఫ్, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గేకు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. గురువారం పార్లమెంటులో ఖర్గేతో సీఎం రేవంత్, టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్, మంత్రులతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో కులగణన సర్వే తీరు, శాసనసభలో బిల్లుల ఆమోదంపై ఖర్గేతోపాటు జైరాం రమేశ్ తదితరులకు సీఎం, పీసీసీ చీఫ్ వివరించారు. రాష్ట్రంలో రిజర్వేషన్ల సవరణకు సంబంధించిన ఆర్డినెన్స్‌ను గవర్నర్ ఆమోదించకుండా నెలల తరబడి పెండింగ్‌లో ఉంచిన విషయాన్ని ఖర్గే దృష్టికి తీసుకెళ్లారు. బిల్లులను ఆమోదించాలని కోరుతూ రాష్ట్రపతి అపాయింట్‌మెంట్‌కు ప్రయత్నిస్తున్నామన్నారు. బుధవారం జంతర్‌మంతర్‌లో రోజంతా ధర్నా నిర్వహించిన తీరు, ఇండీ కూటమిలోని పార్టీల ఎంపీలు సంఘీభావం తెలిపిన విషయాలను వివరించారు. సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు.

సచివాలయ బీసీ ఉద్యోగుల సంఘం నేతలను అభినందించిన సీఎం..

తెలంగాణ సచివాలయ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు ఢిల్లీలో సీఎం రేవంత్‌తో భేటీ అయ్యారు. బీసీ రిజర్వేషన్ల సాధన కోసం హస్తినలో జరిగిన మహాధర్నాలో పాల్గొన్న వారిని సీఎం అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం వెనుకబడిన వర్గాలకు సామాజిక న్యాయం కల్పించటానికి కట్టుబడి ఉందని ఈ సందర్భంగా సీఎం పునరుద్ఘాటించారని సంఘం ప్రతినిధులు టి.యాదగిరి, ఎం.శ్రీనివాస్ తెలిపారు. రిజర్వేషన్లు సాధించేవరకు అండగా ఉంటామని స్పష్టం చేసినట్లు వెల్లడించారు.



తెలంగాణ విద్యారంగానికి సేవలందిస్తాం..

- సీఎం రేవంత్‌తో అమిటీ వీసీ అతుల్ చౌహాన్

న్యూఢిల్లీ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో విద్యారంగం అభివృద్ధికి తమ వంతు సేవలందిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అమిటీ యూనివర్సిటీ చాన్స్‌లర్ అతుల్ చౌహాన్ తెలిపారు. గురువారం ఢిల్లీలోని అధికారిక నివాసంలో సీఎం రేవంత్‌ను ఆయన కలిశారు. తెలంగాణలో తమ యూనివర్సిటీ ఏర్పాటుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలపడంపై కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీతో ఒప్పందం చేసుకుంటామని.. ఆయా కార్యక్రమాల్లో భాగస్వాములమవుతామని చెప్పారు. మెరుగైన వసతులు, నాణ్యమైన విద్యా బోధనలో అమిటీకి మంచి పేరుందని, తెలంగాణలో మరింతగా రాణించేందుకు కృషి చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో అమిటీ యూనివర్సిటీ ప్రతినిధి రామచంద్రం పాల్గొన్నారు.

ఆధార్ అప్‌డేట్ ఉంటేనే ఉచిత ప్రయాణం

మహిళల కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మీ పథకం కింద.. ఇకపై ఉచితంగా బస్సు ప్రయాణం చేయాలంటే తప్పనిసరిగా ఆధార్ కార్డు అప్‌డేట్ చేసి ఉండాలని అధికారులు తెలిపారు. 'జీరో టిక్కెట్' జారీ చేసే సమయంలో ఆధార్ కార్డులో అప్‌డేట్ చేసిన ఫొటోతో పాటు తెలంగాణ చిరునామా ఉండాలని చెప్పారు. ఇటీవల పథకాన్ని అమలు చేసే క్రమంలో క్షేత్రస్థాయిలో కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నట్లు అధికారుల దృష్టికి వచ్చింది. ముఖ్యంగా నివాస ధ్రువీకరణ విషయంలో అవాంతరాలు తలెత్తుతుండడంతో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు ఆర్టీసీ అధికారులు స్పష్టం చేశారు.

దివ్యాంగ ఉద్యోగులకు శుభవార్త

- సాధారణ బదిలీల నుంచి మినహాయింపు

దివ్యాంగ ప్రభుత్వ ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త తెలిపింది. దివ్యాంగుల హక్కుల చట్టం 2016 ప్రకారం సాధారణ బదిలీల నుంచి వారికి మినహాయింపు ఇస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు స్త్రీ, శిశు, వికలాంగుల సంక్షేమ శాఖ ఉత్తర్వులిచ్చింది. 70% వైకల్యం కలిగిన ఉద్యోగులకు సాధారణ బదిలీల నుంచి మినహాయింపు ఉంటుంది. పదోన్నతి పొందినా పని చేస్తున్న స్థానంలోనే కొనసాగేందుకు వీలు కల్పించారు. బుద్ధి మాంద్యం ఉన్న పిల్లల తల్లిదండ్రులు ఉద్యోగులుగా ఉంటే వారు కోరుకున్న ప్రాంతంలోనే ఉద్యోగం చేసే వెసులుబాటు కల్పించింది.

డిస్కమ్‌లకు సర్కారు బకాయిలు 14,928 కోట్లు

నాలుగేళ్లలోగా చెల్లించాలని సుప్రీంకోర్టు ఆదేశం.. 2024 ఏప్రిల్ 1 తర్వాత బాకీలైతే మూడేళ్లలోపే!

- సబ్సిడీ సొమ్ము ముందే డిపాజిట్ చేయాలని నిర్దేశం
- సర్కారీ శాఖల బాకీలు రూ.28,842.72 కోట్లు అదనం
- రెండూ కలిపితే మొత్తం బకాయిలు.. రూ.43,770 కోట్లు



హైదరాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా డిస్కమ్‌లకు ప్రభుత్వాలు సుమారు రూ.1.75 లక్షల కోట్ల మేర బకాయిలను నాలుగేళ్లలోగా చెల్లించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. 2024 ఏప్రిల్ 1వ తేదీ తర్వాత ఏర్పడ్డ బాకీలను మూడేళ్లలోపు కట్టాలని స్పష్టం చేసింది. డిస్కమ్‌ల బకాయిలపై దేశ అత్యున్నత న్యాయస్థానం గురువారం స్పష్టమైన తీర్పునిచ్చింది. విద్యుత్ సరఫరాకు అయ్యే వ్యయంపై వార్షిక ఆదాయ అవసరాలు దాఖలు చేస్తున్నప్పటికీ.. పూర్తిస్థాయి వ్యయాన్ని వినియోగదారుల నుంచి రాబట్టుకోవడానికి విద్యుత్ నియంత్రణ మండళ్లు అనుమతి ఇవ్వట్లేదని, దీనివల్ల విద్యుత్ అప్పిలేట్ అథారిటీని ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొందని, ప్రభుత్వాలు బకాయిలు విడుదల చేయడం లేదంటూ దాఖలైన కేసును విచారించి సుప్రీం ఈమేరకు తీర్పు వెలువరించింది. విద్యుత్ సవరణ నిబంధనలు-2024 ప్రకారం ఒక యూనిట్‌కు అయ్యే పూర్తి వ్యయాన్ని వినియోగదారుల నుంచి రాబట్టుకునేలా టారిఫ్ ఆర్డర్ ఉండాలని, ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వదలుచుకుంటే ప్రత్యేకంగా ఒక ఖాతాను ఏర్పాటు చేసి, ఆ ఖాతాలో ముందస్తుగా జమచేయాలని రూల్స్ చెబుతున్నాయి. కాగా.. తెలంగాణ ప్రభుత్వం డిస్కమ్‌లకు రూ.14,928 కోట్లు బకాయిలు చెల్లించాల్సి ఉంది. వాస్తవానికి ఈ బాకీ ఇప్పటిది కాదు. గత ప్రభుత్వం తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి(టీజీఈఆర్సీ)కి ఇచ్చిన హామీలో భాగం. ట్రూఅప్ చార్జీలపై టీజీఈఆర్సీ తీర్పు వెలువరించే క్రమంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. 2016-17 నుంచి 2022-23 ఆర్థిక సంవత్సరం దాకా అంచనా వేసిన విద్యుత్ వ్యయం కన్నా.. వాస్తవికంగా అయిన వ్యయం రూ.12,550 కోట్లు ఎక్కువని మండలి నిర్ణయానికి వచ్చింది. ఆ మొత్తాన్ని వినియోగదారుల నుంచి వసూలు చేయాలని డిస్కమ్‌లు నిర్ణయించగా.. అప్పట్లో ప్రభుత్వం జోక్యం చేసుకొని, ఐదు సమాన వాయిదాల్లో ఈ మొత్తాన్ని చెల్లిస్తామని ఈఆర్సీకి హామీ ఇచ్చింది. గత ప్రభుత్వం అధికారంలో ఉండగానే ఒక వాయిదా చెల్లించాల్సి ఉన్నప్పటికీ.. అలా చేయలేదు. అంతేకాకుండా ఇంధన సర్దుబాటు చార్జీల రూపంలో కూడా రూ.2378 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఈ నిధులను తామే చెల్లిస్తామని గత ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఆ మొత్తాన్నీ చెల్లించలేదు. ఆ రెండూ కలిపి.. బాకీ రూ.14,928 కోట్లు అయింది. ఈ వివరాలను ప్రభుత్వం సుప్రీంకోర్టుకు అఫిడవిట్ రూపంలో సమర్పించింది.

కీలక సబ్సిడీ ముందస్తుగానే..

రాష్ట్రంలో 28,67,210 వ్యవసాయ పంపుసెట్లకు 24 గంటల పాటు ఉచితంగా విద్యుత్‌ను అందిస్తున్నారు. దీని కింద ఏటా రూ.11,232 కోట్లు సబ్సిడీగా.. 12 సమాన వాయిదాల్లో ఒక నెల ముందే ప్రభుత్వం విడుదల చేస్తోంది. ఇక 200 యూనిట్ల దాకా గృహజ్యోతి కింద ఉచిత విద్యుత్‌ను అందిస్తుండగా.. దీన్ని మాత్రం బిల్లులు జారీ చేసిన తర్వాత లెక్క చూసి, విడుదల చేస్తున్నారు.

సర్కారు శాఖల బాకీలు ఫుల్లు

సుప్రీంకోర్టు తీర్పు ప్రభుత్వం ఇచ్చే బకాయిలకే పరిమితం కానుంది. వివిధ ప్రభుత్వ శాఖలు కట్టాల్సిన బకాయిలపై దీని ప్రభావం ఉండబోదు. ఆయా శాఖలే నేరుగా డిస్కమ్‌లకు చెల్లింపులు చేయాల్సి ఉంటుంది. 2023 అక్టోబరు 31 దాకా వివిధ ప్రభుత్వ శాఖలు డిస్కమ్‌లకు కరెంట్ బిల్లుల రూపంలో కట్టాల్సిన బాకీలు రూ.28,842.72 కోట్లు. ప్రభుత్వం నుంచి బకాయిలు సకాలంలో రాకపోవడంతో డిస్కమ్‌లు వివిధ సంస్థలు/బ్యాంకుల నుంచి రూ.30406 కోట్లు రుణాల రూపంలో తీసుకున్నాయి.

(రూ.కోట్లలో)

శాఖలు	2-6-2014కు ముందు బాకీలు	31-10-2023 నాటికి బాకీలు
ఎత్తిపోతల పథకాలు	150.28	14193
మిషన్ భగీరథ	35.40	3558.83
పంచాయతీరాజ్	769.99	4393.99
వాటర్‌బోర్డు	362.04	3932.47
మునిసిపాలిటీలు	131.37	1657.81
కేంద్రప్రభుత్వ శాఖలు	82.55	720.34
మొత్తం	1595.37	28842.72

18 ఏళ్లలోపు దివ్యాంగులకూ పింఛను ఇవ్వండి

- కేంద్ర మంత్రి వీరేంద్రకుమార్‌కు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ విజ్ఞప్తి



కేంద్ర మంత్రి వీరేంద్రకుమార్‌కు వినతి పత్రం ఇస్తున్న రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్

హైదరాబాద్, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులైన 18 ఏళ్ల లోపు బాలలకు కూడా దివ్యాంగుల పింఛను ఇవ్వాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అలాగే దివ్యాంగుల పింఛను కింద ఇచ్చే మొత్తాన్ని రూ.3 వేలకు పెంచాలని కోరారు. ఈ మేరకు కేంద్ర సామాజిక న్యాయ, సాధికార శాఖ మంత్రి వీరేంద్రకుమార్‌కు గురువారం ఓ వినతి పత్రం అందజేశారు. తెలంగాణ వికలాంగుల కార్పొరేషన్ ఛైర్మన్ ముత్తినేని వీరయ్యతో కలిసి కేంద్ర మంత్రిని న్యూఢిల్లీలో కలిసిన అడ్లూరి లక్ష్మణ్ దివ్యాంగుల సంక్షేమానికి సంబంధించి కీలక ప్రతిపాదనలు చేశారు. ప్రస్తుతం ఉన్న దివ్యాంగుల పింఛనును రూ.300 నుంచి రూ.3వేలకు పెంచాలని కోరారు. 40 శాతం వైకల్యంతో బాధపడుతున్న వారికి కూడా వికలాంగులకు అందించే ఉచిత పరికరాలను ఇవ్వాలని అడిగారు. 2014లో కేంద్రంలో బీజేపీ అధికారం చేపట్టిన తర్వాత దివ్యాంగుల పింఛను మొత్తాన్ని పెంచలేదనే విషయాన్ని లక్ష్మణ్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. 18-79 ఏళ్లలోపు వయస్సు ఉన్న దివ్యాంగులకు రూ.300, 80 ఏళ్లు పైబడిన వారికి రూ.500 చొప్పున కేంద్రం పింఛనుగా ఇస్తోందని తెలిపారు. కేంద్ర బడ్జెట్ రూ.20 లక్షల కోట్లు దాటిందని, వికలాంగుల హక్కుల చట్టం 2016 ప్రకారం 5 శాతం బడ్జెట్ అంటే రూ.లక్ష కోట్లను దివ్యాంగులకు కేటాయించాలని పేర్కొన్నారు. ఆ నిధులను పింఛను మొత్తాన్ని రూ.3 వేలు చేసేందుకు కేటాయించాలని కోరారు. కాగా, ప్రస్తుతం 80 శాతం వైకల్యం ఉన్నవారికే పింఛను ఇస్తున్నారని, కానీ చట్ట ప్రకారం 40 శాతం వైకల్యం ఉన్నవారు కూడా సంక్షేమ పథకాలకు అర్హులని అడ్లూరి చెప్పారు. 40 శాతం వైకల్యం ఉన్న దివ్యాంగులకు తెలంగాణలో పింఛను ఇస్తున్నామని, ఉచితంగా పరికరాలు ఇస్తున్నామని కేంద్ర మంత్రికి ఈ సందర్భంగా వివరించారు. వికలాంగులు పుట్టిన వెంటనే వైకల్య ధ్రువీకరణ పత్రం ఇచ్చి రూ.4016 పింఛను ఇస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే ఈ పింఛను రూ.6 వేలకు పెంచుతున్నామని, కేంద్రం కూడా తెలంగాణను ఆదర్శంగా తీసుకుని దివ్యాంగులకు న్యాయం చేయాలని విన్నవించారు.

గంజాయి మత్తులో మెడికోలు..

- విక్రేతల వద్ద విద్యార్థుల కాంటాక్టు నంబర్లు
- పరీక్షల్లో 9 మందికి పాజిటివ్.. వారిలో ఇద్దరు అమ్మాయిలు
- తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమక్షంలో కౌన్సెలింగ్

హైదరాబాద్ సిటీ, మేడ్చల్ టౌన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ప్రాణాలు కాపాడే వైద్యవిద్యను అభ్యసిస్తున్న మెడికోలు గంజాయి మత్తులో తూలుతున్నారు. గంజాయి విక్రయం కేసులో ఇటీవల బొల్లారం ప్రాంతానికి చెందిన అర్బాత్ అహ్మద్, బీదర్‌కు చెందిన జరీనా బేగంను పోలీసులు అరెస్టు చేశారు. వారి ఫోన్‌లోని కాల్‌డాటా ఆధారంగా వారి నుంచి గంజాయి కొనుగోలు చేస్తున్న వారి వివరాల కోసం ఆరా తీశారు. అర్బాత్ వద్ద నుంచి మేడ్చల్ పరిసర ప్రాంతాల్లో ఉన్న పలు కళాశాలలకు చెందిన 64 మంది విద్యార్థులు గంజాయి కొనుగోలు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. వారిలో 26 మంది మెడిసిటీ వైద్య కళాశాల విద్యార్థులుగా గుర్తించి వారికి వైద్య పరీక్షలు నిర్వహించగా 9 మంది మెడికోలకు పాజిటివ్ అని తేలింది. వారిలో ఇద్దరు అమ్మాయిలు ఉన్నారు. దీంతో వారిని డీఎడిక్షన్ సెంటర్‌కు పంపినట్టు తెలిపారు. మరికొంత మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. గంజాయి కొనుగోలు చేస్తున్న మెడికోలకు వారి తల్లిదండ్రులు, మెడిసిటీ కళాశాల ప్రిన్సిపాల్ దేవేందర్ సింగ్, హెచ్‌ఓడీ డాక్టర్ పవన్‌కుమార్ శర్మల సమక్షంలో ఈగల్ పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా విద్యాసంస్థల్లో ఆకస్మిక తనిఖీలు కొనసాగిస్తామని తెలిపారు.

హైకోర్టులో గుండెపోటుతో న్యాయవాది మృతి



హైదరాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): హైకోర్టులో విధుల్లో ఉన్న ఖమ్మం జిల్లా ఇల్లందుకు చెందిన న్యాయవాది, మాజీ స్పెషల్ జీపీ పర్సా అనంత నాగేశ్వర్ రావు(45) గురువారం గుండెపోటుతో మృతిచెందారు. మధ్యాహ్నం 2.15 గంటల సమయంలో ఆయన న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, జడ్జిల సెక్యూరిటీ సిబ్బంది చూస్తుండగానే బెంచిపై ఓ పక్కకు ఒరిగిపోతూ ప్రాణాలు కోల్పోయారు. అక్కడే ఉన్న సెక్యూరిటీ సిబ్బంది సీపీఆర్ చేస్తూ.. ప్రాణాలను కాపాడేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. నాగేశ్వర్‌రావు మృతి పట్ల హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్, న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ తదితరులు ప్రగాఢ సంతాపం వ్యక్తంచేశారు.

దండకారణ్యంలో మావోయిస్టుల వారోత్సవాలు

చర్ల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు అమర వీరుల సంస్మరణ వారోత్సవాలు దండకారణ్యంలో ఘనంగా ముగిశాయి. ప్రతిఏటా మాదిరిగానే జూలై 28 నుంచి ఆగస్టు 3వరకు ఈ వారోత్సవాలు నిర్వహించినట్టు మావోయిస్టులు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టుల ఏరివేత కార్యక్రమం ఉధృతంగా సాగిస్తోన్న వేళ.. ఇంతటి కఠిన పరిస్థితుల్లో అమర వీరుల వారోత్సవాలను ఘనంగా నిర్వహించినట్లు మావోయిస్టు పార్టీ పేర్కొంది. ఈ మేరకు 15 నిమిషాల నిడివి ఉన్న వీడియోను సైతం విడుదల చేసింది. ఈ ఉత్సవాలకు భారీ సంఖ్యలో పార్టీ సానుభూతి పరులు, స్థానిక గిరిజనులు హాజరయ్యారు. అడవిలోని ఓ ఊరి చివరి నుంచి బ్యానర్లు పట్టుకుని, నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించినట్టు అందులో ఉంది.

ట్యాపింగ్‌పై సంజయ్ చేతిలో కీలక ఆధారాలు!

- నేడు సిట్ ఎదుట హాజరై అందించనున్న కేంద్ర మంత్రి

హైదరాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చేతికి కీలక ఆధారాలు అందినట్లు తెలిసింది. శుక్రవారం సిట్ ఎదుట హాజరై సదరు ఆధారాలను ఆయన అందించనున్నట్లు సమాచారం. కాగా, ఫోన్ ట్యాపింగ్ అంశంలో కేసీఆర్, కేటీఆర్ పాత్రపై కేంద్ర నిఘా వర్గాలు ఇప్పటికే కొన్ని ఆధారాలు సేకరించినట్లు బీజేపీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ మేరకు ఢిల్లీ నుంచి ముగ్గురు హోంశాఖ అధికారులు హైదరాబాద్ చేరుకోగా, వారితోపాటు ఎస్ఐబీ, కౌంటర్ ఇంటలిజెన్స్ విభాగాల్లో పనిచేసిన కొంతమంది సీనియర్ అధికారులతో సంజయ్ భేటీ అయ్యారు. నాటి ప్రభుత్వం.. సంజయ్ ఫోన్‌ను అత్యధికంగా ట్యాప్ చేసినట్లు గుర్తించడమే కాకుండా, సంబంధిత ఆధారాలను సంజయ్‌కు అందించినట్లు తెలిసింది. కాగా, కేంద్ర మంత్రి బండి సంజయ్ శుక్రవారం ఉదయం 11 గంటలకు ఖైరతాబాద్‌లోని హనుమాన్ ఆలయాన్ని దర్శించుకుంటారు. అనంతరం, రాజ్‌భవన్ సమీపంలోని దిల్‌కుషా గెస్ట్‌హౌజ్‌కు చేరుకుంటారు. మధ్యాహ్నం 12 గంటలకు సిట్ విచారణకు హాజరవుతారు.

డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపండి:డీజీపీ

హైదరాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్, గంజాయి, ఇతర నిషేధిత మత్తు పదార్థాలపై ఉక్కుపాదం మోపాలని కమిషనర్లు, ఎస్పీలకు డీజీపీ జితేందర్ ఆదేశించారు. ఆయా కేసుల్లో రాష్ట్రంలో పట్టుబడిన వాటితో సరిపెట్టుకోకుండా, డ్రగ్స్ ఎక్కడి నుంచి రాష్ట్రంలోకి ప్రవేశిస్తున్నాయనే మూలాల్ని గుర్తించి పట్టుకోవాలని సూచించారు. అర్ధవార్షిక నేర సమీక్షా సమావేశం రెండో రోజు డీజీపీ కార్యాలయంలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా డీజీపీ జితేందర్ మాట్లాడుతూ.. డ్రగ్స్, నిషేధిత మత్తుపదార్థాల వినియోగాన్ని పూర్తిస్థాయిలో అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని, ప్రభుత్వ ఆకాంక్షకు తగ్గట్లుగా కమిషనర్లు, ఎస్పీలు కఠినంగా వ్యవహరించాలని అన్నారు. అనంతరం అదనపు డీజీపీ మహేశ్ భగవత్ మాట్లాడుతూ, రైతులకు శాపంగా మారిన నకిలీ విత్తనాలు, ఎరువులపై ఉక్కుపాదం మోపాలని, ఇవి విక్రయించే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని ఆదేశించారు.

సృష్టి ఫర్టిలిటీ కేసు.. ఇద్దరు విశాఖ వైద్యుల అరెస్టు

హైదరాబాద్ సిటీ/అడ్డగుట్ట, విశాఖపట్నం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టిస్తున్న 'సృష్టి' ఫర్టిలిటీ సెంటర్ కేసులో హైదరాబాద్ పోలీసులు విశాఖకు చెందిన ఇద్దరు వైద్యులను అరెస్టు చేశారు. డాక్టర్ నమ్రత స్నేహితులుగా ప్రచారంలో ఉన్న వీరిలో ఒకరు కేజీహెచ్ అనస్థీషియా విభాగంలో పనిచేస్తున్న రవి కాగా, మరొకరు గైనకాలజీ విభాగంలో పనిచేస్తున్న ఉషగా చెబుతున్నారు. మూడు రోజులుగా డాక్టర్ రవి సెలవులో ఉన్నారు. సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ అడ్డగోలు వ్యవహారాల్లో వీరి పాత్ర ఉన్నట్టు పోలీసులు గుర్తించారు.

జీఎస్టీ అప్పిలేట్ ట్రైబ్యునల్ సభ్యుడిగా వేమిరెడ్డి భాస్కర్ రెడ్డి



హైదరాబాద్, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ అప్పిలేట్ ట్రిబ్యునల్ జ్యుడీషియల్ సభ్యుడిగా తెలంగాణ హైకోర్టు సీనియర్ న్యాయవాది వేమిరెడ్డి భాస్కర్ రెడ్డిని కేంద్ర ప్రభుత్వం నియమించింది. మొత్తం 53 మంది జ్యుడీషియల్ సభ్యులను నియమించగా అందులో ఆయన ఒకరు కావడం గమనార్హం. వేమిరెడ్డి 1987లో న్యాయవాదిగా పేరు నమోదు చేసుకున్నారు. 2022లో సీనియర్ న్యాయవాదిగా హైకోర్టు గుర్తింపు పొందారు. పన్నుల చట్టాల్లో నైపుణ్యం ఉండటంతో ఆయనకు ఈ అవకాశం దక్కింది.

తీన్మార్ మల్లన్నపై చర్యలు తీసుకోండి

- డీజీపీ, ప్రభుత్వానికి ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఆదేశాలు జారీ

హైదరాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): గత నెలలో ఒక సమావేశంలో జాగృతి నాయకురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై అనుచిత వ్యాఖ్యలు చేసిన చింతపండు నవీన్ (తీన్మార్ మల్లన్న)పై చర్యలు తీసుకోవాలని డీజీపీ, రాష్ట్ర ప్రభుత్వానికి జాతీయ మానవ హక్కుల కమిషన్(ఎన్‌హెచ్‌ఆర్‌సీ) ఆదేశాలు జారీ చేసింది. ఈ అనుచిత వ్యాఖ్యలపై హైదరాబాద్‌కు చెందిన కారుపోతుల రేవంత్ ఎన్‌హెచ్‌ఆర్‌సీకి ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ చేపట్టిన ఎన్‌హెచ్‌ఆర్‌సీ.. మహిళా ఎమ్మెల్సీపై అనాలోచితంగా, అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన తీన్మార్ మల్లన్నపై చర్యలు తీసుకుని, నాలుగు వారాల్లో నివేదిక సమర్పించాలని గురువారం డీజీపీ, రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది.



జూబ్లీహిల్స్ రోడ్లపై భారీగా నిలిచిన వరద నీరు



పంజాగుట్ట జంక్షన్‌లో వాహనాల రద్దీ

హైదరాబాద్‌పై వరుణ గర్జన

(మొదటిపేజీ తరువాయి)

నాలుగు రోజుల క్రితమే భారీ వర్షంతో ఉక్కిరిబిక్కిరైన హైదరాబాద్‌లో వరుణుడు మరోసారి గర్జించాడు. దీంతో జనజీవనం ఉక్కిరిబిక్కిరైంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో సాయంత్రం 6:30 నుంచి 8 గంటలవరకు వర్షం పడింది. క్షణాల్లోనే వరద పోటెత్తింది. రోడ్లు చెరువులను తలపించాయి. కార్ల అద్దాల వరకూ నీళ్లొచ్చాయంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవొచ్చు. ప్రవాహ తీవ్రతకు రోడ్డు పక్కన, ఇళ్ల వద్ద పార్క్ చేసిన బైక్‌లు కొట్టుకుపోయాయి. ఎక్కడికక్కడ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడటంతో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. లోతట్టు ప్రాంతాలు, కాలనీలు జలమయమయ్యాయి. ఇళ్లలోకి నీళ్లు రావడంతో చిన్నారులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బస్తీల్లో బియ్యం, పప్పులు తదితర నిత్యావసరాలు తడిసిముద్దవడంతో బడుగుజీవుల పరిస్థితి దయనీయంగా మారింది. కూకట్‌పల్లి, మూసాపేట, అమీర్‌పేట, ఎస్సార్‌నగర్, మధురానగర్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, మాదాపూర్, గచ్చిబౌలి, రాయదుర్గం, ఖైరతాబాద్, కోఠి, మలక్‌పేట, దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్, వనస్థలిపురం, హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్ తదితరచోట్ల భారీ వర్షం పడింది. ఆరాంఘర్, సూరారం మల్లారెడ్డి కాలేజీ, లింగపల్లి రైల్వే అండర్‌బ్రిడ్జి, బండ్లగూడ రత్నదీప్ సూపర్‌మార్కెట్, గంగారం, చందానగర్ ప్రాంతాల్లో 4-5 కి.మీ మేర వాహనాలు నిలిచిపోయాయి. పలుచోట్ల చెట్లు కూలిపోయాయి. విద్యుత్తు వైర్లు తెగిపడటంతో విద్యుత్తు సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గ్రేటర్ పరిధిలో 43 ఫీడర్ల పరిధిలో విద్యుత్తు సరఫరా సమస్యలు ఏర్పడ్డాయి. లంగర్‌హౌస్, ప్రశాంత్‌నగర్, వినాయక్‌నగర్, రామంతాపూర్‌లోని శ్రీనివాసకాలనీ, ముషీరాబాద్, అంబర్‌పేట్, సికింద్రాబాద్ తదితర ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. బంజారాహిల్స్ రోడ్ నంబర్-12 వెంగళరావు భవనం వద్ద విద్యుత్తు స్తంభం పడిపోయింది. శేరిలింగంపల్లి ఖాజాగూడ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రాంతంలో రాత్రి 11 గంటల వరకు 13.3 సెం.మీ వర్షపాతం నమోదైంది. గచ్చిబౌలిలో 12.6 సెం.మీ, శ్రీనగర్ కాలనీలో 11.13, సరూర్‌నగర్‌లో 11.3, మణికొండలో 10.9, ఖైరతాబాద్‌లో 10.4, ఎల్బీనగర్‌లో 9.7 సెం.మీ వర్షపాతం నమోదైంది. యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)లో 14.8 సెం.మీ వర్షపాతం నమోదైంది. జిల్లాలోని అడ్డగూడూరులో 12.1, వలిగొండలో 10.4, నల్లగొండ జిల్లా శాలిగౌరారంలో 13.6, సూర్యాపేట జిల్లా నడిగూడెం 9.3 సెం.మీ వర్షపాతం నమోదైంది. కాగా వర్షాలు, వరదల కారణంగా రంగారెడ్డి జిల్లా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆ జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబు ఆదేశించారు. ఈ మేరకు గురువారం ఆయన సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలపై దృష్టిసారించి.. అవసరమైతే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి సిద్ధంగా ఉండాలని సూచించారు. ప్రజలకు అత్యవసర సేవలు అందించడంలో ఏమాత్రం అలసత్వం ప్రదర్శించకూడదని, అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. కాగా ఆకస్మిక వర్షాలు, వరదలపై జీహెచ్‌ఎంసీ పరిధిలోని అధికారులు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఆదేశించారు. గురువారం ఆయన పోలీస్ కమాండ్ కంట్రోల్ కార్యాలయం నుంచి అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. నగరంలో కొన్నిచోట్ల 12 సెం.మీ వర్షపాతం నమోదైందని చెబుతూ రోడ్లపై ట్రాఫిక్ సమస్యలు ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని చెప్పారు. డ్రైనేజీ మూతలు ఎట్టి పరిస్థితుల్లోనూ తొలగించొద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కాగా వర్షాలు, వరదల కారణంగా నగరంలో ఏర్పడిన పరిస్థితులను ఎదుర్కొనేందుకు 250 బృందాలు పని చేస్తున్నాయని సీఎస్‌కు అధికారులు వివరించారు. విద్యుత్తు సరఫరాకు సంబంధించి 250 ఫిర్యాదులు వచ్చాయని.. వీటిలో 149 సమస్యలను వెంటనే పరిష్కరించినట్లు చెప్పారు.



వర్షం కారణంగా అమీర్‌పేట్ మెట్రో స్టేషన్‌ను పోటెత్తిన జనం

అధికారులు అప్రమత్తంగా ఉండాలి: సీఎం

హైదరాబాద్ సహా రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. రానున్న రెండు రోజులు వర్షాలు ఉంటాయనే సమాచారం ఉన్నందున కలెక్టర్లు జిల్లాల్లోని అన్ని విభాగాలతో ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని ఆదేశించారు. హైదరాబాద్‌లో పలు ప్రాంతాల్లో గురువారం అర్ధరాత్రి వరకు భారీ వర్ష సూచన ఉన్నందున అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలని అదేశించారు. జీహెచ్‌ఎంసీతోపాటు పోలీస్, ట్రాఫిక్, హైడ్రా విభాగాల అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లో తగిన ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు. హైదరాబాద్‌లో ప్రజలు అత్యవసరమైతే తప్ప తమ ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా, విద్యుత్తు సరఫరాలో అంతరాయం లేకుండా అధికారులు తగిన చర్యలు చేపట్టాలన్నారు. వర్షాలు, వరదలతో ఎటువంటి పరిస్థితి వచ్చినా ఎదుర్కొనేందుకు, ఎలాంటి సహాయమైనా అందించేందుకు అధికారులు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

మహానగరంలో వాన నీటి కష్టాలు తొలగించేలా.. వరద నీటికి మాస్టర్‌ప్లాన్..!

- ముంపు ముప్పు తగ్గింపు.. మెరుగైన నీటి నిర్వహణ
- భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ప్రణాళిక
- జీహెచ్‌ఎంసీకి బాధ్యతలు అప్పగింత

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఆధునిక హంగులతో విశ్వనగరంగా పరుగులు తీస్తున్న భాగ్యనగరంలో.. చినుకు పడుతోందంటే మాత్రం వణుకే. మహా నగరంలో చిన్న వర్షం పడితేనే రోడ్లన్నీ జలమయమవుతాయి. రహదారులపై వరదనీరు నిలవడానికి ప్రధాన కారణం సరైన వరద నీటి ప్రవాహ వ్యవస్థ లేకపోవడం, ఏళ్ల తరబడి పూడికతీత పనులు సక్రమంగా జరగకపోవడం, నాలాలు ఆక్రమణకు గురై కుచించుకు పోవడమే. నగరంతో పాటు తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ (టీసీయుఆర్) పరిధిలో.. ఇకపై వాననీటి కష్టాలు తొలగించేలా ప్రభుత్వం మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసింది. మెరుగైన వరద నీటి నిర్వహణ, ముంపు ముప్పునకు చెక్ పెట్టేలా సమగ్ర వరద నీటి నిర్వహణ మాస్టర్ ప్లాన్ రూపకల్పనకు అనుమతినిస్తూ గురువారం పురపాలక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బాధ్యతలను జీహెచ్‌ఎంసీకి అప్పగించింది. వరద నీటి అంచనా, నివారణ చర్యలు, నీటి నిర్వహణ, పునరావాస వ్యూహాలు ద్వారా వరద నష్టాన్ని తగ్గించేలా ప్రణాళిక రూపొందించడమే లక్ష్యమని ఉత్తర్వుల్లో పేర్కొంది.

మాస్టర్‌ప్లాన్‌లో ఉండాల్సిన కనీస విషయాలు..

- క్షేత్రస్థాయిలో వరద నీటి ప్రవాహ వ్యవస్థ డేటా సేకరించాలి. ఆయా ప్రాంతాల్లో నమోదైన వర్షపాతం, భూభాగం, మ్యాన్ హోళ్లు తదితర సమాచారం లైడార్, జీఐఎస్ సర్వే ద్వారా గుర్తించాలి.
- 2047 నాటికి జరుగనున్న అభివృద్ధిని అంచనా వేసి 1డీ, 2డీ హైడ్రాలాజికల్ మోడల్ రూపొందించాలి.
- వరద ప్రమాద మ్యాపులు, చెరువులు పొంగిపొర్లే అవకాశాలు వంటి అంశాల వివరాలు ఉండాలి.
- వందేళ్లలో సంభవించిన వరద ముంపును ముందుగానే అంచనా వేయగలగాలి.
- దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని వరద నీటి కాలువల నిర్వహణ, పూడికతీత, రహదారుల ఎత్తు పెంపు పనులు చేపట్టాలి.
- వరద నీటి కాలువల్లో పూడికతీతకు సంబంధించి సాంకేతికతను వినియోగించి ప్రామాణిక నిర్వహణ విధానాలు రూపొందించాలి.
- ఎప్పటికప్పుడు వరద పరిస్థితిని తెలుసుకునేలా సెన్సార్లు, రాడార్లు, డ్యాష్‌బోర్డులు ఏర్పాటుచేయాలి

ఇవీ ప్రయోజనాలు..

- సమగ్ర వివరాల సేకరించడం ద్వారా భారీ వర్షాలు కురిసినప్పుడు వరద వల్ల నష్టం తగ్గించేలా అవసరమైన ప్రాంతాల్లో డ్రైనేజీలు విస్తరించడం
- వరద నీరు ఎక్కడ కలుషితమవుతుందన్నది గుర్తించి.. నీటి కాలువల్లోకి మురుగు చేరకుండా నియంత్రించడం.
- వరద ముంపు ఉన్న ప్రాంతాలను గుర్తించి ప్రాధాన్యక్రమంలో ఆ ప్రాంతాల్లో వ్యవస్థలను మెరుగుపరచడం.
- సెన్సార్లు, రాడార్ వ్యవస్థ ద్వారా వరద ఉధృతిని ముందుగానే గుర్తించడం.. స్థానిక అధికారులను అప్రమత్తం చేయడం.

ఏపీ ఏసీబీ చరిత్రలోనే అవినీతి రికార్డు

- 25 లక్షలు లంచం తీసుకుంటూ దొరికిన ఏపీ గిరిజన సంక్షేమ శాఖ ఈఎన్‌సీ శ్రీనివాస్

అమరావతి/విజయవాడ, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ఇప్పటి వరకూ రూ.4 లక్షలు, రూ.6 లక్షలు లంచాలు డిమాండ్ చేసి స్వల్ప మొత్తంలో నగదు తీసుకుంటున్న వారిని ఏసీబీ పట్టుకుంది. తాజాగా ఏకంగా 5 కోట్ల రూపాయల లంచాన్ని డిమాండ్ చేసి రూ.25 లక్షలు టోకెన్ నగదు తీసుకుంటున్న అధికారిని ఆంధ్రప్రదేశ్ ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఏపీ గిరిజన సంక్షేమ శాఖ ఈఎన్‌సీ శ్రీనివాస్ తన చాంబర్‌లో ఓ కాంట్రాక్టరు నుంచి ఈ మేరకు డబ్బులు తీసుకుంటూ అడ్డంగా దొరికిపోయారు. ఏసీబీ చరిత్రలో ఇదే అతిపెద్ద ట్రాప్. విశాఖకు చెందిన సబ్బవరపు శ్రీనివాస్ విజయవాడలో ఉన్న గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ కార్యాలయంలో ఈఎన్‌సీగా ఉన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో గిరిజన ప్రాంతాల్లో నిర్మించే ఏకలవ్య పాఠశాలల భవనాల కాంట్రాక్టును విశాఖపట్నానికి చెందిన శ్రీసత్యసాయి కన్‌స్ట్రక్షన్స్ అధినేత సీహెచ్ కృష్ణంరాజు దక్కించుకున్నారు. అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల్లో ఏకలవ్య పాఠశాల భవనాలను నిర్మించారు. ఒక్కో భవనం అంచనా వ్యయం రూ.12 కోట్లు కాగా, నిర్మాణం పూర్తయ్యేసరికి రూ.15 కోట్లకు చేరింది. ఈ భవనాలకు సంబంధించి కృష్ణంరాజుకు రూ.35.50 కోట్ల బిల్లులు రావాల్సి ఉన్నాయి. ఈ బిల్లుల చెల్లింపునకు ప్రభుత్వం నిధులు విడుదల చేసినా శ్రీనివాస్ ఏదో ఒకవిధంగా కొర్రీలు పెడుతున్నారు. చివరికి బిల్లులు చేయాలంటే రూ.5 కోట్లు లంచం ఇవ్వాలని పట్టుబట్టారు. ముందుగా రూ.25 లక్షలు ఇవ్వాలని షరతు విధించారు. కృష్ణంరాజు విశాఖపట్నం ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. దీంతో అటు విశాఖపట్నం, ఇటు విజయవాడ ఏసీబీ అధికారులు సంయుక్తంగా దాడి చేయాలని నిర్ణయించారు. ఏసీబీ డీజీ అతుల్ సింగ్ వెంటనే గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. నేరుగా ఆఫీసులోకి తీసుకొచ్చి లంచం ఇవ్వమని శ్రీనివాస్ ఫోన్‌లో బాధిత కాంట్రాక్టరుకు చెప్పారు. కృష్ణంరాజు తన స్నేహితుల వద్ద నుంచి రూ.25 లక్షలు తీసుకుని బ్యాగ్‌లో పెట్టి శ్రీనివాస్‌కు అందజేశారు. ఆయన ఈఎన్‌సీ చాంబర్‌లోకి వెళ్లిన కొద్ది నిమిషాలకు విజయవాడ ఏసీబీ డీఎస్పీ సుబ్బారావు, శ్రీకాకుళం డీఎస్పీ రమణమూర్తి, ఇన్‌స్పెక్టర్లు భాస్కరరావు, నాగరాజు శ్రీనివాస్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. శ్రీనివాస్‌ను ఏసీబీ కోర్టులో ప్రవేశ పెట్టి జైలుకు తరలించారు. మరో మూడు వారాల్లో పదవీ విరమణ చేయాల్సిన అధికారి లంచానికి కక్కుర్తి పడి జైల్లో గడపాల్సిన పరిస్థితి తెచ్చుకున్నారు. ఈఎన్‌సీ శ్రీనివాస్ ఏసీబీ అధికారులకు పట్టుబడటం ఇది మూడో సారి. 2001లో విశాఖపట్నం ఎస్‌ఈ కార్యాలయంలో ఏఈగా విధులు నిర్వర్తిస్తున్నపుడు తొలిసారిగా ఏసీబీకి చిక్కారు. శ్రీకాకుళం జిల్లా సీతంపేటలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేస్తూ 2014లో రెండో దఫా ఏసీబీకి పట్టుబడ్డారు.

ఏసీబీకి చిక్కిన ఇరిగేషన్ డీఈఈ

ఎంబీ రికార్డులో కొలతల కోసం రూ. 11 వేల లంచం

అలంపూరు చౌరస్తా, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : గద్వాల జిల్లా అలంపూర్ డివిజన్ పరిధిలో పని చేసే ఓ ఇరిగేషన్ అధికారి గురువారం కాంట్రాక్టర్ నుంచి లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుపడ్డారు. అలంపూర్ పట్టణంలోని సబ్ డివిజన్ కార్యాలయంలో ఆరేళ్లుగా శ్రీకాంత్ నాయుడు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయన పరిధిలో క్యాతూరు, ఉట్కూరు, అలంపూరు, బుక్కాపురం, గొందిమల్ల లిఫ్టులు ఉన్నాయి. ఆయన ఎంబీ రికార్డులో కొలతలు సరి చేయడం కోసం ఓ కాంట్రాక్టర్ నుంచి రూ. 11 వేలు డిమాండ్ చేశారు. అందుకు ఒప్పుకున్న బాధితుడు.. ఆ తర్వాత ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. గురువారం కాంట్రాక్టరు నుంచి లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు.. శ్రీకాంత్ నాయుడును అరెస్టు చేశారు. హైదరాబాదులోని నాంపల్లి ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టనున్నట్లు వారు తెలిపారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: **N.Rahul Kumar.** Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, **Managing Director : Vemuri Radha Krishna** Founder: K.L.N.Prasad.